
సోమవారం 14-10-2024



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 203

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



భారత మహిళల పరాజయం

టి20 ప్రపంచకప్‌లో ఆసీస్ చేతిలో ఓటమితో సెమీస్ చాన్స్ క్లిష్టం - 14లో



సంసారం 'ఆర్థిక' చదరంగం

కాబోయే భాగస్వాములకు 'మనీ'పై అవగాహన ఉండాలి - 15లో



బాబాపై బిష్ణోయ్ బుల్లెట్

బాలీవుడ్ నటుడు సల్మాన్‌పై కక్షగట్టిన లారెన్స్ బిష్ణోయ్ ముఠా ఆయన సన్నిహితుడు ఎన్సీపీ నేత సిద్దిఖీని దారుణంగా హత్య చేసింది.

- వివరాలు 6లో▶



రైలు పట్టాలపై గ్యాస్ సిలిండర్

ఉత్తరాఖండ్‌లోని రూర్కీ–లుక్సార్ మార్గంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తులు చిన్న గ్యాస్ సిలిండర్‌ను ఉంచారు.

- వివరాలు 6లో▶



ఒమర్ ప్రమాణస్వీకారం 16న!

కేంద్రపాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రిగా ఒమర్ అబ్దుల్లా ఈనెల 16న ప్రమాణం స్వీకారం చేసే అవకాశాలున్నాయి.

- వివరాలు 6లో▶



బూస్టర్ క్యాచ్ సక్సెస్

రాకెట్‌ను నింగిలోకి పంపించాక బూస్టర్‌ను మళ్లీ వాడేందుకు సాయపడే కొత్త టెక్నాలజీని స్పేస్‌ఎక్స్ విజయవంతంగా పరీక్షించింది.

- వివరాలు 6లో▶



ప్రొఫెసర్ సాయిబాబా కన్నుమూత

అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి

- విద్యావేత్త, మానవహక్కుల ఉద్యమకారుడిగా గుర్తింపు
- మావోలతో సంబంధాల ఆరోపణలతో తొమ్మిదేళ్ల జైలు జీవితం.. ఇటీవలే విడుదలైనా వెంటాడిన అనారోగ్య సమస్యలు
- నేడు ఆయన భౌతికకాయం గాంధీ ఆస్పత్రికి అప్పగింత

సాక్షి, హైదరాబాద్/లక్డీకాపూల్: విద్యావేత్త, మానవ హక్కుల కార్యకర్త, కవి, రచయితగా గుర్తింపు పొందిన ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా (54) శనివారం రాత్రి కన్నుమూశారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. జీర్ణ కోశ సంబంధిత మిగతా 2వ పేజీలో ▶

భూమి లేదు.. ఉన్నా హక్కుల్లేవు!

రాష్ట్రంలో 56 శాతం గ్రామీణ కుటుంబాలకు భూమి లేదు

50 శాతం భూ యజమానులకు సమగ్ర హక్కులు లేవు

- 80 ఏళ్లుగా భూముల సర్వే లేదు.. కోర్టుల్లో 66 శాతం సివిల్ కేసులే..
- రెవెన్యూ కోర్టుల్లో ఇప్పటికీ 25 వేలకుపైగా కేసులు పెండింగ్
- అటవీ, రెవెన్యూ శాఖల మధ్య 4 లక్షల ఎకరాల భూములపై వివాదాలు
- 10 లక్షల మంది కౌలు రైతులకు ఎలాంటి ప్రయోజనాలూ కలగడం లేదు
- వీటన్నింటినీ పరిష్కరించేలా రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలి
- 54 అంశాలతో, మూడు విభాగాల్లో ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిన ధరణి పోర్టల్ పునర్నిర్మాణ కమిటీ

సాక్షి, హైదరాబాద్

తెలంగాణలో భూముల సమస్యలు పేరుకు పోతున్నాయని, వాటి పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాల్సిన అవసరం ఉందని ధరణి పోర్టల్ పునర్నిర్మాణ కమిటీ స్పష్టం చేసింది. ఇందు కోసం కొత్త చట్టాలను, విధానాలను రూపొందించుకోవడంతోపాటు కొన్ని రకాల సంస్కరణలు, మరికొన్ని కొత్త పద్ధతులను అవలంబించాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి 54 అంశాలతో కూడిన నివేదికను అందజేసింది. అందులో పలు ఆసక్తికర అంశాలను కూడా వెల్లడించింది.



రాష్ట్రంలోని 56శాతం గ్రామీణ కుటుంబాలకు భూమి లేదని కమిటీ తమ నివేదికలో తెలిపింది. భూములున్న రైతాంగం కూడా హక్కుల కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోందని పేర్కొంది. రాష్ట్రంలోని 50శాతం మంది పట్టాదారులకు భూముల విషయంలో పలు సమస్యలు ఉన్నాయని.. వారికి సమగ్ర హక్కుల కల్పన ఇంకా పూర్తికాలేదని వెల్లడించింది. ఎప్పుడో నిజాం కాలంలో చేసిన భూముల సర్వే తర్వాత తెలంగాణలో సర్వేనే జరగలేదని, వెంటనే భూముల డిజిటల్ సర్వేకు పూనుకోవాలని సిఫార్సు చేసింది. కోర్టు కేసుల్లో భూములు నలిగిపోతున్నాయని, దశాబ్దాల తరబడి కోర్టుల చుట్టూ హక్కుల కోసం తిరగాల్సి వస్తోందని తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రంలోని కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో 66శాతం సివిల్ కేసులే ఉన్నాయని.. ఇందులో భూవివాదాలే ఎక్కువగా ఉన్నాయని స్పష్టం చేసింది. ఇక రెవెన్యూ కోర్టులను రద్దు చేసే నాటికి వాటిలో 25వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, అవి ఇంతవరకు పరిష్కారానికి నోచుకోలేదని తెలిపింది. అటవీ, రెవెన్యూ శాఖల మధ్య 4 లక్షల ఎకరాల భూముల విషయంలో వివాదాలు ఉన్నాయని.. అటవీ శాఖ చెప్తున్న దానికి, ధరణిలో నమోదు చేసిన భూములకు 23.72 లక్షల ఎకరాల తేడా ఉందని వెల్లడించింది. వక్ఫ్, దేవాదాయ భూముల వివరాల్లో కూడా పొంతన లేదని తెలిపింది. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించి రాష్ట్రంలో టైటిల్ గ్యారంటీ చట్టాన్ని అమల్లోకి తేవాలని సిఫార్సు చేసింది. క్షేత్రస్థాయిలో గ్రీవెన్స్ వ్యవస్థ ఉండాలని.. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో రెవెన్యూ ట్రిబ్యునళ్లు ఏర్పాటు చేయాలని సూచించింది. పహాణీలను డిజిటలైజ్ చేయాలని, గ్రామానికో రెవెన్యూ నిర్వాహకుడిని ఏర్పాటు చేయాలని కోరింది. అయితే, తమ సిఫారసులన్నీ ఏకకాలంలో అమలు చేయడం సాధ్యం కాదని.. అందుకే మూడు విభాగాల్లో ప్రతిపాదిస్తున్నామని తెలిపింది. అందులో కొన్ని తక్షణమే చేపట్టాల్సి ఉండగా, మరికొన్ని స్వల్పకాలిక, ఇంకొన్ని దీర్ఘకాలిక వ్యూహాలు, ప్రణాళికలతో పరిష్కరించుకోవాల్సి ఉంటుందని నివేదికలో ధరణి కమిటీ స్పష్టం చేసింది.

ధరణి పోర్టల్ పునర్నిర్మాణ కమిటీ ఇచ్చిన నివేదికలోని ముఖ్య సిఫారసులివీ..

- గ్రామస్థాయిలోనే ల్యాండ్ గ్రీవెన్స్ వ్యవస్థ ఉండాలి. కమ్యూనిటీ పారాలీగల్ కార్యక్రమాన్ని పునరుద్ధరించాలి.
- రాష్ట్ర, జిల్లా స్థాయిలలో ట్రిబ్యునళ్లు ఏర్పాటు మిగతా 5వ పేజీలో ▶

అలయ్ బలయ్ కార్యక్రమంలో గొంగడితో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో గవర్నర్లు విజయశంకర్ (మేఘాలయ), బండారు దత్తాత్రేయ (హరియాణా), గుర్మీత్ సింగ్ (ఉత్తరాఖండ్), హరిబాహు బగడే (రాజస్తాన్), కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ లక్ష్మణ్ ▼



రాష్ట్ర సాధనకు తోడ్పడిన అలయ్ బలయ్

పొలిటికల్ జేఏసీ ఏర్పాటుకు ఈ కార్యక్రమమే స్ఫూర్తి

- రాజకీయాలకు అతీతంగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల కొనసాగింపు
- 19వ అలయ్ బలయ్ వేడుకలో సీఎం రేవంత్
- రాష్ట్ర నేతలు తమ భాష మార్చుకోవాల్సిన అవసరముందన్న కిషన్‌రెడ్డి

వివరాలు 2లో

వెయ్యి మందికి ఒక్క డాక్టరే!



భారత్‌లో 'హెల్త్ వర్క్ ఫోర్స్'పై ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక వెల్లడి

మన దేశంలో ప్రతీ పది వేల మందికి ఉన్న డాక్టర్లు 9.6 మంది మాత్రమే

- రాష్ట్రాల వారీగా చూస్తే.. డాక్టర్ల సంఖ్యలో 20వ స్థానంలో తెలంగాణ..
- నర్సుల సంఖ్యలో 15వ స్థానం.. ఫార్మాసిస్టులలో 13వ స్థానం
- దేశంలో ఎంబీబీఎస్ సీట్లు 1.15 లక్షలు.. ఇందులో సగం గత పదేళ్లలో సమకూరినవే.. ఐదు రెట్లు పెరిగిన ఫార్మసీ కాలేజీలు

16లో

చంద్రబాబు కులగణన ఎందుకు చేపట్టరు?

కాంగ్రెస్ సీనియర్ నేత మాణిక్కం ఠాగూర్



సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎందుకు కులగణన చేపట్టడం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత మాణిక్కం ఠాగూర్ ప్రశ్నించారు. కులగణన విషయంలో ప్రధాని మోదీ ఎందుకు భయపడుతున్నారంటూ ఆదివారం ఎక్స్‌లో నిలదీశారు. 'తెలంగాణలో కులగణన చేపట్టడం.. సామాజిక న్యాయంపై కాంగ్రెస్‌కు ఉన్న నిబద్ధతను తెలియజేస్తోంది. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కోరుతున్న జాతీయ కులగణన డిమాండ్.. దేశవ్యాప్తంగా సమానంగా వనరుల పంపిణీకి ఎంతో అవసరం. దీనిపై కేవలం కేంద్ర ప్రభుత్వం మాత్రమే దేశం కోసం ఒక కీలకమైన నిర్ణయం తీసుకోగలదు. రేవంత్ రెడ్డి చేయగలిగినపుడు మోదీ ఎందుకు భయపడుతున్నారు. చంద్రబాబు ఎందుకు చేపట్టడం లేదు?'అని మాణిక్కం ఠాగూర్ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

15న మరో రూ.వెయ్యి కోట్ల రుణం

ఆర్‌బీఐ ద్వారా సెక్యూరిటీల వేలంతో సమీకరణ


సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం మరో రూ.వెయ్యి కోట్ల రుణం తెచ్చుకోనుంది. సెక్యూరిటీల వేలం ద్వారా రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి బహిరంగ మార్కెట్‌లో ఈ రుణాన్ని సేకరించనుంది. ఈ మేరకు దేశంలోని 8 రాష్ట్రాలు తీసుకోనున్న రూ.13,050 కోట్ల రుణాల షెడ్యూల్‌ను ఆర్‌బీఐ విడుదల చేసింది. కాగా, ఈ నెలలో బహిరంగ మార్కెట్ నుంచి ప్రభుత్వం రుణం తీసుకోలేదు. మొదటిసారి ఈనెల 15న రూ.1,000 కోట్లను రుణంగా తీసుకుంటోంది.

సాయిబాబా మరణం తీరని లోటు: కూనంనేని



సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ సాయిబాబా మృతిపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. ఆయన మరణం సమాజానికి తీరని లోటు అని పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం సాయిబాబా సతీమణి వసంతను వారి నివాసంలో కూనంనేని పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ సాయిబాబా మరణించినా ఆయన స్ఫూర్తి సమాజాన్ని తట్టి లేపుతుందన్నారు. ఆయన మరణానికి ప్రభుత్వాలు బాధ్యత వహించాలన్నారు. వరవరరావు పరిస్థితి కూడా ఇదే మాదిరిగా ఉందని, ప్రశ్నించేవారిని హౌస్ అరెస్టుల పేరుతో శారీరకంగా, మానసికంగా అణచివేయాలని కేంద్రం చూస్తోందన్నారు.

మానవ హక్కుల ఉల్లంఘన జరిగింది: నారాయణ



సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ సాయిబాబా 90 శాతం వైకల్యంతో ఉన్నప్పటికీ భారత ప్రభుత్వం ఆయన్ను అరెస్టు చేయించిందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. సాయిబాబా విషయంలో మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందని అన్నారు. అదే చివరకు ఆయన్ను ఈ ప్రపంచానికి దూరం చేసిందనడంలో సందేహం లేదని పేర్కొన్నారు. ఇందుకు నిరసనగా తాను అలయ్ బలయ్ కార్యక్రమానికి హాజరుకావడం లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయకు ఆయన లేఖ రాశారు.

కేంద్రం కుట్రపూరితంగా వ్యవహరించింది: తమ్మినేని



సాక్షి, హైదరాబాద్: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కూడా సాయిబాబా మృతికి సంతాపం తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలకు, అణచివేతకు వ్యతిరేకంగా సాయిబాబా పోరాడారన్నారు. దీంతో కేంద్రం కుట్రపూరితంగా దేశద్రోహ నేరం మోపి 90 శాతం అంగవైకల్యంతో ఉన్న సాయిబాబాను దీర్ఘకాలం జెల్లో నిర్బంధించిందన్నారు. అర్బన్ నక్సలైట్‌గా ముద్రవేసిందని విమర్శించారు. ఆయన మృతి ప్రజా ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు.

ఇదండీ సంగతి



విదేశీ విద్యానిధికి మరింత ప్రోత్సాహం!

లబ్ధిదారుల సంఖ్యను భారీగా పెంచే యోచనలో సంక్షేమ శాఖలు

- ప్రస్తుతం బీసీల్లో ఏటా 300 మందికే అందుతున్న ఆర్థిక సాయం
- తీవ్ర డిమాండ్ ఉన్నా.. పరిమిత సంఖ్యలో అమలుతో నిరుత్సాహం
- ఎస్టీల్లో 100, ఎస్సీల్లో 210 మంది మాత్రమే... కానీ క్రమంగా పెరుగుతున్న డిమాండ్
- దీంతో మూడు సంక్షేమ శాఖలకు అర్హుల సంఖ్య పెంచాలని వినతులు
- సీఎం కార్యాలయానికి చేరిన ప్రతిపాదనలు.. అతి త్వరలోనే నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: 'విదేశీ విద్యానిధి పథకం'లబ్ధిదారుల సంఖ్య పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. సంక్షేమ పథకాల్లో అత్యంత ఎక్కువ ఆర్థికసాయం అందుతున్న పథకం కూడా ఇదే కావడంతో డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. అత్యంత పరిమిత సంఖ్యలో అర్హులను గుర్తిస్తుండటంతో విదేశాల్లో ఉన్నత చదువులు చదవాలన్న విద్యార్థులు తీవ్ర నిరాశ పడుతున్నారు. గత ఆరేళ్లుగా సంక్షేమశాఖల వారీగా వస్తున్న దరఖాస్తుల సంఖ్యను విశ్లేషిస్తూ విద్యార్థుల సంఖ్య పెంపు కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు నివేదించగా...ఆ ఫైలు ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరినట్టు సమాచారం. అతి త్వరలో ఈ ఫైలుకు మోక్షం కలుగుతుందని, ఎక్కువ మందికి లబ్ధి కలిగించాలని సంక్షేమశాఖలు భావిస్తున్నాయి.

పూలే విద్యానిధికి అత్యధిక దరఖాస్తులు

విదేశీ విద్యానిధి పథకం కింద అర్హత సాధించిన విద్యార్థికి నిర్దేశించిన దేశాల్లో పీజీ కోర్సు చదివేందుకు గరిష్టంగా రూ.20లక్షల ఆర్థిక సాయం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. ఈ మొత్తాన్ని విద్యార్థి తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదు. పీజీ మొదటి సంవత్సరం పూర్తి చేసిన వెంటనే రూ.10 లక్షలు, రెండో సంవత్సరం పూర్తి చేసిన తర్వాత మరో రూ.10 లక్షల సాయాన్ని సంబంధిత సంక్షేమ శాఖలు నేరుగా విద్యార్థి ఖాతాలో జమ చేస్తాయి. ఈ పథకం కింద అర్హత సాధించిన విద్యార్థులకు రూ.20లక్షల సాయంతో పాటుగా ప్రయాణ ఖర్చుల కింద కోర్సు ప్రారంభ సమయంలో ఫ్లైట్ చార్జీని కూడా ప్రభుత్వమే చెల్లిస్తుంది. ప్రస్తుతం బీసీ సంక్షేమశాఖ ద్వారా అమలు చేస్తున్న మహాత్మా జ్యోతిబా పూలే విదేశీ విద్యానిధి పథకం కింద 300 మందికి మాత్రమే అవకాశం కల్పిస్తున్నారు. ఇందులో బీసీ కేటగిరీలోని కులాల ప్రాధాన్యత క్రమంలో 285 మంది విద్యార్థులకు, ఈబీసీల నుంచి 15 మందికి అవకాశం ఇస్తున్నారు. వాస్తవానికి బీసీ సంక్షేమ శాఖకు ఏటా 5 వేలకు పైబడి దరఖాస్తులు వస్తున్నాయి. కానీ అందులో 5 నుంచి 7శాతం మందికే అవకాశం లభిస్తుండగా, మిగిలిన విద్యార్థులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. దీంతో లబ్ధిదారుల సంఖ్య పెంచాలని పెద్ద సంఖ్యలో వినతులు రావడంతో బీసీ సంక్షేమశాఖ ఈ దిశగా ప్రతిపాదనలు తయారు చేసింది. ప్రస్తుతమున్న 300 పరిమితిని కనీసం వెయ్యి వరకు పెంచాలని కోరింది. ఒకేసారి ఇంతపెద్ద సంఖ్యలో పెంచే అవకాశం లేదని ఉన్నతాధికారులు సూచించడంతో కనీసం 800లకు పెంచాలని కోరుతూ ప్రతిపాదనలు సమర్పించింది. మరోవైపు ఎస్సీ అభివృద్ధి శాఖ పరిధిలో 210 పరిమితిని 500కు, ఎస్టీ సంక్షేమ శాఖ పరిధిలో 100 పరిమితిని 300 నుంచి 500 వరకు పెంచాలంటూ ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపినట్టు సమాచారం. ఈ అంశంపై ఇటీవల సంక్షేమ శాఖల అధికారులతో జరిగిన సమావేశంలోనూ చర్చించారు. సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉండటంతో ఈ ప్రతిపాదనలు ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపించినట్టు తెలిసింది. అతి త్వరలో ఈ ప్రతిపాదనలు ఆమోదించిన తర్వాత ఉత్తర్వులు వెలువడతాయని విశ్వసనీయ సమాచారం.

లబ్ధిదారుల సంఖ్య పెంపుపై ప్రతిపాదనలు ఇలా...

సంక్షేమ శాఖ	పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	ప్రతిపాదనలు
బీసీ	మహాత్మా జ్యోతిబా పూలే విదేశీ విద్యానిధి	300	800
ఎస్సీ	అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి	210	500
ఎస్టీ	అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి	100	500
మైనార్టీ	సీఎం ఓవర్సీస్ విద్యానిధి	500	....

రాష్ట్ర సాధనకు తోడ్పడిన అలయ్ బలయ్

పొలిటికల్ జేఏసీ ఏర్పాటుకు ఈ కార్యక్రమమే స్ఫూర్తి

- రాజకీయాలకు అతీతంగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల కొనసాగింపు
- 19వ అలయ్ బలయ్ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి
- రాష్ట్ర నేతలు తమ భాష మార్చుకోవాల్సిన అవసరముందన్న కిషన్‌రెడ్డి



దోలు వాయిస్తున్న దత్తాత్రేయ. చిత్రంలో ఆయన కుమార్తె విజయలక్ష్మి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగించడానికి, గౌరవించడానికి రాజకీయాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా ముందుకు వస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర సంస్కృతి నలు దిశలా వ్యాపించడానికే కాకుండా, నాటి తెలంగాణ ఉద్యమంలో భాగంగా పొలిటికల్ జేఏసీ ఏర్పాటుకు అలయ్ బలయ్ కార్యక్రమం స్ఫూర్తిగా నిలిచిందని చెప్పారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలనే ఆలోచనతో బండారు దత్తాత్రేయ ప్రారంభించిన ఈ కార్యక్రమం.. చివరకు స్వరాష్ట్రం సాధించుకోవడానికి కూడా దోహదపడిందని పేర్కొన్నారు. దసరా పండుగ నేపథ్యంలో హరియాణా గవర్నర్, బీజేపీ సీనియర్ నేత బండారు దత్తాత్రేయ, ఆయన కుమార్తె బండారు విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 19వ అలయ్ బలయ్ కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

అలయ్ బలయ్ అంటే దత్తాత్రేయే..

'తెలంగాణ ప్రజలకు అతి పెద్ద పండుగ దసరా.. దసరా అంటే మొట్టమొదట పాలపిట్ట, జమ్మి చెట్టు గుర్తుకు వస్తాయి. అలాగే అలయ్ బలయ్ అంటే కూడా బండారు దత్తాత్రేయ గుర్తుకు వస్తారు. ఆయన అందించిన సంస్కృతి, వారసత్వ లక్షణాలతో దత్తాత్రేయ వారసురాలిగా బండారు విజయలక్ష్మి ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం. రాజకీయాలకు అతీతంగా మా పార్టీ అధ్యక్షుడు, మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు దీనికి హాజరై రాష్ట్ర సంప్రదాయాలు కొనసాగించడంలో రాజకీయాలకు తావు లేదని నిరూపించాం. వివిధ రాష్ట్రాల గవర్నర్లు, కేంద్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కవులు, కళాకారులు, వివిధ సంఘాల వారు కూడా ఏకమై అంతా ఒకటేనని సందేశాన్నివ్వడం అభినందనీయం..'అని సీఎం పేర్కొన్నారు.

వేరే రాష్ట్రానికి గవర్నర్ అయినా తెలుగు బిడ్డనే: దత్తాత్రేయ

'నేను ఇప్పుడు వేరే రాష్ట్రానికి గవర్నర్ అయినా తెలుగు బిడ్డనే. అందుకే స్థానిక కళాకారులు, కుటీర పరిశ్రమలకు చెందిన కుమ్మరి, కమ్మరి, చేనేత, గీత కార్మికులు తదితర వర్గాలను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాముల్ని చేశా. వారికి ప్రత్యేకంగా అంకుర సంస్థలు ఏర్పాటు చేసే విధంగా ప్రోత్సాహం అందించాల్సిన అవసరముంది. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సోదర భావంతో ముందుకు సాగాలి..'అని దత్తాత్రేయ ఆకాంక్షించారు.

ఐక్యతను ప్రతిబింబిస్తుంది: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

'విజయలక్ష్మి అలయ్ బలయ్‌ను కొనసాగించడం అభినందనీయం. గ్రామాల్లో పొలాల గెట్ల గొడవలు, ఇంట్లో మనస్పర్థలు, రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ దసరా జమ్మి పూజ చేశాక అంతా కలిసి అలయ్ బలయ్ తీసుకోవడం తెలంగాణ సంస్కృతి. దత్తన్న అలయ్ బలయ్ దీనినే ప్రతిబింబిస్తుంది. రాజకీయాల్లో విమర్శలు, విభేదాలు ఉండొచ్చు కానీ ఇలా కలవడం మంచి విషయం. ఎన్నికల సమయంలో విమర్శించుకోవచ్చు.. తర్వాత రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించాలి. కానీ తెలుగు రాష్ట్రాల్లో ఇది లోపించింది. ముఖ్యంగా రాజకీయ నాయకులు తమ భాష మార్చుకోవాలి. ప్రజలు అసహ్యించుకునే పరిస్థితి తెచ్చుకోవద్దు. అలయ్ బలయ్ స్ఫూర్తిగా రాష్ట్ర రాజకీయాల్లో మార్పు రావాలి..'అని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆకాంక్షించారు.

ఉద్రేకాలు రగిలించడాన్ని నియంత్రించాలి: పొన్నం

'రాజకీయ నాయకులు భాష మార్చుకోవాలంటూ కిషన్‌రెడ్డి చేసిన సూచన వంద శాతం సమంజసం. అదే విధంగా మత పరమైన ఉద్రేకాలను రగిలించే మాటలను కూడా నియంత్రించేలా చొరవ చూపించాల్సిన అవసరం ఉంది..'అని రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

అద్భుతమైన సంస్కృతి

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

'భారతీయ సంస్కృతి అంటేనే ఐకమత్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం. దీనిని ప్రతిబింబించేలా నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమం చాలా బాగుంది. ఇక్కడి సంస్కృతిలో విభిన్న మతాలను సైతం సమానంగా చూసే తత్వముంది. సీనియర్ నేత దత్తాత్రేయ అద్భుతమైన స్థానిక సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించడం హర్షణీయం..'అని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు.

ఈ సంస్కృతి కొనసాగాలి

ఉత్తరాఖండ్, రాజస్తాన్, మేఘాలయ గవర్నర్లు

'గతంలో బొల్లారంలోని యూనిట్‌లో పని చేశా. ఇక్కడి సంస్కృతి అద్భుతమైనది. శాంతికి సంకేతంలా ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు ఉంటాయి. ఈ సంస్కృతి ఇలాగే శతాబ్దాలు కొనసాగాలని ఆశిస్తున్నా..'అని ఉత్తరాఖండ్ గవర్నర్ లెఫ్టినెంట్ గుర్మిత్ సింగ్ అన్నారు. అలయ్ బలయ్ మంచి సంస్కృతి అని రాజస్తాన్ గవర్నర్ హరిభావ్ బగాదే పేర్కొన్నారు. ఈ కార్యక్రమం నేతల మధ్య ఆత్మీయత, అనుబంధాలను పెంచుతోందని మేఘాలయ గవర్నర్ విజయశంకర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, నేతలు ఈటల రాజేందర్, గుత్తా సుఖేందర్ రెడ్డి, రఘునందన్ రావు, కోదండరాం, వి.హన్మంతరావు, లక్ష్మణ్, కె.కేశవరావు, గోరటి వెంకన్న, వందే మాతరం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చీఫ్‌విప్‌గా 'పట్నం' నియామకం రాజ్యాంగ విరుద్ధం

- మండలి చైర్మన్ బీఆర్ఎస్ ఎమ్మెల్సీని ప్రభుత్వ చీఫ్‌విప్‌గా ఎలా నియమిస్తారు
- మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం



సాక్షి, హైదరాబాద్: శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్‌విప్‌గా పట్నం మహేందర్ రెడ్డి నియామకం రాజ్యాంగ విరుద్ధమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మహేందర్‌రెడ్డి అనర్హత పిటిషన్ పెండింగ్‌లో ఉండగా, ఆయనను చీఫ్ విప్‌గా మండలి చైర్మన్ ఎలా గుర్తిస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తోందనడానికి ఈ నియామకం ఓ ఉదాహరణ అని అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో చిట్‌చాట్ చేస్తూ, నిబంధనలకు విరుద్ధంగా మహేందర్‌రెడ్డిని చీఫ్‌విప్‌గా నియమించారని ధ్వజమెత్తారు. సభలో బిల్లులు పాస్ చేయించడం, ప్రభుత్వ బిజినెస్ జరిగేలా చూడడం చీఫ్‌విప్ బాధ్యత అని అన్నారు. 'బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన మహేందర్‌రెడ్డి ఎవరికి విప్ జారీ చేస్తారు? అధికార పార్టీ సభ్యులకా.. ప్రతి పక్ష పార్టీ సభ్యులకా?'అని ప్రశ్నించారు. శాసనసభ సమావేశాలు ముగిసే నాటికి బీఆర్ఎస్ పార్టీ సభ్యుల సంఖ్య 38 అని స్పీకర్ చెప్పారని, ఈ విషయాన్ని కాంగ్రెస్ వారు కూడా చెప్పారని గుర్తు చేశారు. అయితే మార్చి 15వ తేదీన మహేందర్‌రెడ్డిని చీఫ్‌విప్‌గా నియమిస్తూ గెజిట్ విడుదల చేశారని, మార్చిలో చీఫ్‌విప్ అయితే పంద్రాగస్టు, జూన్ 2, సెప్టెంబర్ 17న ఎమ్మెల్సీగా ఆయన జెండా ఎగురవేస్తారని జీఏడీ జీవో ఎలా ఇస్తుందని హరీశ్ ప్రశ్నించారు. అనర్హత వేటు వే యాల్సిన కౌన్సిల్ చైర్మన్.. స్వయంగా మహేందర్‌రెడ్డి చీఫ్‌విప్‌గా నియమి తులైనట్లు బులెటిన్ ఇవ్వటం సరికాదన్నారు. పట్నం మహేందర్‌రెడ్డి ఇప్పుడు ఏ పార్టీకి చెందిన వ్యక్తో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు.

రాజ్యాంగబద్ధమే: మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: శాసనమండలి చీఫ్ విప్‌తో సహా ఇతర నియామకాలన్నీ రాజ్యాంగబద్ధంగానే జరిగాయని, అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే మండలి చైర్మన్, అసెంబ్లీ స్పీకర్‌లు నిర్ణయం తీసుకుంటారని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో హరీశ్‌రావు శాసనసభ వ్యవహారాల మంత్రిగా ఉన్నప్పుడే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారని, అప్పుడు ఆయనకు రాజ్యాంగం గుర్తు రాలేదా? అని ప్రశ్నించారు. పట్నం మహేందర్‌రెడ్డి నియామకం గురించి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు. సంప్రదాయం ప్రకారమే ప్రతిపక్ష సభ్యునికి పీఏసీ చైర్మన్ హోదా ఇచ్చామని, ఎమ్మెల్యేల అనర్హత అంశం కోర్టులో ఉందన్నారు. ఎక్కడా ఉల్లంఘనలు లేవని, అయినా హరీశ్‌రావుకు ప్రతి అంశాన్ని రాజకీయం చేయడం అలవాటుగా మారిందని మంత్రి వ్యాఖ్యానించారు.

ప్రొఫెసర్ సాయిబాబా కన్నుమూత

▶ మొదటి పేజీ తరువాయి

సమస్యతో గత నెల 19న నిమ్స్‌లో చేరారు. నిమ్స్ డైరెక్టర్, గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగం అధిపతి డాక్టర్ బీరప్ప పర్యవేక్షణలో మెట్టు రంగారెడ్డి స్పెషల్ వార్డులో చికిత్స పొందుతున్న ఆయన ఇన్ఫెక్షన్‌కు గురయ్యారు. చికిత్సతో ఆరోగ్యం మెరుగుపడుతోందని అనుకుంటుండగా ఇతర సమస్యలు తలెత్తడంతో పరిస్థితి విషమించింది. శనివారం రాత్రి 8.36 గంటలకు ఆయన తుది శ్వాస విడిచినట్లు వైద్యులు ప్రకటించారు. ఆయనకు భార్య వసంత, కుమార్తె మంజీరా ఉన్నారు. సోమవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో ఆస్పత్రి నుంచి మౌలాలి జవహర్‌నగర్‌లో ఉన్న శ్రీనివాస హైట్స్‌లోని స్వగృహానికి సాయిబాబా పార్థివ దేహాన్ని తరలించనున్నారు. అంతకుముందు గన్‌పార్క్ వద్ద ఆయన భౌతికకాయాన్ని కొద్ది సమయం ఉంచుతామని కుటుంబసభ్యులు చెప్పారు. బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు నివాళులర్పించిన తర్వాత మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమయ్యే అంతిమయాత్ర 4 గంటలకు గాంధీ మెడికల్ కాలేజీకి చేరుతుందని, సాయిబాబా కోరిక మేరకు ఆయన పార్థివ దేహాన్ని గాంధీ ఆస్పత్రికి దానం చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆయన తన నేత్రాలను ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు.

అమలాపురం నుంచి హస్తిన దాకా..

ఆంధ్రప్రదేశ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఓ పేద రైతు కుటుంబంలో జన్మించిన గోకరకొండ నాగ సాయిబాబాకు ఐదేళ్ల వయస్సులోనే పోలియోతో రెండుకాళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. అప్పటినుంచి ఆయన వీల్‌చైర్‌కే పరిమితం అయ్యారు. అయినప్పటికీ స్థానికంగానే ప్రాథమిక విద్య, శ్రీ కోనసీమ భానోజీ రామర్స్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. హైదరాబాద్ యూనివర్సిటీ నుంచి పీజీ పట్టా పొందారు. 2013లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఢిల్లీ యూనివర్సిటీ అనుబంధ కాలేజీ రామ్‌లాల్ ఆనంద్ కళాశాలలో ఇంగ్లిష్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. అయితే మావోయిస్టులతో సంబంధాలున్నాయన్న ఆరోపణలపై 2014లో సాయిబాబాను మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో 2021 ఫిబ్రవరిలో ఆయనను పదవి నుంచి తొలగించారు.

తొమ్మిదేళ్లు అండా సెల్‌లో జైలు శిక్ష

సాయిబాబా అరెస్టు అనంతరం కేసును విచారించిన గడ్చిరోలి జిల్లా సెషన్స్ కోర్టు 2017లో సాయిబాబాకు జీవిత ఖైదు విధించింది. ఈ తీర్పుపై సాయిబాబా బాంబే హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. బాంబే హైకోర్టు 2022లో ఆయనపై కేసును కొట్టివేసింది. కానీ మహారాష్ట్ర ప్రభుత్వం ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దీంతో సుప్రీంకోర్టు సాయిబాబా విడుదలపై స్టే విధించింది. ఈ కేసును తిరిగి విచారించాలని బాంబే హైకోర్టును ఆదేశించింది. బాంబే హైకోర్టు సాయిబాబా నిర్దోషి అని మళ్లీ తీర్పు ఇవ్వడంతో ఈ ఏడాది మార్చిలో ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. దీనికి ముందు నాగ్‌పూర్ సెంట్రల్ జైల్లోని అండా సెల్‌లో తొమ్మిదేళ్ల పాటు జైలు శిక్ష అనుభవించారు. జైల్లో ఉండగానే సాయిబాబా తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఎట్టకేలకు జైలు నుంచి విడుదలైనా అనారోగ్య సమస్యలు కొనసాగడంతో కోలుకోలేకపోయారు. సాయిబాబా మరణవార్త తెలుసుకున్న పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు. నిమ్స్ మార్చురీలో ఉన్న ఆయన భౌతిక కాయాన్ని ఆదివారం పలువురు సందర్శించి నివాళులర్పించారు.



ప్రొఫెసర్ సాయిబాబా సతీమణి వసంత, కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ప్రజాసంఘాల నేతలు

'హింసల కొలిమిలో పదేళ్లు'

తప్పుడు కేసుల కారణంగా పదేళ్లు నాగ్‌పూర్ సెంట్రల్ జైల్లో చిత్ర హింసల కొలిమిలో మగ్గిపోయానని ప్రొఫెసర్ సాయిబాబా ఈ ఏడాది ఆగస్టు 23న బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ద ప్రెస్ కార్యక్రమంలో వాపోయారు. తన నిర్బంధం, అందుకు కారణాలు, తొమ్మిదేళ్ల జైలు జీవితంలో పడిన కష్టాలు, జైళ్లలో అంతర్గత రాజకీయాలు ఇలా అనేక అంశాలపై ఆయన సుదీర్ఘంగా మాట్లాడారు. 'జైలు జీవితం అంతా చీకటి రోజులు. పదేళ్ల తర్వాత తెలంగాణలో స్వేచ్ఛగా మాట్లాడుతున్నా. రాజ్యహింస నుంచి ఆదివాసీయులను కాపాడేందుకు ప్రయత్నించడం, 'ఆపరేషన్ గ్రీన్ హంట్'కు వ్యతిరేకంగా ప్రచారం చేయడమే నా అరెస్టుకు ప్రధాన కారణం. జైల్లో నాకు సరైన వైద్యం అందించలేదు. పదేళ్లలో కొన్నిసార్లు మాత్రమే ఆసుపత్రికి తీసుకెళ్లారు. సరైన వైద్యం లేక నా ఎడమచేయి కూడా పడిపోయింది. పోలియో తప్ప ఏ ఇతర వ్యాధి లేని నేను 21 రకాల జబ్బుల బారినపడ్డా..'అని చెబుతూ సాయిబాబా భావోద్వేగానికి లోనయ్యారు.

జైల్లో మగ్గిపోవడమే కారణం

అక్రమ కేసులతో అన్యాయంగా జైలుకు వెళ్లి అక్కడే మగ్గిపోయారు. ఎట్టకేలకు ప్రభుత్వ నిర్బంధాన్ని ఛేదించుకొని బయటకు వచ్చారు. మళ్లీ ప్రజల కోసమే పనిచేయాలనుకున్నారు. కానీ జైల్లో చుట్టుముట్టిన అనారోగ్యం నుంచి కోలుకోలేక పోయారు. చిన్న ఆపరేషన్ చేసినా శరీరం తట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది. నిమ్స్‌లో చికిత్స విజయవంతం అయిన తర్వాత తలెత్తిన ఇబ్బందులతో కన్నుమూశారు.

– సాయిబాబా భార్య వసంత, కుమార్తె మంజీరా

ప్రభుత్వమే బాధ్యత వహించాలి: హరగోపాల్

ప్రొఫెసర్ సాయిబాబాకు నిర్బంధ వ్యతిరేక వేదిక కన్వీనర్ ప్రొఫెసర్ జి.హరగోపాల్, కో–కన్వీనర్లు ప్రొఫెసర్ జి.లక్ష్మణ్, రాఘవాచారి, కె.రవిచందర్‌లు జోహార్లు అర్పించారు. సాయిబాబా రాజ్యం కక్షపూరిత చర్యలకు బలైపోయారని, ఆయన మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. '1990 సంవత్సరాల నుండి రిజర్వేషన్ అనుకూల ఉద్యమం, జైలు ఖైదీల హక్కుల సాధన ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ సాధన ఉద్యమం, ఆదివాసీ హక్కుల ఉద్యమం లాంటి అనేక ప్రజా ఉద్యమాలకు సాయిబాబా నాయకత్వం వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించడం సహించలేని రాజ్యం అతనిపై అక్రమ కేసులు బనాయించి జైల్లో బంధించింది. తల్లి మరణించినా పెరోల్ నిరాకరించారు. జైలు జీవితంలో తీవ్ర అనారోగ్యానికి గురవ్వడంతోనే సాయిబాబా మరణించారు..'అని వారు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మంత్రి సీతక్క సంతాపం

ప్రొఫెసర్ సాయిబాబా మృతి పట్ల రాష్ట్ర మంత్రి సీతక్క తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు. సమాజంలో అసమానతలను రూపుమాపేందుకు జీవితాంతం పోరాడిన మానవతావాది సాయిబాబా అని ఆమె పేర్కొన్నారు. సాయిబాబా ఎంచుకున్న పంథాతో అందరూ ఏకీభవించకపోయినా.. తన సిద్ధాంత పటిమ, చిత్తశుద్ధితో అందరి అభిమానాన్నీ సంపాదించుకున్నారని కొనియాడారు. సాయిబాబా కుటుంబసభ్యులకు మంత్రి తన సానుభూతి తెలిపారు.

హార్ట్ ఫెయిలవడంతో మరణించారు



నాగపూర్ జైలు జీవితం ఆయన ఆరోగ్యాన్ని బలి తీసుకుంది. అంతకు ముందు ఆయన ఆరోగ్యం బాగుండడమే కాకుండా అవయవాలు చక్కగా పనిచేసేవి. జైల్లో ఉన్నప్పుడు కిడ్నీలో, గాల్ బ్లాడర్‌లో రాళ్లు వచ్చాయి. నిమ్స్ దాక్టర్లు గాల్‌బ్లాడర్ తొలగించారు. ఇతర అవయవాలు దెబ్బతినడంతో ఇంటర్నల్ బ్లీడింగ్ ఎక్కువైంది. కంట్రోల్ చేసినప్పటికీ హార్ట్ ఫెయిల్ కావడంతో మృతి చెందారు.

– సాయిబాబా సోదరుడు డాక్టర్ రామ్‌దేవ్

నిశ్శబ్ద ఎన్‌కౌంటర్



ప్రజా ఉద్యమాల మేధావిగా సాయిబాబా చరిత్రలో నిలిచిపోతారు. హైదరాబాద్‌లో విద్యార్థుల సమస్యలపై పోరాటం చేసిన మొదటి వ్యక్తి సాయిబాబా. పోరాటం ఎక్కడ ఉంటే అక్కడ సాయిబాబా ముందుండేవారు. సాయిబాబా జైలుపాలు కావడానికి మోదీ, అమిత్ షానే కారణం. ఆయన మరణం నిశ్శబ్ద ఎన్‌కౌంటర్‌లాంటిది.

– రాజనర్సింహ, ప్రజాకళా మండలి రాష్ట్ర నాయకుడు

తెలంగాణ ఉద్యమానికి కీలకం



తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు పాల్గొనడంలో, పల్లె పల్లెలో ఉద్యమం ఊపందుకోవడంలో కీలకంగా వ్యవహరించిన వ్యక్తి సాయిబాబా. ఢిల్లీ యూనివర్సిటీలో అనేక సమస్యలపై విద్యార్థులను చైతన్యపరిచారు. అయితే అక్రమ కేసులు బనాయించి జైల్లో చిత్రహింసలు పెట్టినా మానసిక స్థైర్యాన్ని కోల్పోలేదు. కానీ ఆరోగ్యం పూర్తిగా దెబ్బతినడంతో ప్రాణాలు కోల్పోవాల్సివచ్చింది.

– జయక్క, చైతన్య మహిళా సంఘం

తెలుగునేల గర్వించదగ్గ మేధావి



తెలుగునేల గర్వించదగ్గ మేధావి సాయిబాబా. అందరికీ సమానత్వం దక్కాలని కోరుకున్నారు. పది సంవత్సరాల ఆయన జైలు జీవితం గురించి ఆలోచిస్తే దేశంలో న్యాయస్థానాల పరిస్థితి ఏమిటో అర్థమవుతుంది. ప్రభుత్వాల నిర్బంధమే ఆయన అమరుడు కావడానికి కారణం. ఇప్పటికైనా ప్రజాస్వామికవాదులు, మేధావులు, ప్రజలు ఆలోచించాలి.

– ప్రొఫెసర్ కాసిం

క్లుప్తంగా...

బీఆర్‌ఎస్ హయాంలో ఏం అభివృద్ధి జరిగింది

కాంగ్రెస్ ఎంపీ మల్లురవి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రతిపక్షాల నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం కాంగ్రెస్ పార్టీకి లేదని ఎంపీ మల్లురవి వ్యాఖ్యానించారు. రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసిన బీఆర్‌ఎస్ హయాంలో ఏం అభివృద్ధి జరిగిందని ఆయన ప్రశ్నించారు. ఆదివారం ఆయన గాంధీభవన్‌లో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతంలతో కలసి విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణను అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ కంకణం కట్టుకున్నారని అన్నారు. రాష్ట్రంలో నిర్వీర్యమైన విద్యా వ్యవస్థలో సంస్కరణలు చేపడుతున్నారని, తమిళనాడులో కరుణానిధి, జయలలితల తరహాలో సీఎం రేవంత్ విప్లవ నేతగా నిలిచిపోతారని పేర్కొన్నారు. గత పాలకులు తమ సొకర్యాల కోసం వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేస్తే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని పేదలకు పంచేదిశలో పాలిస్తోందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ గురుకులాల నిర్ణయం చరిత్రాత్మకమన్నారు. కేజీ టు పీజీ నిర్బంధ విద్య అని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజల చెవుల్లో పువ్వులు పెట్టిందని చెప్పారు. నూతి శ్రీకాంత్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు.

లీగల్ నోటీసులకు భయపడేది లేదు: క్రిశాంక్



సాక్షి, హైదరాబాద్: మూసీ ప్రాజెక్టు కన్సల్టెన్సీ విషయంలో నిరాధార ఆరోపణలు చేశారంటూ సింగపూర్‌కు చెందిన మెయిన్‌హార్ట్ సంస్థ ఇచ్చిన లీగల్ నోటీసులకు భయపడే ప్రసక్తే లేదని బీఆర్‌ఎస్ నేత మన్నె క్రిశాంక్ స్పష్టం చేశారు. తమ కంపెనీ ప్రతిష్ట దెబ్బతినేలా ఆరోపణలు చేశారని, ఆయన తన వ్యాఖ్యలను 24 గంటల్లోపు ఉపసంహరించుకుని క్షమాపణలు చెప్పి 'ఎక్స్'లో పెట్టిన పోస్టులను తొలగించాలని సదరు సంస్థ డిమాండ్ చేసింది. ఈ నోటీసులపై 'ఎక్స్' వేదికగా మన్నె క్రిశాంక్ స్పందిస్తూ...మూసీ కాంట్రాక్టుపై 'ఎక్స్'పోస్టులను తొలగించేది లేదని స్పష్టం చేశారు. ఈ నోటీసుల విషయం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో చర్చించినట్లు పేర్కొన్నారు. మెయిన్‌హార్ట్ నోటీసులకు బీఆర్‌ఎస్ లీగల్ సెల్ సమాధానం ఇస్తుందని తెలిపారు.

సొంతూరిలో సీఎం దసరా సంబరాలు

సీఎం హోదాలో తొలిసారిగా కొండారెడ్డిపల్లికి వచ్చిన రేవంత్‌రెడ్డి



జమ్మిచెట్టు వద్ద పూజలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షి, నాగర్‌కర్నూల్/కొడంగల్: సీఎం రేవంత్‌రెడ్డి దసరా పండుగ సందర్భంగా శనివారం సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలో పర్యటించారు. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి స్వగ్రామానికి వచ్చిన రేవంత్‌రెడ్డికి అడుగడుగునా పూలు, డప్పు వాయిద్యాలు, బతుకమ్మలు, కోలాటాలతో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల నడుమ దసరా వేడుకలు జరుపుకొన్న సీఎం రేవత్‌రెడ్డి అందరినీ పలకరిస్తూ గ్రామస్తుల్లో పండుగ సంబురాన్ని రెట్టింపు చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లికి శనివారం మధ్యాహ్నం 3 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి హెలీకాప్టర్‌లో చేరుకున్నారు. కొండారెడ్డిపల్లి పంచాయతీ కార్యాలయం పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణ రెడ్డి, కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన శమీ పూజకు..

కొండారెడ్డిపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి తన ఇంటి నుంచి గ్రామంలోని మైసమ్మ ఆలయ ప్రాంగణంలో ఉన్న జమ్మి చెట్టు వద్దకు గ్రామస్తులతో కలిసి కాలి నడకన బయలుదేరారు. మార్గమధ్యలో గ్రామస్తులను పేరుపేరునా పలకరిస్తూ.. ఆప్యాయంగా ముచ్చటిస్తూ జమ్మిచెట్టు వద్దకు చేరుకొని శమీ పూజలు నిర్వహించారు. అనంతరం ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు, అభిమానులు సీఎంతో సెల్ఫీలు, ఫొటోల కోసం పోటీ పడటంతో సుమారు 40 నిమిషాలపాటు వారితో ఫొటోలు దిగుతూ గ్రామస్తులను ఆనందంలో ముంచెత్తారు. పాలమూరు బిడ్డగా ఉమ్మడి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపే బాధ్యత తనదని, ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతానని చెప్పారు. విద్య, వైద్యం, సాగునీరు, ఉపాధి కల్పనకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, వేగంగా నిర్ణయం తీసుకునేందుకు తాను సిద్ధంగా ఉన్నట్టు ఎమ్మెల్యేలు, అధికారులకు చెప్పారు. మరోసారి గ్రామానికి వచ్చి అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానన్నారు. రాత్రి 8.30 గంటలకు రోడ్డు మార్గంలో కొడంగల్‌కు బయలుదేరారు. కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి స్వాగతం పలికారు. పూల మొక్కలు ఇచ్చి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఉదయం నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు సీఎంను కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసూఫ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, యువజన కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్ కృష్ణంరాజు తదితరులు సీఎంను కలిశారు. పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి కొడంగల్‌కు వచ్చి ముఖ్యమంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



బయోమాస్ పవర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి తదితరులు

రానున్నది గ్రీన్ పవర్ యుగం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా ప్రణాళికలు
- మంత్రులు పొంగులేటి, తుమ్మలతో కలసి బయోమాస్ పవర్ ప్లాంట్ ప్రారంభం

అశ్వారావుపేట: ప్రపంచంలో రానున్నది గ్రీన్ పవర్ యుగమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో రూ.36.50 కోట్లతో నిర్మించిన 2.5 కేవీ బయోమాస్ పవర్‌ప్లాంట్‌ను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులతో కలసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బొగ్గు, వంట చెరుకును మండించకుండా జలవిద్యుత్, పవన విద్యుత్‌తోపాటు గ్రీన్ పవర్ యుగం రాబోతోందని చెప్పారు. కాలుష్యం లేకుండా ప్రకృతిలోని వనరుల సహకారంతో విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, ఇందుకోసం రాష్ట్రంలో కొన్ని గ్రామాలను ఎంపిక చేసి పైలట్ ప్రాజెక్టుల కింద సోలార్ విద్యుత్ ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తామని భట్టి తెలిపారు. పైలట్ ప్రాజెక్టు పరిధిలోని రైతులకు సోలార్ పంపు సెట్లు ఏర్పాటు చేస్తామని, రాబోయే ఆరేళ్లలో 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి సామర్థ్యం లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు. ఇందిరమ్మ రాజ్యంలో రైతులకు ప్రాధాన్యం కల్పిస్తూ రూ.73 వేల కోట్లను వ్యవసాయ రంగానికి కేటాయించామని చెప్పారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో పామాయిల్ ఫ్యాక్టరీని అమ్మేందుకు కుట్ర జరిగిందని, ఆ చర్యలను తిప్పికొట్టి రాష్ట్రవ్యాప్తంగా ఆయిల్ పామ్ సాగు విస్తరించామని తెలిపారు. పామాయిల్ గెలల ధర పెంచేందుకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చామని, టన్నుకు రూ.20 వేలకు పైగా రైతులకు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రత్యేక చొరవతో దేశంలోనే ఆయిల్‌పామ్ రంగంలో తెలంగాణ అగ్రగామిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతమైన అశ్వారావుపేట పామాయిల్ తోటలతో పచ్చగా మారడం హర్షణీయమని అన్నారు. రాష్ట్రంలోని రైతులు లాభసాటి పంటలపై దృష్టి సారించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెలలో ట్రిపుల్‌ఆర్ టెండర్!

- ఉత్తర భాగానికి నోటిఫికేషన్ జారీ చేయనున్న ఎన్‌హెచ్‌ఏఐ
- అందుకు వీలుగా టెండర్ డాక్యుమెంటేషన్ ప్రక్రియ కొలిక్కి
- పర్యావరణ అనుమతులు వచ్చాక నిర్మాణ సంస్థ ఖరారు
- ఈలోపు రోడ్డు నంబర్ కేటాయింపు.. అటవీ అనుమతుల జారీ



సాక్షి, హైదరాబాద్: ట్రిపుల్‌ఆర్ (రీజినల్ రింగు రోడ్డు) నిర్మాణానికి కేంద్రం వేగంగా ఏర్పాట్లు చేస్తోంది. దీనికి వీలుగా ఎన్‌హెచ్‌ఏఐ ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగం టెండర్ డాక్యుమెంటేషన్‌పై దృష్టి సారించింది. వచ్చే నెల మొదటి వారంలో టెండర్లు పిలిచే అవకాశాలున్నాయి.

పర్యావరణ అనుమతులు రాకుండానే..

ట్రిపుల్‌ఆర్ విషయంలో ఇప్పటికే తీవ్ర జాప్యం జరిగింది. దీంతో భవిష్యత్‌లో మరింత ఆలస్యం జరగకుండా చూడాలని ఎన్‌హెచ్‌ఏఐ భావిస్తోంది. పర్యావరణ అనుమతులు రాకుండా టెండర్ల ప్రక్రియ పూర్తి చేయటానికి వీలులేదు. కానీ, టెండర్లు పిలిచేందుకు అది అడ్డంకి కాదు. దీంతో పర్యావరణ అనుమతులు వచ్చేలోగా టెండర్లు పిలిచి, పర్యావరణ అనుమతులు వచ్చిన తర్వాత టెండర్లు ఖరారు చేయాలని అధికారులు భావిస్తున్నారు. టెండర్లు తెరిచే నాటికి అనుమతులు వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎక్స్‌ప్రెస్‌వేగా కొత్త నంబర్

జాతీయ రహదారి హోదాలో కేంద్రం ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టు చేపడుతోంది. ఉత్తర భాగం విషయంలో ఆ స్పష్టత ఉంది. దక్షిణభాగాన్ని కేంద్రం కాకుండా సొంతంగానే చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఉత్తర భాగాన్ని సొంత నిధులతో కేంద్రమే నిర్మిస్తోంది. గతంలో కేవలం జాతీయ రహదారిగా మాత్రమే దాన్ని పరిగణించింది. కానీ, ఇటీవల దాన్ని ఎక్స్‌ప్రెస్‌వే జాబితాలో చేర్చింది. అప్పటి వరకు తాత్కాలికంగా దానికి 161ఏ నంబర్‌ను పరిగణనలోకి తీసుకున్నారు. ఇప్పుడు అది కాకుండా ఎక్స్‌ప్రెస్‌వేగా కొత్త నంబర్ కేటాయించనున్నారు. ఈ నంబర్ అలాట్ అయిన తర్వాతే ఫారెస్టు క్లియరెన్సు వస్తుంది. ఇప్పటికే ఈ రోడ్డుకు సంబంధించి పబ్లిక్ హియరింగ్స్ ప్రక్రియ పూర్తి చేశారు. పర్యావరణ అనుమతులకు అది కీలకం. రోడ్డు నంబర్ అలాట్ అయిన తర్వాతనే పర్యావరణ అనుమతులకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. త్వరలో ఆ రోడ్డు నంబర్ కేటాయించే అవకాశముంది. పర్యావరణ అనుమతులు వచ్చిన తర్వాతే టెండర్లు తెరవాల్సి ఉంటుంది. ఈ తతంగం పూర్తయ్యే వరకు టెండర్ల కోసం ఎదురు చూడకుండా, ముందు నోటిఫికేషన్ జారీ చేయాలని అధికారులు నిర్ణయించారు. మరోవైపు భూపరిహారం పంపిణీకి వీలుగా గ్రామాల వారీ అవార్డులు పాస్ చేసే ప్రక్రియ కూడా నిర్వహించాల్సి ఉంది. ఇది జరగాలంటే పరిహారం నిధులు ఎన్‌హెచ్‌ఏఐకి కేటాయించాలి. ఉత్తర భాగం భూసేకరణ వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం సగం మొత్తాన్ని భరించాల్సి ఉన్నందున, ఆ నిధులు రాష్ట్ర ప్రభుత్వం డిపాజిట్ చేయాలి. ఈ ప్రక్రియ కూడా వేగంగా పూర్తి చేసేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని ఎన్‌హెచ్‌ఏఐ నిర్ణయించింది. సమాంతరంగా ఈ ఏర్పాట్లు చేస్తూనే టెండర్ల ప్రక్రియ ప్రారంభించబోతున్నారు. వచ్చేనెల మొదటి వారంలో టెండర్లు పిలిచి నిర్ధారిత గడువులోపు నిర్మాణ సంస్థను ఖరారు చేయనున్నారు. ఆ తర్వాత వీలైనంత తొందరలో పనులు ప్రారంభించాలని కేంద్రం భావిస్తోంది.

ఆ పెద్దన్న ఎవరు?

- కాంగ్రెస్ నాయకులను ఈడీ నుంచి రక్షిస్తున్నది ఎవరో ప్రజలకు తెలియాలి: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులను ఈడీ నుంచి కాపాడుతున్న పెద్దన్న ఎవరో చెప్పాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ప్రశ్నించారు. ఢిల్లీలో కొట్లాడుతున్నట్టు నాటకం ఆడుతూ, తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ అంట కాగుతున్నాయని ఆదివారం ఒక ప్రకటనలో ఆయన విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులపై ఈడీ దాడులు జరుగుతున్నా బీజేపీ నేతలు ఈ అంశంపై మాట్లాడటం లేదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ నాయకులను ఈడీ నుంచి రక్షిస్తున్న పెద్దన్న ఎవరో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నివాసంపై ఈడీ జరిపిన దాడుల అంశాన్ని ప్రస్తావిస్తూ, ఆ దాడిలో రూ.వందల కోట్ల నగదు దొరికిందని మీడియాలో కథనాలు వస్తున్నాయని, 2 వారాలు పూర్తయిన తర్వాత కూడా ఇప్పటి దాకా ఈ సంఘటన తాలూకు ఒక్క విషయం బయటకి రాలేదని కేటీఆర్ తెలిపారు. కర్ణాటకలో జరిగిన వాల్మీకి కుంభకోణం ద్వారా వచ్చిన రూ.40 కోట్ల అక్రమ ధనాన్ని పార్లమెంటు ఎన్నికల సమయంలో తెలంగాణలో కాంగ్రెస్ ఉపయోగించిందని స్వయంగా తన ప్రకటనలో ఈడీ వెల్లడించిందని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టులు జరగకపోవడం, దారి మళ్లిన నిధుల తాలూకు అంశంపైనా ప్రాథమిక విచారణ కూడా చేయకపోవడం పట్ల కేటీఆర్ అనుమానాలు వ్యక్తం చేశారు.



"అసూయ అనేది అజ్ఞానం. అనుకరణ అనేది ఆత్మహత్య.
- రిచర్డ్ పి. ఫెయిన్‌మాన్

సాక్షి
సోమవారం, 14 అక్టోబర్ 2024

పొరలు ఒలిచే రచయిత

అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ సాహిత్య పురస్కారాన్ని ఈ ఏడాది గెలుచుకోవడం ద్వారా ఆ గౌరవం పొందిన తొలి ఆసియా రచయిత్రిగా నిలిచింది దక్షిణ కొరియాకు చెందిన హాన్ కాంగ్ (సరైన ఉచ్చారణ: హన్ గాన్). ప్రతి ఏడాదీ జరిగినట్టుగానే ఈసారీ అందరి అంచనాలు తలకిందులైనాయి. చైనా రచయిత్రి కాన్ షుయె, ఆస్ట్రేలియా రచయిత జెరాల్డ్ మర్నేన్, జపాన్ రచయిత హరూకి మురకామి నుంచి భారత మూలాలున్న సల్మాన్ రష్దీ వరకు ఎవరిని వరించొచ్చనే విషయంలో బెట్టింగ్స్ నడిచాయి. కానీ 'చారిత్రక విషాదాలను ప్రతిఘటించే, మానవ దుర్బలత్వాన్ని ఎత్తి చూపే తీక్షణమైన కవితాత్మక వచనానికి'గానూ హాన్ కాంగ్‌కు ఈ పురస్కారాన్ని ప్రకటించింది స్వీడిష్ అకాడెమీ. 2016లో తన కొరియన్ ఆంగ్లానువాద నవల 'ద వెజిటేరియన్'కు 'ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్' గెలుచుకున్న హాన్ కాంగ్ ఆ పురస్కారం పొందిన తొలి కొరియన్ రచయిత కూడా కావడం విశేషం.

దక్షిణ కొరియా ప్రసిద్ధ రచయిత హాన్ సుయెంగ్-వాన్ కూతురిగా 1970లో జన్మించిన హాన్ కాంగ్ సాహిత్య ప్రయాణం- మనుషుల్ని మనుషులే పీక్కు తినే ఈ సమాజంలో దానికి విరుగుడు ఏమిటనే శోధనతో మొదలైంది. 'మనుషులు మొక్కలు కావాల్సిందని నా నమ్మకం' అంటాడు 28 ఏళ్లకే క్షయ వ్యాధితో మరణించినప్పటికీ కొరియన్ సాహిత్య రంగం మీద ప్రబలమైన ముద్రవేసిన యీ సంగ్. అదొక నిరసన! ప్రస్తుతం సుమారు ఐదు కోట్ల జనాభా ఉన్న దక్షిణ కొరియా చరిత్రలో మాయని మచ్చలైన జపాన్ దురాక్రమణ (1910-45), కొరియన్ యుద్ధం (1950-53) తర్వాత, అలాంటిదే- సైనిక పాలనకు వ్యతిరేకంగా తలెత్తిన విద్యార్థుల తిరుగుబాటు (1980)ను అణచివేసే క్రమంలో జరిగిన 'మే 18' ఘటన. కాంగ్‌కు తొమ్మిదేళ్లున్నప్పుడు ఆమె జన్మించిన గ్వాంగ్జు పట్టణం నుంచి వాళ్ల కుటుంబం సియోల్‌కు వెళ్లిపోయింది. సరిగ్గా నాలుగు నెలల తర్వాత అక్కడ వేలాది విద్యార్థులు, పౌరులు చనిపోయారు. తనకు ప్రత్యక్షంగా అనుభవం లేని ఈ ఘోరాలను పెద్దయ్యాక తెలుసుకునే క్రమంలో అంతులేని పశ్చాత్తాపానికి గురైంది కాంగ్. వాళ్ల కుటుంబం బతికుండటానికీ, ఇంకో కుటుంబం లేకుండాపోవడానికీ కారణమే లేదు. ఒక చిన్న నిర్ణయం వాళ్ల గతిని మార్చింది. గ్వాంగ్జు, ఆష్విట్స్, బోస్నియా- ప్రపంచమంతటా ఇదే హింస. అయితే, గాయాల పాలైనవారికి రక్తం ఇవ్వడం కోసం తమ భద్రతకు కూడా వెరవకుండా వేలాది మంది ఆసుపత్రుల ముందు వరుసలు కట్టిన ఫొటోలు కాంగ్‌లో ఉద్వేగాన్ని పుట్టించాయి. వర్తమానం గతాన్ని కాపాడుతుందా? బతికున్నవాళ్లు పోయినవాళ్లను కాపాడగలరా? 'దొరక్కపోయినా జవాబుల కోసం రచయితలు వెతకడం మానరు'. ఎంతటి క్రౌర్యానికైనా మనిషి వెనుదీయడు; అదే సమయంలో, 'రైల్వే ట్రాక్ మీద పడిపోయిన పసికందును కాపాడటానికి తన ప్రాణాలను సైతం లెక్కించడు'. మనిషిలోని ఈ రెండు ముఖాల ప్రహేళికను చిత్రిస్తూ 'హ్యూమన్ యాక్ట్స్' నవల రాసింది కాంగ్. రచనల్లో రాజకీయ ప్రకటనలు చేయాల్సిన అవసరం లేకుండా- మనిషిలోని అంతులేని క్రూరత్వాన్నీ, దాని మరుగునే ఉన్న మృదుత్వాన్నీ తవ్వి తీసింది.

పుట్టిన రెండు గంటలకే చనిపోయి తన తల్లిదండ్రులు ఎన్నటికీ బయటపడలేని దుఃఖానికి కారణమైన తను ఎన్నడూ చూడని తన 'అక్క' హాన్ కాంగ్‌కు ఓ పుండులా మిగిలిపోయింది. 'గాయం అనేది మాన్పుకోవాల్సిందో, బయటపడాల్సిందో కాదు; దాన్ని ఆలింగనం చేసుకోవాలి' అంటుందామె. కాలం వల్ల, మరణం వల్ల, ఇతర విషాదాల వల్ల మనుషులు ఇతరులతో సంభాషించే శక్తిని కోల్పోతారు. అంధత్వం వల్ల రాయగలిగే, చదవగలిగే సామర్థ్యాన్ని కోల్పోయిన ఒక ప్రాచీన-గ్రీకు బోధకుడు, తీవ్ర కుటుంబ విషాదాల వల్ల నోరు లేకుండాపోయిన ఆయన విద్యార్థిని పరస్పరం సమాచారాన్ని పంచుకోవడానికి చేరుకునే గౌరవపూరిత సామీప్యతను చిత్రించడానికి 'గ్రీక్ లెసన్స్' నవల రాసింది కాంగ్. మనిషికీ మనిషికీ మధ్య ఉండాల్సిన 'నిరంతర మృదు స్పర్శ'ను నొక్కి చెప్పింది. తద్వారా భాషా సూక్ష్మతనూ, గెలుచుకోగలిగే జీవన సౌందర్యాన్నీ పట్టిచూపింది.

హాన్ కాంగ్ ఎంత వేగంగా టైప్ చేయగలదంటే, 'నమ్మండి నమ్మకపోండి' లాంటి టీవీ షోలో పాల్గొనమని ఆమె మిత్రులు నవ్వుతూ అనేంతగా! ఆమె రచనల్లోని ధారకు సరితూగేట్టుగా టైప్ చేసే క్రమంలో పుట్టిన నొప్పులకు కొన్నాళ్లు వేళ్లు కదపలేని పరిస్థితి వచ్చింది. మణికట్టు నొప్పి వల్ల పెన్నుతోనూ రాయలేదు. కొంతకాలం పెన్నును తిరగేసి పట్టుకుని ఒక్కో అక్షరాన్ని నొక్కుతూ టైప్ చేసేది. కవయిత్రిగా మొదలైన కాంగ్‌కు సంగీతమూ తెలుసు. పాటలు రాసి, తానే స్వరపరిచి, ముందు వద్దనుకున్నా ఆ తర్వాత ఆ మొత్తం పాడి ఒక పది పాటల సీడీ విడుదల చేసింది. ఆమె రచనల్లోనూ ఈ సంగీతం మిళితమై ఉంటుంది. 1993లో మొదలైన కాంగ్ మూడు దశాబ్దాల సాహిత్య ప్రయాణంలో నవలలు, నవలికలు, కథలు, కవితలు, వ్యాసాలు రాసింది. ఎన్నో పురస్కారాలను అందుకుంది. తరచూ వేధించే తీవ్రమైన తలనొప్పులు తనను అణకువగా ఉంచడంలో సాయపడుతున్నాయంటుంది. ఆమెకు ఒక కొడుకు. నోబెల్ వార్త తెలిసినప్పుడు అతడితో కలిసి కాఫీ తాగుతోందట. 2114 సంవత్సరంలో ప్రచురించనున్న 'ఫ్యూచర్ లైబ్రరీ ప్రాజెక్ట్' కోసం 'డియర్ సన్, మై బిలవ్డ్' సమర్పించిందామె. అందులో ఏం రాసివుంటుంది? మనిషి హింసను ఎదుర్కొనే సున్నిత ప్రతీకారం మరింత మానవీయతను చూపడమేనని మరోసారి నొక్కి చెప్పివుంటుందా!

సానుభూతి నుంచి ఛీత్కారం దాకా...

కామెంట్



కరణ్ థాపర్

ఒకప్పుడు ఇజ్రాయెల్ అంటే ప్రపంచమంతటికీ ఎంతో ఇష్టం. అత్యద్భుతమైన నిఘా వ్యవస్థ, మాజీ ప్రధానులను సైతం జైలులో పెట్టగల న్యాయవ్యవస్థ, సరదాగా మాటలకు ఉపక్రమించే ప్రజల తీరు వంటి లక్షణాలన్నింటినీ మెచ్చుకునేవారు. గతేడాది అక్టోబర్ 7న హమాస్ దాడికి గురైనప్పుడు కూడా ఇజ్రాయెల్ పట్ల ప్రపంచ సానుభూతి ఉండింది. ఎంతైనా ఉగ్రవాద బాధితురాలు అనుకున్నారు. అయితే ఆ జ్ఞాపకాలేవీ ఇప్పుడు లేవు. బదులుగా ఇజ్రాయెల్ చేపట్టిన మానవ హననమే అందరి కళ్లల్లో మెదులుతోంది. తమను హింసలకు గురిచేసిన హిట్లర్ మాదిరిగానే తామూ పాలస్తీనీయులను హింసలు పెడుతున్నామని అంగీకరించేందుకు ఇజ్రాయెల్ సిద్ధంగా లేదు. కాకపోతే ఇదే అద్దంతో మరేదో చూపేందుకు ఇజ్రాయెల్ తాపత్రయ పడుతోంది.

బ్రిటన్ మాజీ ప్రధాని హరాల్డ్ మెక్‌మిలన్‌కు రాజకీయాల్లో వారం రోజులంటే చాలా ఎక్కువ సమయం! ఇదే విధంగా హమాస్‌తో నడుస్తున్న యుద్ధం విషయంలో ఇజ్రాయెలీలు కూడా ఒక యుగమైందని అనుకుంటున్నారు. ఈ ఏడాది సమయంలో ఇజ్రాయెలీల ప్రపంచం మొత్తం తల్లకిందులైంది. తమ సంబంధాలన్నీ వాళ్లు కోల్పోయారు.

గత ఏడాది అక్టోబర్ ఏడవ తేదీన హమాస్ చేసింది అత్యంత భయంకరమైంది, ఆటవికమైంది. అది క్షమించరాని నేరం. సుమారు 1,200 మంది ఇజ్రాయెలీల ప్రాణాలను పొట్టనబెట్టుకున్న హమాస్ ఆ రోజు ఇంకో 250 మందిని బందీలుగా చేసుకుంది. ఇజ్రాయెల్ మొత్తం ఈ ఘటనతో వణికిపోయింది. ఇజ్రాయెల్ పట్ల ఆ రోజు కొంతైనా సానుభూతి వ్యక్తమైంది. ఎంతైనా ఉగ్రవాద బాధితురాలు కదా అని అనుకున్నారు. కానీ, ప్రతీకారం పేరుతో ఏడాది కాలంలో ఇజ్రాయెల్ దమనకాండను పరిశీలిస్తే, హమాస్ అకృత్యాలు కూడా పేలవమైనవిగా అనిపించక మానవు. ఆడవాళ్లు, పిల్లలతోపాటు 42 వేల మంది పాలస్తీనియులు ఇప్పటిదాకా చనిపోయారు. ఇంకో లక్ష మంది గాయపడ్డారు. గాజాలో 23 లక్షల మంది జనాభాకు నిలువ నీడ లేకుండా పోయింది. ఎటు చూసిన విధ్వంసపు ఆనవాళ్లే. అందుకేనేమో... ఏడాది క్రితం వరకూ ఇజ్రాయెల్‌పై ఉన్న సానుభూతి కాస్తా ధిక్కారంగానూ, ఛీత్కారంగానూ మారిపోయింది. అందరి దృష్టిలో ఇజ్రాయెల్ ఇప్పుడు దురాక్రమణదారుగా మారిపోయింది!

హమాస్‌ను సమూలంగా నాశనం చేసేందుకు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ కంకణం కట్టుకున్నారు. దశాబ్దాల పాలస్తీనా వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టడం ద్వారా తమకు మేలు జరుగుతుందని ఆశించారు. అయితే హమాస్ ఎప్పటికప్పుడు తన ఉనికిని చాటుకోవడమే కాకుండా, సైద్ధాంతికంగా మరింత బలం పుంజుకుందని చెప్పాలి.

ఇంకో ముఖ్యమైన విషయం... నెతన్యాహూ గాజాపై చేస్తున్న యుద్ధం కాస్తా పాలస్తీనా అంశాన్ని అంతర్జాతీయ వేదిక పైకి చాలా బలంగా చేర్చింది. ఐక్యరాజ్య సమితిలోనూ పాలస్తీనాకు న్యాయం జరగాలన్న నినాదాలు వినిపిస్తున్నాయి. అంతేకాదు... అగ్రరాజ్యం అమెరికా విశ్వవిద్యాలయాల్లోనూ ఇజ్రాయెల్ వ్యతిరేక ఉద్యమాలు, ప్రదర్శనలు జరగడం గమనార్హం. నెతన్యాహూ ఈ పరిణామాలను బహుశా ఊహించి ఉండరు.



ఇజ్రాయెల్ – హమాస్ యుద్ధం నడిచిన గత 365 రోజుల్లో ఐర్లాండ్, స్పెయిన్, నార్వేలు పాలస్తీనాను అధికారికంగా గుర్తించాయి. సౌదీ అరేబియా ఇంకో అడుగు ముందుకేసి ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాల కోసం పాలస్తీనా సమస్య పరిష్కారాన్ని ఒక నిబంధనగా ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, అధ్యక్ష అభ్యర్థిగా బరిలో ఉన్న ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ నోట పాలస్తీనా ఏర్పాటు మాట వస్తూనే ఉంది.

పాలస్తీనా, ఇజ్రాయెల్ సమస్య పరిష్కారానికి ఇప్పుడు అందరూ సూచిస్తున్న మార్గం ఆ ప్రాంతాన్ని రెండు స్వతంత్ర దేశాలుగా విడగొట్టడం. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఇది సాధ్యం కాదని అందరూ మరచిపోతున్నారు. ఎందుకంటే వెస్ట్‌బ్యాంక్‌లో సుమారు ఏడు లక్షల మంది ఇజ్రాయెలీ వలసదారులు ఉంటున్నారు. గాజాలో తను చెప్పినట్టు నడుచుకునే అధికార యంత్రాంగాన్ని ఏర్పాటు చేసేందుకు నెతన్యాహూ శతథా ప్రయత్నిస్తున్నారు. అలాంటప్పుడు పాలస్తీనా దేశం ఎక్కడ ఏర్పాటు అవుతుంది?

ఏడాది క్రితం... కనీసం ఆరు నెలల క్రితం కూడా పాలస్తీనీయులు దేశం మొత్తం తమదే అన్నట్టుగా మాట్లాడేవారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. యూదులకు ఇది అస్సలు అంగీకారం కాదు. కారణం ఒక్కటే. తాము యుగాలుగా ఆశిస్తున్న తమదైన మాతృదేశం తమకు లేకుండా పోతుందని!

ఎంత విచిత్ర పరిస్థితి? పాలస్తీనాకు న్యాయం జరగాలని మొట్టమొదటిసారి ప్రపంచం మేల్కొన్న సమయంలో అసలు ఆ న్యాయం ఏమిటన్నది కూడా తెలియని పరిస్థితి. రాజకీయ ఆలోచనలకు అతీతంగా అంతా మారిపోయింది.

మరో దృక్కోణం ఒకటి ఉంది. ఇది ఇజ్రాయెలీలకు అంతగా రుచించకపోవచ్చు. ఆశ్చర్యంగానూ అనిపించవచ్చు. ఏడాది క్రితం వరకూ తమ దేశం పట్ల ఇతరులకు ఉన్న దృక్పథం ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. ఎందుకంటే... ఆక్రమణదారుడైనప్పటికీ బాధితుడిగా తనను తాను చిత్రీకరించుకునేందుకు ఇజ్రాయెల్ ప్రయత్నిస్తోంది మరి!

2023లో ప్రజాభిప్రాయం ఒకదాన్ని సేకరించే ముందు కాలంలో ఇజ్రాయెల్ అంటే ప్రపంచమంతటికీ ఎంతో ఇష్టం. అత్యద్భుతమైన నిఘా వ్యవస్థ, మాజీ ప్రధానులను సైతం జైలులో పెట్టగల న్యాయ వ్యవస్థ, సరదాగా మాటలకు ఉపక్రమించే ప్రజల తీరు వంటి లక్షణాలన్నింటినీ మెచ్చుకునేవారు. అయితే ఆ జ్ఞాపకాలేవీ ఇప్పుడు లేవు. బదులుగా ఇజ్రాయెల్ చేపట్టిన మానవ హననం మాత్రమే అందరి కళ్లల్లో మెదలుతోంది. ఒకప్పుడు అభినందించిన ప్రజలే ఇప్పుడు ఛీత్కరించే పరిస్థితి.

ఇజ్రాయెలీలకు ఈ విషయాలు తెలియవా? రెండో ప్రపంచ యుద్ధంలో జర్మన్ల చేతిలో ఊచకోతకు గురైన వాళ్లే కదా! హిట్లర్ మాదిరిగానే తామూ పాలస్తీనీయులను నానా హింసలూ పెడుతున్నామన్న విషయాన్ని అంగీకరించేందుకు కూడా ఇప్పుడు ఇజ్రాయెల్ సిద్ధంగా లేదు. కానీ వాస్తవమైతే అదే! కాకపోతే ఇదే అద్దంతో మరేదో చూపేందుకు ఇజ్రాయెల్ తాపత్రాయపడుతోంది.

హమాస్ నేత ఇస్మాయెల్ హనియే, హెజ్బొల్లా నేత హసన్ నస్రల్లాల నాటకీయ హత్యలు ఇజ్రాయెలీల నిఘా వ్యవస్థ చురుకుదనానికి నిదర్శనంగా నిలుస్తాయనడంలో సందేహం లేదు. కానీ గత ఏడాది అక్టోబరులో నిఘా విభాగం వాళ్లు సిగ్గుతో తలదించుకున్నారు. అయితే గాజాపై ఇజ్రాయెల్ చేసిన రక్తపు మరక అంత తొందరగా చెరిగిపోయేది కాదు. మరచిపోయేది, క్షమించదగ్గది కూడా కాదు. ఇజ్రాయెల్‌ను ఓ భిన్న దేశంగా చూపింది ఈ యుద్ధం. ఈ విషయాన్ని ఇజ్రాయెలీలు ఎంతవరకూ అంగీకరిస్తారన్నది చూడాల్సిన విషయం.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అందరికీ నష్టమే!



తీవ్రవాదంతో సమస్య ఏమిటంటే – ఎవరు ఆయుధాలు ఇచ్చారన్నదానితో నిమిత్తం లేదు. ఎవరు మద్దతిచ్చారు అన్నదానితో నిమిత్తం లేదు. ఎవరు హాని కలిగించారు అన్నదానితో నిమిత్తం లేదు. ఎవరు అణిచివేశారు అన్నదానితో నిమిత్తం లేదు. ఎవరు రెచ్చగొట్టారు అన్నదానితో నిమిత్తం లేదు. ఎవరూ దాన్నుంచి బయటపడలేరు!

– అమిత్ పాండీలియా, కాలమిస్ట్

వృత్తి వేదాంతులు



బహుశా మెడిసిన్‌లో చేరడమంటే, మానసిక ప్రొజీరియాకు సిద్ధం కావడం – ఉద్వేగపూరితంగా వయసుకు ముందే ముసలితనం వచ్చేస్తుంది. చాలా చావులు వేదనలు, ఎన్నో ఆశలు నిరాశలు, ప్రేమలు మోసాలు చూశాక అది మిమ్మల్ని లోపలి నుంచి మొద్దుబారుస్తుంది. ఇంక ఏది అత్యంత ముఖ్యమో అది మాత్రమే కనబడుతుంది. (చిన్న పిల్లల్లో ముసలి తనం కనబడే అరుదైన జబ్బు ప్రొజీరియా). – కార్తీక్ బాలచంద్రన్, వైద్యుడు

దానిమ్మల నగరం



ఇరాన్‌లోని ఫరూఖ్ నగరాన్ని దాని విస్తారమైన దానిమ్మ తోటల కారణంగా 'దానిమ్మ తోటల నగరం' అని పిలుస్తారు. పర్షియన్ సంస్కృతిలో దానిమ్మలు కీలక పాత్ర పోషిస్తాయి. అవి లేకుండా వివాహం, కళ, కవిత్వం ఉండవు. పునర్జన్మకూ, చీకటి మీద వెలుగు విజయానికీ సంకేతంగా భావించే 'యల్దా రాత్రి' (చలికాలంలో వచ్చే సుదీర్ఘ రాత్రి) వేడుకల్లో వాటికి చాలా ప్రాధాన్యం ఉంటుంది.

– నైగోరా ఫజ్లుద్దీన్, ఫిలిమ్ మేకర్

పిచ్చుకల శత్రువులు



పిచ్చుకలు కనబడకపోవడానికి నగరీకరణ, వాతావరణ కాలుష్యం లాంటి ఇతర కారణాలతో పాటు పావురాల సంతతి విపరీతంగా పెరగడం కూడా ఒక కారణం. కొన్ని నగర మూలల్లోనైతే దాదాపుగా పిచ్చుకలు అంతరించిపోవడానికి పరోక్షంగా పావురాలు కారణం. – జకర్ డాక్టర్, ఫిజీషియన్

మారిపోయారు!



మీలోని పాత వ్యక్తిని క్షమించేయండి. మీకు తెలిసింది మీరు చేశారు. వదిలేయండి. మీరు మారారు. జరిగిందేదో జరిగిపోయింది. ముందుకు సాగడమే జీవిత సారం! ఒక ఏడాది క్రితమో, ఒక నెల క్రితమో, ఆఖరికి ఒక క్షణం క్రితమో ఉన్న మీరు ఇప్పుడు మీరు కాదు. ఈ వాస్తవాన్ని అంగీకరిస్తే, మీరు వికసిస్తారు. – కరుణ్ పాల్, మైండ్‌సెట్ కోచ్

అమ్మానాన్నే ముందు!



ఎప్పుడు కొత్త ఫోన్ కొన్నా... మొదటి కాల్ మా నాన్నకు చేయడం నా అలవాటు. అలాగే నా ఫోన్ కెమెరాలోని మొదటి ఫొటోలు కూడా నా తల్లిదండ్రులవే తీస్తాను. ఒకవేళ వాళ్లు అందుబాటులో లేరనుకోండి, కొంత కాలం ఆగుతాను, తొందరేముంది!

– శ్రుతీ చతుర్వేది, ఆంట్రప్రెన్యూర్

ఇన్‌బాక్స్

సామాన్యుల్ని చంపేస్తారా?

తెలంగాణ ముఖ్యమంత్రి సెక్యూరిటీల కండకావరం... దాదాపు చావు నుంచి బయటపడ్డాను. గొంతు తొక్కి, తోసి బయట పారేశారు. నా మిత్రుడి కాలు తొక్కి పడేశారు. ఆదివారం నాడు హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఆవరణలో జరిగిన అలయ్ బలయ్ కార్యక్రమం మా ప్రాణానికి వచ్చింది. సెక్యూరిటీ అంటే చంపడమా? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వస్తూ ఉంటే చుట్టూ ఉన్నవాళ్లు పోలీసులా? లేక ప్రైవేట్ సైన్యమా? సీఎం కోసం అక్కడ ఉన్న ప్రతివాడినీ చంపేయాలా? అదృష్టవశాత్తూ చావు తప్పి, బయటపడ్డాం.

ఈ పరిస్థితి నాకు (మాడభూషి శ్రీధర్), సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరికీ ఎదురైంది. గవర్నర్ బండారు దత్తాత్రేయ స్వయంగా ఫోన్ చేస్తే వెళ్ళకపోవడం భావ్యం కాదనుకుని 'అలయ్ బలయ్'కి వెళ్ళాం. సీఎం వస్తున్నదశ. నేను, పాశం యాదగిరి దూరం నుంచి వేదిక వద్దకు రాకముందే సెక్యూరిటీ వారి అతి వల్ల ప్రమాదం వచ్చిపడింది. సీఎం చుట్టూ ఎవరు చచ్చిపోయినా ఫరవాలేదన్నట్టుగా రక్షకభటులు వ్యవహరించారు. నా గొంతు నొక్కేయడంతో నొప్పిగా ఉంది. యాదగిరి కాలిపైన నెత్తురు గాయమైంది. మందులు వాడుతున్నాం. ఇలాంటి రక్షణలో ఉండే సీఎం సామాన్యులకు రక్షణ ఏమిస్తారు?

సీఎం చుట్టూ ఉన్నవారు మమ్మల్ని తొక్కిపారేశారు. ఒక దశలో నేను చనిపోతాననే అనిపించింది. అసలే ఆరోగ్యం పూర్తిగా బాగుకాని దశలో ఉన్నవాణ్ణి. నన్ను నేను ఏ విధంగా రక్షించుకోవాలి? నిజానికి సెక్యూరిటీ వారు మమ్మల్ని పక్కకు వెళ్లమని చెప్పి, ముఖ్యమంత్రిని భద్రంగా తీసుకువెళ్ళవచ్చు. ఆ మాత్రం కనీసపు ఇంగితం వాళ్ళకు లేకపోయింది. వీరు రక్షకులా, రజాకార్లా, కిరాయి గూండాలా? మా ప్రాణాలు పోతే ఈ ముఖ్యమంత్రి గారు బాధ్యత తీసుకుంటారా? ఒకవేళ చస్తే ఏం చేస్తారు? సంతాపం చెబుతారు. లేదంటే కుటుంబానికి కొన్ని లక్షలు ఇస్తారు. మనుషుల ప్రాణాల విలువ అంతేగా!

సీఎం గారూ! వేదిక వద్దకు వచ్చే ముందు జనాన్ని చంపేయకండి. మీ అలయ్ బలాయ్ లేకపోతే మానె... సామాన్యుల్ని చంపకండి. బండారు దత్తాత్రేయ గారూ! మీ అలయ్ బలయ్ పేరుతో మీ మిత్రులనుకునే వారిని కూడా చావుకు సిద్ధం కమ్మనడం న్యాయం కాదు. ఈ పని బదులు తిండిలేని వారికి అన్నదానం చేయండి. ఇంకేం వద్దు. ఇదేదో అనుకోకుండా జరిగిన చిన్నతప్పు అని తోసిపారేయకండి. ఇక ముందు ఏ వేదిక దగ్గరా ఏ మనిషినీ తోసి, తొక్కేయకండి. నా వయసు 69. యాదగిరి 73 దాటిన వారు. పదిమంది కండలు పెంచుకున్న వారి దాడులకు మేం తట్టుకోలేం. ఈ రాష్ట్రం తట్టుకోలేదు. గొంతు నొక్కకుండా, కొట్టకుండా వీలు కాకపోతే ఈ అలయ్ బలయ్ లేకపోయినా ఫరవా లేదు. మనుషుల్ని బతికించకపోయినా ఫరవాలేదు కానీ చంపకండి.

– మాడభూషి శ్రీధర్, రచయిత – ప్రొఫెసర్,
పాశం యాదగిరి, సీనియర్ జర్నలిస్ట్

తగిన గుర్తింపునకు నోచని ప్రజ్ఞాశాలి

అభిప్రాయం



డా॥ దేవరాజు మహారాజు

కొందరు నిజాయతీగా సమాజానికి పనికొచ్చే రచనలు చేస్తారు. అటువంటి అరుదైన, విలువైన రచయిత కొడవటిగంటి రోహిణీ ప్రసాద్. అరవై మూడవ యేట అనూహ్యంగా 2012 సెప్టెంబర్ 8న బొంబాయిలో కన్నుమూసి, తెలుగు జాతికి దిగ్భ్రాంతిని కలుగజేసిన ఆయన కృషి చిరస్మరణీయం.

బాల్యంలో తండ్రి కొడవటిగంటి కుటుంబరావు (కొ.కు.) కల్పించిన వాతావరణం వల్ల రోహిణీ ప్రసాద్ పుస్తకాల వైపు, హేతువాద దృక్పథం వైపు, శాస్త్రీయ అవగాహన వైపు ఆకర్షితులయ్యారు. కానీ, సంగీతం వైపు, నాట్యం వైపు, అనువాదాల వైపు ఆకర్షితులు కావడం ఆశ్చర్యంగా తోస్తుంది. విశాఖలో చదువుకునే రోజుల్లో రోహిణీ ప్రసాద్ కర్ణాటక సంగీత వాయిద్యం వీణ నేర్చుకోవాలి. కానీ, ఆయన హిందుస్తానీ సంగీత వాద్యం – సితార్ నేర్చుకున్నారు. తర్వాత ముంబయిలో ఉన్నప్పుడు ఉస్తాద్ ఇమ్రత్ ఖాన్ శిష్యరికం చేసి సితార్ వాదనంలో ప్రావీణ్యం గడించారు. ముంబయిలో అక్కడి తెలుగువారితో కలిసి కూచిపూడి, భరత నాట్యం, కథక్, ఒడిస్సీ నృత్యాలు కలగలిపి 'కృష్ణ పారిజాతం' బ్యాలేకు రూపకల్పన చేశారు. ఈ అణు భౌతిక శాస్త్రవేత్త ముంబాయిలో సితార్ కచేరీలు చేయడం మామూలై పోయినా, 1990లలో అమెరికాలోని పలు నగరాలలో తన కళా ప్రదర్శనలు కొనసాగించడం, సితార్ వాద్య కళాకారుడిగా గొప్ప పేరు ప్రఖ్యాతులు సాధించుకున్నారని తెలిసినప్పుడు ఆశ్చర్యపోతాం. అంతేకాదు, రాగాల గూర్చి, సంగీత వాద్య పరికరాల గూర్చి ఎన్నో విలువైన వ్యాసాలు రాశారని తెలిసినప్పుడు మనసు ఉప్పొంగిపోయినా, వెంటనే చివుక్కుమంటుంది. అయ్యో! ఈయనకు రావాల్సిన గుర్తింపు రాకపోయెనే అనీ!

తనకు సన్నిహితంగా తెలిసిన హిందుస్తానీ, కర్ణాటక సంగీత సమ్రాట్టుల జీవిత విశేషాలన్నీ 2000-2012 మధ్య కాలంలో 'ఈమాట డాట్ కామ్'లో ఆయన భద్రపరిచారు. ప్రధానంగా జరిగిన లోపమేమంటే ఆయన పుస్తకాలు వెంట వెంట రాకపోవడం.

గ్రంథాలు వెలువడడం, గ్రంథాలయాల్లో లభ్యం కావడం, వచ్చే తరాలకు అందుబాటులో ఉండటం అవసరం. బహుముఖ ప్రజ్ఞాశాలి అయి ఉండి కూడా రోహిణీ ప్రసాద్ ఆలోచనలు తెలుగు జాతికి అందాల్సినంతగా అందలేదు. బడే గులాం అలీఖాన్, అల్లా ఉద్దీన్ ఖాన్, అహ్మద్ జాన్ థిరక్వా, ప్రభా ఆత్రే, ఉస్తాద్ అమీర్ ఖాన్, విలాయత్ ఖాన్, ఈమని శంకరశాస్త్రి, నౌషాద్, ఓపీ నయ్యర్, సీఆర్ సుబ్బురామన్, ఘంటసాల, బాల మురళీ కృష్ణ వంటి మహా సంగీత విద్వాంసుల శైలులపై, వారి జీవిత విశేషాలపై రాసిన వ్యాసాలు ఇప్పటికైనా పుస్తక రూపంలో రావాలి. ఆ రకంగా మరణాంతరమైనా రోహిణీ ప్రసాద్ కృషి వెలుగులోకి వస్తుంది.



కొడవటిగంటి రోహిణీ ప్రసాద్

రోహిణీ ప్రసాద్, తన తండ్రి కొ.కు. లాగా సృజనాత్మక సాహిత్యంలో కృషి చేయలేదు. కానీ వైజ్ఞానిక సారస్వతంలో చేసిన కృషి తక్కువది కాదు. అలాగే తన సోదరి ఆర్. శాంతసుందరి లాగా అనువాదాల వైపు కూడా ఆకర్షితులయ్యారు. 1947 నుండి ఏడేళ్లపాటు చందమామ పత్రికలో అచ్చయిన పిల్లల కథలను ఆయన ఇంగ్లిష్‌లోకి అనువదించారు. బాల సాహిత్యం విలువను, సాహిత్యం విలువను, అనువాదాల విలువను, సంగీత కళారూపాల విలువను గ్రహించడంతో పాటు సమాజంలో వైజ్ఞానిక అవగాహన ఎంతో అవసరం అన్నది గ్రహించారు. అందుకే మరణానంతరం తన శరీరం మట్టిపాలు కాకుండా వైద్య పరిశోధనలకు ఉపయోగపడాలి అను కున్నారు.


మూఢ విశ్వాసాలను బలపరిచే వారిపై వ్యంగ్యాస్త్రాలు సంధిస్తూనే... జరుగుతున్న సంఘటనల వెనుక ఎటువంటి భౌతిక శక్తులు పని చేస్తాయో హేతువాదులు వివరించగలగాలని సూచించారు. పుట్టిన ప్రతి ప్రాణీ కలకాలం జీవించడానికి ప్రకృతి సూత్రాలు ఒప్పుకోవని, అయితే పనికొచ్చే పదార్థం జన్యు పదార్థమే గనక, దాన్ని తరువాతి తరం కోసం వాడుకుంటూ ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. శాస్త్రవేత్తగా, సంగీతకారుడిగా, సైన్స్ రచయితగా ఒక క్రమపద్ధతిలో నిరంతరం కృషి చేస్తూ వచ్చిన రోహిణీ ప్రసాద్ ఒక విషయాన్ని గట్టిగా నమ్మారు. 'నీ పనికి నువ్వొక రూపమివ్వు. ఆ పనే మళ్ళీ నీకో రూపమిస్తుంది' అని! జీవితాంతం ఆయన ఆచరించిన సూత్రం అదే!

'జీవశాస్త్ర విజ్ఞానం – సమాజం' తన పుస్తకంలో రోహిణీ ప్రసాద్ ఇలా అంటారు... 'మతాలన్నీ ఎప్పుడు ఎలా తలెత్తాయో అర్థం చేసుకుంటే అవి ఈ రోజుల్లో ఎందుకు నిరుపయోగమో అర్థమవుతుంది. మతం అపెండిక్స్ అని ఎవరో అన్నారు. నిజమే మన శరీరంలో పెద్ద పేగుకు చివర ఉన్న అపెండిక్స్ ఒకప్పుడు పనికొచ్చేదట. ఈనాడు దానివల్ల ఉపయోగమేమీ లేకపోగా, అప్పుడప్పుడు అపెండిసైటిస్ వ్యాధి కలిగిస్తూ ఉంటుంది. దాన్ని తొలగించడమే మంచిది. మతమనేది కూడా అంతే.' మతం పట్ల స్పష్టమైన వైఖరి తెలియజేశారాయన. మనకిప్పుడు వైజ్ఞానిక స్పృహ, వివేచన, ఇంగిత జ్ఞానం కలిగించే రచనలు కావాలి. డాక్టర్ రోహిణీ ప్రసాద్ అలాంటి రచనలే చేశారు. మనకు గొప్ప శాస్త్రవేత్తలు, మేధావులూ ఉన్నారు. కానీ సామాన్యుడి కోసం సైన్స్ రాసే రచయితలు ఎక్కువగా లేరు. ఉన్నా... వారు సైన్స్ సమాచారం ఇవ్వగలుగుతున్నారే గానీ, సమాజానికి అన్వయిస్తూ రాయలేక పోతున్నారు. విలువల్ని ప్రతిష్ఠాపించే చేవగల ఈయన మరణం వల్ల, తెలుగు సమాజానికి పెద్ద విఘాతమే. రోహిణీ ప్రసాద్ ఆశించిన సమాజానికి రూపకల్పన చేయాలి.

వ్యాసకర్త సుప్రసిద్ధ సాహితీవేత్త,
బయాలజీ ప్రొఫెసర్

ధర్మ చింత!

పద్దెనిమిది రోజులు సాగిన కురుక్షేత్ర సంగ్రామంలో, చివరికి ధర్మం గెలిచి, పాండవులకు విజయం లభించింది. పెంచి పెద్దజేసి, విద్యాబుద్ధులు నేర్పించిన కురువృద్ధులందరినీ పోగొట్టుకోగా లభించిన రాజ్యాధికారం, అనుభవించడానికి ఎంతవరకు అర్హమైనది? అనే చింతనలో పడ్డాడు ధర్మరాజు. ఆలోచించగా, తనకు సుఖం రాజ్యాధికారంలో లేదని నిర్ణయించుకుని, భీముడికి పట్టంకట్టి, తాను అడవులకు వెళ్ళడానికి సంకల్పించాడు. ఆ సంగతినే వ్యాస



మహర్షితో చెప్పగా, పెద్దలను నిర్జించి పాపం మూటగట్టు కున్నాననే భయం అక్కర్లేదనీ, ఒక్క అశ్వమేథయాగం చేయడంతో అన్ని పాపాలు తొలుగుతాయి కాబట్టి, అశ్వమేథయాగం చెయ్యమని సలహా ఇచ్చాడు. అశ్వమేథయాగమంటే మాటలు కాదు, దానికి చాలా ధనం కావాలి. యుద్ధంలో సంపదనంతా పోగొట్టు కున్న తనకు అది సాధ్యమయ్యే పని కాదు అన్నాడు ధర్మరాజు. ఇంకా ఇలా అన్నాడు.

**ఉ॥ కాక నెదిర్చి సంగర ముఖంబున హెచ్చిన రాజవంశమున్
గూకటివేళ్ళతో బెజికి గోత్రవధంబును జేసినట్టియా
వ్రేకపుగీడు గాక ప్రజ వేచ దలంచిన గోరుచుట్టుపై
రోకటిపోటు చందముగ రోసి జనుల్ నను జూచి తిట్టరే**

'ప్రసిద్ధి వహించిన రాజవంశాన్ని యుద్ధంలో విజయం సాధించడం కోసం సమూలంగా నాశనం చేసి కీడును సొంతం చేసుకున్నాను. ఆ కీడును తొలగించుకునే కోరికతో అశ్వమేథయాగం చేయడానికి సంకల్పించి, కావలసిన ధనం కోసం ప్రజలను వేధించడం మొదలుపెడితే, యుద్ధం కారణంగా అన్నీ పోగొట్టుకుని నిరుపేదలైన ప్రజలకు అది గోరుచుట్టు మీద రోకటిపోటులా పరిణమించి, వాళ్ళు నన్ను ఛీత్కరించుకుని నానా తిట్లూ తిట్టకుండా ఉంటారా?' అని భయాన్ని వ్యక్తం చేశాడు ధర్మరాజు – అని జైమిని భారతం, అశ్వమేథపర్వం, ప్రథమాశ్వాసంలోని పై పద్యం భావం.

ధర్మరాజుకు రాజ్యాధికారం మీద దుర్యోధనుడికి ఉన్న కాంక్ష లేదు. గౌరవంగా బ్రతకడానికి వలసినంత మాత్రమే రాజ్యంలో భాగంగా ఇస్తే చాలునని స్పష్టం చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో వీరధర్మంగా యుద్ధం చేసి సాధించుకోవలసి వచ్చింది.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.ద్వాదశి రా.12.26 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** శతభిషం రా.10.29 వరకు, తదుపరి పూర్వాభాద్ర, **వర్జ్యం:** ఉ.6.38 నుండి 8.06 వరకు, తదుపరి తె.4.30 నుండి 5.58 వరకు (తెల్లవారితే మంగళవారం), **దుర్ముహూర్తం:** ప.12.12 నుండి 1.00 వరకు, తదుపరి ప.2.33 నుండి 3.21 వరకు, **అమృతఘడియలు:** ప.3.34నుండి 5.05 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.56, **సూర్యాస్తమయం:** 5.37.

● వైభవంగా శ్రీభద్రకాళి అమ్మవారి తెప్పోత్సవం



వరంగల్‌లోని శ్రీభద్రకాళి దేవాలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా శనివారం విజయ దశమిని పురస్కరించుకుని అమ్మవారికి హంసవాహనంపై తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. భద్రకాళి తటాకంలో చేపట్టిన ఈ వేడుక కనువిందు చేసింది. - హనుమకొండ కల్చరల్

● నేత్రపర్వంగా జోగుళాంబ తెప్పోత్సవం



తెలంగాణలోని ఏకైక శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర ఆలయంలో వైభవంగా నిర్వహించిన శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు విజయ దశమితో ముగిశాయి. ఈ సందర్భంగా శనివారం తుంగభద్ర నదిలో నిర్వహించిన తెప్పోత్సవం నేత్రపర్వంగా సాగింది. - జోగుళాంబ శక్తిపీఠం

● కమనీయంగా శ్రీరామ లీలా మహోత్సవం



విజయదశమి సందర్భంగా భద్రాచలం రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత ఆలయ ఈవో రమాదేవి ఆధ్వర్యంలో శ్రీరామ లీలా మహోత్సవం జరిపారు. రావణాసురుడి ప్రతిమపైకి అగ్ని బాణాన్ని వదలగా.. బాణాసంచా కాంతులతో దసరా మండప ప్రాంగణం వెలిగిపోయింది. - భద్రాచలం

కలుషిత నీరు తాగి 50 మందికి అస్వస్థత

నారాయణఖేడ్: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం సంజీవరావుపేట్ గ్రామంలో కలుషిత నీరు తాగి 50 మంది వరకు అస్వస్థతకు గురయ్యారు. ఇదే సమయంలో రెండు రోజుల్లో ఇద్దరు మరణించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఊరిలో 3 మంచినీటి ట్యాంకులు ఉండగా, 2 ట్యాంకులకు మిషన్ భగీరథ పథకం కనెక్షన్ ఉంది. పాత ట్యాంకుకు మాత్రం బావి నీటి కనెక్షన్ ఉంది. కాగా, బావి నీటికి సంబంధించిన ట్యాంకు ద్వారా సరఫరా అయిన నీటిని తాగి రెండు కాలనీలకు చెందినవారు అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం వీరు నారాయణఖేడ్, సంగారెడ్డిల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఆర్డీఓ అశోకచక్రవర్తి శనివారం గ్రామాన్ని సందర్శించారు. అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని సూచించారు. దీంతోపాటు ట్యాంకులోని నీటిని ఖాళీ చేయించి బావిని, ట్యాంకును క్లోరినేషన్ చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ సంగారెడ్డి, డీఎంహెచ్‌ఓ గాయత్రీ దేవి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సంధ్యారాణి బాధితులను పరామర్శించారు. ఇదిలా ఉండగా శుక్రవారం గ్రామానికి చెందిన బోడిమ హేశ్ (23) వాంతులు, విరోచనాలతో అస్వస్థతకు గురై సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందగా, సాయమ్మ (86) వాంతులు, విరేచనాలతో శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. వారి మృతికి కలుషిత నీరే కారణమని మృతుల కుటుంబీకులు ఆరోపిస్తుండగా.. మహేశ్ కోలుకున్నాక అపెండిక్స్‌తో, సాయమ్మ వృద్ధాప్య సమస్యల కారణంగా మృతిచెందినట్లు డీఎం అండ్‌హెచ్‌ఓ గాయత్రిదేవి తెలిపారు.

ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌కు నిరసనగా గళమెత్తండి

● మావోయిస్టు తూర్పు బస్తర్ డివిజన్ కమిటీ పేరిట లేఖ విడుదల

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని తుల్‌తులి అడవుల్లో ఈ నెల 4న పోలీసులు జరిపిన కాల్పుల్లో 35 మంది వీరమరణం పొందారని మావోయిస్టు పార్టీ తూర్పు బస్తర్ డివిజన్ కమిటీ తెలిపింది. ఈ ఘటనను వ్యతిరేకిస్తూ అన్ని వర్గాల ప్రజలు నిరసన గళం వినిపించాలని పిలుపునిచ్చింది. ఎన్‌కౌంటర్ జరిగిన తర్వాత తొలిసారిగా ఆదివారం ఆ పార్టీ ఓ లేఖను విడుదల చేసింది. లేఖలో 35 మంది అమరులయ్యారని పేర్కొంటూ, వారి పేర్లు, కేడర్ వివరాలు పేర్కొంది. లేఖలో పేర్కొన్న వివరాల ప్రకారం.. ఉదయం 6 గంటల ప్రాంతంలో మా శిబిరానికి శత్రువు వస్తున్న సమాచారం అందిందని, దీంతో సహచరులందరూ అప్రమత్తమయ్యారని తెలిపింది. అక్కడి నుంచి శిబిరాన్ని మార్చాలనుకుంటున్న తరుణంలో పోలీసుల వైపు నుంచి ఫైరింగ్ ప్రారంభమైందని, కాల్పుల్లో పలువురు అమరులవగా, గాయపడిన 17 మందిని పట్టుకొని ఈ నెల 5న పోలీసులు కాల్చి చంపారని మావోయిస్టు పార్టీ ఆరోపించింది.

డిజిటల్ క్రాప్ సర్వే చేయలేం

● వ్యవసాయ విస్తరణాధికారుల హెచ్చరిక
● నేటికీ యాప్ డౌన్‌లోడ్ చేసుకోని ఏఈవోలు
● 15 రోజులుగా విధులకు హాజరుకాని వైనం



సాక్షి, హైదరాబాద్: డిజిటల్ సర్వే చేయలేమంటూ వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవో) చేతులెత్తేశారు. కొత్త విధానంతో పనిభారం పెరుగుతుందని, ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా ఇక్కడ అమలు చేయాలని వారు పట్టుబడుతున్నారు. దీంతో గత పదిహేను రోజులుగా ఏఈవోల నిరసన కొనసాగుతూనే ఉంది. వారు విధులకు హాజరు కాకుండా డిజిటల్ క్రాప్ సర్వేను అడ్డుకుంటున్నారు. మొత్తం 2,600 మంది ఏఈవోలు బహిష్కరిస్తుండటంతో సర్వే నిలిచిపోయింది. వ్యవసాయ రంగంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ)ని రూపొందించే లక్ష్యంతో కేంద్రం డిజిటల్ అగ్రిమిషన్ పథకాన్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఒక్కో రాష్ట్రం ఒక్కో విధంగా సిబ్బందిని సమకూర్చుకుంటోంది. కొన్ని రాష్ట్రాలు ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించి సర్వే చేయిస్తున్నాయని, మన రాష్ట్రంలో మాత్రం పూర్తిగా తమ పైనే వదిలేశారని ఏఈఓలు వాపోతున్నారు.

ఇవన్నీ ఎలా చేయాలి ?

- ఏఈవోలు 25 మీటర్ల లోపు పరిధి నుంచి యాప్‌లో ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి.
- సర్వే నంబర్ల వారీగా ఏఏ పంటలు ఎన్ని ఎకరాల్లో వేశారనే వివరాలు నమోదు చేయాలి.
- జిల్లాల్లో కొన్ని ఎత్తయిన గుట్ట ప్రదేశాలు, వాగులు, వంకల అవతల, సరైన రోడ్లు లేని ప్రాంతాల్లోని భూములకు వెళ్లి సర్వే చేయడం ఇబ్బందిగా ఉంటుంది.
- బై నంబర్లు ఉన్న భూముల విషయంలో రెవెన్యూ సహకారం లేనిదే సర్వే చేయలేమంటున్నారు.
- ఏఈఓలకు గతంలో ట్యాబ్‌లు అందించినా, ప్రస్తుతం అవి పని చేయడం లేదు. దీంతో తమ సొంత ఫోన్లలోనే ఫొటోలు తీసి వివరాలు నమోదు చేయాల్సి వస్తుందంటున్నారు.
- కొన్ని రాష్ట్రాల్లో 1,000–1,500 ఎకరాలకు ఒక గ్రామ వ్యవసాయ సహాయకుడిని నియమించారని, తెలంగాణలోనూ తాత్కాలిక విధానంలో అలా నియమిస్తే సర్వే చేసేందుకు సిద్ధమంటున్నారు.
- ఒక్కో సర్వే నంబరుకు కేంద్రం రూ. 10 ఇవ్వనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నా ఇక్కడ తమ పైనే పూర్తిగా భారం మోపుతున్నారని ఏఈవోలు ఆవేదన చెందుతున్నారు.
- వ్యవసాయ శాఖలోని 49 రకాల పనులు చేస్తూనే.. డిజిటల్ సర్వే నిర్వహించటం సాధ్యం కాదంటున్నారు.
- ఏఈవోలు ఇప్పటివరకు యాప్‌ను కూడా డౌన్‌లోడ్ చేసుకోకపోవడంతో వ్యవసాయశాఖ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వేలాది ఎకరాలు ఎలా చేయగలం?

భవిష్యత్‌లో ఆహారభద్రత, పంటల బీమాతోపాటు ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే పంట నష్టాన్ని అంచనా వేయటం, ఆహార ధాన్యాల ఎగుమతి, పంటల కొనుగోలు, సాగు ప్రణాళిక, మార్కెటింగ్ తదితర అవసరాలకు డిజిటల్ క్రాప్ సర్వే చేయాలనేది కేంద్ర ప్రభుత్వ ఉద్దేశం. 'డిజిటల్ అగ్రి మిషన్'పథకం అమలుకు దేశవ్యాప్తంగా రూ.2,817కోట్లు నిధులను ఖర్చు చేస్తోంది. రైతులకు ప్రయోజనం చేకూర్చటానికి, వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడానికి ఈ సర్వే చేపట్టింది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో ఈ సర్వే కొనసాగుతుండగా తెలంగాణ ఆసక్తి చూపలేదు. అయితే ఇప్పుడు మాత్రం సర్వే చేసేందుకు ముందుకొచ్చి ఏఈవోలకు శిక్షణ ఇచ్చింది. గత సెప్టెంబరు 24 నుంచి సర్వే నిర్వహించాలని ఆదేశించింది. కాగా, రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో దాదాపు 50 శాతం క్లస్టర్లలో సాగు భూమి 5 వేల ఎకరాలకు మించి ఉంది. కొన్ని క్లస్టర్లలో 20 వేల నుంచి 30 వేల ఎకరాలు కూడా ఉండటంతో ఏఈవోలు అంత భూమిని సర్వే చేయడం సాధ్యం కాదంటున్నారు. ఇప్పటికే రైతు బీమా, పంట నష్టం సర్వే, పంటల నమోదు, పంటల కొనుగోళ్లు, రైతు భరోసా, పంటల రుణమాఫీ వంటి వాటితో తీవ్రమైన పని ఒత్తిడి ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భూమి లేదు.. ఉన్నా హక్కుల్లేవు!

▶ మొదటి పేజీ తరువాయి

చేయాలి. కలెక్టరేట్లు, ఐటీడీఏలు, సీసీఎల్‌ఏలో లీగల్ సెల్స్ ఏర్పాటు చేయాలి.

- ఆర్‌వోఆర్ కొత్త చట్టం తీసుకురావాలి. సాదాబైనామాల సమస్యను పరిష్కరించాలి. గ్రామీణ నివాస ప్రాంతాల (ఆబాదీ)ను సర్వే చేయాలి.
- రాష్ట్రంలోని అన్ని భూములను రీసర్వే చేసి శాశ్వత భూఆధార్ ఇవ్వాలి. టైటిల్ గ్యారంటీ చట్టాన్ని అమల్లోకి తేవాలి.
- అసైన్డ్ భూములన్నింటికీ పట్టాదారు పాసుపుస్తకాలు, టైటిల్ డీడ్స్ మంజూరు చేసి యాజమాన్య హక్కులు కల్పించాలి. సీలింగ్ భూములకు కూడా హక్కులివ్వాలి.
- ఇనాం భూములకు ఆక్యుపేషన్ రైట్స్ సర్టిఫికెట్ (ఓఆర్‌సీ) ఇవ్వాలి. ఆ ఓఆర్‌సీ వివరాలను ధరణి పోర్టల్‌లో నమోదు చేయాలి.
- అటవీ, రెవెన్యూ శాఖల మధ్య ఉన్న భూముల సమస్యల పరిష్కారానికి జాయింట్ సర్వే చేపట్టాలి. అటవీ భూముల వివరాలను ధరణి పోర్టల్‌లో మరోమారు నమోదు చేయాలి.
- భూదాన బోర్డును ఏర్పాటు చేయాలి. భూదాన భూముల వివరాలను ధరణి పోర్టల్‌లో నమోదు చేయాలి. దేవాదాయ, వక్ఫ్ భూములను కూడా ధరణిలో పొందుపర్చాలి.
- నిషేధిత భూముల జాబితా (22ఏ)ను సవరించాలి. అప్‌డేట్ చేయాలి. భూసేకరణ జరిగిన భూములను పట్టాదారు ఖాతాల నుంచి తొలగించాలి.
- రాష్ట్రంలోని అన్ని భూచట్టాల స్థానంలో రెవెన్యూ కోడ్ (ఒకే చట్టం) అమల్లోకి తేవాలి. నల్సార్ న్యాయ వర్సిటీలోని ల్యాండ్ రైట్స్ సెంటర్‌ను అభివృద్ధి చేయాలి.
- భూసంస్కరణల విషయంలో ప్రభుత్వానికి సహాయకారిగా ఉండేందుకు 'ఇన్నోవేషన్స్ అండ్ లీగల్ సపోర్ట్ సెల్'ను ఏర్పాటు చేయాలి.
- తహసీల్దార్ స్థాయిలో ల్యాండ్ సపోర్ట్ సెల్స్ ఏర్పాటు చేయాలి. గ్రామానికో భూమి నిర్వహణ అధికారిని నియమించాలి.
- రెవెన్యూ సిబ్బంది సామర్థ్యాలు, పనితీరును మెరుగుపర్చేలా ఎప్పటికప్పుడు శిక్షణ ఇవ్వడం కోసం ల్యాండ్ అకాడమీని ఏర్పాటు చేయాలి. కొత్త ల్యాండ్ పాలసీ రూపొందించాలి.
- కోనేరు రంగారావు, గిర్‌గ్లానీ కమిటీలతోపాటు 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, కేంద్ర ప్రభుత్వ' సలహాలను పరిగణనలోకి తీసుకోవాలి. ల్యాండ్ గవర్నెన్స్ అసెస్‌మెంట్ రిపోర్టు తయారు చేయాలి.
- ధరణి పోర్టల్‌ను ప్రభుత్వ ఏజెన్సీకి అప్పగించాలి. గతంలో జరిగిన ధరణి లావాదేవీలపై థర్డ్ పార్టీ ఆడిట్ చేయించాలి.
- ధరణి పోర్టల్‌లో ఉన్న అన్ని మాడ్యూళ్ల స్థానంలో ఒక్కటే మాడ్యూల్ ఉంచాలి. పార్ట్–బీ భూముల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి. సేత్వార్, ఖాస్రా, సెస్లా, పాత పహాణీలను డిజిటలైజ్ చేయాలి.

ప్రియుని హత్య... ప్రియురాలి ఆత్మహత్య

● విషాదాంతంగా ముగిసిన అంజలి జీవితం



అంజలి

గోదావరిఖని: కట్టుకున్న భర్తను, కడుపున పుట్టిన పిల్లలను కాదని ఓ మహిళ ప్రియుడితో కలిసి వెళ్లిపోయింది. ఇది నచ్చని ఆమె అన్న, మాజీ భర్త కలిసి ప్రియుడిని హత్య చేశారు. దీంతో నిర్వేదానికి గురైన ఆమె ఉరివేసుకుని జీవితాన్ని చాలించింది. గోదావరిఖని హనుమాన్‌నగర్‌కు చెందిన అంజలి (25) భర్త, ఇద్దరు పిల్లలను కాదని యైటింక్లయిన్ కాలనీకి చెందిన ప్రియునితో కాపురం సాగిస్తోంది. పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించినా ప్రియుడితో ఉండేందుకే మొగ్గుచూపింది. ఇద్దరూ మేజర్లు కావడంతో పోలీసులు చేసేదేమీ లేక ఇష్టపడిన ప్రియునితో పంపించేశారు. ఇలా 3 నెలలపాటు గడిచాయి. అయితే శుక్రవారం సద్దుల బతుకమ్మ రోజు చూడాలంటూ అంజలికి అన్న ఫోన్ చేశాడు. నిజమని నమ్మిన ఆమె ప్రియుడిని ఎదురుగా పంపించింది. చెల్లిని ఇంట్లో బంధించి బయట గడియవేసి ప్రియుడు వినయ్‌కుమార్ (26)ను అన్న, మాజీ భర్త కలిసి హతమార్చారు. ఈ సంఘటన తర్వాత అంజలిని పోలీసులు అదేరోజు పెద్దపల్లిలోని సఖీ కేంద్రానికి పంపించారు. అనంతరం గుంటూరుకు వెళ్లిన అంజలి చిన్నమ్మ ఇంట్లో ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గోదావరిఖనికి తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో చిచ్చురేపిన దసరా ఫ్లెక్సీలు

● ఎమ్మెల్యే రేవూరి, మంత్రి 'కొండా'వర్గీయుల ఘర్షణ



పోలీసు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి సురేఖ

గీసుకొండ: దసరా పండుగ సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 16వ డివిజన్ ధర్మారంలో శనివారం కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి వర్గీయుల మధ్య చిచ్చు రేపాయి. కొండా అభిమానులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో కాంగ్రెస్‌కు చెందిన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఫొటోలు లేకపోవడంతో రేవూరి వర్గం వారు ప్రశ్నించారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ వివాదంపై రేవూరి వర్గం గీసుకొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కొండా వర్గం సైతం పోలీసులకు ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. అయితే వారిని పోలీస్‌స్టేషన్‌లోనే అదుపులోకి తీసుకుని బయటకు పంపడం లేదనే సమాచారం రావడంతో కొండా వర్గం కార్యకర్తలు, నాయకులు ధర్మారంలో ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న మంత్రి సురేఖ తమ వారిని విడిపించేందుకు ఆదివారం సాయంత్రం గీసుకొండ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. తమ కార్యకర్తలు ఫిర్యాదు చేయడానికి వస్తే, బంధించి బూట్లతో తన్నుతారా.. విచారణ చేయరా? అని ఆమె పోలీసు అధికారులను నిలదీశారు. ఎమ్మెల్యేకు తొత్తుగా వ్యవహరిస్తున్నారంటూ ఆమె ఆరోపించినట్లు తెలుస్తోంది. పోలీస్ స్టేషన్‌లో సీఐ కుర్చీలో కూర్చుని ఆమె అధికారులతో వాదిస్తున్నట్లు ఉన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మంత్రి పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన విషయం తెలిసిన సీపీ అంబర్ కిషోర్‌ఝా అక్కడికి వెళ్లి ఆమెతో మాట్లాడారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పడంతో మంత్రి అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా రేవూరి వర్గీయుడు పిట్టల అనిల్‌పై దాడి చేసిన విషయంలో కొండా వర్గానికి చెందిన ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు గీసుకొండ పోలీసులు తెలిపారు. ఇందులో ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకోగా, ఇద్దరు పరారీలో ఉన్నారు. కొండా వర్గీయుల నుంచి తనకు ప్రాణహాని ఉందని పిట్టల అనిల్ చేసిన వీడియో వైరల్ అయింది.

ఇద్దరు పిల్లలను బావిలో తోసి..

తండ్రి ఆత్మహత్య

● కామారెడ్డి జిల్లా నందివాడలో విషాదం



విగ్నేశ్, అనిరుధ్ (ఫైల్)



రోదిస్తున్న పిల్లల తల్లి అపర్ణ



శ్రీనివాస్‌రెడ్డి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): దసరా పండుగ రోజు సంతోషంగా కొత్త బట్టలు వేసుకొని.. తండ్రి బండి మీద జమ్మికి వెళ్లిన ఆ చిన్నారులకు అవే చివరి క్షణాలు అయ్యాయి. భవిష్యత్‌కు భరోసాగా ఉండాల్సిన తండ్రే తన ఇద్దరు కుమారులను బావిలో తోసేసి తాను ఆత్మహత్య చేసుకున్నాడు. కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం నందివాడలో శనివారం ఈ విషాదకర ఘటన జరిగింది. నందివాడ గ్రామానికి చెందిన సుగుణవ్వ, గుండారెడ్డి దంపతులకు అపర్ణ అనే కూతురు ఉంది. ఆమెకు మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నాయిగావ్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి (30)తో పదేళ్ల క్రితం వివాహం జరిపించి ఇల్లరికం తెచ్చుకున్నారు. శ్రీనివాస్‌రెడ్డి దంపతులకు విగ్నేశ్‌రెడ్డి (6), అనిరుధ్‌రెడ్డి (4) అనే కుమారులు ఉన్నారు. తమకున్న భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఏడాది నుంచి శ్రీనివాస్‌రెడ్డి డబ్బుల విషయంలో కుటుంబ సభ్యులతో గొడవ పడుతున్నాడు. డబ్బులు ఇవ్వకపోతే మనశ్శాంతి లేకుండా చేస్తానని, ఇద్దరు పిల్లలను లేకుండా చేస్తానని భార్యను బెదిరించేవాడు. కాగా శనివారం దసరా సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి తన ఇద్దరు కుమారులకు కొత్త బట్టలు వేసి, బైక్‌పై జమ్మి కోసం ఇంటి నుంచి బయటకు తీసుకెళ్లాడు. అలా వెళ్లిన ముగ్గురూ రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వారికోసం గాలించారు. ఆదివారం ఉదయం గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావి వద్ద శ్రీనివాస్‌రెడ్డి ఫోన్, చెప్పులు కనిపించడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అక్కడికి వెళ్లి చూసే సరికి బావిలో ఇద్దరు చిన్నారుల మృతదేహాలు తేలాయి. సమాచారం అందుకున్న ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రామన్, ఎస్సై వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకొని పిల్లల మృతదేహాలను బయటకు తీయించారు. శ్రీనివాస్ రెడ్డి ఆచూకీ తెలియకపోవడంతో బావి చుట్టు పక్కల వెతికారు. అతని జాడ ఎంతకీ లభించకపోవడంతో రెండు మోటార్ల ద్వారా బావిలో ఉన్న నీటిని తొలగించారు. చివరికి బావి అడుగున శ్రీనివాస్‌రెడ్డి మృతదేహం లభించింది. శ్రీనివాస్‌రెడ్డి ఇద్దరు పిల్లలను బావిలో తోసేసి, తాను కూడా అదే బావిలో పడి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సర్కార్‌పై ఉద్యమ కార్యాచరణకు కమలదళం సై!

● కర్ణాటక తరహాలో అవినీతి, అక్రమాలను ఎండగట్టాలని...
● కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్‌ల సమక్షంలో జరిగిన ముఖ్యనేతల భేటీలో నిర్ణయం



బీజేపీ ముఖ్యనేతల భేటీలో పాల్గొన్న కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్. చిత్రంలో గరికపాటి, రామచంద్రరావు, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఈటల, లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: కర్ణాటక తరహా ఇక్కడా కాంగ్రెస్ సర్కారుపై బీజేపీ ఉద్యమ కార్యాచరణ సిద్ధం చేసింది. తెలంగాణ ప్రభుత్వ పరిధిలోని వివిధ శాఖల్లో పనుల కేటాయింపులు, కాంట్రాక్టులు, కేంద్ర ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టడం, అవినీతి, అక్రమాలను ఎండగట్టాలని రాష్ట్ర బీజేపీ నాయకత్వం నిర్ణయించింది. అధికారంలో ఉంటూ నిధుల దుర్వినియోగం, ఉన్నత స్థానాల్లోని వ్యక్తులు అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్న విషయంలో కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంతో తెలంగాణ ప్రభుత్వం పోటీ పడుతుందని బీజేపీ నేతలు అంటున్నారు. కర్ణాటక సర్కార్‌పై బీజేపీ పోరాడుతున్న విధంగానే, ఇక్కడా రాజీలేని పోరు చేసి ఇక్కడి ప్రభుత్వంలోని అవినీతిని ఆధారాలతో సహా నిరూపించాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వం తీర్మానించింది. ఆదివారం రాత్రి బీజేపీ కార్యాలయంలో జరిగిన పార్టీ ముఖ్యనేతల భేటీలో కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు లక్ష్మణ్, డీకే అరుణ, ఈటల రాజేందర్, పార్టీ నేతలు పొంగులేటి సుధాకరరెడ్డి, ఎన్.రామచంద్రరావు, గరికపాటి మోహన్‌రావు, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, దుగ్యాల ప్రదీప్‌కుమార్, డా.కాసం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కర్ణాటకలో సీఎం సిద్ధరామయ్య భూ కుంభకోణం, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వారసుల ట్రస్ట్‌కు భూ కేటాయింపు, ఎస్టీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో కుంభకోణం తదితర అంశాలను బీజేపీ కర్ణాటక, తమిళనాడు సహ ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకరరెడ్డి వివరించారు. కర్ణాటకను మించి తెలంగాణలోనూ ఇప్పటికే కాంట్రాక్టులు, వర్క్‌ల విషయంలో పలు కుంభకోణాలు, అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నందున ఆ అంశాలపైనా పోరాడాలనే అభిప్రాయం వ్యక్తమైంది. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పేరిట హామీలిచ్చి.. అధికారంలోకి వచ్చి పదినెలలు గడిచినా ప్రధాన వాగ్దానాలేవి పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం, రుణమాఫీ అంటూ రైతాంగాన్ని మోసం చేస్తున్న తీరు, ఇతర హామీ అమలులో వైఫల్యాలను ఎండగట్టాలని నిర్ణయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ సుందరీకరణ, హైడ్రా పేరిట పేదల ఇళ్లను కూల్చడంపై ఆందోళనలు, నిరసనల రూపంలో గట్టిగా అడ్డుకోవాలని అనుకుంటున్నారు. వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న స్వల్ప, దీర్ఘకాలిక, తక్షణ సమస్యలపై పోరాట పటిమను చూపి ప్రజల పక్షానే బీజేపీ నిలుస్తుందనే సందేశాన్ని తీసుకెళ్లాలని తీర్మానించారు.

కేంద్ర పథకాలపై ప్రజల్లోకి....

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలు, కేటాయిస్తున్న నిధులు, వాటితో చేకూరుతున్న ప్రయోజనాలు తదితర అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు. గ్రామాలకు, రోడ్ల కోసం ఇస్తున్న నిధులు, ఇతర పథకాలపై ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని భావిస్తున్నారు.

- రాష్ట్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం సాగుతున్న తీరుపైనా సమీక్షించారు. రాబోయే రోజుల్లో ఈ డ్రైవ్‌ను మరింత ఉధృతంగా నిర్వహించాలని, ఇందులో నేతలంతా చురుగ్గా పాల్గొని విజయవంతం చేయాలని నిర్ణయించారు. ఈ నెల 15వ తేదీతో సభ్యత్వ గడువు ముగుస్తుండగా...తెలంగాణలో గతనెలలో భారీవర్షాలు వరదలు, వినాయక చవితి, దసరా ఉత్సవాల కారణంగా సభ్యత్వ నమోదును మరో పదిరోజులు పొడిగించాలని రాష్ట్ర నాయకులు కోరుతున్నారు. కశ్మీర్ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక ఓటింగ్ శాతంతో మంచి ఫలితాల సాధన, హరియాణాలో వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం పట్ల కిషన్‌రెడ్డిని పొంగులేటి శాలువా కప్పి సన్మానించారు.

ఇద్దరు పోలీసుల ఆత్మహత్య

● ఉన్నతాధికారులు బలిపశువును చేశారన్న వేదనతో ఓ కానిస్టేబుల్..
● కుటుంబ విభేదాలతో కలతచెంది ఓ హెడ్ కానిస్టేబుల్ బలవన్మరణం



శ్రీనివాస్



సాగర్

బూర్గంపాడు/ఏన్కూరు/మహబూబాబాద్ రూరల్: ఓ కేసులో ఉన్నతాధికారులు తనను బలిపశువును చేశారన్న ఆవేదనతో ఓ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకోగా, కుటుంబ కలహాలతో మరో కానిస్టేబుల్ తుపాకీతో కాల్చుకుని తనువు చాలించాడు. ఖమ్మం జిల్లా ఏన్కూరుకు చెందిన భూక్యా సాగర్ (34) భద్రాద్రి జిల్లా బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో గతంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించాడు. ఆ సమయంలో, ఆ తర్వాత లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్‌లో పని చేసినప్పుడు గంజాయి అక్రమ రవాణా కేసులో సాగర్ ప్రమేయం ఉందంటూ ఉన్నతాధికారులు ఆయనను అరెస్ట్ చేసి, సస్పెండ్ చేశారు. ఇటీవలే సస్పెన్షన్ ఎత్తివేసి ఏడూళ్ల బయ్యారంలో పోస్టింగ్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో తన తప్పు లేకున్నా ఎస్సైలు సంతోష్, రాజ్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకుడు నాని తనను గంజాయి కేసులో ఇరికించారని.. ఆ నింద మోయలేకపోతున్నా.. చచ్చిపోతున్నా అంటూ సాగర్ ఏన్కూరులోని ఎన్ఎస్‌పీ ప్రధాన కాల్వ వద్ద పురుగు మందు తాగి సెల్ఫీ వీడియో తీసి శనివారం సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన గంజాయిని బయట విక్రయించేందుకు ఎస్సైలు తనపై ఒత్తిడి చేశారని, తన సెల్ నుంచే గంజాయి కొనుగోలుదారులకు ఫోన్లు చేయించారని తెలిపాడు. ఇది బయటపడుతుందన్న భయంతోనే తనను అరెస్ట్ చేయించారని ఆరోపించాడు. కాగా, పురుగు మందు తాగిన సాగర్‌ను కుటుంబ సభ్యులు హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతిచెందాడు. చికిత్స పొందుతున్న సమయంలో కూడా 'రేవంతన్నా.. నా కుటుంబానికి న్యాయం చేయండి'అని మరో సెల్ఫీ వీడియో తీశాడు. కాగా, ఈ ఘటనలో ఇద్దరు ఎస్సైలు, ఒక సీఐ, బీఆర్‌ఎస్ నాయకుడిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఏన్కూరు ఎస్సై రఫీ తెలిపారు.

కుటుంబ విభేదాలతో..

మరో ఘటనలో తుపాకీతో కాల్చుకుని ఓ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బలవన్మరణానికి పాల్పడ్డారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం ఎన్‌జీఓస్ కాలనీకి చెందిన గుడిబోయిన శ్రీనివాస్ (59)కు భార్య, కుమారుడు ఉన్నారు. అయితే, విభేదాల కారణంగా ఐదేళ్ల నుంచి వారికి దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో మహబూబాబాద్ ఐడీఓసీ ఆవరణలోని స్ట్రాంగ్‌రూం వద్ద ఆదివారం సాయంత్రం 4.30 గంటల సమయంలో తన ఎస్ఎల్ఆర్ తుపాకీతో కాల్చుకుని చనిపోయారు.

మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

నల్లబెల్లి: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన ఓ మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం పెంబర్తికి చెందిన ధరణికి 2020లో కానిస్టేబుల్ ఉద్యోగం రాగా, వరంగల్ జిల్లా నల్లబెల్లిలోని పోలీస్ క్వార్టర్స్‌లో నివసిస్తోంది. నాలుగు నెలల క్రితం తన పెద్దన్నకు వివాహం అయింది. ఆర్థిక ఇబ్బందులతో పాటు తన పెళ్లి విషయమై తరచుగా ఆలోచిస్తూ మనస్తాపానికి గురైన ధరణి.. పోలీస్ క్వార్టర్స్‌లోని తన నివాసంలో ఆదివారం ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. గమనించిన పోలీసులు మంటలార్పి.. చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

బూస్టర్ క్యాచ్ సక్సెస్

స్టార్‌షిప్ ఐదో బూస్టర్ ప్రయోగపరీక్ష సక్సెస్

బూస్టర్‌ను విజయవంతంగా ఒడిసిపట్టిన లాంచర్ చేతులు

బోకా చినా(అమెరికా): అగ్రరాజ్యం అమెరికాలో అంతరిక్ష ప్రయోగాల్లో మరో ఇంజనీరింగ్ అద్భుతం చోటుచేసుకుంది. రాకెట్‌ను నింగిలోకి పంపించాక బూస్టర్‌ను మళ్లీ వినియోగించుకునేందుకు సాయపడే కొత్తరకం సాంకేతికతను అంతరిక్ష రంగ సంస్థ స్పేస్‌ఎక్స్ విజయవంతంగా పరీక్షించింది. ప్రయోగవేదిక నుంచి రాకెట్‌తోపాటు నింగిలోకి దూసుకెళ్లిన బూస్టర్ తిరిగి యథాస్థానానికి ఎగిరొచ్చిన ఘటనకు దక్షిణ టెక్సాస్‌లోని స్టార్‌బేస్ ప్రయోగవేదిక సాక్షిగా నిలిచింది. అమెరికా స్థానికకాలమానం ప్రకారం ఆదివారం ఉదయం 8.25 గంటలకు ఈ స్టార్‌షిప్ రాకెట్‌ను ప్రయోగించారు. రాకెట్‌లోని 232 అడుగుల(71 మీటర్ల) ఎత్తయిన బూస్టర్.. లాంచ్‌పోయ్‌డ్ నుంచి స్పేస్‌క్రాఫ్ట్‌ను నింగిలోకి పంపించిన ఏడు నిమిషాల తర్వాత మళ్లీ లాంచ్‌ప్యాడ్‌కు వచ్చి చేరింది. నిప్పులు కక్కుతూ తిరిగొచ్చిన బూస్టర్‌ను లాంచ్‌ప్యాడ్‌లోని మెకానికల్ 'చాప్‌స్టిక్' చేతులు ఒడిసిపట్టిన వీడియోను స్పేస్‌ఎక్స్ వ్యవస్థాపకుడు, సీఈఓ ఎలాన్‌మస్క్ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్‌చేశారు. ''రాకెట్‌ను లాంచ్‌టవర్ ఒడుపుగా పట్టేసుకుంది. ఇదొక సైన్స్ ఫిక్షన్. అయితే ఇందులో ఎలాంటి ఫిక్షన్ లేదు'' అని మస్క్ ట్వీట్‌చేశారు. ప్రయోగం విజయవంతమవడంతో ప్రయోగకేంద్రంలోని స్పేస్‌ఎక్స్ శాస్త్రవేత్తలు, సంస్థ ఉద్యోగులు ఆనందంతో కేరింతలు కొట్టారు. నాసా అడ్మినిస్ట్రేటర్ సైతం వీళ్లకు ప్రత్యేకంగా అభినందించారు. ఏకంగా 400 అడుగుల(111 మీటర్ల)ఎత్తయిన అత్యంత భారీ రాకెట్‌కు సంబంధించిన బూస్టర్ ఇలా లాంచ్‌ప్యాడ్ మీదకే తిరిగిచేరడం ఇదే తొలిసారి. బూస్టర్ వల్ల నింగిలోకి వెళ్లిన స్పేస్‌క్రాఫ్ట్‌ను శాస్త్రవేత్తలు హిందూమహాసముద్రంలో నిర్దేశిత సముద్రప్రాంతంలో దించారు. ఇంజనీరింగ్ చరిత్ర పుస్తకాల్లో లిఖించదగ్గ రోజు ఇది అని స్పేస్‌ఎక్స్ ప్రధానకార్యాలయంలో ఇంజనీరింగ్ మేనేజర్ కేట్ టైస్ ఆనందం వ్యక్తంచేశారు.


బూస్టర్‌ను లాంచ్‌ప్యాడ్ చేతులు పట్టుకున్న దృశ్యం


నింగిలోకి దూసుకెళ్తున్న స్టార్‌షిప్ రాకెట్


ఫస్ట్-స్టేజీ బూస్టర్ మళ్లీ లాంచ్‌ప్యాడ్‌ను చేరుకుంటున్న దృశ్యాలు


లాంచ్‌ప్యాడ్‌పై తొలిసారిగా..

చిన్నపాటి 'ఫాల్కన్-9' రాకెట్లకు వినియోగించిన ఫస్ట్-స్టేజీ బూస్టర్లను గత తొమ్మిదేళ్లుగా స్పేస్‌ఎక్స్ వినియోగిస్తోంది. అయితే అందులో ఏవీ కూడా మళ్లీ లాంచ్‌ప్యాడ్‌కు చేరుకోలేదు. క్యాప్సూల్, స్పేస్‌క్రాఫ్ట్‌ను నింగిలోకి తీసుకెళ్లాక ఫస్ట్-స్టేజీ బూస్టర్లు సముద్రంలోని నిర్దేశిత తేలియాటే తలాలపై క్షేమంగా ల్యాండ్ అయ్యేవి. లేదంటే లాంచ్‌ప్యాడ్‌కు ఏడు మైళ్ల దూరంలోని కాంక్రీట్ శ్లాబులపై ల్యాండ్ అయ్యేవి. కానీ ఇలా భారీ ఫస్ట్-స్టేజీ బూస్టర్ తిరిగి లాంచ్‌ప్యాడ్‌కు తిరిగిరావడం ఇదే తొలిసారి. జూన్‌లో మినహా గతంలో భారీ ఫస్ట్-స్టేజీ బూస్టర్‌ల పునరాగమనంపై ప్రయోగాలు విఫలమయ్యాయి. ఫాల్కన్ విషయంలో సక్సెస్ అయిన ఫార్ములాను భారీ స్టార్‌షిప్‌కు వాడాలని మస్క్ నిర్దేశించుకుని ఎట్టకేలకు విజయం సాధించారు. ఒక్కోటి 33 మిథేన్ ఇంధన ఇంజన్ల సామర్థ్యముండే బూస్టర్లతో తయారైన స్టార్‌షిప్ ప్రపంచంలోనే అతి ఎత్తయిన పెద్ద రాకెట్‌గా పేరొందింది. ఇలాంటి రెండు స్టార్‌షిప్‌లను సరఫరాచేయాలని స్పేస్‌ఎక్స్‌కు నాసా ఆర్డర్ ఇచ్చింది. ఈ దశాబ్ది చివరికల్లా చంద్రుడి మీదకు వ్యోమగాములను తరలించేందుకు వీటిని వాడనున్నారు.

బాబాపై బిష్ణోయ్ బుల్లెట్

మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్దిఖీ దారుణ హత్య

- ముంబైలో కుమారుడి కార్యాలయం వద్ద ఘటన
- మూడు రౌండ్లు కాల్చిన దుండగులు
- ఇద్దరు నిందితుల అరెస్టు..
- తామే హత్య చేసినట్లు ప్రకటించిన బిష్ణోయ్ గ్యాంగ్
- దావూద్ ఇబ్రహీం ముఠాతో సంబంధాలున్నా వదిలిపెట్టమని హెచ్చరిక



ఏమిటీ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్?

పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ జిల్లాలో జన్మించిన లారెన్స్ బిష్ణోయ్(33) అనే గ్యాంగ్‌స్టర్ ఈ ముఠాను ఏర్పాటు చేశాడు. చండీగఢ్‌లో విద్యార్థి రాజకీయాల ద్వారా నేర సామ్రాజ్యంలోకి అడుగుపెట్టాడు. అతడిపై 20కిపైగా కేసులున్నాయి. ముఠాలో దాదాపు 700 మంది షూటర్లు ఉన్నట్లు తెలుస్తోంది. 2022లో పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్యతో బిష్ణోయ్ గ్యాంగ్ పేరు అందరికీ తెలిసింది. 2023 నవంబర్‌లో మరో పంజాబీ గాయకుడు గిప్పీ గ్రేవాల్ నివాసం వద్ద ఈ ముఠా కాల్పులు జరిపింది. సల్మాన్ ఖాన్‌ను సోదరుడు అని సంబోధించినందుకు గ్రేవాల్‌ను టార్గెట్ చేసినట్లు ప్రకటించింది. గత నెలలో కెనడాలో గాయకుడు ఎ.పి.థిల్లాన్‌ను హత్య చేసేందుకు ప్రయత్నించింది. ప్రస్తుతం దేశ విదేశాల్లో లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ కార్యకలాపాలు కొనసాగిస్తోంది. బిష్ణోయ్ ప్రస్తుతం గుజరాత్‌లో సబర్మతి జైలులో ఉన్నాడు.

ముంబై/న్యూఢిల్లీ: బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్‌తో ఉన్న స్నేహ సంబంధాలు మహారాష్ట్ర మాజీ మంత్రి, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(అజిత్‌పవార్) సీనియర్ నేత బాబా సిద్దిఖీని బలి తీసుకున్నాయి. రాజస్తాన్‌లో బిష్ణోయ్ తెగ ప్రజలు పరమ పవిత్రంగా భావించే కృష్ణ జింకలను వేటాడినందుకు సల్మాన్‌పై కక్షగట్టిన లారెన్స్ బిష్ణోయ్ ముఠా ఆయన సన్నిహితుడు సిద్దిఖీని దారుణంగా హత్య చేసింది. మహారాష్ట్ర రాజధాని ముంబైలో దసరా పండుగ రోజే జరిగిన ఈ హత్యాకాండ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ముంబై బాంద్రా ఈస్ట్ ప్రాంతంలోని నిర్మల్ నగర్‌లో బాబా సిద్దిఖీ కుమారుడు, మహారాష్ట్ర ఎమ్మెల్యే జీషాన్ సిద్దిఖీ కార్యాలయం వద్ద ఈ ఘటన జరిగింది. శనివారం రాత్రి 9.30 గంటలకు ముగ్గురు యువకులు ముఖాలకు కర్చీఫ్‌లు ధరించి, కార్యాలయం ప్రాంగణంలోకి దూసుకొచ్చారు. అక్కడే ఉన్న బాబా సిద్దిఖీపై 9.9 ఎంఎం పిస్టోల్ గురిపెట్టారు. మూడు రౌండ్లు కాల్పులు జరిపి, వెంటనే పరారయ్యారు. నగరంలో పండుగ సందర్భంగా టపాసుల మోత వల్ల ఈ కాల్పుల శబ్దం బయటకు వినిపించలేదు. 66 ఏళ్ల సిద్దిఖీ కడుపు, ఛాతీలోకి తూటాలు దూసుకెళ్లడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. తీవ్రంగా రక్తస్రావం జరిగింది. లీలావతి ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మరణించినట్లు రాత్రి 11.27 గంటలకు డాక్టర్లు నిర్ధారించారు.

హత్య చేసింది మేమే..

1998 సెప్టెంబర్‌లో రాజస్తాన్‌లోని జోధ్‌పూర్ సమీపంలో 'హమ్ సాథ్ సాథ్ హై' సినిమా షూటింగ్‌లో పాల్గొన్న సల్మాన్ ఖాన్ ఆటవిడుపుగా కృష్ణ జింకలను వేటాడినట్లు కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఈ కేసులో కోర్టు ఆయనకు బెయిల్ ఇచ్చింది. కృష్ణ జింకలను చంపేసినందుకు సల్మాన్ ఖాన్‌పై ప్రతీకారం తీర్చుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్న లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ఆయన మిత్రులను వేటాడడం మొదలుపెట్టింది. అందులో భాగంగానే బాబా సిద్దిఖీని హత్య చేశామని ప్రకటించింది. శనివారం రాత్రి సిద్దిఖీ హత్య జరగ్గా, ఆదివారం ఫేసుబుక్‌లో లారెన్స్ బిష్ణోయ్ ముఠా సభ్యుడు శిబూ లోంకర్ అలియాస్ శుభం రామేశ్వర్ లోంకర్ పేరిట ఓ పోస్టు ప్రత్యక్షమైంది. సల్మాన్ ఖాన్‌కు మిత్రుడు కావడంతోపాటు దావూద్ ఇబ్రహీం గ్యాంగ్‌తో సంబంధాలు కొనసాగిస్తుండడం వల్లే సిద్దిఖీని హత్య చేశామని లోంకర్ తేల్చిచెప్పారు. సల్మాన్‌కు సహకరిస్తే ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. సల్మాన్ ఖాన్‌తోపాటు దావూద్ ఇబ్రహీం ముఠాతో సంబంధాలు కొనసాగిస్తే సిద్దిఖీకి పట్టిన గతే పడుతుందని స్పష్టం చేశారు. అలాగే తమ ముఠా సభ్యుడైన అనూజ్ థపన్ మరణానికి కారణమైన వారిని శిక్షించామని పేర్కొన్నారు.


బాబా సిద్దిఖీ

కాంట్రాక్టు హంతకుల పనే

బాబా సిద్దిఖీపై కాల్పులు జరిపినవారిలో ఇద్దరిని గుర్మెయిల్ బల్జీత్ సింగ్(23), ధరమ్‌రాజ్ రాజేశ్ కాశ్యప్(19)గా పోలీసులు గుర్తించారు. ధరమ్‌రాజ్‌ను ఉత్తరప్రదేశ్‌లో, బల్జీత్ సింగ్‌ను హరియాణాలో అరెస్టు చేశారు. లారెన్స్ బిష్ణోయ్ ముఠా సభ్యులమని దర్యాప్తులో వారు అంగీకరించినట్లు పోలీసులు చెప్పారు. గత నెల రోజులుగా సిద్దిఖీ కదలికలపై కన్నేసి, పథకం ప్రకారం హత్య చేసినట్లు నిందితులు వెల్లడించారు. సిద్దిఖీపై మూడు రౌండ్లు కాల్పులు జరపగా, ఒకటి ఆయన ఛాతీలోకి, మరొకటి కడుపులోకి దూసుకెళ్లింది. మరొకటి గురి తప్పడంతో సిద్దిఖీ కారు విండ్‌షీల్డ్ ధ్వంసమైంది. కాల్పులు జరిపినవారిలో మూడో నిందితుడు శివ కుమార్ పరారీలో ఉన్నాడని, అతడి కోసం గాలిస్తున్నామని పోలీసులు ఆదివారం తెలిపారు. ఈ హత్యాకాండతో మరో నిందితుడి ప్రమేయం ఉందని, అతడిని మొహమ్మద్ జీషాన్ అఖ్తర్‌గా గుర్తించినట్లు వెల్లడించారు. వీరంతా కాంట్రాక్టు హంతకులేనని తెలిపారు.సిద్దిఖీని హత్య చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్న నిందితులు అడ్వాన్స్ తీసుకున్నారని, కొద్దిరోజుల క్రితమే ఆయుధాలు సమకూర్చుకున్నారని వివరించారు. హత్య జరిగిన సమయంలో సిద్దిఖీ సమీపంలో ఒక కానిస్టేబుల్ ఉన్నాడని చెప్పారు. నిందితుల నుంచి రెండు పిస్టోళ్లు, 28 తూటాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పోలీసు కస్టడీకి నిందితుడు

బాబా సిద్దిఖీ హత్య కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు ఆదివారం ముంబై కోర్టులో హాజరుపర్చారు. మహారాష్ట్రలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాజకీయ వైరంతో ఈ హత్య జరిగిందా? అనే కోణంలోనూ దర్యాప్తు చేయాలని నిర్ణయించినట్లు పోలీసులు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అంతర్జాతీయ స్థాయిలో కుట్ర ఏదైనా జరిగిందా? అనేది తేల్చాల్సి ఉందన్నారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితులను తమ కస్టడీకి అప్పగించాలని కోరారు. నిందితుల్లో ఒకడైన హరియాణా వాసి గుర్మెయిల్ బల్జీత్ సింగ్(23)ను ఈ నెల 21 దాకా పోలీసు కస్టడీకి అప్పగిస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. తాను మైనర్‌నని మరో నిందితుడు వాదించాడు. దాంతో అతడికి వయసు నిర్ధారణ పరీక్షలు నిర్వహించిన అనంతరం తమ ఎదుట హాజరుపర్చాలని పోలీసులను కోర్టు ఆదేశించింది.



నివాళులర్పించిన సల్మాన్ ఖాన్

తన మిత్రుడు బాబా సిద్దిఖీపై జరిగిన హత్యాయత్నం గురించి తెలిసిన వెంటనే సల్మాన్ ఖాన్ లీలావతి హాస్పిటల్‌కు వచ్చారు. సిద్దిఖీ ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లతో మాట్లాడారు. ఆదివారం సాయంత్రం బాంద్రాలోని సిద్దిఖీ అపార్టుమెంట్ వద్దకు సల్మాన్ చేరుకున్నారు. సిద్దిఖీ మృతదేహం వద్ద నివాళులర్పించారు. సల్మాన్ కుటుంబ సభ్యులైన సోహైల్ ఖాన్, షురా ఖాన్, అర్పితాఖాన్ శర్మ, అల్వీరా అగ్నిహోత్రి, సల్మాన్ స్నేహితురాలు లులియా వంతూర్‌తోపాటు పలువురు బాలీవుడ్ ప్రముఖులు సైతం నివాళులర్పించారు.

హత్య వెనుక వ్యాపార విభేదాలు?

సల్మాన్‌తో సంబంధాలు ఉన్నందుకు బాబా సిద్దిఖీని తామే హత్య చేసినట్లు బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించినప్పటికీ, వ్యాపార విభేదాలు కారణం కావొచ్చని ప్రచారం సాగుతోంది. 2000 నుంచి 2004 దాకా మహారాష్ట్ర హౌసింగ్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా పనిచేశారు. అప్పట్లో మురికివాడ పునరావాస ప్రాజెక్టు చేపట్టారు. ఇందులో రూ.2 వేల కోట్ల దాకా అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. 2014లో సిద్దిఖీతోపాటు మరికొందరిపై కేసు నమోదైంది. 2018లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సిద్దిఖీకి చెందిన రూ.462 కోట్ల ఆస్తులను ఆటాచ్ చేసింది. వ్యాపార గొడవల కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

దుండగులను కఠినంగా శిక్షిస్తాం: ఏక్‌నాథ్ షిండే

బాబా సిద్దిఖీ హత్యాకాండపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ సహా వివిధ పార్టీల నేతలు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. సిద్దిఖీని పొట్టనపెట్టుకున్న దుండగులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని, కఠినంగా శిక్షిస్తామని ఏక్‌నాథ్ షిండే ప్రకటించారు. దర్యాప్తు వేగవంతం చేయాలని పోలీసులను ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ లీలావత్ హాస్పిటల్‌కు చేరుకొని వైద్యులతో మాట్లాడారు. తన విశ్వసనీయ సహచరుడు, సన్నిహిత మిత్రుడైన సిద్దిఖీ హత్యకు గురికావడం బాధాకరమని అజిత్ పవార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన వెనుక ఉన్న సూత్రధారులను పట్టుకొని కఠినంగా శిక్షిస్తామని అన్నారు. మైనార్టీల సంక్షేమం, మత సామరస్యం కోసం సిద్దిఖీ నిరంతరం పోరాటం సాగించారని అజిత్ పవార్ కొనియాడారు.


సిద్దిఖీ కుమారుడితో అజిత్ పవార్

కార్యకర్త నుంచి మంత్రి స్థాయికి..

బాబా సిద్దిఖీ అలియాస్ జియా ఉద్దీన్ సిద్దిఖీ 1953 సెప్టెంబర్ 13న బిహార్ రాజధాని పాట్నాలో జన్మించారు. బాల్యంలో కుటుంబంతోపాటు ముంబైకి వలస వచ్చి, అక్కడే పెరిగారు. రాజకీయాలపై ఆసక్తితో 1977లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. చురుకైన నాయకుడిగా పేరు సంపాదించారు. స్థానిక ప్రజలతో మంచి సంబంధాలు కొనసాగిస్తూ తక్కువ కాలంలోనే పార్టీలో ఉన్నతస్థాయికి చేరుకున్నారు. 1980లో బాంద్రా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. రెండేళ్లలో బాంద్రా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడయ్యారు. 1988లో ముంబై యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నియ్యారు. 1992లో ముంబై మున్సిపల్ కౌన్సిలర్‌గా విజయం సాధించారు. 1999లో తొలిసారిగా బాంద్రా వెస్ట్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. అదే నియోజకవర్గం నుంచి వరుసగా మూడుసార్లు జయకేతనం ఎగురవేశారు. 2014 దాకా ఎమ్మెల్యేగా కొనసాగారు. 2004 నుంచి 2008 దాకా మహారాష్ట్ర ఆహార, పౌర సరఫరాల, కార్మిక శాఖ మంత్రిగా పనిచేశారు. రాజకీయ వర్గాలతోపాటు బాలీవుడ్ ప్రముఖులతో సిద్దిఖీకి చక్కటి సంబంధాలున్నాయి. ఆయన ఇచ్చే భారీ ఇఫ్తార్ విందులకు బాలీవుడ్ హీరోలు, హీరోయిన్లు, నిర్మాతలు, దర్శకులు హాజరయ్యేవారు. సల్మాన్ ఖాన్, షారుక్ ఖాన్, సంజయ్ దత్‌తో సిద్దిఖీ సన్నిహితంగా మెలిగేవారు. సల్మాన్, షారుక్ మధ్య ఐదేళ్లపాటు నెలకొన్న వివాదాన్ని స్వయంగా పరిష్కరించారు. ఆయన ఈ ఏడాది ఫిబ్రవరిలో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, ఎన్సీపీలో చేరారు. సిద్దిఖీ కుమారుడు జీషాన్ సిద్దిఖీ ప్రస్తుతం కాంగ్రెస్ ఎమ్మెల్యే. ముంబై ముస్లిం ప్రజల్లో గట్టి పట్టున్న బాబా సిద్దిఖీ రాకతో లోక్‌సభ ఎన్నికల్లో ఎన్సీపీ లబ్ధి పొందింది. ఇదిలా ఉండగా, కరోనా మహమ్మారి ఉధృతి సమయంలో బాబా సిద్దిఖీ అందించిన సేవలు ప్రశంసలందుకున్నాయి. ప్రజలకు ప్రాణాధార ఔషధాలు, పీపీఈ కిట్లు పెద్ద ఎత్తున పంపిణీ చేశారు.


సల్మాన్‌ఖాన్, షారుక్‌ఖాన్‌లతో బాబా సిద్దిఖీ

ఈ యుద్ధం మేము కోరుకోలేదు

''ఓం జైశ్రీరామ్, జైభారత్. జీవితం గురించి నాకు తెలుసు. నా దృష్టిలో ఆస్తులకు, మానవ శరీరానికి పెద్దగా విలువ లేదు. ఏది సరైందో అదే చేశాం. స్నేహం అనే బాధ్యతను గౌరవించాం. నిజానికి ఈ యుద్ధం మేము కోరుకోలేదు. కానీ, సల్మాన్ ఖాన్ వల్ల మా సోదరుడు అనూజ్ థపన్ ప్రాణాలు కోల్పోయాడు. మాకు ఎవరితోనూ శత్రుత్వం లేదు. కానీ, సల్మాన్ ఖాన్‌కు, దావూద్ ఇబ్రహీంకు ఎవరైనా సహరిస్తే వారి లెక్కలు సరిచేస్తాం. గతంలో మహారాష్ట్ర వ్యవస్థీకృత నేరాల నియంత్రణ చట్టం కింద దావూద్‌తోపాటు సిద్దిఖీ కూడా నిందితుడే. మా సోదరుడు థపన్ మరణం, సల్మాన్, దావూద్‌తో సంబంధాలు, బాలీవుడ్, రాజకీయాల్లో భాగస్వామ్యం, ఆస్తుల సెటిల్‌మెంట్ల వ్యవహారాలే సిద్దిఖీ హత్యకు కారణం. మా సభ్యుల్లో ఎవరినైనా చంపేస్తే తగిన రీతిలో జవాబిస్తాం. మొదట దాడి మేము చేయం. ప్రత్యర్థులు దాడి చేస్తేనే ప్రతిస్పందిస్తాం. అమరులకు మా వందనాలు'' అని ఫేసుబుక్ పోస్టులో లారెన్స్ బిష్ణోయ్ ముఠా సభ్యుడు శిబూ లోంకర్ తేల్చిచెప్పాడు. ఈ పోస్టు సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

అనూజ్ థపన్ మరణానికి ప్రతీకారం?

సల్మాన్ ఖాన్‌కు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి గత కొన్నేళ్లుగా హెచ్చరికలు వస్తున్నాయి. దీంతో ఆయనకు మహారాష్ట్ర పోలీసులు పటిష్టమైన భద్రత కల్పిస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ముంబైలో సల్మాన్ ఇంటి ఎదుట తుపాకీతో కాల్పులు జరిపారు. ఈ ఇద్దరిలో అనూజ్ థపన్ ఉన్నాడు. పోలీసులు అతడిని అరెస్టు చేశారు. పోలీసు కస్టడీలో ఉన్న థపన్ అనుమానాస్పద స్థితిలో మరణించాడు. మే 1న ముంబై క్రైమ్ బ్రాంచ్ లాకప్‌లో శవమై కనిపించాడు. ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు చెప్పగా, పోలీసులే చిత్రహింసలు పెట్టి చంపేశారని థపన్ కుటుంబ సభ్యులు ఆరోపించారు. థపన్ మరణం పట్ల ప్రతీకారంతో రగిలిపోయిన బిష్ణోయ్ ముఠా బాబా సిద్దిఖీని అంతం చేసినట్లు ప్రచారం సాగుతోంది.

ఒమర్ ప్రమాణస్వీకారం 16న!

శ్రీనగర్: కేంద్రపాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రిగా ఒమర్ అబ్దుల్లా ఈనెల 16న ప్రమాణం స్వీకారం చేసే అవకాశాలున్నాయి. ఆరేళ్లుగా జమ్మూకశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన కొనసాగుతోందని, దాన్ని ఎత్తివేయడానికి కేబినెట్ నోట్‌ను సిద్ధం చేయాల్సి ఉంటుందని ఒమర్ శనివారం తెలిపారు. తర్వాత అది రాష్ట్రపతి వద్దకు, కేంద్ర హోంశాఖకు వెళుతుందని వివరించారు. ఈ ప్రక్రియ సోమవారానికి ముగిస్తే.. బుధవారం ప్రమాణ స్వీకారం చేస్తానని ఒమర్ వెల్లడించారు.

కశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన ఎత్తివేత


న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో రాష్ట్రపతి పాలనకు కేంద్రం ముగింపు పలికింది. కేంద్రపాలిత ప్రాంతంలో నూతన ప్రభుత్వం ఏర్పాటుకు వీలు కల్పిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్రపతి భవన్ ఆదివారం సాయంత్రం తెలిపింది. 'జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2019ని అనుసరించి 2019 అక్టోబర్ 31వ తేదీన జారీ చేసిన ఉత్తర్వులను ముఖ్యమంత్రి నియామకానికి వీలుగా ముందే రద్దు చేయడమైనది. ఇవి తక్షణమే అమల్లోకి వస్తాయి'అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సంతకంతో జారీ అయిన ఆ నోటిఫికేషన్ పేర్కొంది.

సెంట్రల్ ఇజ్రాయెల్‌పై హెజ్‌బొల్లా డ్రోన్ దాడి

డెయిర్ అల్ బాలాహ్(గాజా స్ట్రిప్): ఇజ్రాయెల్‌లోని బిన్యామియా నగరంపై హెజ్‌బొల్లా సాయుధులు డ్రోన్ దాడి జరిపారు. ఈ ఘటనలో 40 మంది స్థానికులు గాయపడినట్లు ఇజ్రాయెల్ సహాయకసేవల విభాగం ఆదివారం ప్రకటించింది. లెబనాన్ నుంచి రెండు డ్రోన్లు ఇజ్రాయెల్ వైపు దూసుకురాగా ఒకదానిని కూల్చేశారని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది.

మదర్సాలకు నిధులను ఆపేయండి

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో నడుస్తున్న మదర్సాలు కేంద్ర విద్యాహక్కు చట్టం చట్టం అమలును గాలికొదిలేశాయని జాతీయ చిన్నారుల హక్కుల పరిరక్షణ కమిషన్(ఎన్‌సీపీసీఆర్)వ్యాఖ్యానించింది. బాలబాలికల విద్యలో సమాన అవకాశాలుసహా పలు నిబంధనలను తుంగలో తొక్కిన మదర్సా బోర్డులను ఇకమీదట కొనసాగించకూడదని, మూసేయాలని కమిషన్ సూచించింది. ఆయా మదర్సాలకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంత ప్రభుత్వాల నుంచి ఆర్థిక సాయాన్ని నిలిపేయాలని శుక్రవారం సిఫార్సు చేసింది.


గతిశక్తి అనుభూతి కేంద్రంలో ప్రధాని మోదీ

విప్లవాత్మక మార్పే 'గతి శక్తి' లక్ష్యం: ప్రధాని మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడమే 'పీఎం గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్(పీఎంజీఎస్-ఎన్ఎంపీ)'లక్ష్యమని ప్రధాని మోదీ అన్నారు. వికసిత్ భారత్ సంకల్పాన్ని పూర్తి చేయడంలో ఈ పథకం వేగంగా ముందుకు సాగుతోందన్నారు. పీఎంజీఎస్-ఎన్ఎంపీ మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం మోదీ 'ఎక్స్'వేదికగా ప్రశంసించారు. 'దేశ మౌలిక సదుపాయాల కల్పనలో విప్లవాత్మకంగా మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో 'పీఎం గతిశక్తి'ఉద్భవించింది. ఇది మల్టీమోడల్ కనెక్టివిటీని గణనీయంగా మెరుగు పరిచింది, వివిధ రంగాలలో వేగవంతమైన, మరింత ప్రభావవంతమైన అభివృద్ధికి దారితీసింది. వివిధ వాటాదారుల ఏకీకరణతో లాజిస్టిక్‌లకు ప్రోత్సాహం లభించింది. జాప్యాలను తగ్గించింది. చాలా మందికి కొత్త అవకాశాలను సృష్టించింది. గతిశక్తి కారణంగా వికసిత్ భారత్ అనే మా స్వప్నం సాకారం చేసే దిశలో దేశం వేగంగా ముందుకుసాగుతోంది. ఇది అభివృద్ధిని,, పారిశ్రామికవేత్తలను, ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుంది'అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

విద్రోహచర్య కారణంగానే భాగమతి ఎక్స్‌ప్రెస్ ప్రమాదం !

- పట్టాలపై మాయమైన బోల్ట్‌లు, పట్టాలను సుత్తితో మోదిన గుర్తులు
- ఘటనాస్థలిలో దర్యాప్తు మొదలెట్టిన రైల్వే అధికారులు

న్యూఢిల్లీ: తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లాలో అక్టోబర్ 11న జరిగిన మైసూర్-దర్భంగా భాగమతి ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదం వెనుక విద్రోహుల కుట్ర దాగి ఉందని ముగ్గురుసభ్యుల రైల్వే సాంకేతిక బృందం అనుమానాలు వ్యక్తంచేసింది. ప్రమాదం జరిగిన చోట పట్టాలకు ఎలాంటి బోల్ట్‌లు లేకపోవడం, పట్టాలను ఎవరో బలవంతంగా అపసవ్య దిశలోకి సుత్తితో కొట్టిన గుర్తులు ఉన్నట్లు తెలుస్తోంది. 15 బోగీలు పట్టాలు తప్పిన ఈ ఘటనలో తొమ్మిది మంది గాయపడిన విషయం తెల్సిందే. సవ్యదిశలో నేరుగా వెళ్లాల్సిన రైలు లూప్‌లైన్‌లోకి హఠాత్తుగా వచ్చి ఆగి ఉన్న గూడ్సు రైలును ఢీకొనడంతో అనుమానాలు ఎక్కువయ్యాయి. దీంతో రైల్వే సిగ్నల్, టెలికం, ఇంజనీరింగ్, ఆపరేషన్స్ బృందం ఆదివారం కవరపేట స్టేషన్‌లోని ఘటనాస్థలిలో దర్యాప్తు మొదలెట్టింది. ''రైల్వేపట్టాల ఇంటర్‌లాకింగ్ వ్యవస్థలోని భాగాలను విడదీశారు. వీటి గురించి బాగా అవగాహన ఉన్న ఆగంతకులే ఈ పని చేశారు. ఇటీవల కవరపేట స్టేషన్ సమీపంలో ఇలాంటి దుశ్చర్యకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఇక్కడ మాత్రం సఫలమయ్యారు. ఘటన జరగడానికి నాలుగు నిమిషాల ముందే ఇదే పట్టాల మీదుగా ఒక రైలు వెళ్లింది. అది వెళ్లి మైసూర్-దర్భంగా రైలువచ్చేలోపే బోల్ట్‌లు, విడిభాగాలు విడదీశారు'' అని అధికారులు వెల్లడించారు.

గాజాపై ఇజ్రాయెల్ దాడి.. కుటుంబంలోని 8 మంది మృతి

డెయిర్ అల్-బలాహ్/బీరుట్: సెంట్రల్ గాజాపై ఇజ్రాయెల్ బలగాలు జరిపిన దాడిలో ఒకే కుటుంబంలోని ఎనిమిది మంది చనిపోయారు. నుసెయిరత్ శరణార్థి శిబిరంలోని ఓ ఇంటిపై శనివారం అర్ధరాత్రి చోటుచేసుకున్న ఈ ఘటనలో దంపతులు, వారి ఆరుగురు పిల్లలు మృత్యువాతపడ్డారు. పిల్లల వయస్సు 8 నుంచి 23 ఏళ్ల మధ్యన ఉంటుందని అక్కడికి దగ్గర్లోని అల్ అక్సా మార్టిర్స్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.


పట్టాల మధ్యనున్న సిలిండర్

రూర్కీలో రైలు పట్టాలపై గ్యాస్ సిలిండర్

హరిద్వార్: ఉత్తరాఖండ్‌లోని రూర్కీ-లుక్సార్ మార్గంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తులు గ్యాస్ సిలిండర్‌ను ఉంచారు. ధంధేరా రైల్వే స్టేషన్ సమీపంలో రెండో లైన్‌పై ఉన్న సిలిండర్‌ను శనివారం ఉదయం 6.45 గంటల సమయంలో గూడ్స్ రైలు గార్డు ఒకరు గమనించి అధికారులకు వెంటనే సమాచారమిచ్చారు. ఆ సమయంలో ఆ మార్గంలో రైళ్లేవీ ప్రయాణించడం లేదని లుక్సర్ రైల్వే పోలీస్ ఇన్‌చార్జి సంజయ్ శర్మ చెప్పారు. రైలు మార్గం మధ్యలో మూడు కిలోల చిన్న ఖాళీ సిలిండర్ పడి ఉందని తెలిపారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసు బృందాలు సిలిండర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. రూర్కీ సివిల్ లైన్ పోలీస్‌స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తులపై రైల్వే చట్టం కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని వెల్లడించారు.

ఎక్స్‌ప్రెస్ రైలు బోగీకి మంటలు

ఛతర్‌పూర్: మధ్యప్రదేశ్‌లోని ఛతర్‌పూర్‌లో ఆదివారం ఉదయం గీతా జయంతి ఎక్స్‌ప్రెస్ రైలు బోగీకి మంటలంటుకున్నాయి. ఉదయం 7.30 గంటల సమయంలో చోటుచేసుకున్న ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. ఇషానగర్ స్టేషన్ నుంచి రైలు వెళ్తుండగా డీ5 కోచ్‌లో పొగలు రావడాన్ని గమనించిన వెంటనే సిబ్బంది రైలును నిలిపివేసి, ఆర్పివేశారని ఓ అధికారి తెలిపారు. కోచ్ దిగువ భాగంలోని రబ్బర్ వేడెక్కడం వల్లే మంటలు మొదలైనట్లు తెలుస్తోందన్నారు.



నేరస్తులు @ మెయిల్స్.కామ్

'అక్రమంగా ఆయుధాలు తరలిస్తున్న ఏపీకి చెందిన సాయిరాం రెడ్డిని ఇటీవల రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 7 తుపాకులు, 11 బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. -8లో



ట్రాన్స్‌'ప్లాంటేషన్'

నగరంలో వాటా ఫౌండేషన్ చెట్ల దత్తత, తరలింపు సేవలను అందిస్తోంది. 10 మంది వలంటీర్లు ఉన్న ఈ ఫౌండేషన్ ఇప్పటివరకు 2,500 వృక్షాలను దత్తత తీసుకుంది. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
33.0/23.0

వాతావరణం

నగరంలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురవొచ్చు. గరిష్టంగా 33, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

సంప్రదాయ సందడి

"అలయ్ బలయ్ అదిరింది. ఆత్మీయ ఆలింగనాల మధ్య సాగింది. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టింది. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఆయన కూతురు విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వేదికగా అలయ్-బలయ్ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆద్యంతం ఆహూతులను అలరించింది. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తదితరులు హాజరయ్యారు."







సన్నాయి వాయిస్తున్న హరియాణా గవర్నర్ దత్తాత్రేయ, చిత్రంలో ఆయన కూతురు విజయలక్ష్మి, పాటలు పాడుతున్న గోరటి, వందేమాతరం శ్రీనివాస్









దత్తాత్రేయ మనవరాళ్లతో సీఎం రేవంత్‌రెడ్డి

టెన్షన్... టెన్షన్..

- దుర్గా నవరాత్రుల్లో పోలీసులకు ఉత్కంఠ
- శుక్ర, శనివారాల్లో పరుగులు పెట్టిన వైనం
- బేగంబజార్, మాసబ్‌ట్యాంక్‌ల్లో ఘటనలు
- సంయమనం పాటించిన నగర వాసులు

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు విభాగానికి ప్రతి ఏడాది గణేష్ ఉత్సవాలు, సామూహిక నిమజ్జనం ఓ సవాల్ లాంటివి. బందోబస్తు నేపథ్యంలో వీటిని అధికారులు ఫైనల్స్‌గా పిలుస్తుంటారు. ఎలాంటి అపశ్రుతులు, వదంతులు షికార్లు చేయడం తదితరాలు చోటు చేసుకోకుండా నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పహారా కాస్తుంటారు. అయినప్పటికీ చిన్న చిన్న ఉదంతాలు, టెన్షన్లు మామూలే. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి దుర్గా నవరాత్రులు పోలీసులకు చెమటలు పట్టించాయి. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, మాసబ్‌ట్యాంక్‌ల్లో శుక్ర, శనివారాల్లో చోటు చేసుకున్న ఘటనలతో పోలీసులు పరుగులు పెట్టారు. నగర వాసులు పూర్తి సంమయనం పాటించడంతో ఏ చిన్న అపశ్రుతి లేకుండా ఈ రెండూ గట్టెక్కాయి. దీంతో పోలీసుల ఊపిరి పీల్చుకున్నారు.

డిప్రెషన్ రోగి నిర్వాకం..

నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన దేవీమాత విగ్రహం చేతిని శుక్రవారం మానసిక స్థితి సరిగా లేని వ్యక్తి ధ్వంసం చేశాడు. ఈ విషయం తెలియడంతో పోలీసు విభాగం అత్యంత అప్రమత్తమైంది. ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టింది. ఎట్టకేలకు అదే రోజు రాత్రి 8.15 గంటలకు నాగర్ కర్నూలుకు చెందిన కృష్ణయ్యను ఫీల్‌ఖానా చౌరస్తా వద్ద పట్టుకున్నారు. గురువారం రాత్రి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సద్దుల బతుకమ్మ పండగ జరిగింది. అర్ధరాత్రి దాటిన తర్వాత ఆకలితో ఉన్న కృష్ణయ్య ఆహారం కోసం గ్రౌండ్స్‌లోకి వచ్చాడు. తినేందుకు ఏదైనా దొరుకుతుందేమోనని వెతికే ప్రయత్నాల్లోనే మండపం చిందరవందర కావడంతో పాటు విగ్రహం చేయి ధ్వంసమైందని పోలీసులు తేల్చారు. మండపం వద్ద నిర్వాహకులు ఎవరు లేకుండా నిర్లక్ష్యంగా వ్యవరించడంతో పోలీసులు వారి పైనా కేసు నమోదు చేశారు. ఈ ఉదంతంపై సోషల్ మీడియాలో వదంతులు షికారు చేశాయి.

వీధికుక్క చేసిన పనికి...

మాసబ్‌ట్యాంక్ ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి మరో కలకలం రేగింది. ఓ ప్రార్థన స్థలం ఎదురుగా రోడ్డుపై ఓ ప్రాణి మాంసం పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. ఈ విషయం బయటకు రావడంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. వెంటనే అప్రమత్తమై రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లోని సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సమీపంలో ఉన్న చెత్త పదార్థాల నుంచి ఓ వీధికుక్క మాంసం ముక్కను నోటితో కరుచుకుని రావడం వీటిలో కనిపించింది. కొద్దిదూరం ఆ ముక్కను అలాగే తీసుకువెళ్లిన శునకం నోటి నుంచి ఓ ముక్క ప్రార్థన స్థలం సమీపంలో పడిపోయింది. శునకం తిరిగి ఆ ముక్కను తీసుకోకుండా వదిలేసి వెళ్లిపోయిన దృశ్యాలు స్పష్టంగా కనిపించాయి. వీటిని వెంటనే మీడియాకు విడుదల చేసిన పోలీసులు ఈ అంశంపై వదంతులు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని గుజరాతీ సేవా మండలి ఆధ్వర్యంలో చేపట్టిన నవరాత్రి సంబరాలు అంబరాన్నంటాయి. దసరా సందర్భంగా సికింద్రాబాద్‌లో నిర్వహించిన దాండియా ఆటపాటలు అలరించాయి.

ఇక కమ్యూనిటీ

సిల్ట్ చాంబర్లు

మురుగులో కరగని వ్యర్థాల కట్టడి

- సీవరేజీ కనెక్షన్‌దారుల భాగస్వామ్యంతో..
- అయిదారు నివాసాలకో సిల్ట్ చాంబర్
- పైలట్ ప్రాజెక్టుగా హౌసింగ్ బోర్డు కాలనీలో అమలు
- సరికొత్త ప్రయోగానికి సిద్ధమైన జలమండలి

సాక్షి, సిటీబ్యూరో: మహా నగరంలో మురుగు వ్యవస్థను మరింత మెరుగుపర్చేందుకు జలమండలి పాట్లు అన్నీఇన్నీ కావు. డ్రైనేజీ పైపులైన్ల ద్వారా మురుగు నీటి సరఫరా సాఫీగా కొనసాగేందుకు అన్ని మార్గాలపై దృష్టి సారిస్తోంది. అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సీవరేజీ స్పెషల్ డ్రైవ్'లో డ్రైనేజీ పైపులైన్ల డీసిల్టింగ్‌తో పాటు గృహ సముదాయల నుంచి విడుదలయ్యే మురుగులోని వ్యర్థాలు, ఇతరత్రాలన్నింటినీ ఎక్కడికక్కడే కట్టడి చేసేందుకు 'కమ్యూనిటీ సిల్ట్ చాంబర్'లతో ప్రయోగానికి సిద్ధమవుతోంది. సీవరేజీ కనెక్షన్‌దారుల భాగస్వామ్యంతో కమ్యూనిటీ సిల్ట్ చాంబర్ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. ప్రతి అయిదారు నివాసాలకో సిల్ట్ చాంబరు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని భావిస్తోంది. నగరంలో ప్రయోగాత్మకంగా కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని బ్లాక్‌లలో కమ్యూనిటీ సిల్ట్ చాంబర్లను ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకొని మురుగు వ్యర్థాల కట్టడి అమలు చేయాలని భావిస్తోంది. ఇక్కడ విజయవంతమైతే నగర వ్యాప్తంగా కాలనీల్లో విస్తరించాలని జలమండలి యోచిస్తోంది.



మ్యాన్‌హోళ్ల నుంచి సిల్ట్ వ్యర్థాల తొలగింపు (ఫైల్)

సిల్ట్ చాంబర్ ఎందుకంటే..

గృహాల సీవరేజీ కనెక్షన్‌ల ద్వారా వచ్చే మురుగు నీరు నేరుగా డ్రైనేజీ పైపులైన్‌లోకి వెళ్లకుండా ముందుగా ఒకే చోట చేరేలా ప్రతి అయిదారు నివాసాలకు ఒకటి చొప్పన కమ్యూనిటీ సిల్ట్ చాంబర్లను ఏర్పాటు చేస్తారు. సిల్ట్ చాంబర్ల నుంచి డ్రైనేజీ పైపులైన్లకు కనెక్షన్ ఇస్తారు. నివాసాల నుంచి వచ్చిన మురుగులోని వ్యర్థల వడబోతతో సిల్ట్ చాంబర్‌లోనే వదిలి మురుగు నీరు మాత్రమే డ్రైనేజీ పైపులైన్‌లోకి చేరేలా ప్రత్యేక ఏర్పాటు చేస్తారు. దీంతో డ్రైనేజీ పైపులైన్‌లో ఎలాంటి ఆటంకం లేకుండా మురుగు సాఫీగా ముందుకు సాగుతోంది. జలమండలి సీవరేజీ బృందం పక్షం రోజులకోసారి సిల్ట్ చాంబర్‌లోని వ్యర్థాలను ఎయిర్‌టెక్ మిషన్ల ద్వారా తొలగించి అక్కడి నుంచి తరలించనుంది.

క్షేత్రస్థాయి పరిశీలనతో పసిగట్టి..

సీవరేజీ ఓవర్‌ఫ్లో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ప్రతి నిత్యం క్షేత్ర స్థాయి డీసిల్టింగ్‌ను పరిశీలిస్తున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ఇటీవల కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డులో పర్యటిస్తున్న సమయంలో.. సీవరేజీ సిబ్బంది ఒక మ్యాన్‌హోల్ నుంచి తొలగిస్తున్న పూడికలో నీటిలో కరగని వ్యర్థాలు అధికంగా ఉండటాన్ని గమనించారు. దీనికి శాశ్వత పరిష్కారం కమ్యూనిటీ సిల్ట్‌చాంబర్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని భావించారు. తక్షణమే కనీసం బ్లాక్‌లవారీగా అయిదారు ప్లాట్లకు ఒక కమ్యూనిటీ సిల్ట్ ఛాంబర్ ను ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ప్రజల భాగస్వామ్యం అవసరం



సీవరేజీ శాశ్వత సమస్య పరిష్కార యజ్ఞంలో ప్రజల భాగస్వామ్యం అవసరం. మురుగు సమస్యకు శాశ్వత పరిష్కార కోసం సాధ్యమైన అన్ని మార్గాలపై దృష్టి సారించాం. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితులు పరిశీలిస్తున్నాం. సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్ష మేరకు సీవరేజీ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీగా మార్చాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం.

– అశోక్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్, జలమండలి

కరగని వ్యర్థాలతోనే..

మహా నగరంలో మురుగు నీటి వ్యవస్థ సాఫీగా సాగేందుకు జలమండలి స్పెషల్ డ్రైవ్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. భూగర్భ పైపులైన్ వ్యవస్థ ఉన్నప్పటికి సామర్థ్యానికి మించి మురుగు నీటితో పాటు కరగని వ్యర్థాలు కూడా చేరడం సమస్యగా పరిణమించింది. ఫలితంగా ఎక్కడికక్కడే పైపులైన్ స్తంభించి మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు నీరు బయటికి వచ్చి రోడ్లపై చేరడం షరామామూలైంది. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే గాని స్పందించని పరిస్థితి నెలకొంది. దీంతో జలమండలి అధికార యంత్రాంగం మురుగు సమస్య పరిష్కారానికి సరికొత్త ఆలోచనతో ముందడుగు వేస్తున్నట్లు కనిపిస్తోంది.

నాలుగింతల మురుగు

నగరంలో డ్రైనేజీ పైపులైన్ వ్యవస్థ కంటే మురుగు నాలుగింతలు అధికంగా ఉత్పన్నమవుతోంది. సుమారు 9,769.74 కిలో మీటర్ల పైపులైన్ వ్యవస్థ ఉండగా దినసరి 2,815 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్ ఫర్ డే) మురుగు ఉత్పత్తి అవుతోంది. ప్రస్తుతం పైపులైన్ల వ్యవస్థ సామర్థ్యం మాత్రం 796 ఎంఎల్‌డీ మించి లేనట్లు గణంకాలు స్పష్టం చేస్తున్నాయి. సీవరేజీ మ్యాన్‌హోళ్లు కూడా 6,31,379 మించిలేవు. పెరుగుతున్న జనాబాకు అనుగణంగా కోర్‌సిటీలో మరో 2,656 కిలోమీటర్లు, శివారు, ఓఆర్‌ఆర్‌లో మరో 4,378 కిలోమీటర్లు పైపులైన్ వ్యవస్థను విస్తరించేందుకు జలమండలి సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వం వద్ద ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి.

మహా నగరంలో మురుగు నీటి వ్యవస్థ ఇలా..	
పైపులైన్ వ్యవస్థ	
కోర్ సిటీ	5,570 కి.మీ
శివారు	4,199 కి.మీ
మ్యాన్‌హోళ్లు	
కోర్‌సిటీ	2,70,679
శివారు	3,60,700

తెగ తాగేశారు..!

దసరాకు రూ.312 కోట్లపైనే మద్యం విక్రయాలు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ సహా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో మద్యం అమ్మకాలు ప్రభుత్వానికి భారీ ఆదాయాన్ని సమకూర్చాయి. గత ఏడాది అక్టోబర్ 1 నుంచి 10వ తేదీతో పోలిస్తే ఈ ఏడాది ఇదే సమయంలో (పది రోజుల్లో) అమ్మకాలు కొంత తగ్గుముఖం పట్టాయి. రియల్ ఎస్టేట్ పడిపోవడం, మూసీ ముంపు బాధితుల్లో దసరా సంబురాలు తగ్గాయి. హైడ్రా కూల్చివేతలతో మెజారిటీ అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లు, ఖాళీ స్థలాల అమ్మకాలు నిలిచిపోయాయి. రిజిస్ట్రేషన్లు కాకపోవడం, మార్కెట్లో పెద్దగా ఆర్థిక లావాదేవీలు లేకపోవడం, నిత్యావసరాల ధరలు అమాంతం పెరగడం తదితర కారణాలతోనూ మద్యం అమ్మకాల తగ్గుదలకు మరో కారణమని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. గ్రేటర్‌లోని హైదరాబాద్, సికింద్రాబాద్, మేడ్చల్, మల్కాజిగిరి, వికారాబాద్, శంషాబాద్, సరూర్‌నగర్ ఎక్సైజ్ జిల్లాల పరిధిలో 674 మద్యం దుకాణాలు ఉండగా, గత ఏడాది మద్యం అమ్మకాల ద్వారా రూ.317.23 కోట్ల ఆదాయం సమకూరింది. ప్రస్తుతం రూ.312.05 కోట్లే సమకూరింది. గతంతో పోలిస్తే.. ఎక్సైజ్ ఆదాయం పెరగకపోగా.. రూ.5.18 కోట్ల మేర ఆదాయం తగ్గడం గమనార్హం. కాగా.. గతంతో పోలిస్తే.. మద్యం ప్రియుల సంఖ్య కూడా క్రమంగా తగ్గుముఖం పడుతోంది. ఏళ్లుగా మద్యం అలవాటు ఉన్న వాళ్లను అనారోగ్య సమస్యలు వెంటాడుతుండటంతో మెజారిటీ మద్యం ప్రియులు లిక్కర్‌కు దూరంగా ఉంటున్నట్లు తెలిసిందే.



గత పది రోజుల్లో మద్యం అమ్మకాలు (రూ.కోట్లలో)			
ఎక్సైజ్ జిల్లా	షాపులు	2023	2024
హైదరాబాద్	80	45.56	38.50
సికింద్రాబాద్	99	38.02	35.87
మేడ్చల్	114	52.69	55.53
మల్కాజిగిరి	88	45.94	45.50
వికారాబాద్	59	15.98	17.25
శంషాబాద్	100	61.31	59.64
సరూర్‌నగర్	134	57.73	60.55

బతుకమ్మ వేడుకల్లో డీజే

మేయర్ సహా మరో ఇద్దరిపై కేసు నమోదు



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునంబర్-12లోని ఎన్బీటీనగర్ ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఉన్న మైదానంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో నిబంధనలకు విరుద్ధంగా డీజే ఏర్పాటు చేయడంతో పాటు గడువు ముగిసిన తర్వాత కూడా సౌండ్ పొల్యూషన్‌కు పాల్పడిన ఘటనలో నగర మేయర్‌తో పాటు మరో ఇద్దరిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. ఈ నెల 10వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో బంజారాహిల్స్ రోడ్డునంబర్-12లోని ఎన్బీటీ నగర్‌లో అమ్మవారి విగ్రహాల నిమజ్జన ఊరేగింపుతో పాటు మండపాలను కానిస్టేబుళ్లు ఎస్కే నజీర్ అహ్మద్, హోంగార్డు సాయి ప్రసాద్‌లు పర్యవేక్షిస్తున్నారు. రాత్రి 11.40 గంటల ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాల ముందు జరుగుతున్న బతుకమ్మ వేడుకల్లో భారీ సౌండ్‌తో డీజే ఏర్పాటు చేశారని, శబ్ద కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని పోలీసులకు సమాచారం అందింది. దీంతో నజీర్ అహ్మద్, సాయిప్రసాద్‌లు అక్కడికి చేరుకుని డీజేను ఆపాల్సిందిగా నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. అదే సమయంలో గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అక్కడికి చేరుకుని పోలీసులు ఇందులో జోక్యం చేసుకోవద్దని, మ్యూజిక్‌ను కొనసాగించాలని వారికి సూచించారు. భారీ శబ్ద కాలుష్యంతో ఈవెంట్‌ను అలాగే కొనసాగించారని, వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కానిస్టేబుల్ నజీర్ అహ్మద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో బతుకమ్మ వేడుకల నిర్వాహకులు కందాడి విజయ్‌కుమార్, మ్యూజిక్ ప్లే చేస్తున్న మహ్మద్ గౌస్, జోక్యం చేసుకోవద్దంటూ చెప్పిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మిపై బంజారాహిల్స్ పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 223, 280, 292, 49 రెడ్‌విత్ 3 (5), సెక్షన్ 21/76 సీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బైక్‌లతో భయానక స్టంట్లు

● 10 బైక్‌లు సీజ్..10 మందిపై కేసు నమోదు

గచ్చిబౌలి: బైక్‌లతో యువకులు భయానక స్టంట్లు చేస్తూ రోడ్లపై హల్‌చల్ చేస్తున్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ పరిసరాల్లో ప్రధాన రోడ్లపై అర్ధ రాత్రి వరకు రేసింగ్‌కు పాల్పడుతూ భయానక వాతావరణం సృష్టిస్తూ ప్రయాణికులకు ఇక్కట్లు సృష్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాయదుర్గం పోలీసులు పది బైక్‌లను సీజ్ చేసి, పది మంది యువకులపై కేసు నమోదు చేశారు. ఆదివారం రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరానికి చెందిన యువకులు పది బైక్‌లపై వచ్చి నాలెడ్జి సిటీ ప్రధాన రోడ్లపై స్టంట్లు సృష్టిస్తూ మితిమీరిన వేగంతో రేసింగ్‌కు పాల్పడ్డారు. దీంతో విషయం తెలుసుకున్న రాయదుర్గం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పది బైక్‌లను అదుపులోకి తీసుకొని వాటిని సీజ్ చేశారు. పది మంది యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

కిన్నెర మొగులయ్య ప్లాట్ ప్రహరీ కూల్చివేత

● కేసు నమోదు చేసిన పోలీసులు



మొగులయ్య నిర్మించుకున్న ప్లాట్ ప్రహరీ

లింగోజిగూడ: ప్రముఖ జానపద కళాకారుడు కిన్నెర మొగులయ్యకు ప్రభుత్వం హయత్‌నగర్ పరిధిలో స్థలం కేటాయించగా.. అక్కడ మొగులయ్య ప్లాట్ చుట్టూ ప్రహరీ గోడను నిర్మించుకున్నాడు. అయితే..గత నాలుగు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు మొగులయ్య నిర్మించిన పహరీ గోడను ధ్వంసం చేశారు. ఈ విషయంపై ఆయన హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు మొగులయ్యతో స్వయంగా మట్లాడి ప్లాట్ కాంపౌండ్ వాల్ పునర్ నిర్మించుకునేందుకు తగిన తోడ్పాటు అందించారు. దీంతో మొగులయ్య గోడను నిర్మించుకున్నాడు. ఈ కేసులో నిందితులను త్వరగా అరెస్టు చేస్తామని హయత్‌నగర్ పోలీసులు పేర్కొన్నారు.

నేరస్తులు@మెయిల్స్.కామ్

- కమ్యూనికేషన్‌కు బ్రేక్ రాకుండా సరికొత్త ఎత్తుగడ
- మొబైల్‌లోని డేటా ఈ-మెయిల్‌తో అనుసంధానం
- పోలీసులు ఫోన్ సీజ్ చేసినా కాంటాక్ట్స్ పోకుండా ప్లాన్
- దీంతో నిరంతరం నెట్‌వర్క్ సభ్యులతో సంప్రదింపులు



సాక్షి, సిటీబ్యూరో: 'అక్రమంగా ఆయుధాలు తరలిస్తున్న ఏపీకి చెందిన సాయిరాం రెడ్డిని ఇటీవల రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 7 తుపాకులు, 11 బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు సాయిరాంను విచారిస్తున్న క్రమంలో ఈ-మెయిల్స్ అడ్డా గురించి వెలుగులోకి వచ్చింది. నిందితుడు గతంలో కాకినాడ జైలులో 6 నెలలు, చర్లపల్లి జైలులో 4 నెలలు ఉన్నాడు. ఆ సమయంలో అక్రమ ఆయుధాల కేసులో అరెస్టయిన పాత నేరస్తుడి ఈ-మెయిల్ ఐడీని సేకరించాడు. సాయిరాం బెయిల్‌పై బయటకు వచ్చాక ఈ-మెయిల్స్ ద్వారా పాత నేరస్తుడిని సంప్రదించాడు. అతని కాంటాక్ట్ ద్వారా మహారాష్ట్ర నుంచి తుపాకులను కొనుగోలు చేసి, హైదరాబాద్‌కు తరలించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.''

.. ఇలా నేరస్తులు సాంకేతికత బాట పట్టారు. క్రిమినల్స్ బెయిల్‌పై బయటికి వచ్చాక పాత సహచరులతో పాటు జైలులో పరిచయమైన ఇతర నిందితులతో ఈ-మెయిల్స్‌లో సంప్రదింపులు జరుపుతున్నారు.

సిమ్ కార్డ్ సీజ్ అవుతుండటంతో...

కేటుగాళ్లు పోలీసులకు చిక్కిన తర్వాత సెల్‌ఫోన్‌ను, సిమ్ కార్డును సీజ్ చేస్తారు. కొన్ని నెలల పాటు సిమ్ వినియోగంలో లేకపోతే ఆ ఫోన్ నంబరును టెలిఫోన్ నెట్‌వర్క్ కంపెనీలు ఇతర వినియోగదారులకు కేటాయిస్తుంటాయి. దీంతో నేరస్తులకు మొబైల్‌లోని కాంటాక్ట్‌లు మిస్ అవుతున్నాయి. దీంతో జైలు నుంచి బయటికి వచ్చాక పాత సహచరులతో సంప్రదింపులకు కష్టమవుతుంది. నెట్‌వర్క్‌లోని సభ్యులతో కమ్యూనికేషన్ బ్రేక్ అవకుండా ఉండాలంటే ఈ-మెయిల్స్ ద్వారా కాంటాక్ట్ చేయాలని కొత్త ఎత్తుగడ వేశారు. ఈక్రమంలో నిందితులు మొబైల్‌లోని డేటాను ఈ-మెయిల్‌కు అనుసంధానిస్తున్నారు. పోలీసులకు దొరికినప్పుడు సెల్‌ఫోన్, సిమ్ కార్డు సీజ్ అయినా మొబైల్‌లోని కాంటాక్ట్ మిస్ కాకుండా జాగ్రత్త పడుతున్నారు. జైలు నుంచి బయటికి వచ్చాక కొత్త సిమ్ కార్డు తీసుకొని, దీని ద్వారా మళ్లీ ఈ-మెయిల్‌కు అనుసంధానమవుతున్నారు. నెట్‌వర్క్‌లోని సభ్యులతో సంప్రదింపులు పునరుద్ధరించుకుంటున్నారు.

పాస్‌వర్డ్‌తో డేటా సురక్షితం...

క్రిమినల్స్ జైలుకెళ్లాక అక్కడ పరిచయమయ్యే వారి ఫోన్ నంబర్లు, వారి నేర ప్రక్రియ ఆలోచనలతో ఉండే ఇతర కేటుగాళ్ల నంబర్లు, ఈ-మెయిల్స్‌తో భద్రపరుచుకుంటున్నారు. వాటికి పటిష్టమైన యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లను పెట్టుకుంటున్నారు. దీంతో పోలీసులకు దొరికినా వారి ఈ-మెయిల్స్‌ను తెరవలేరని, వారి నెట్‌వర్క్ సురక్షితంగా ఉంటుందనేది నేరస్తుల ధీమా. జైలు నుంచి విడుదలైన తర్వాత ఆ సమాచారాన్ని మెయిల్స్ ద్వారా వారి సహచరులకు పంపించుకుంటున్నారు. వీటి ద్వారానే తీసుకున్న కొత్త నంబరును షేర్ చేసుకుంటున్నారు.

అన్ని రకాల టెక్నాలజీని వాడుతున్నారు..

నేరస్తులు, నిందితులు ఇప్పుడు అన్ని రకాల టెక్నాలజీలను వినియోగిస్తున్నారు. పోలీసులు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా జాడ గుర్తిస్తున్నారని పసిగట్టి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. ఇటీవల అక్రమ ఆయుధాల కేసులో అరెస్టయిన నిందితుడు ఈ-మెయిల్స్ ద్వారా నెట్‌వర్క్ సభ్యులతో సంప్రదింపులు జరిపాడు. ఇది మా పరిశీలనలో వెల్లడైంది. – జి.సుధీర్ బాబు, పోలీసు కమిషనర్, రాచకొండ

మద్యం మత్తులో మహిళ హల్‌చల్

ఫిలింనగర్: మద్యం మత్తులో ఓ మహిళ (44) పార్కు పక్కన తూలిపోతూ..రోడ్డు పక్కన పడుకుని న్యూసెన్స్ చేస్తుండగా సమాచారం అందుకున్న ఫిలింనగర్ పోలీసులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని సయ్యద్‌నగర్ బస్తీలో నివసించే ఓ మహిళ గత కొంతకాలంగా మద్యానికి బానిసై అర్ధరాత్రి దాకా రోడ్లపై తిరుగుతూ న్యూసెన్స్ క్రియేట్ చేస్తుంది. శుక్రవారం రాత్రి 12.30 గంటల ప్రాంతంలో బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఎన్‌బీటీనగర్ ప్రాంతంలో మద్యం మత్తులో న్యూసెన్స్ చేస్తుండగా బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే వారు అక్కడకు వెళ్లి ఆమె ఇంట్లో అప్పగించి వచ్చారు. అయితే ఇంట్లో చెప్పకుండానే ఆమె మళ్లీ అదే అర్ధరాత్రి 2.30 గంటల ప్రాంతంలో బయటకు వచ్చింది. ఎమ్మెల్యే కాలనీ సమీపంలోని లోటస్‌పాండ్ పార్కు వద్ద వివస్త్రగా పడి ఉంది. శనివారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఫిలింనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆమె గురించి ఆరా తీయగా సయ్యద్‌నగర్‌లో నివసిస్తుందని తెలిసింది. దీంతో ఆమె కూతురికి ఫోన్ చేయగా 'సార్..దయచేసి మా అమ్మను ఇంటికి పంపకండి..జైలుకు పంపండి..' అంటూ ఆమె ఇంట్లో చేసిన న్యూసెన్స్‌ను మొరపెట్టుకుంది. ఆమె భర్త పెయింటర్‌గా పనిచేస్తుంటాడని, ముగ్గురు పిల్లలు ఉన్నారని, మద్యానికి బానిసై నట్లుగా పోలీసుల దర్యాప్తులో తేలింది. గత నెల రోజుల నుంచి 10 మార్లు పోలీసులు ఆమెను ఇలా గే రోడ్లపై మద్యం మత్తులో తిరుగుతుండగా కు టుం బసభ్యులకు అప్పగించారు. ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బంధువుల ఇంటికొచ్చి మహిళ బలవన్మరణం

ఇబ్రహీంపట్నం: బంధువుల ఇంటికొచ్చిన ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా మునుగోడు మండలం లక్ష్మీదేవిగూడెంకు చెందిన వివాహిత కొప్పెర సాలమ్మ(30) ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఖానాపూర్ గ్రామ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సమీపంలో నివసించే బంధువుల ఇంటికి కుటుంబ సమేతంగా పది రోజుల క్రితం వచ్చినట్లు తెలిపారు. శనివారం అర్ధ రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి ఖానాపూర్ గ్రామ సమీపంలోని వేప చెట్టుకు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ విషయంలో పోలీసులు ఆమె బంధువులను విచారించినట్లు పేర్కొన్నారు.

వైభవంగా రామాయణ్ మేళా

పాల్గొన్న గవర్నర్ బండారు దత్తాత్రేయ, నగర సీపీ సీవీ ఆనంద్



శ్రీరామ పట్టాభిషేకంలో పాల్గొన్న సీపీ సీవీ ఆనంద్, గవర్నర్ బండారు దత్తాత్రేయ



ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో రావణ దహన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

అబిడ్స్: ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో దసరా సంబరాలు జోరుగా నిర్వహించారు. శనివారం రాత్రి రామాయణ్ మేళా వేడుకలు, రావణ దహనం, శమీపూజ, శ్రీరాముని పట్టాభిషేకం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. రామాయణ్ మేళా చీఫ్ కన్వీనర్ గోవింద్‌రాఠి, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు నిరంజన్, కార్యదర్శి సురేందర్‌రెడ్డి, కోశాధికారి ప్రభాశంకర్‌ల ఆధ్వర్యంలో ఈ వేడుకలు చేపట్టారు. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్యఅతిథులుగా పాల్గొని వేడుకల్లో పూజలు చేశారు. నిర్వాహకులు వారిని ఘనంగా సత్కరించారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు హన్మంతరావు, డాక్టర్ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యార్థులకు మళ్లీ రాగి జావ

● వారానికి మూడ్రోజులు అందించాలి ● అమలు చేయాలని ప్రభుత్వ ఉత్తర్వులు

సాక్షి, సిటీబ్యూరో: ఉదయం పూట విద్యార్థుల ఆకలి తీర్చేందుకు, పోషక విలువలతో కూడిన ఆహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పాఠశాలల్లో రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని గత విద్యా సంవత్సరం ప్రారంభించింది. ఈ విద్యా సంవత్సరం జూన్ మాసం వరకు ఈ కార్యక్రమం కొనసాగగా, మూడు నెలలు (జులై, ఆగస్టు, సెప్టెంబర్)గా నిలిచి పోయింది. రాగి జావ అందించడం వల్ల మంచి ఫలితాలున్నాయని భావించిన ప్రభుత్వం ఇప్పటికే అంగన్వాడీ కేంద్రాల్లో అమలు చేయాలని నిర్ణయించింది. తాజాగా పీఎం పోషణ్ పథకంలో భాగంగా సర్కారు పాఠశాలల్లోనూ తిరిగి ప్రారంభించాలని ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో దసరా సెలవులు ముగిసిన తర్వాత అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రాగి జావ అందనుంది.

గ్రేటర్ జిల్లాల్లో ఇలా..

హైదరాబాద్ నగరంతో సహా మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో మొత్తం 2,497 ప్రభుత్వ పాఠశాలల్లో 3.81లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ ప్రతి రోజూ మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. వీటితో పాటు ఉదయం వేళ వంట ఏజెన్సీల ద్వారా రాగి జావ కూడా అందించనున్నారు. దీంతో ఉదయం వేళ ఆహారం తీసుకోకుండా వచ్చే విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. ఒక్కో విద్యార్థికి 10 గ్రాముల రాగి పిండి, బెల్లంతో కలిపి మరగబెట్టిన జావను వారంలో మూడు రోజుల పాటు అందించనున్నారు.

చర్యలు చేపడతాం..

విద్యార్థులకు మళ్లీ రాగి జావ అందించాలని ఆదేశాలు వచ్చాయి. ప్రభుత్వం నుంచి అవసరమైన పిండి, బెల్లం సరఫరా కాగానే పాఠశాలలకు చేరవేసి, అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం.
– విజయకుమారి, మేడ్చల్-మల్కాజిగిరి డీఈఓ

నకిలీ నిత్యావసరాల దందా!

● ప్రముఖ కంపెనీల పేర్లతో ఉత్పత్తులు
● రెండు ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్ దాడులు
● భారీ స్థాయిలో నాసిరకం సరుకు స్వాధీనం

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ కంపెనీలు, బ్రాండ్ల పేర్లతో ఉన్న నకిలీ నిత్యావసర వస్తువుల్ని విక్రయిస్తున్న మూడు దుకాణాలపై మధ్య మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. ఈ నేపథ్యంలో ముగ్గురు వ్యాపారులను పట్టుకోవడంతో పాటు భారీగా నకిలీ, నాసిరకం ఉత్పత్తులు స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ వైవీఎస్ సుదీంద్ర ఆదివారం వెల్లడించారు. రాజస్థాన్ నుంచి వచ్చి గోషామహల్‌లో స్థిరపడిన రమేష్ కుమార్ పర్మర్ బేగంబజార్‌లో ఆర్‌ఎం జనరల్ స్టోర్ పేరుతో, హితేష్ పర్మర్ ఫీల్‌ఖానాలో సరోజ్ ఏజెన్సీ పేరుతో, ఎర్రగడ్డలో స్థిరపడిన రమేష్ కుమార్ శ్రీ ట్రేడర్స్ పేరుతో నిత్యావసర వస్తువుల విక్రయ వ్యాపారం చేస్తున్నారు. ఇందులో ఆశించిన లాభాలు లేకపోవడంతో తక్కువ కాలంలో భారీ లాభాలు పొందడానికి మార్గాలు అన్వేషించారు. ఇందులో భాగంగా ప్రముఖ కంపెనీల పేరుతో నకిలీ వస్తువులు తయారు చేసి విక్రయించే ఏజెంట్లను సంప్రదించారు. వారి నుంచి గుడ్‌నైట్ లిక్విడ్, గోల్డ్‌ఫ్లాష్ కాంబి ప్యాక్, లైజాల్ లిక్విడ్, ఫెవీ క్విక్ పేర్లు, ప్యాకింగ్‌తో ఉన్న నకిలీ ఉత్పత్తులు అతి తక్కువ రేటుకు ఖరీదు చేస్తున్నారు. వీటిని తమ దుకాణాల్లో ఉంచి అసలైనవే అని వినియోగదారులకు చెప్తూ హోల్‌సేల్, రిటైల్‌గా అమ్ముతున్నారు. ఈ బ్రాండ్లపై ఉన్న నమ్మకంతో కస్టమర్లు సైతం భారీగా కొనుగోలు చేస్తున్నారు. ఈ ముగ్గురి దందాపై మధ్య మండల టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ ఎస్.రామకృష్ణ నేతృత్వంలో ఎస్సై డి.శ్రీకాంత్ గౌడ్‌తో కూడిన బృందం మూడు ప్రాంతాల్లో దాడి చేసి ముగ్గురినీ అదుపులోకి తీసుకుంది. వీరి నుంచి 444 బాక్సుల గోల్డ్ ఫ్లాష్ కాంబి ప్యాక్, 94 బాక్సుల గుడ్ నైట్ లిక్విడ్, 702 లైజాల్ బాటిల్స్, 13440 ఫెవీక్విక్ సాచెట్స్ స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం ఈ ముగ్గురితో పాటు స్వాధీనం చేసుకున్న నకిలీ సరుకును బేగంబజార్ పోలీసులకు అప్పగించారు.

ప్రాణం తీసిన కుటుంబ తగాదాలు

భార్యను హత్య చేసిన భర్త

చైతన్యపురి: భార్యా భర్తల మధ్య చోటుచేసుకున్న గొడవ హత్యకు దారితీసింది. ఆవేశానికి లోనైన భర్త కత్తితో పొడిచి భార్యను చంపిన సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాలు...ప్రకాశం జిల్లాకు చెందిన గంజి వెంకటేష్, గంజి సోను (32) దంపతులు ఇద్దరు పిల్లలతో నగరానికి వచ్చి గడ్డిఅన్నారం సరస్వతీనగర్ కాలనీలో నివసిస్తున్నారు. వెంకటేష్ కూలిపని చేస్తుండగా సోను ఇళ్లలో పనిచేస్తుంది. వీరికి గోవిందరాజు (14), మురళీ కృష్ణ (11) ఇద్దరు కుమారులున్నారు. గత మూడేళ్లుగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీలు కూడా జరిగాయి. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం సోను పంజాబీ డ్రస్ వేసుకోగా వెంకటేష్‌కు నచ్చలేదు. వద్దని వారించినా వినకపోవటంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ దశలో వెంకటేష్ ఆవేశంగా కూరగాయలు కోసే చాకు తీసుకుని భార్యను కడుపులో, వీపుపై పొడిచాడు. దీంతో సోను రక్తపు మడుగులో పడి అక్కడికక్కడే మృతిచెందింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. భార్యపై దాడి చేసే సమయంలో వెంకటేష్ చేతికి స్వల్పగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తుల మృతదేహాలు

ఇబ్రహీంపట్నం రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందగా మరోకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఆదివారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను సీఐ రాఘవేందర్‌రెడ్డి వెల్లడించారు. ఆదిబట్ల టీసీఎస్‌నుంచి ద్విచక్ర వాహనంపై ద్యానిసింగ్, పెరుమల్ల హరీశ్, ప్రకాశ్ అనే ముగ్గురు వ్యక్తులు బొంగ్లూర్ ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి వస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఒకే వాహనంపై అతివేగంగా వచ్చి బొంగ్లూర్ సర్వీస్‌రోడ్డు సమీపంలోని శ్రీరామధర్మకాంట వద్ద నాలాలో పడిపోయారు. ఈ సంఘటనలో బిహార్‌కు చెందిన ద్యాన్ సింగ్ (40), పెరుమల్ల హరీశ్ (28) నిర్మల్ ఖానాపూర్‌కు చెందిన ఇద్దరు దుర్మరణం చెందారు. బెంగాల్‌కు చెందిన ప్రకాశ్ (30)కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతనిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రైయివేటు ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఇద్దరి మృతదేహాలను ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని పోలీసులు పేర్కొన్నారు.





తప్పిన ముప్పు

ఎర్రమంజిల్ కాలనీ రోడ్డులో ఆదివారం ఓల్వో కారు బీభత్సం సృష్టించింది. అతివేగంగా వచ్చి ఫుట్‌పాత్‌ను ఢీకొట్టి ఆగిపోయింది. ఈ సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వాహన డ్రైవర్ నిర్లక్ష్యంగా అతివేగంతో నడపడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుందని పోలీసులు తలిపారు. అతన్ని అదుపులోకి తీసుకున్నారు.

అంబరాన్నంటిన దసరా సంబురాలు

పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. ఉత్సాహపూరిత వాతావరణంలో రావణ దహనాలు


వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో రావణ దహనం



వెంకటేశ్వరకాలనీ: ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల వ్యాప్తంగా విజయదశమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. పండుగ సందర్భంగా ఉదయమే అమ్మవారి ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా సాయంత్రం జమ్మిచెట్టును దర్శించి శమీ పూజల్లో పాల్గొన్నారు. శ్రీనగర్‌కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో జరిగిన రావణ దహనం వేడుకల్లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పాల్గొన్నారు. అంతకముందు ఆలయ అర్చకులు సంప్రదాయ బద్ధంగా ఈ వేడుకలకు శ్రీకారం చుట్టారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య రావణ దహన కార్యక్రమం జరిగింది.

బంజారాహిల్స్‌లో...

బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2లోని ఇందిరానగర్ కట్ట మైసమ్మ ఆలయ ఆవరణలో నిర్వహించిన రావణ దహన వేడుకల్లో కాంగ్రెస్ నాయకురాలు పి.విజయారెడ్డి పాల్గొన్నారు. రావణ దహనాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి జనం పెద్ద సంఖ్యలో విచ్చేశారు. బంజారాహిల్స్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అదే విధంగా బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని ఎన్‌బీటీనగర్ హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్ ఆవరణలో శనివారం రాత్రి రావణ దహన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానికులు భారీ సంఖ్యలో విచ్చేసి ఈ వేడుకను తిలకించి పులకించిపోయారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ కూడా వేడుకల్లో పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో...

జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో దసరా పర్వదిన సంబరాలు అంబరాన్ని తాకాయి. శనివారం సాయంత్రం క్లబ్ ఆవరణలో లాన్స్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఒకవైపు దాండియా, ఇంకోవైపు బతుకమ్మ వేడుకలను కన్నులపండువగా నిర్వహించారు. క్లబ్ మహిళా సభ్యుల ఆటపాటలు, దాండియా నృత్యాలు ఈ కార్యక్రమానికి హైలెట్‌గా నిలిచాయి. క్లబ్ కార్యదర్శి కిలారు రాజేశ్వరరావు నేతృత్వంలో నిర్వహించిన ఈ వేడుకల్లో సభ్యులు వేలాదిగా పాల్గొన్నారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన వేడుకలకు పిల్లలు, పెద్దలు భారీగా విచ్చేసి దసరాను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.


రావణ దహనంలో ఎమ్మెల్యే, కార్పొరేటర్లు..


పూజలు నిర్వహిస్తున్న రాధారెడ్డి, డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డిలు


బోరబండ బస్‌స్టాప్ వద్ద బాబా ఫసియుద్దీన్, శివసేనారెడ్డిలు...


రహమత్‌నగర్‌లో నవీన్ యాదవ్...


జూబ్లీహిల్స్ క్లబ్‌లో దసరా వేడుకలు నిర్వహిస్తున్న నిర్వాహకులు


క్వారీ గ్రౌండ్‌లో సీఎన్‌రెడ్డి...


దసరా వేడుకల్లో దాండియా ఆడుతున్న మహిళలు


జీటీఎస్ టెంపుల్‌లో పూజలు చేస్తున్న భక్తులు...


వేడుకల్లో... ఎమ్మెల్యే, కార్పొరేటర్లు..


జూబ్లీహిల్స్ క్లబ్‌లో...

ప్రత్యేక పూజలు


పూజలో బీజేపీ నేతలు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–10లోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో ఆదివారం షిర్డీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి నివాసంలో జరిగిన ఈ పూజా కార్యక్రమాల్లో బీజేపీ నేతలు కె. భోజిరెడ్డి, గడ్డం వెంకటస్వామి, కొత్త నీరజ, జూబ్లీహిల్స్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరిదేవిగా పర్వతవర్ధినిదేవి



బంజారాహిల్స్: విజయదశమి పర్వదినాన జూబ్లీహిల్స్‌లోని సీతారామస్వామి దేవాలయంలో కొలువుదీరిన పర్వతవర్ధినిదేవి అమ్మవారు రాజరాజేశ్వరీదేవి అలంకరణలో దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు విశేషంగా తరలివచ్చారు. ఉత్సవాల్లో భాగంగా వేర్వేరుగా నిర్వహించిన భరతనాట్య నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


భరతనాట్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

సాయిబాబాకు పుష్పాభిషేకం


పుష్పాభిషేకం చేస్తున్న అర్చకులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని విశ్వసాయి మందిరంలో కొలువుదీరిన శ్రీసాయిబాబా మహా సమాధి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం బాబాకు విశేషంగా క్షీరాభిషేకం, పుష్పాభిషేకం, అర్చన అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ విశేష పూజల్లో పాల్గొనేందుకు, సాయిబాబాను దర్శించుకునేందుకు ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో విచ్చేశారు. ఈ నెల 3వ తేదీ నుంచి బాబా మహా సమాధి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

నేడు నానక్‌రాంగూడలో బీజేపీ సభ్యత్వ నమోదు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ నానక్‌రాంగూడలో ఈ నెల 14న (నేడు) బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటలకు మెదక్ ఎంపీ రఘునందన్ రావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, శేరిలింగంపల్లి ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ హాజరై ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, ఇన్‌చార్జిలు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలి



సనత్‌నగర్: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట నీలిమ తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు బి. మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా చూడాలని ఈ సందర్భంగా మహేష్‌గౌడ్ ఆమెకు సూచించారు.

కులగణన జీఓపై హర్షం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో కుల గణన కోసం ప్రభుత్వం జీవో నంబర్ 18 జారీ చేయడం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆదివారం పేర్కొన్నారు. ఇచ్చిన మాటలకు కట్టుబడి కులగణను శ్రీకారం చుట్టడం పట్ల సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బీసీల పోరాటం వలనే ప్రభుత్వం కులగణను జీవో జారీ చేసిందన్నారు.

కూరగాయల ధరలు



సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కిలోల్లో.. టమాటా రూ.51, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 28, బెండకాయ 40, పచ్చిమిర్చి 23, బజ్జీమిర్చి 55, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 38, పందిరి బీర 45, క్యాబేజీ 23, క్యారెట్ 35, దొండ 28, గుండుబీన్స్ 95, గింజ చిక్కుడు 55, గోకరకాయ 28, కీర 18, దోసకాయ 40, బీట్‌రూట్ 38, ఉల్లిగడ్డ 45, ఆలుగడ్డ 36, చామగడ్డ 35, మొరంగడ్డ 23, కందగడ్డ 50, సొరకాయ 15, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఓయూ కాలేజీల్లో నిధుల కొరత

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని 10 కాలేజీలతో పాటు అనుబంధ నిజాం, సికింద్రాబాద్, సైఫాబాద్ పీజీ కాలేజీలు, జిల్లా పీజీ సెంటర్లలో తీవ్రమైన నిధుల కొరత ఏర్పడింది. గత మూడు సంవత్సరాలుగా ఫీజు రీ యింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో కాలేజీలు జీరో బడ్జెట్‌తో కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఓయూలో వివిధ కోర్సులు చదివే విద్యార్థులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూసీ అయినందున ఫీజులు ఎవరూ చెల్లించడం లేదు. విద్యార్థులు ఫీజులు చెల్లించక, ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయక ఓయూ కాలేజీలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాయి.

నాణ్యత, విశ్వాసానికి బిల్డింగ్ బ్లాక్ గ్రూప్ ప్రతీక

- ఇళ్లతో పాటు భవిష్యత్తు నిర్మాణంలో భాగం
- సినీనటి ఐశ్వర్యమీనన్


గ్రాండ్ టాలెంట్ అవార్డు వేడుకల్లో సినీనటి ఐశ్వర్యమీనన్

బంజారాహిల్స్: నాణ్యత, విశ్వాసానికి బిల్డింగ్ బ్లాక్ గ్రూప్ ప్రతీక అని సినీ నటి ఐశ్వర్యమీనన్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో 474వ గ్రాండ్ టాలెంట్ అవార్డుల వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఐశ్వర్యమీనన్ మాట్లాడుతూ ఈ గ్రూప్ ఇళ్లను నిర్మించడమే కాకుండా భవిష్యత్తును నిర్మించడంలో కూడా ముందుందన్నారు. బీబీజీ బృందం అంకిత భావం ప్రశంసనీయమన్నారు. మహిళా సాధికారత పట్ల చూపిస్తున్న శ్రద్ధ అమోఘమన్నారు. వ్యాపారంతో పాటు సమాజం పట్ల ఉన్న బాధ్యతకు ఇది నిదర్శనమన్నారు. బీబీసీ గ్రూప్ సీఎండీ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ బీబీజీ బంగారు తల్లి లక్ష్యం మహిళలను ఉన్నత స్థానంలో చూడడమేన్నారు. అందులో భాగంగా 2040 నాటికి 20 లక్షల మంది మహిళలకు సాధికారత కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇక వ్యాపారంలో ఇప్పటి వరకు 240 ప్రాజెక్టులు పూర్తి చేశామన్నారు. ఈ సందర్భంగా సినీనటి ఐశ్వర్యమీనన్ చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్కీ డీప్ ద్వారా బహుమతులు ప్రదానం చేశారు.

కేఫ్ ముసుగులో ఖరీదైన మద్యం విక్రయం

- యజమానితోపాటు మేనేజర్‌పై కేసు నమోదు

బంజారాహిల్స్: నిబంధనలకు విరుద్ధంగా కేఫ్ ముసుగులో ఖరీదైన మద్యం విక్రయిస్తున్న యజమానితో పాటు మేనేజర్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి భారీగా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే... కాకతీయహిల్స్‌లో నివసించే నిఖిత్‌రెడ్డి (28) జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–5లో ది ఫిఫ్త్ స్ట్రీట్ పేరుతో కేఫ్ నిర్వహిస్తున్నాడు. కొంతకాలంగా ఈ కేఫ్‌లో మద్యం విక్రయాలు జరుపుతున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో జూబ్లీహిల్స్ పోలీసులు శనివారం రాత్రి ఈ కేఫ్‌పై దాడి చేసి ఇక్కడ విక్రయిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ లైసెన్స్ లేకుండా నిబంధనలు ఉల్లంఘించి గుట్టుచప్పుడు కాకుండా మద్యం విక్రయిస్తున్నట్లుగా గుర్తించారు. కరోనా, బడ్వైజర్ బీర్లతో పాటు హైరీష్ విస్కీ చివాస్ రీగల్, వాలంటైన్ విస్కీ, బ్లాక్ లేబుల్ విస్కీ, ఓల్డ్ మంక్ రమ్, వోడ్కా తదితర బ్రాండ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిఖిత్‌రెడ్డితో పాటు మేనేజర్ డి.రాజులపై ఎక్సైజ్ యాక్ట్ 34 (ఏ) కింద కేసు నమోదు చేశారు. మొత్తం 16 బ్రాండ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇందులో విదేశీ మద్యం కూడా ఉన్నట్లు గుర్తించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా అలయ్..బలయ్


కార్యక్రమంలో పాల్గొన్న కాసాని జ్ఞానేశ్వర్ తదితరులు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ బోయిగూడ ముదిరాజ్ సంఘంలో ఆదివారం ముదిరాజ్‌లు అలయ్ బలయ్ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. తెలంగాణ జిల్లాలలో పాటు నగర నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ముదిరాజ్ కులస్తులు హాజరైనారు. ముఖ్య అతిథిగా హాజరైన ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తులు విద్యా, ఆర్థిక, సామాజిక, రాజకీయపరంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఎన్నో సంవత్సరాల నుంచి ముదిరాజ్ కులస్తులను డీ నుంచి ఏ గ్రూప్‌లోకి మార్చాలనే డిమాండ్ ఆచరణకు నోచుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ముదిరాజ్ కులస్తులు తమ హక్కుల కోసం ఐక్యం ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో గొడుగు ఆంజనేయులు, కాసాని వీరేష్, కాసాని సుధాకర్, నవాడ రాంమూర్తి, ముదిరాజ్ మహాసభ నాయకుల సదానంద్, ప్రకాశ్, చెన్నయ్య, సురేందర్, శ్రీకాంత్, శారద, చంద్రమౌళి, దివాకర్, శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫంక్షన్‌కు వెళ్లిన వ్యక్తి అదృశ్యం

వెంగళరావునగర్: ఫంక్షన్‌కు వెళ్ళిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఓంనగర్‌కు చెందిన మాదారపు సత్యనారాయణకు 2010లో అదే ప్రాంతానికి చెందిన స్వాతితో వివాహమైంది. వారికి ముగ్గురు సంతానం. ఈ నెల 11వ తేదీన సత్యనారాయణ కుటుంబం మొత్తం కార్మికనగర్‌లోని బంధువుల ఇంటికి ఫంక్షన్‌కు వెళ్ళారు. అదేరోజు స్వాతి పిల్లలతో కలిసి ఇంటికి వెళ్ళగా, సత్యనారాయణ మద్యం సేవించడంతో స్వాతి బాబాయి శ్రీను అతనిని ఇంటి వద్ద డ్రాప్ చేసి వెళ్ళాడు. 12వ తేదీ సత్యనారాయణ కుమార్తె తన తండ్రి ఇంటికి రాలేదని ఆమె తాత రాములుకు తెలియజేసింది. దీంతో కుటుంబ సభ్యులు సత్యనారాయణకు ఫోన్ చేస్తే సిచ్చాఫ్ వచ్చింది. తెలిసిన అన్ని ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఒకసారి కార్డు వినియోగిస్తే

ఆరుసార్లు నగదు కట్

వెంగళరావునగర్: క్రెడిట్ కార్డు ఒకసారి వినియోగిస్తే మరో ఆరుసార్లు నగదు కట్ అయిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... హుబ్లీకి చెందిన అనిత టెక్నీషియన్‌గా పనులు చేస్తూ తన కుటుంబంతో కలిసి కార్మికనగర్‌లో నివాసముంటుంది. ఈ క్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిట్ కార్డు ద్వారా ఈనెల 8న ఈఎంఐ పద్ధతిలో రూ.9,160లకు కిచెన్ సామగ్రి కొనుగోలు చేసింది. అయితే 10, 11 తేదీల్లో ఆరుసార్లు వివిధ రూపాల్లో మొత్తం రూ. 58,460లు అదనంగా నగదు వేరే అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యాయి. రెండు రోజుల్లో గుర్తు తెలియని మహిళ అనేకసార్లు ఆమెకు ఫోన్ చేసింది. దీంతో బాధితురాలు సైబర్ పీఎస్‌తో పాటుగా మధురానగర్ పీఎస్‌లో కూడా ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

వెంగళరావునగర్: దేవాలయానికి వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లిన మైనర్ బాలిక అదృశ్యమైన సంఘటన మ.దురానగర్ పీఎస్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఏపీలోని వెస్ట్ గోదావరికి చెందిన మహిళ గత రెండేళ్లుగా ఎల్లారెడ్డిగూడలోని హాస్టల్‌లో తన ఇద్దరి కుమార్తెలతో కలిసి ఉంటూ, హాస్టల్ నివాసితులకు వంట చేస్తుంది. ఆమె చిన్న కుమార్తె పదో తరగతి తరువాత చదువు మానేసింది. కాగా ఈనెల 10వ తేదీ ఆమె దేవాలయానికి వెళ్ళి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. దీంతో బాలిక కోసం పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. అయితే హాస్టల్ పక్కన ఉండే కొందరు ఒక యువకుడితో బాలిక వెళ్ళినట్టుగా తల్లికి సమాచారం ఇచ్చారు. దీంతో ఏపీలోని ఆమె స్వగ్రామం పక్కింట్లో నివాసం ఉండే దుర్గాప్రసాద్ తన కుమార్తెను తీసుకెళ్ళినట్టుగా అనుమానం వ్యక్తం చేస్తూ బాలిక తల్లి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని డిగ్రీ, పీజీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు నెల్లి సత్య ప్రభుత్వాన్ని కోరారు. రీయింబర్స్ నిధులు విడుదల చేయకపోవడంతో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ప్రవేటు కాలేజీల యజమానులు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. దీంతో విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోతున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు.

అతిథి అధ్యాపకుల వేతనాలు చెల్లించండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా 135 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో పని చేస్తున్న అతిథి అధ్యాపకుల వేతనాలు చెల్లించాలని తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు డా. చింతల కిశోర్‌కుమార్ కోరారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంత వరకు వేతనాలు చెల్లించక పోవడంతో అధ్యాపకుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ముఖ్యమైన పండుగ దసరాను అరకొరగా చేసుకున్నారని కనీసం దీపావలి వరకైనా వేతనాలు చెల్లించాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

దత్తాత్రేయకు భజరంగ్‌సేన సన్మానం



అబిడ్స్: నాంపల్లి ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో రాష్ట్ర భజరంగ్‌సేన అధ్యక్షుడు ఎస్ఆర్ లక్ష్మణ్‌రావు హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయను సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ ప్రజల్లో స్నేహభావాలు, ప్రేమానురాగాలు పెంపొందించేందుకు అలయ్ బలయ్ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ప్రతి సంవత్సరం బండారు విజయలక్ష్మీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఈ కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషకరమన్నారు. కార్యక్రమంలో హరి, నరేష్, కౌశిక్, అవినాష్‌దేవుడా తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సోమవారం । 14 । అక్టోబర్ । 2024

కోటను సందర్శించిన విదేశీ శాస్త్రవేత్తల బృందం



గోల్కొండ కోటలో వృక్ష శాస్త్రవేత్తల బృందంతో డాక్టర్ సుధాకర్

గోల్కొండ: ప్లాంట్ హెల్త్ మెనేజ్‌మెంట్ అంశాలపై అధ్యాయనం చేసేందుకు హైదరాబాద్ వచ్చిన 16 దేశాల ప్రతినిధుల బృందం ఆదివారం గోల్కొండ కోటను సందర్శించింది. వీరు రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మెనేజ్‌మెంట్ కేంద్రం సందర్శనానికి వచ్చినట్లు ఎన్‌ఐఆర్‌డీకి చెందిన డాక్టర్ సుధాకర్ తెలిపారు. 30 మంది సభ్యులతో కూడిన ఈ బృందం ఆయనతో పాటు గోల్కొండ కోటను సందర్శించారు. ఈ సందర్భంగా వారు కోటలోని చారిత్రక ప్రదేశాలను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కోట ఆయుధాగారంలో ఉన్న ఆయుధాల ఫొటోలు తీసుకున్నారు. నగీనాబాగ్‌లో ఉన్న వివిధ రకాల చెట్లను పరిశీలించారు.

అయోధ్య రాముడి ధనుస్సు దర్శనం



అయోధ్య రాముడి ధనుస్సును దర్శించుకున్న సినీనటుడు సుమన్ తదితరులు

సనత్‌నగర్: అయోధ్య రాముడికి సమర్పించే ధనుస్సు, బాణాన్ని తిలకించి భక్తులు పులకించిపోయారు. విజయదశమి సందర్భంగా బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని శ్రీభూలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రజల దర్శనార్థం రామయ్య ధనుస్సును ఉంచారు. దేశవ్యాప్తంగా పుణ్యక్షేత్రాల్లో పూజలు చేయించి అయోధ్య రాముడికి సమర్పించే క్రమంలో భూలక్ష్మీ అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చినందుకు భక్తులు సంతోషం వ్యక్తంచేశారు. సినీనటుడు సుమన్, కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ కో–ఆర్డినేటర్ సత్యం శ్రీరంగం, బేగంపేట పోలీస్ ఇన్‌స్పెక్టర్ రామయ్యలతో పాటు గంగాధర్‌గౌడ్, అరుణ్‌గౌడ్, సంజయ్, గోవింద్‌రావు, శేఖర్, కృష్ణ, చిరంజీవులు, జగదీష్, బాల, మొహిత్ తదితరులు శ్రీరాముడి ధనుస్సును తిలకించారు.

ప్రసూతి ఆసుపత్రిలో భోజన వితరణ కేంద్రం

- ప్రారంభించిన చినజీయర్ స్వామి



అల్పాహారం, భోజన వితరణ చేస్తున్న చిన్నజీయర్ స్వామి

సుల్తాన్‌బజార్: సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ఆసుపత్రికి ప్రత్యేక గుర్తింపు ఉందని, ఈ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించడం ఎంతో సంతోషకరమైన విషయమని త్రిదండి శ్రీమన్నారాయణ చిన్నజీయర్ స్వామి అన్నారు. శ్రీమన్నారాయణ ట్రస్ట్, వికాస్ పరిణవ్ సంస్థ వాలంటీర్ ఐటీ ప్రొఫెషనల్ హాభిఘ్న ఆధ్వర్యంలో పేద రోగులు, వారి సహాయకుల కోసం ఏర్పాటు చేసిన అల్పాహార, భోజన కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే నిష్ణాతులైన వైద్యులు, మెరుగైన సౌకర్యాలు ఉంటాయన్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చే రోగులకు, వారి సహాయకులకు అన్నప్రసాద వితరణ చేపట్టడం అభినందనీయమన్నారు. అంతకు ముందు ఆసుపత్రిలో ఉన్న వార్డులను, ఆపరేషన్ థియేటర్లను స్వామీజీ సందర్శించి రోగులకు ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ అనురాధ, శ్రీమన్నారాయణ ట్రస్ట్ ప్రతినిధులు వికాస్, డాక్టర్లు శ్రీలక్ష్మీ, నీలిమ, నిశీత, దీప్తి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

డోజీ 'ఏఐ' పేరెంట్ కేర్..



సాక్షి, సిటీబ్యూరో: ఆరోగ్య రంగంలో ఏఐ ఆధారిత ఉత్పత్తులకు పేరొందిన డోజీ.. సరికొత్త ఉత్పత్తిని నగర మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. డోజీ శ్రవణ్ పేరుతో అందుబాటులోకి వచ్చిన ఈ ఏఐ ఆధారిత రిమోట్ పేరెంట్ మానిటరింగ్ సర్వీస్ ద్వారా తల్లిదండ్రులు ఎంత దూరంలో ఉన్నా వారి ఆరోగ్య పరిస్థితుల్ని పర్యవేక్షించేందుకు పిల్లలకు వీలు కలుగుతుందని, పెద్దల ఆరోగ్య వివరాలను వైద్యులు, కుటుంబ సభ్యులకు అందిస్తుందని వివరించారు. విదేశాల్లో నివసించే పిల్లలు స్వదేశంలోని తల్లిదండ్రుల ఆరోగ్యబాధ్యతల్ని నిశితంగా పరిశీలించేందుకు వీలు కల్పిస్తుందన్నారు.

టీకాతో మెనింజైటిస్ నివారణ సాధ్యం



డాక్టర్ పవన్‌కుమార్

చిక్కడపల్లి: నిశ్శబ్ద ముప్పుగా పరిగణించే మెనింజైటీస్ వ్యాధిని టీకా ద్వారా నివారించవచ్చునని ప్రముఖ వైద్యులు డాక్టర్ కె.పవన్‌కుమార్ తెలిపారు. ప్రపంచ మెనింజైటీస్ వారోత్సవాల సందర్భంగా ఆదివారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాధి నుంచి పిల్లలకు రక్షణ కల్పించడం అవసరమన్నారు. ఈ వ్యాధి బారిన పడితే మెదడు, వెన్ను చుట్టూ ఉన్న రక్షిత పొరల్లో వాపు వస్తుందన్నారు. మెడ పట్టేయడం, జ్వరం, గందరగోళం, మానసిక స్థితి మారడం, తలనొప్పి, వికారం, వాంతులతో పాటుగా అప్పుడప్పుడు మూర్ఛ, కోమా, నరాల సంబంధిత సమస్యలు ఎదురవుతాయన్నారు. ఏటా ప్రపంచ వ్యాప్తంగా 2.5 మిలియన్లకు పైగా మైనింజైటీస్ కేసులు నమోదవుతుంటే, వీరిలో ఐదేళ్ల లోపు చిన్నారులే అధికంగా ఉన్నారన్నారు. మెనింజైటీస్ సంబంధిత మరణాల్లో భారతదేశం మొదటి మూడుస్థానాల్లో ఉందని తెలిపారు. రెండేళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న చిన్నారులు నీసేరియా మెనింజైటిడిస్ కారణంగా మరణానికి కారణమవుతున్నట్లు అధ్యాయనాలు వెల్లడిస్తున్నాయన్నారు. సకాలంలో టీకాలు వేయడం ద్వారా వ్యాధి ప్రభావాన్ని నివారించవచ్చునని ఆయన సూచించారు.






ఘనంగా నిమజ్జనం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో నెలకొల్పిన అమ్మవారి విగ్రహాలను ఆదివారం ఘనంగా ట్యాంక్‌బండ్ వద్ద హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేశారు.ఈ సందర్భంగా ట్యాంక్‌బండ్ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.


పత్తాలేని పత్తర్‌గట్టి ఆధునికీకరణ



పత్తర్‌గట్టీలోని రాతి కట్టడాల వ్యాపార సముదాయం

- అప్పట్లో పనుల కోసం రూ.1.57 కోట్లు కేటాయింపు...
- వారసత్వ సంపద కట్టడాల పరిరక్షణకు రూ.9.94 కోట్లు మంజూరు...
- కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ నుంచి కేటాయింపు
- అధికారులు మారడంతో పెండింగ్‌లో పనులు

15 ఏళ్లుగా అటకెక్కిన పనులు



సుందరీకరణ అనంతరం పత్తర్‌గట్టీ నమూనా చిత్రం

చార్మినార్: పూర్తిగా రాళ్లతో నిర్మించిన పత్తర్‌గట్టి వ్యాపార సముదాయాల కట్టడాలను ఆధునికీకరించేందుకు చేపట్టిన పనులు 15 ఏళ్ల గడుస్తున్నా..కార్యరూపం దాల్చడం లేదు. నిజాం కాలంలో పూర్తిగా రాళ్లతో నిర్మించిన పత్తర్‌గట్టీని మరింత ఆధునికీకరించేందుకు జీహెచ్‌ఎంసీ అప్పట్లో ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఇందుకు గాను రూ.1.57 కోట్లు కేటాయించారు. ఈ పనులను స్థానిక వ్యాపారస్తులకు అవగాహన కల్పించేదుకు జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. సభలు, సమావేశాలు, పాద యాత్రలు, పరిశీలనలు నిర్వహించారు. సహకరించాలని వ్యాపారుల వెంట పడ్డారు. అయితే ఆ తర్వాత ఏళ్లు గడుస్తున్నా అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. అధికారులు మారిపోవడంతో ఇప్పుడున్న అధికారులకు ఆ విషయమే తెలియనట్లు కనిపిస్తోంది. దీంతో పత్తర్‌గట్టీలో కొంత మంది నిబంధనలకు విరుద్ధంగా షాపింగ్ మాల్స్ నిర్మాణం చేపట్టారు. చార్మినార్ కట్టడానికి 200 మీటర్ల పరిధిలో పాత భవనాలకు మరమ్మతులు చేపట్టాలన్నా...పునఃనిర్మించాలన్నా... సంబంధిత ఆర్కియాలజీ విభాగం అధికారుల అనుమతి తప్పని సరి. వీటిని బేఖాతరు చేస్తున్న కొందరు వ్యాపారులు తమ ఇష్టానుసారంగా నిర్మాణాలను చేపట్టారు.

2009 అక్టోబర్‌లో...

అప్పటి జీహెచ్‌ఎంసి (ప్లానింగ్స్) అదనపు కమిషనర్ నీతూ ప్రసాద్, వర్క్స్ అదనపు కమిషనర్ ధనంజయరెడ్డి, సీసీ ముజాఫర్ హుస్సేన్, జీహెచ్‌ఎంసీ దక్షిణ మండలం జోనల్ కమిషనర్ బాల సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు 2009 అక్టోబర్‌లో చార్మినార్‌లోని సనా ఫంక్షన్‌హాల్‌లో సమావేశాన్ని నిర్వహించారు. పత్తర్‌గట్టీలో వ్యాపారాలు నిర్వహిస్తున్న పలువురు వ్యాపారులను అక్కడికి పిలిపించి ఆధునీకరణ పనుల అంశాన్ని వివరించారు. పెద్ద ఎత్తున సుందరీకరణ చేయనున్నందున వ్యాపారులు తమకు సహకరించాలని కోరారు. సాండ్ ట్రీట్ మెంట్‌తో పాటు పత్తర్‌గట్టీలోని సైన్ బోర్డులన్నింటిని యూనిఫాంగా తీర్చిదిద్దడానికి చేపట్టనున్న చర్యలను వ్యాపారులకు వివరించారు. కొన్ని రోజులు తూతూ మంత్రంగా కొనసాగిన ఈ పనులు అర్ధాంతరంగా కనుమరుగయ్యాయి. మళ్లీ ఇటీవల మరో ఉన్నతాధికారి ప్రత్యక్షమై గుల్జార్‌హౌజ్, పత్తర్ గట్టి రోడ్డులో కొన్ని సైన్ బోర్డులను తొలగించే ప్రయత్నం చేశారు. అంతే...కారణాలేమిటో తెలియజేయకుండానే తిరిగి పనులను నిలిపివేశారు.

వారసత్వ కట్టడాల పరిరక్షణకు రూ.9.94 కోట్లు మంజూరు

పాతబస్తీలోని వారసత్వ సంపద కట్టడాలను పరిరక్షించడానికి గతంలో జీహెచ్‌ఎంసీ రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలు కార్యరూపం దాల్చకుండానే అటకెక్కాయి. 2009లో ఎంతో హడావుడి చేసిన అప్పటి జీహెచ్‌ఎంసీ అధికారులు పనులను పూర్తి చేయలేక పోయారు. తూతూమంత్రంగా జరిగిన ఈ పనులు, ప్రణాళికలు కాగితాలకే పరిమితమయ్యాయి. చార్మినార్ ప్రాంతాన్ని వారసత్వ ప్రాజెక్ట్ కింద అభివృద్ధి చేసేందుకు కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ 2009లో రూ.9.94 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో పాతబస్తీలోని హెరిటేజ్ కట్టడాలను పరిరక్షించడంతో పాటు సుందరీకరణ తదితర కార్యక్రమాలను చేపట్టడానికి ప్రణాళికలు రూపొందించారు. పత్తర్‌గట్టీతో పాటు చార్‌కమాన్‌లను ఆధునీకరించడానికి సిద్ధమయ్యారు. అయితే చార్‌కమాన్‌ల ఆధునీకరణ పనుల్లో భాగంగా కేవలం మచిలీకమాన్, కాలీకమాన్ పనులు మాత్రమే ప్రారంభించి పూర్తి చేశారు. ఈ పనులు సైతం తూతూ మంత్రంగా కొనసాగాయి.

సీఆర్‌పీపీ ఏర్పాటులో ప్రొ.సాయిబాబ పాత్ర కీలకం

సాక్షి, సిటీబ్యూరో: ప్రొఫెసర్ జీ.ఎన్.సాయిబాబ 2009లో 'కమిటీ ఫర్ ది పొలిటికల్ ప్రిజనర్స్' (సీఆర్‌పీపీ) ఏర్పాటులో కీలక పాత్ర పోషించారని ఆ కమిటీ జనరల్ సెక్రటరీ బల్ల రవీంద్రనాథ్ అన్నారు. ప్రొఫెసర్ సాయిబాబ అకాల మరణం తమ కమిటీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. 1994లో జరిగిన రాజకీయ ఖైదీల జైలు పోరాట సంఘీభావ కమిటీలోనూ ప్రొ.సాయిబాబ విశిష్టమైన భూమిక పోషించారన్నారు. చదువుకునే రోజుల్లోనే విప్లవ రాజకీయాల వైపు ఆకర్షితుడై, జీవితంలో ఎన్నో కష్ట నష్టాలు, హింసలను ఎదుర్కొని కఠిన జైలు జీవితాన్ని భరించి తుది శ్వాస వరకు ఆవే రాజకీయాల కోసం కృషి చేశారన్నారు. ఆయన మరణానికి కమిటీ ఫర్ ది పొలిటికల్ ప్రిజనర్స్ కమిటీ విప్లవ జోహార్లు అర్పిస్తోందన్నారు. ఏబీవీ ఆర్‌ఎఫ్, ఆర్‌డీఎఫ్, ఆపరేషన్ గ్రీన్ హంట్ వ్యతిరేక పోరాటాలు ఏదైనా సరే మొక్కవోని ధైర్యంతో కొండంత అండలా నిలబడేవారని, ఆయన ఆలోచనా విధానానికి భయపడి ఎటువంటి ఆధారం లేకున్నా జైలులో పెట్టి కనీస వైద్య సహాయం అందించకుండా ప్రభుత్వం కుట్ర చేసిందన్నారు. సాయిబాబా మరణానికి ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు.

మహారాష్ట్రలో శాంతిభద్రతలు క్షీణించాయి : అసదుద్దీన్ ఒవైసీ

సాక్షి,సిటీబ్యూరో: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నేత బాబా సిద్దిఖీ హత్య మహారాష్ట్రలో క్షీణిస్తున్న శాంతి భద్రతలకు నిదర్శనమని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతోమాట్లాడారు. బాబా సిద్దిఖీ హత్యను ఆయన తీవ్రంగా ఖండించారు. ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మరణం కూడా తనను తీవ్ర ఆందోళనకు గురి చేసిందన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా సాయిబాబాను సుదీర్ఘకాలం జైల్లో ఉంచడం కూడా ఆయన మరణానికి కారణమని ఒవైసీ పేర్కొన్నారు. ఇద్దరు ఒకే రోజు మృతి చెందడం బాధాకరమన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పునరుత్పాదక శక్తి వనరులకు ప్రోత్సాహం



శిలఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

- దేశాన్ని క్లీన్ ఎనర్జీలో గ్లోబల్ లీడర్‌గా తీర్చిదిద్దేందుకు కృషి
- కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి

మన్సూరాబాద్: పునరుత్పాదక శక్తి వనరులను ప్రోత్సహించడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించేందుకు జీఎస్ఐ ప్రాధాన్యం ఇస్తుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ (జీఎస్ఐటీఐ)లో నూతనంగా ఏర్పాటు చేసిన రైఫ్‌టాప్ సోలార్ పవర్ ప్లాంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడంలో జీఎస్ఎస్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ప్రభుత్వ సంస్థలో సోలార్ ప్లాంట్‌లతో విద్యుత్ ఉత్పత్తి చేయాలనే ప్రేరణను జీఎస్ఐటీఐ కల్పించిందన్నారు. భారతదేశాన్ని క్లీన్ ఎనర్జీలో గ్లోబల్ లీడర్‌గా మార్చాలనే ధ్యేయంతో ప్రధాని మోడీ ఉన్నారన్నారు. పీఎం సూర్యఘర్ యోజనలో భాగంగా జీఎస్ఐటీఐలో ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్లాంట్ జీఎస్ఐటీఐలో 75శాతం ఇంధన వనరులను అందిస్తుందని, దీంతో సంస్థ ఏటా రూ.30లక్షలు ఆదా చేస్తుందన్నారు. ముందుగా శిలఫలకాన్ని ఆవిష్కరించి సోలార్ ప్లాంట్ ఏర్పాటు వివరాలను తెలుసుకుని ప్లాంట్‌ను రూఫ్‌టాప్‌ను సందర్శించారు. అనంతరం జీఎస్ఐటీఐ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, జీఎస్ఐ ఏడీజీ అండ్ హెడ్ పటభజే, డీడీజీ డాక్టర్ మాథ్యుజోసఫ్, డైరెక్టర్ విజయ్‌కుమార్, కార్పొరేటర్లు చింతల అరుణ, కొప్పుల నర్సింహ్మారెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

దుర్గాదేవికి ఎంపీ ఈటల పూజలు



ఘట్‌కేసర్: మున్సిపాలిటీ పరిధిలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. పట్టణంలో జైభవాని నవరాత్రి ఉత్సవ సమితి ఏర్పాటు చేసిన మండపంలో ఎంపీ ఈటల రాజేందర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దమ్మతల్లికి క్రికెటర్ల పూజలు




క్రికెటర్లు నితీష్‌కుమార్‌రెడ్డి, తిలక్‌వర్మ

బంజారాహిల్స్: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ఇద్దరు తెలుగు ఆటగాళ్లు జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లిని దర్శించుకున్నారు. అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారులు నితీష్‌కుమార్‌రెడ్డి, తిలక్ వర్మ శనివారం ఉదయం సాదాసీదాగా వచ్చి పెద్దమ్మ గుడికి అమ్మవారిని దర్శించుకున్నారు. అయితే వీరు వస్తున్న విషయం ఎవరికీ తెలియకపోవడంతో పెద్దగా ఆర్భాటం లేకుండా అమ్మవారిని దర్శించుకుని వెళ్లిపోయారు. శనివారం రాత్రి 7 గంటలకు ఉప్పల్ వేదికగా బంగ్లాదేశ్, ఇండియా జట్ల మధ్య మూడో టీ–20 మ్యాచ్ జరిగిన విషయం తెలిసిందే. ఈ ఆటలో భారత ఆటగాళ్లు టీ–20 రికార్డులన్నీ బద్దలుకొట్టిన విషయం విదితమే.

బసవతారకంలో దొంగలు పడ్డారు..

- నకిలీ పత్రాలతో డబ్బులు కాజేసిన ఉద్యోగులు
- పోలీసులకు యాజమాన్యం ఫిర్యాదు..

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–10లోని బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో దురుద్దేశపూర్వకంగా నకిలీ పత్రాలతో బోగస్ బిల్లులతో రూ. లక్షలు కాజేసిన ముగ్గురు ఉద్యోగులపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో మెయింటెనెన్స్ అండ్ ప్రాజెక్ట్ జీఎంగా పనిచేస్తున్న వెంకటపతిరాజు, స్టోర్స్ డిపార్ట్‌మెంట్ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌గౌడ్, ప్రొక్యూర్‌మెంట్ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న నవీన్‌బాబు తదితరులు ఆస్పత్రి యాజమాన్యానికి తెలియకుండా పెద్ద ఎత్తున నిధులు కాజేసినట్లుగా ఆస్పత్రి హెచ్‌ఆర్ డిపార్ట్‌మెంట్ జీఎం ఎస్‌కే సలీం ఫిర్యాదు చేశారు. 2022–23, 2023–24 గాను నిధుల ఆడిట్ చేపట్టగా భారీగా నిధులు దుర్వినియోగమైనట్లు గుర్తించారు. నవీన్‌బాబును విచారణకు రావాలని కోరగా, ఆ రోజు నుంచి విధులకు హాజరుకావడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. పెద్ద ఎత్తున మెటీరియల్ కొనుగోలు చేశారని, రికార్డులు ఫ్యాబికేటెడ్ చేశారని వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా కొటేషన్లు తీసుకోవడమే కాకుండా ఫేక్ కొటేషన్లు, ఫేక్ బిల్లులు దురుద్దేశపూర్వకంగా డాక్యుమెంట్లను తారుమారు చేశారని, తద్వారా ఆస్పత్రికి భారీగా నష్టం చేకూరిందన్నారు. ఈ ముగ్గురూ కలిసి ఆస్పత్రి నిధులను బోగస్ పత్రాలతో కాజేసినట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. రూ. లక్షలు దుర్వినియోగం చేసిన వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. 2000 సంవత్సరంలో బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ప్రారంభమైందని, ఏటా కేన్సర్ వ్యాధిగ్రస్తులు పెరుగుతుండగా ఆ మేరకు సౌకర్యాలతో పాటు ఆధునిక చికిత్స పద్ధతులను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. గత ఆర్థిక సంవత్సరం 9 ప్రాజెక్టులు చేపట్టి రూ.127 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని, ఈ నిధుల్లో దుర్వినియోగం జరిగినట్లుగా క్రమశిక్షణ కమిటీ గుర్తించిందన్నారు. ఈ మేరకు పోలీసులు వెంకటపతిరాజు, నవీన్‌బాబు, శ్రీనివాసగౌడ్‌లపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పెద్దమ్మ గుడికి పోటెత్తిన భక్తులు



పెద్దమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ..



పెద్దమ్మ తల్లి అలంకారం

- పెద్దమ్మతల్లిని దర్శించుకుని పులకించిన భక్తులు
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు

బంజారాహిల్స్: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మ తల్లిని దర్శించుకునేందుకు భక్తులు వేలాది సంఖ్యలో విచ్చేశారు. శనివారం, ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో విచ్చేయడంతో ఆలయ ప్రాంగణంతో పాటు పరిసరాలన్నీ భక్తజన సందోహంతో కిటకిటలాడాయి. ఎటుచూసినా అమ్మవారి దర్శనం కోసం బారులుదీరిన భక్తులే కనిపించారు. ఆలయ నిర్వాహకులు పటిష్ఠమైన ఏర్పాట్లు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శీఘ్ర దర్శనానికి అనుమతించారు. దీంతో భక్తులు అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడ్డారు. ఒకవైపు దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆఖరి రోజైన శనివారం అమ్మవారు పెద్దమ్మతల్లి అలంకారంలో దర్శనమివ్వడంతో అమ్మవారి అలంకారాన్ని తిలకించిన భక్తులు పులకించిపోయారు. దసరా రోజు అమ్మవారిని సుమారుగా 50 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. అలాగే ఆదివారం కూడా అమ్మవారి దర్శనానికి పోటెత్తగా సుమారుగా 60 వేల వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

'శ్రీశైలం రహదారిలో ఓ స్థల యజమాని తన ప్లాట్‌లో అడ్డుగా ఉన్న రెండు మర్రి చెట్లను కొట్టేసి రోడ్డు పక్కన నిర్జీవంగా పడేశాడు. ఇది చూసిన వృక్ష ప్రేమికులు వందేళ్ల వయసు ఉన్న ఈ చెట్లను కాపాడుకోవాలని భావించారు. మరి, అంత పెద్ద చెట్లు తరలించాలంటే భారీ క్రెయిన్, పెద్ద లారీ, కార్మికులు అవసరం. వీటి ఖర్చు కోసం సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. దీంతో అమెరికాలో ఉంటున్న నాల్గో తరగతి అమ్మాయి స్పందించింది. చెట్లు తరలించేందుకు అయ్యే ఆర్థిక సహాయాన్ని అందించింది. అంతే ఈ చెట్లను అక్కడి నుంచి మణికొండలోని ఓ ప్రైవేటు పాఠశాలకు తరలించారు. ప్రస్తుతం ఆ చెట్టు స్కూల్ విద్యార్థులకు నీడనిస్తూ హాయిగా ఉంది.'

'ఓ ప్రభుత్వ బాలికల పాఠశాలలో భారీ వర్షానికి చీమ చింతకాయ చెట్టు కూలిపోయింది. ఆ చెట్టును ఎలాగైనా కాపాడాలని ప్రిన్సిపాల్ భావించారు. భారీ క్రెయిన్ సహాయంతో 300 మంది స్కూల్ విద్యార్థులు చూస్తుండగా ఆ చెట్టును తిరిగి భూమిలో పాతారు. ఇక అక్కడి నుంచి ప్రతి ఏటా జులై 23న స్కూల్ విద్యార్థులు, టీచర్లందరూ ఆ చెట్టుకు రాఖీ కడుతూ పండుగ చేసుకోవడం ఆనవాయితీగా మారింది.' ఇలా ఒకటీ రెండూ కాదు కొత్త సచివాలయం, కూకట్‌పల్లిలో ఫోరం మాల్ బ్రిడ్జి నిర్మాణ సమయంలో అడ్డుగా ఉన్న వందలాది వృక్షాలను వాటా ఫౌండేషన్ దత్తత తీసుకుంది. వాటిని భారీ క్రెయిన్లు, లారీలతో వేరే చోటుకు తరలించింది. ఇప్పటి వరకూ 2,500కు పైగా వృక్షాలను వేరే చోటుకు తరలించింది.

- సాక్షి, సిటీబ్యూరో





ఆపరేషన్.. ట్రాన్స్‌ప్లాంటేషన్..

ఇప్పటి వరకూ 2,500కు పైగా వృక్షాల తరలింపు

- భవన నిర్మాణాలు, రోడ్ల విస్తరణలో అడ్డుగా చెట్లు
- నరికి వేసే బదులుగా వేరే చోటుకు తరలింపు
- మర్రి, వేప, రావి వంటి వందల ఏళ్ల నాటి వృక్షాలే ఎక్కువ
- స్కూల్స్, ఆఫీసులు, ఫామ్‌హౌస్‌లలో వీటి ఏర్పాటు
- చెట్ల సంరక్షణకు నడుంబిగించిన వాటా ఫౌండేషన్





2010 నుంచి హైదరాబాద్‌లో వాటా ఫౌండేషన్ చెట్ల దత్తత, తరలింపు సేవలను అందిస్తుంది. 10 మంది వలంటీర్లు ఉన్న ఈ ఫౌండేషన్ ఇప్పటి వరకూ కేపీహెచ్‌బీ, ఎల్బీనగర్, గచ్చిబౌలి, తెల్లాపూర్ వంటి నగరం నలువైపులా సుమారు 2,500 వృక్షాలను దత్తత తీసుకుంది. ఒక చోటు నుంచి వేరే చోటుకు చెట్టును తరలించేందుకు అవసరమైన జేసీబీ, క్రెయిన్, భారీ లారీ, కార్మికులు ఇతరత్రా ఖర్చులను చెట్లను దత్తత తీసుకునే వాళ్లు భరిస్తుంటారు. ఒకవేళ వాళ్లు చెట్టును మాత్రమే నిర్వహణ చేస్తాం.. ఖర్చు భరించలేం అంటే క్రౌండ్ ఫండింగ్ ద్వారా నిధులు సమీకరించి చెట్టును తరలిస్తారు. చెట్టు రూట్ ప్యాకింగ్, కొమ్మలు కత్తిరించడం, జేసీబీ, క్రెయిన్, పెద్ద లారీ వంటి వాహనాల ఏర్పాటు తదితరాల కోసం ఒక్క చెట్టును తరలించేందుకు 3 వారాల సమయం పడుతుంది.

సచివాలయంలోని చెట్లు ఫామ్‌హౌస్‌కు..

కొత్త సచివాలయం నిర్మాణ సమయంలో అక్కడున్న వేప, సుబాబుల్, మర్రి, రావి, పెల్టోఫోరం, కొబ్బరు, కానుగ, గుల్మోహర్, రాయల్ పామ్, బాదం, చింత, నేరేడు వంటి చాలా చెట్లను కొట్టేశారు. వీటిలో వంద ఏళ్ల నాటి చెట్లను వేరే చోటుకు తరలించేందుకు వాటా ఫౌండేషన్ ముందుకొచ్చింది. 18 మర్రి చెట్లను శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఫామ్‌హౌస్‌లోకి తరలించారు. ఈ ఖర్చు మొత్తం ఆ ఫామ్‌హౌస్ యజమానే భరించారు. కూకట్‌పల్లిలో ఫోరం మాల్ దగ్గర బ్రిడ్జి నిర్మాణం సమయంలో అక్కడున్న వంద చెట్లను కొట్టేశారు. వీటిలో 70 వృక్షాలను మణికొండ స్మశానం, క్రికెట్ మైదానం చుట్టూ నాటారు.

ఫామ్‌హౌస్, ఆఫీసుల్లో ఏర్పాటు..

రాజకీయ, సినీ, క్రీడా ప్రముఖుల ఇళ్లతో పాటు శామీర్‌పేట, చేవెళ్ల, గండిపేట, మహేశ్వరం, ఘట్‌కేసర్ వంటి నగరం నలువైపులా ఉన్న ఫామ్‌హౌస్‌లో ఇంటీరియర్ కోసం ఈ పెద్ద చెట్లను వినియోగిస్తున్నారు. ప్రముఖ దర్శకులు తమ ఫామ్‌హౌస్‌లో 3 మర్రి, 25 రావి చెట్లను ఏర్పాటు చేసుకున్నారు. పలు ప్రైవేట్ కంపెనీలు వారి కార్యాలయం చుట్టూ, ప్రధాన మార్గాలకు ఇరువైపులా ఈ చెట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు.

నీళ్లు పోస్తే సరిపోదు..

వృక్షాలను ఎండాకాలంలో తరలించకూడదు. రూట్ ప్యాకింగ్ చేసిన తర్వాత వేర్లు బలంగా, ఏపుగా పెరిగేందుకు ఎరువులు వేస్తారు. చెట్టు కొమ్మలు కత్తిరించి, చెదలు పట్టకుండా పెస్టిసైడ్స్ పూస్తారు. భూమిలో నుంచి చెట్టును తీసిన తర్వాత గంట వ్యవధిలోపు తిరిగి నాటాలి. లేకపోతే మనుగడ సాగించలేవు. చెట్టును ట్రాన్స్‌లోకేట్ చేసిన తర్వాత రెండేళ్ల పాటు దాని బాగోగులు చూసుకోవాలి. కేవలం నీళ్లు పోయడంతోనే సరిపోదు. చాలా మంది చెట్టుకు ఆకులు రాగానే నీళ్లు పోయడం ఆపేస్తారు.



అనుమతిలో జాప్యమెందుకు?



రాత్రికి రాత్రే దొంగతనంగా చెట్లు కొట్టేస్తే అడిగేవాళ్లు ఉండరు. కానీ చెట్లు సేవ్ చేస్తామని ముందుకొచ్చే వారికి అనుమతి ఇచ్చేందుకు 2–3 నెలల సమయం తీసుకుంటున్నారు. ఇది సరైనది కాదు. దీంతో స్థల యజమాని ఆగలేక చెట్లను కొట్టేసి రోడ్ల మీద పడేస్తున్నారు. నగరంలో చెట్ల సంరక్షణ కమిటీ ఉన్నా తూతూ మంత్రంగా పనిచేస్తోంది. – ఉదయ్ కృష్ణ, కో–ఫౌండర్, వాటా ఫౌండేషన్

దర్శకుడిగా ది డీల్.. నటనే తన జీల్..



నాంపల్లి: సినిమాలకు మూలం నాటకం.. తొలితరం నటులందరూ నాటకరంగం నుంచి వచ్చిన వారే.. ఎన్టీఆర్, ఏఎన్ఆర్, కృష్ణ, ఎస్వీ రంగారావు, సావిత్రి వంటివారెందరో ఈ రంగంలోకి వచ్చినవారే. ఇతర భాషల్లోనూ అనేక మంది నటులు నాటక రంగం నుంచి వెండితెరకు పరిచయమైనవారే. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి బిఏ.యాక్టింగ్, ఎంఏ దర్శకత్వం పూర్తి చేసి ఆధునిక తెలుగు నాటక రంగంలో నటుడిగా, దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక ముద్రను వేసుకున్న డాక్టర్ హనుకోట్ల మంచి నటుడిగా పేరు తెచ్చుకున్నారు. ఎంఏ పూర్తి చేసిన వెంటనే ఈశ్వర్ సినిమాలో ప్రభాస్ ఫ్రెండ్‌గా మూగ పాత్రలో అందరినీ మెప్పించాడు. ఆ తర్వాత అదే వర్శిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరి ప్రొఫెసర్‌గా, రంగస్థల కళల శాఖాధిపతిగా, లలిత కళాపీఠం పీఠాధిపతిగా (డీన్) ఎందరో నటులను తీర్చిదిద్దుతున్నారు.

దర్శకుడిగా, రచయితగా...

తెలుగు విశ్వవిద్యాలయం విద్యార్థులతో కలిసి స్వీయ రచన, దర్శకత్వంలో కె2 నాటకాన్ని ప్రదర్శించి ఉత్తమ దర్శకుడిగా రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రతిష్టాత్మక నంది అవార్డును అందుకున్నారు. ఆ తర్వాత కళ్యాణి నాటకానికి తన బృందంతో ద్వితీయ ఉత్తమ ప్రదర్శనకు వెండి నందిని అందుకున్నారు. నాటక రంగ ఆచార్యుడిగా తెలుగులో నాయకురాలు, గంగిరెద్దు, జయ జయహే తెలంగాణ, రామప్ప వంటి అత్యున్నత ప్రమాణాలు కలిగిన నాటకాలను నిర్మించారు. తెలుగులో మొట్టమొదటి నాటకత్రయం 'ప్రతాపరుద్రమ' దర్శకత్వం వహించి మెప్పించారు. రచయితగా గంగిరెద్దు, కాశ్మీర్ టు కన్యాకుమారి, గబ్బర్‌సింగ్, ధనత్రయోదశి, నాటకాలలో నూతన తోరణాలను ప్రవేశపెట్టాడు.



డాక్టర్ హనుకోట్ల

మరోసారి వెండితెరకు..

కేవలం రంగస్థలానికే పరిమితం కాకుండా రేడియో జాకీగా, టెలివిజన్ నటుడిగా, దర్శకుడిగా తన ప్రయాణాన్ని కొనసాగించి ఈటీవీ- 2లో ప్రసారమైన 'మాయాబజార్' రాజకీయ వ్యంగ్య రూపకంతో పాటు దూరదర్శన్‌లో అనేక ఎపిసోడ్‌లకు దర్శకత్వం వహించారు. ఈశ్వర్ సినిమా తర్వాత ఆగిపోయిన తన సినీ ప్రస్థానాన్ని తిరిగి కొనసాగిస్తూ తన స్వీయ దర్శకత్వంలో హెచ్.పద్మారమాకాంతరావు, రామకృష్ణ నిర్మాతలుగా 'ద డీల్' అనే సినిమాతో అక్టోబరు 18న ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ప్రముఖ నిర్మాత దిల్‌రాజు పోస్టర్ లాంచ్ చేయగా, ప్రముఖ హీరో మంచు విష్ణు ఈ సినిమా పాటను విడుదల చేశారు. దసరా సందర్భంగా కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ద డీల్ టైటిల్ సాంగ్‌ని విడుదల చేశారు.

ఆకట్టుకుంటున్న చిత్రప్రదర్శన..



సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్, కావూరి హిల్స్‌లోని చిత్రమయి స్టేట్ గ్యాలరీ ఆఫ్ ఆర్ట్‌లో ప్రముఖ క్యూరేటర్ ప్రేమ్‌జిష్ ఆచారి క్యురేట్ చేసిన 'సైరెన్స్ లుల్లబీ ఇన్ ఏ ఫర్గోటెన్ రియామ్' (మర్చిపోయిన రాజ్యంలో సైరెన్ లాలిపాట) పేరుతో నిర్వహిస్తున్న చిత్ర ప్రదర్శన ఆకట్టుకుంటోంది. ఈ ప్రదర్శనలో మహిళ శిల్పాలకు ప్రసిద్ధి చెందిన రవీందర్ రెడ్డి, జీఆర్ ఈరన్న గీసిన వైవిధ్యభరిత చిత్రాలు, జగన్నాథ్ పాండా ఇన్‌స్టాలేషన్స్, స్థానికతకు పట్టం కట్టేటి వైకుంఠం చిత్రాలు.. అదే విధంగా అజి విఎస్, మహేష్ బలిగ, సుజిత్ ఎస్ఎన్, టి వెంకన్న, శోభా బ్రూటా తదితర ప్రఖ్యాత చిత్రకారులతో పాటు ఔత్సాహిక కళాకారులు విభిన్నమైన కళారూపాలు ఆకట్టుకునేలా కొలువుదీరాయి. ఈ ప్రదర్శన ఈనెల 16 వరకూ కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.



సాక్షి, సిటీబ్యూరో: నగరం వేదికగా దేశంలోనే అతిపెద్ద డిజైన్ ఎగ్జిబిషన్ 'బీఆర్‌డీఎస్ డిజైన్ ఎగ్జిబిషన్–2024'లో ప్రముఖ ఆర్టిస్టులు తమ నైపుణ్యాలతో ఆకట్టుకున్నారు. భన్వర్ రాథోడ్ డిజైన్ స్టూడియో (బీఆర్‌డీఎస్) ఆధ్వర్యంలో నగరంలోని ది ప్లాటినం బిజినెస్ హోటల్ వేదికగా నిర్వహించిన డిజైన్ ఎడ్యుకేషన్ అవేర్‌నెస్ సెషన్‌లో భాగంగా ఫ్యాషన్ – టెక్స్‌టైల్, ఇంటీరియర్ – ఆర్కిటెక్చర్, ప్రొడక్ట్, ఆటోమొబైల్, గ్రాఫిక్, యానిమేషన్, ఫొటోగ్రఫీ, ఫైన్ ఆర్ట్స్ తదితర డిజైనింగ్ రంగంలోని ఔత్సాహికులకు అందుబాటులో ఉన్న బహుళ విభాగాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు కెరీర్‌లో విజయం సాధించడానికి నైపుణ్యాలు, పరిజ్ఞానంపై పట్టు సాధించాలన్నారు. ఈ వేదిక ద్వారా ఎన్ఐడి, నిఫ్ట్, ఎన్ఏటీఏ, యూసీఈఈడీలలో విజయం సాధించేందుకు చిట్కాలపై బీఆర్డీఎస్ వ్యవస్థాపకులు, అధ్యక్షులు డాక్టర్ భన్వర్ రాథోడ్ గ్రాండ్ కెరీర్ సెమినార్ అందించారు. దేశవ్యాప్తంగా 25కు పైగా డిజైన్ కళాశాలలు, విశ్వవిద్యాలయాల భాగస్వామ్యం గురించి వివరించారు. విభిన్న కళల్లో ఆసక్తి ఉన్న ఆర్టిస్టులు, విద్యార్థులు వారి కళాఖండాలు, 3డి మోడల్స్, దుస్తులు, కాన్వాస్ పెయింటింగ్ రూపంలో ప్రదర్శన ఏర్పాటు చేశారు. దేశంలోని హైదరాబాద్, ముంబై, ఢిల్లీ, అహ్మదాబాద్, పుణె, బెంగళూరు, కోల్‌కతా, జైపూర్, లఖ్నవ్, భోపాల్, నాసిక్, నాగ్‌పూర్ వంటి 12 నగరాల్లో ఏటా ప్రదర్శన నిర్వహించడం విశేషం.



ఆ గుండెకు అండగా..

పుట్టుకతోనే గుండె సమస్యలతో జన్మిస్తున్న చిన్నారులు..

గత కొన్నేళ్లుగా గుండె జబ్బులు, హృదయ సమస్యలతో పుడుతున్న చిన్నారుల సంఖ్య పెరిగిపోతోంది. ఒక అంచనా ప్రకారం ప్రతి వెయ్యి మందిలో దాదాపు 10 మంది చిన్నారులు ఏదో ఒక గుండె సమస్యతో జన్మిస్తున్నారు. కారణాలు ఏమైనప్పటికీ ఈ సమస్యలతో జన్మించే పిల్లల్లో 80 శాతం మంది పేదవారే. పుట్టుకతో వచ్చిన ఈ సమస్య (కాన్‌జెనిటల్ హార్ట్ డిసీజ్)కు సంబంధిత సర్జరీలు, ఇతర చికిత్సలు చేయించలేక ఆ నిరుపేద కుటుంబాలు శోకసముద్రంలో మునిగిపోతున్నాయి. ఇలాంటి వారికి అండగా నిలుస్తుంది ప్యూర్ లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్ (పీఎల్‌హెచ్‌ఎఫ్).

- సాక్షి, సిటీబ్యూరో

- ప్రతి ఏడాదీ కాన్‌జెనిటల్ హార్ట్ డిసీజ్‌తో 2 లక్షల చిన్నారుల జననం..
- ఇందులో 80 శాతం పేద కుటుంబాలకు చెందిన వారే..
- వీరికి ఉచితంగా సర్జరీలు చేస్తున్న ప్యూర్ లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్..
- ఇప్పటి వరకూ 233 మందికి పైగా పునర్జన్మ ఇచ్చిన పీఎల్‌హెచ్‌ఎఫ్..

తెలుగు రాష్ట్రాల్లోని చిన్నారులకే కాకుండా దేశవ్యాప్తంగా ఏ పేద పిల్లలకైనా గుండె సమస్యలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామని ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. 2022లో ప్రముఖ డాక్టర్ రమేష్ కంచర్ల సేవా దృక్పథం నుంచి ప్రారంభమైన ఈ ఫౌండేషన్ దాతలు అందించిన ఆర్థిక సహకారంతో చిన్నారులకు ఉచితంగా సర్జరీలు చేయిస్తున్నారు. అయితే ప్రతి ఏడాది దాదాపు 2 లక్షల మంది చిన్నారులు పుట్టుకతో గుండె సమస్యలతో జన్మిస్తున్నారని సర్వేలు చెబుతున్నాయి. వీరిలో 80 శాతం నిరుపేద కుటుంబాలే కావడంతో ఇలాంటి స్వచ్ఛంద సేవా సంస్థల సహకారం మరింత అవసరముంది.





ముందుగా గుర్తిస్తే మేలు..

జన్యుపరమైన అంశాలే కాకుండా వివిధ కారణాల వల్ల గుండె సమస్యలతో పిల్లలు పుడుతున్నారు. గర్భిణిగా ఉన్న సమయంలోనే ఫీటల్ ఎకోకార్డియోగ్రఫీ వంటి టెస్టులు చేయించుకుంటే ముందుగానే బిడ్డ పరిస్థితి తెలుసుకోవచ్చు. ఏదైనా హృదయ సమస్యలుంటే బిడ్డ పుట్టగానే చికిత్స అందిస్తే ప్రాణాపాయం తగ్గుతుంది. లేదా ఆ వ్యాధి బయటపడ్డాకే తెలుసుకుంటే నష్టం శాతం ఎక్కువ. ఈ విషయంలో సామాజిక అవగాహన పెరగాల్సిన అవసరముంది. 2డీ ఎకో, ఈసీజీ, ఎక్స్‌రే వంటి టెస్టులు చేశాక, పీడియాట్రిక్ కార్డియాలజీ సర్జన్లను సంప్రదించాలి.
– డాక్టర్ శ్వేతా బబ్రు, పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్, పీఎల్‌హెచ్‌ఎఫ్.

తీవ్రతను బట్టి..


వ్యాధి తీవ్రతను బట్టి, మా వైద్య బృందం సూచించిన ఓపెన్ హార్ట్ సర్జరీలు, ఇతర వైద్య సేవలను అందిస్తున్నాం. ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్డియాలజిస్టులు, కార్డియో థొరాసిస్ స్పెషలిస్టులు ఉన్నారు. ప్రతి నెల 30 నుంచి 40 అప్లికేషన్లు వస్తున్నాయి. కొన్ని ప్రమాణాలతో వారు పేద కుటుంబాలకు చెందిన వారని నిర్ధారించుకుని వెంటనే చికిత్సను ప్రారంభిస్తాం. సంస్థ కేటాయించిన ఫండ్ సరిపోని కొన్ని సర్జరీలకు ఫండ్ రైజింగ్ నిర్వహిస్తున్నాం. మా ఈ ప్రయత్నానికి, ప్రయాణానికి మూలాధారం దాతల సహకారం. ఎంతో మంది వ్యక్తిగతంగా, కార్పొరేట్ సంస్థల నుంచి అందుతున్న ఆర్థిక సహకారంతో ఈ సేవ చేయగలుగుతున్నాం.
– డాక్టర్ షాలినీ ప్రభాత, ఫౌండేషన్స్ హెడ్, పీఎల్‌హెచ్‌ఎఫ్



చికిత్స కోసం ఎదురుచూపు..

పుట్టుకతో వచ్చే గుండె సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు అండగా నిలవాలనే ఈ ఫౌండేషన్ స్థాపించబడింది. ఇప్పటి వరకూ 233 మందికి పైగా పిల్లలకు సహకారం అందించాం. ఆదిలాబాద్, కరీంనగర్, సూర్యాపేట వంటి ప్రాంతాలతో పాటు ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన పిల్లలకు సహాయం చేశాం. అప్పుడే పుట్టిన పసిపిల్లలు మొదలు 18 ఏళ్ల వరకూ చిన్నారులకు మెడికల్ సేవలు అందిస్తున్నాం. ఏటా 2 లక్షల మంది చిన్నారుల్లో 90 శాతం మంది సరైన సమయంలో చికిత్స అందకపోవడం వల్లనే మరణిస్తున్నారు. ఈ సమస్య ఉన్న చిన్నారుల్లో 60 శాతం రెండేళ్లలోపు వారే. ప్రభుత్వ లెక్కల ప్రకారం దాదాపు 43 వేల మంది గుండె అత్యవసర చికిత్స, సర్జరీల కోసం ఎదురు చూస్తున్నారు. ప్యూర్ లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్‌ను సంప్రదించిన ఇలాంటి పేద చిన్నారులకు తక్షణమే సహకారం అందిస్తున్నాం.

క్లుప్తంగా...



సీఎం చంద్రబాబును కలిసిన చిరంజీవి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును సినీ నటుడు చిరంజీవి శనివారం హైదరాబాద్‌లో కలిశారు. వరద బాధితుల సహాయార్థం రూ.కోటి చెక్కు అందజేశారు. ఇటీవలి వరదల్లో రెండు తెలుగు రాష్ట్రాలకు మెగాస్టార్ చిరంజీవి, ఆయన తనయుడు రామ్ చరణ్ కలిసి తలో కోటి రూపాయల విరాళం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా శనివారం చిరంజీవి తన రూ.50 లక్షల చెక్కుతో పాటు రామ్ చరణ్ రూ.50 లక్షల చెక్కును.. మొత్తం కోటి రూపాయల చెక్‌లను అందజేశారు.

– సాక్షి, హైదరాబాద్

డీకేజెడ్ టెక్నాలజీ స్కాంపై ఈడీ విచారణ

హవాలా, మనీలాండరింగ్ జరిగినట్లు గుర్తింపు

సాక్షి, హైదరాబాద్ : వివిధ రకాల స్కీముల పేరుతో, అధిక వడ్డీ ఆశ చూపి భారీ కుంభకోణాలకు పాల్పడిన డీకేజెడ్ కంపెనీ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఆరా తీస్తున్నారు. సదరు సంస్థ మొత్తం 17,500మంది బాధితుల నుంచి రూ.229 కోట్లు వసూలు చేశారు. ఈ భారీ మోసం కేసులో కీలక నిందితులను హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు ఇటీవలే అరెస్టు చేసిన విషయం తెలిసిందే. మరికొందరు నిందితుల కోసం సీసీఎస్ పోలీసులు గాలిస్తున్నాయి. అయితే డీకేజెడ్ సంస్థ కొల్లగొట్టిన సొమ్ముతో మనీలాండరింగ్ జరిగినట్లు ఈడీ అధికారులు అనుమానిస్తున్నారు. అదేవిధంగా పెద్ద మొత్తంలో హవాలా జరిగినట్లు ప్రాథమికంగా ఆధారాలు లభించడంతో ఈడీ రంగంలోకి దిగింది.

ఓయూ పరీక్షలు యథాతథం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో జరిగే పరీక్షలు యథావిధిగా కొనసాగుతాయని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ ఆదివారం పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల కోసం ప్రైవేటు కాలేజీల యజమానులు బంద్‌కు పిలుపునిచ్చినప్పటికీ.. డిగ్రీ, పీజీ, ఎంబీఏ పరీక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. విద్యార్థులు యథాప్రకారం పరీక్షలకు హాజరుకావాలని సూచించారు.

ఓయూలో 16 నుంచి తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో ఈ నెల 16 నుంచి వివిధ పీజీ కోర్సులకు సంబంధించి ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులకు తరగతులు ప్రారంభం కానున్నట్లు క్యాంపస్ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వీరయ్య ఆదివారం తెలిపారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఇతర కోర్సుల విద్యార్థులకు ఈ నెల 15 వరకు దసరా సెలవులు ప్రకటించడం తెలిసిందే. హాస్టల్ ప్రవేశాలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు దివ్యాంగుల జాబ్‌పోర్టల్ ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు రంగంలో దివ్యాంగులకు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు యూత్ ఫర్ జాబ్స్ సంస్థ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పోర్టల్‌ను రూపొందించింది. సచివాలయంలో సోమవారం ఉదయం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క ఈ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించనున్నారు.

సాంకేతిక లోపంతో ఆగిన 'షాలిమార్'

ఘట్‌కేసర్ (హైదరాబాద్): సాంకేతిక లోపంతో భువనేశ్వర్ షాలిమార్ ఎక్స్‌ప్రెస్ రైలు ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో సుమారు 10 నిమిషాలు ఆగింది. శనివారం రాత్రి సికింద్రాబాద్ నుండి విశాఖపట్నం వైపు వెళ్తున్న భువనేశ్వర్ షాలిమార్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఘట్‌కేసర్ దగ్గర బ్రేక్‌లైనర్లు పట్టివేయడంతో మంటలు చెలరేగాయి. అది గమనించిన సిబ్బంది అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని లోపాన్ని సరిచేయడంతో రైలు అక్కడినుండి బయలుదేరింది. ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకపోవడంతో ప్రయాణికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

చక్రస్నానంతో సేద తీరిన స్వామి

ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలకు వీడ్కోలు



పుష్కరిణిలో చక్రస్నానాన్ని ఆచరిస్తున్న దృశ్యం

తిరుమల: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. 9వ రోజు శనివారం ఉదయం 3 గంటల నుంచే పల్లకీ ఉత్సవం, తిరుచ్చి ఉత్సవంతో స్వామివారు వరాహస్వామి ఆలయానికి చేరుకున్నారు. 9 రోజులపాటు వివిధ వాహనాల్లో ఊరేగిన అలసి సొలసిన స్వామి..స్నపన తిరుమంజనం సేవలో సేద తీరారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ గర్భాలయంలోని మూలమూర్తి అంశమైన సుదర్శన చక్రత్ అళ్వార్‌కు పుష్కరిణిలో పవిత్ర స్నానం చేయించారు. బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రి ధ్వజావరోహణంతో ముగిశాయి. రాత్రి 7 గంటల నుంచి 9 గంటల మధ్యలో ఆగమ శాస్త్రోక్తంగా గరుడపతాకాన్ని కిందకు దించి బ్రహ్మోత్సవాలను ముగించారు. చక్రస్నానంలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప పాల్గొన్నారు.

వైభవంగా 'భాగ్‌సవారి'ఉత్సవం

తిరుమలలో ఆదివారం సాయంత్రం భాగ్‌సవారి ఉత్సవాన్ని టీటీడీ నిర్వహించింది. స్వామివారి ఉత్సవమూర్తులను తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ అనంతాళ్వారు తోటకు వేంచేశారు. బ్రహ్మోత్సవాలు పూర్తయిన మరుసటి రోజు తిరుమలలో 'భాగ్‌సవారి'ఉత్సవం నిర్వహిస్తారు.

సర్కారు వారి కమీషన్ 30%

ఏపీలో భారీ దోపిడీకి పక్కా డీల్

- మద్యం ఆదాయంలో చెప్పినంత ఇవ్వాల్సిందేనని టీడీపీ సిండికేట్ హుకుం
- అంతా టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, వారి ఆధ్వర్యంలోని సిండికేట్ సభ్యుల కనుసన్నల్లోనే..
- లాటరీ ద్వారా లైసెన్స్ దక్కితే ఇవ్వాల్సిన కమీషన్ ఫిక్స్
- లేదంటే దుకాణం వదిలేయాలని ఎక్కడికక్కడ బెదిరింపులు
- మొత్తం 3,396 మద్యం షాపులను దక్కించుకునే కుట్ర
- నేడు లాటరీ ద్వారా లైసెన్సుల కేటాయింపు
- లాటరీ ప్రక్రియను హైజాక్ చేసేందుకూ ఎత్తుగడ
- లైసెన్స్ దక్కకపోతే గొడవలు, దాడులకూ వ్యూహం

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



ఉచిత ఇసుక ఎక్కడైనా లభిస్తోందా!?

'ఎక్స్'వేదికగా సీఎం చంద్రబాబుకు మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రశ్నల వర్షం



- ఎన్నికల ముందు ఉచితం అంటూ ఊరూరా దప్పు కొట్టారు..
- కానీ, ఇప్పుడు కొందామన్నా మా పాలనలో కన్నా రెండింతలు ఎక్కువగా ఉంది
- ఇది ప్రజలను పచ్చిగా మోసం చేయడం కాదా!?
- మేం నిల్వ ఉంచిన ఇసుకను టీడీపీ కూటమి పార్టీలు దోచేయలేదా?
- 2014–19 మధ్య ఇసుకను కొల్లగొట్టి వేలకోట్ల అవినీతికి పాల్పడ్డారు..
- ఇప్పుడు కూడా జరుగుతోంది సేమ్ టు సేమ్..
- ప్రజలంతా దసరా పండుగలో ఉంటే, దొంగచాటుగా టెండర్లు పిలవడం నిజం కాదా?
- మా హయాంలో ఏటా రూ.750 కోట్ల ఆదాయం ఖజానాకు వచ్చేది..
- మరి మీ హయాంలో ప్రభుత్వానికి ఒక్క రూపాయి రావడంలేదన్నది వాస్తవం కాదా?

సాక్షి, అమరావతి : 'పక్క వీధిలో జరగక పోయినా ఓ దొంగతనం జరుగుతోందంటూ ఒక ఘరానా దొంగ పెద్దగా అరిచి, గోలపెట్టి.. ఆ తర్వాత ప్రజలంతా అటు వెళ్లగానే మొత్తం ఆ ఇళ్లలో దోపిడీకి దిగాడంట. ఇసుక దోపిడీ వ్యవహారంలో సీఎం చంద్రబాబు తీరు కూడా ఇలాగే ఉంది. గత ప్రభుత్వం మీద నిందలు వేసి, అబద్ధాలు చెప్పి, ఇప్పుడు ఇసుక వ్యవహారంలో చంద్రబాబు చేస్తున్నదేంటి? అందుకే ఆయన్నే అడుగుతున్నా.. రాష్ట్రంలో ఎక్కడైనా ఉచితంగా ఇసుక లభిస్తోందా? లభిస్తే ఎక్కడో చెప్పగలరా?'.. అంటూ మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదివారం 'ఎక్స్'(ట్విట్టర్) ద్వారా సూటిగా ప్రశ్నించారు. 'మా ప్రభుత్వంలో రాష్ట్ర ఖజానాకు కనీసం డబ్బు లైనా వచ్చేవి.. ఇప్పుడు అదికూడా లేదు. అసలు ఇసుక కొందామంటే మా ప్రభుత్వంలో కన్నా రేటు రెండింతలు ఎక్కువగా ఉంది. ఎన్నికల్లో ఉచితంగా ఇసుకను ఇస్తామంటూ ఊరూరా దప్పువేసిన విషయాన్ని మరిచిపోయారా? ఇది ప్రజలను పచ్చిగా మోసం చేయడం కాదా? అధికార దుర్వినియోగంతో ఇసుక చుట్టూ ఒక మాఫియాను మీరు ఏర్పాటుచేయలేదా? భరించలేని రేట్లతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారా.. లేదా?'.. అంటూ వైఎస్ జగన్ ఆ ట్వీట్‌లో ప్రశ్నల పరంపర సంధించారు. ఆయన అందులో ఇంకా ఏం పేర్కొన్నారంటే..

వచ్చీ రాగానే ఇసుకను దోచేయలేదా?

ఎన్నికల ఫలితాలు వచ్చిన తొలి క్షణంలోనే టీడీపీ, కూటమి పార్టీలకు చెందిన నేతల చూపులు ఇసుక నిల్వలపై పడ్డాయన్నది నిజం కాదా? వర్షాకాలంలో ఇబ్బందులు రాకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్టాక్‌యార్డుల్లో ఉంచిన సుమారు 80 లక్షల టన్నుల్లో సగం ఇసుక మీ ప్రభుత్వం వచ్చి నెలరోజులు గడవకముందే ఎక్కడకు పోయింది? ఎన్నికల ఫలితాలు వచ్చిన మరుక్షణం నుంచే టీడీపీ, ఆ కూటమికి చెందిన పార్టీల నేతలు దోచేయలేదా? కొండల్లా ఉండే ఇసుక నిల్వలు కొన్నిరోజుల వ్యవధిలోనే మాయమైపోయాయన్నది నిజం కాదా?

ఈ విధానానికి సృష్టికర్త, మూల పురుషుడు మీరే కదా?

2014–19 మధ్య ప్రభుత్వ ఖజానాకు ఒక్క రూపాయి కూడా ఆదాయం రానీయకుండా పక్కా అవినీతి పథక రచనతో ఇసుకను దోచేసిన తీరు మళ్లీ ఇప్పుడు పునరావృతం అయ్యిందన్నది వాస్తవం కాదా? ఈ విధానానికి సృష్టికర్త, మూలపురుషుడు మీరే కదా చంద్రబాబు! ఆ రోజుల్లో మీరు ఇసుక బాధ్యతలను మొదట ఏపీఎండీసీకి అప్పగించారు.. ఆ తర్వాత డ్వాక్రా సంఘాలకు ఇస్తున్నామన్నట్లుగా బిల్డప్ ఇచ్చారు.. రెండునెలలు కాకుండానే దాన్ని రద్దుచేసి టెండర్లు నిర్వహిస్తామన్నారు. చివరికి.. ఎలాంటి చట్టబద్ధత లేకుండా ఉచిత ఇసుక పేరుతో ఒకేఒక్క మెమో ఇచ్చి అప్పనంగా మీ మనుషులకు అప్పగించారు. మొత్తంగా ఆ ఐదేళ్లలో 19 జీఓలు ఇచ్చారు. ఆ నది, ఈ నది అని లేకుండా ప్రతిచోటా ఇసుకను కొల్లగొట్టి వేలకోట్ల అవినీతికి పాల్పడ్డారు. ఇప్పుడు కూడా జరుగుతున్నది సేమ్ టు సేమ్. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా ఇప్పటికీ స్పష్టమైన ఇసుక విధానంలేదు. పేరుకు ఉచితం అంటున్నారంతే. మొత్తం వ్యవహారం అంతా చంద్రబాబు.. ఆయన ముఠా వల్ల, ముఠా కొరకు, ముఠా చేతుల మీదుగా నడుస్తోంది. పాలసీని ప్రకటించకుండా ప్రజలంతా దసరా పండుగలో ఉంటే, దొంగచాటుగా టెండర్లు పిలవడం నిజం కాదా చంద్రబాబుగారూ? దేశంలో ఎక్కడా చూడని విధంగా ఉద్దేశపూర్వకంగా కేవలం రెండ్రోజులు మాత్రమే గడువు ఇచ్చింది మీ స్వార్థం కోసం కాదా? ఎవరినీ టెండర్లలో పాల్గొనకుండా దౌర్జన్యాలకు పాల్పడిన మాట వాస్తవం కాదా?

గతంలో అత్యంత పారదర్శకంగా ఇసుక విధానం

అదే గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇసుక విధానాన్ని అత్యంత పారదర్శకంగా అమలుచేసింది. దోపిడీలకు అడ్డుకట్టవేసి ఇటు ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా, అటు వినియోగదారునికీ సరసమైన ధరకు అందించింది. అత్యంత పారదర్శకంగా కేంద్ర ప్రభుత్వ ప్లాట్‌ఫాం మీద ఈ–టెండర్లు నిర్వహించింది. రీచ్‌ల వద్ద ఆపరేషన్ ఖర్చులతో కలిపి టన్ను ఇసుకను రూ.475కే సరఫరా చేసింది. ఇందులో రూ.375లు నేరుగా రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చేలా చేసింది. రవాణా ఛార్జీలతో కలిపి ప్రతి నియోజకవర్గానికీ ఇసుక రేట్లను ప్రకటించింది.

ఆ డబ్బంతా ఎవరి జేబుల్లోకి వెళ్తోంది?

ఇక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని నిరంతరం దుమ్మెత్తిపోసే పత్రికల్లో కూడా నియోజకవర్గాల వారీగా పారదర్శకంగా రేట్లపై గత ప్రభుత్వం ప్రకటనలు ఇచ్చింది. ప్రజలకు తక్కువ ధరకు ఒకవైపు ఇస్తూ మరోవైపు రాష్ట్ర ఖజానాకు డబ్బులు వచ్చేట్లుగా చేసింది. రేట్లపై 'సెబ్'ద్వారా నిరంతరం పర్యవేక్షణ చేసి తప్పులకు ఆస్కారంలేకుండా కఠిన చర్యలు తీసుకుంది. తద్వారా ఏడాదికి రూ.750 కోట్ల ఆదాయాన్ని ఖజానాకు వచ్చేలా చేసింది. మరి మీ హయాంలో ప్రభుత్వానికి ఒక్క రూపాయి రావడం లేదన్నది వాస్తవం కాదా? ప్రజలకూ ఉచితంగా అందడంలేదన్నది నిజం కాదా? ఇసుక ఉచితమే అయితే వైఎస్సార్‌సీపీ హయాంలో కన్నా రేట్లు ఎందుకు 2–3 రెట్లు పెరిగాయి? మరి ఈ డబ్బంతా ఎవరి జేబుల్లోకి వెళ్తోంది చంద్రబాబు?

బర్త్ సర్టిఫికెట్లే అత్యంత కీలకం!

- 'కిమ్స్'కృష్ణయ్య కేసు దర్యాప్తు ముమ్మరం చేసిన సీసీఎస్
- అసలు, నకిలీ బర్త్ సర్టిఫికెట్లపై ఫోకస్.. అధికారిక కాపీలు కోరుతూ జీహెచ్‌ఎంసీకి లేఖ
- త్వరలో పాస్‌పోర్టు ఆఫీస్‌తోనూ సంప్రదింపులకు ఏర్పాట్లు

సాక్షి, హైదరాబాద్: తెలుగుదేశం పార్టీ కీలక నేత, నెల్లూరు జిల్లా ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్యపై హైదరాబాద్ సీసీఎస్‌లో నమోదైన క్రిమినల్ కేసులో జీహెచ్‌ఎంసీ అధికారులు అందించే ఆధారాలే అత్యంత కీలకం కానున్నాయి. ఇప్పటికే ఈ మేరకు లేఖలు రాసిన దర్యాప్తు అధికారులు త్వరలో రీజనల్ పాస్‌పోర్టు కార్యాలయాన్ని కూడా సంప్రదించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కృష్ణయ్య రెండో భార్య కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాయదుర్గం ఠాణాలో నమోదైన కేసు దర్యాప్తు నిమిత్తం సీసీఎస్‌కు బదిలీ అయిన విషయం విదితమే. ఈ కేసులో కిమ్స్ హాస్పిటల్‌తో పాటు బీఎస్‌సీపీఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థలకు చైర్మన్‌గా ఉన్న బొల్లినేని కృష్ణయ్య, ఆయన మొదటి భార్య సుజాత, సమీప బంధువులైన లోటస్ హాస్పిటల్ ఎండీ దంపతులు హేమమాలిని, ప్రసాద్ నిందితులుగా ఉన్నారు. కృష్ణయ్య రెండో భార్యకు పుట్టిన సంతానం మొదటి భార్యకు జన్మించినట్టు చూపించడానికి నకిలీ పత్రాలు సృష్టించారని.. వీటి ఆధారంగా జీహెచ్‌ఎంసీ నుంచి ధ్రువీకరణలను, పాస్‌పోర్టులను తీసుకున్నారనేది ప్రధాన ఆరోపణ. కృష్ణవేణిని కృష్ణయ్య 2004 ఫిబ్రవరిలో రెండో వివాహం చేసుకున్నారు. వైజాగ్‌లోని గోపాలపట్నంలో ఈ పెళ్లి జరిగింది. వారికి 2004 ఆగస్టు 31న బేగంపేటలోని స్వప్న హెల్త్ కేర్ సెంటర్‌లో కుమారుడు అర్జున్ జన్మించాడు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ సర్కిల్–10 కార్యాలయంలో అదే ఏడాది సెప్టెంబర్ 11న రిజిస్ట్రేషన్ చేయించారు. 2006లో అనారోగ్య కారణాలు చెప్పిన కృష్ణయ్య.. అర్జున్‌ను తనతోపాటు తీసుకువెళ్లిపోయారు. కృష్ణయ్య, కృష్ణవేణిలకు 2006 జూలై 29న స్వప్న నర్సింగ్ హోమ్‌లో కూతురు కృష్ణ వైష్ణవి జన్మించింది. అదే ఏడాది ఆగస్టు 9న జీహెచ్‌ఎంసీ సర్కిల్–10 కార్యాలయంలో రిజిస్టర్ చేయించారు కూడా. కృష్ణయ్య రెండేళ్ల తర్వాత వివిధ కారణాలు చెప్పి కుమార్తెను కూడా తనతో తీసుకెళ్లిపోయారు. కృష్ణవేణికి 2011 మే 27న స్వప్న నర్సింగ్ హోమ్‌లోనే మరో కుమార్తె శ్రీనిక జన్మించింది. ఆ తర్వాతి నుంచి కృష్ణవేణి వద్దకు కృష్ణయ్య రావడం మానేశారు.



కృష్ణయ్య

కుమారుడిని కలిశాక విషయం తెలిసి..

సుదీర్ఘకాలం తర్వాత కృష్ణవేణి తన కుమారుడు అర్జున్‌ను కలిశారు. కృష్ణయ్య మొదటి భార్యనే అర్జున్‌కు తల్లిగా మార్చారని.. వైష్ణవిని వారి సమీప బంధువులు, లోటస్ హాస్పిటల్ ఎండీ దంపతులు హేమ, ప్రసాద్‌లకు ఇచ్చి, వారి కుమార్తెగా పెంచుతున్నారని తెలుసుకున్నారు. కృష్ణయ్య, హేమ, ప్రసాద్, కృష్ణయ్య మొదటి భార్య సుజాత పథకం ప్రకారం నకిలీ పత్రాలు సృష్టించి.. అర్జున్, వైష్ణవిలకు సంబంధించిన ధ్రువీకరణలు పొందినట్లు గుర్తించారు. అర్జున్‌ను బొల్లినేని అర్జున్ చౌదరి పేరిట సుజాత–కృష్ణయ్య తల్లిదండ్రులుగా, సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో జన్మించినట్టుగా పేర్కొంటూ.. 2007 జనవరి 29న జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 కార్యాలయంలో రిజిస్టర్ చేయించారు. అలాగే కృష్ణ వైష్ణవి పేరును వైష్ణవిగా మార్చి, ఆమె బాలానగర్‌లోని రెమెడీ ఆస్పత్రిలో జన్మించినట్లుగా, తల్లిదండ్రులు డాక్టర్ వంకాయలపాటి హేమమాలిని ప్రసాద్, డాక్టర్ వంకాయలపాటి శ్రీ వెంకటేశ్వర ప్రసాద్‌లుగా చూపుతూ.. 2006 డిసెంబర్ 30న జీహెచ్‌ఎంసీ సర్కిల్–14 కార్యాలయంలో రిజిస్టర్ చేయించారు. ఈ మేరకు బర్త్ సర్టిఫికెట్లు పొందారు. వాటి ఆధారంగా రీజనల్ పాస్‌పోర్టు కార్యాలయం నుంచి అర్జున్, వైష్ణవిలకు పాస్‌పోర్టులు కూడా పొందారు. ఈ మేరకు కృష్ణవేణి సేకరించిన ఆధారాలను సీసీఎస్ పోలీసులకు అందించారు. అయితే దర్యాప్తు అధికారి జీహెచ్‌ఎంసీ నుంచి అధికారికంగా నాలుగు బర్త్ సర్టిఫికెట్ల కాపీలు పొందడం తప్పనిసరికావడంతో.. దీనికోసం ఆ విభాగానికి సీసీఎస్ లేఖ రాసింది. త్వరలో పాస్‌పోర్టు కార్యాలయాన్నీ సంప్రదించనుంది.



రక్తమోడిన దేవరగట్టు


- కర్రల సమరంలో 95 మందికి గాయాలు

హొళగుంద: మాళ మల్లేశ్వరస్వామి దసరా బన్ని ఉత్సవాల్లో ఈ ఏడాది కూడా రక్తం చిమ్మింది. కర్నూలు జిల్లా హొళగుంద మండలం దేవరగట్టులో విజయదశమి సందర్భంగా శనివారం అర్ధరాత్రి తర్వాత మొదలైన బన్ని ఉత్సవంలో సంప్రదాయ ఆచారమే గెలిచింది. స్వామివారి కల్యాణోత్సవం అనంతరం విజయోత్సవంలో భాగంగా ఉత్కంఠ భరితంగా జరిగిన జైత్రయాత్ర (కర్రల సమరం)లో 95 మందికి గాయాలు కాగా.. మరో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. తలలు పగిలి, దివిటీలు తగిలి, కిందపడి చేతులు విరిగి.. ఇతర గాయాలతో పరిస్థితి విషమంగా ఉన్న వారికి స్థానిక హెల్త్ క్యాంప్‌లో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఆదోని, ఆలూరు, గుంతకల్లు, కర్నూలు ఆస్పత్రులకు తరలించారు. మిగిలిన వారికి హెల్త్ క్యాంప్‌లో చికిత్స అందించారు. శనివారం అర్ధరాత్రి ప్రారంభమైన మాళ మల్లేశ్వర స్వామి జైత్రయాత్ర ఆదివారం ఉదయం వరకు సాగింది. ఉత్సవాలు నిర్వహించే నెరణికి, నెరణికి తండా, కొత్తపేట భక్తులు డోలు, మేళతాళాలతో ఇనుప తొడుగులు తొడిగిన రింగు కర్రలు, అగ్గి దివిటీలతో అర్ధరాత్రి 12.20 గంటలకు కొండపై ఉన్న స్వామివారి ఆలయానికి చేరుకున్నారు. ఒంటి గంట వరకు నెరణికి పురోహితులు, ఆలయ పూజారులు మాత మాళమ్మ, మల్లేశ్వరునికి అత్యంత వైభవంగా కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం మాళమ్మ, మల్లేశ్వరుని విగ్రహాలతో పాటు పల్లకిని ఊరేగింపుగా కొండ దిగువకు వచ్చి మల్లప్ప గుడిలోని సింహాసన కట్ట మీద అధిష్ఠింపచేశారు. ఆ సమయంలో వారితో పాటు నిట్రవట్టి, బిలేహాల్, విరుపాపురం, ఎల్లార్తి, సుళువాయి, అరికెర, అరికెర తాండా, కురుకుంద, లింగంపల్లి తదితర గ్రామాల భక్తులు మొగలాయిల్లో పాల్గొన్నారు.

చంద్రబాబు ఆరోపణల వెనుక

కుట్ర కోణం

ప్రముఖ న్యాయవాది, మాజీ ఎంపీ డాక్టర్ సుబ్రమణ్యస్వామి



- శ్రీవారి ప్రసాదం కల్తీ అయిందని ఏ ఆధారంతో చెబుతారు?
- జూలైలో నివేదిక వస్తే సెప్టెంబర్ దాకా ఏం చేశారు?
- దర్యాప్తు చేయకుండా కల్తీ జరిగిందని ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి ఎలా ప్రకటిస్తారు?
- సుప్రీంకోర్టును సైతం కలవరపెట్టే ఎన్నో ప్రశ్నలు తలెత్తాయి
- ఏపీ సిట్‌తో వాస్తవాలు బయటపడవనే సుప్రీంకోర్టు జోక్యం కోరాను

సాక్షి, అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి ఉపయోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పదే పదే ప్రకటించడం వెనుక కుట్ర కోణం ఉందని ప్రముఖ న్యాయవాది, మాజీ ఎంపీ సుబ్రమణ్యస్వామి పేర్కొన్నారు. ఎలాంటి ఆధారం లేకుండా లడ్డూ ప్రసాదం కల్తీ జరిగిందని ఆరోపించడం ప్రపంచాన్ని కలవర పెట్టిందని అన్నారు. ప్రజల మనోభావాలను ప్రభావితం చేసే ఇలాంటి అంశాలను బహిరంగంగా ప్రకటించే ముందు దర్యాప్తు చేయాలన్నారు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన తిరుమల లడ్డూపై వచ్చిన ఆరోపణలపై పలు ప్రశ్నలు లేవనెత్తారు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి క్రైస్తవ ముద్ర వేసేందుకు చేసిన సందర్భాలను సైతం ఆయన ఇక్కడ గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మీడియా సంస్థల బాధ్యతారాహిత్యాన్ని ఎత్తిచూపారు. ఏపీ ప్రభుత్వం నియమించిన సిట్‌తో వాస్తవాలు తేలవని, అందుకే సుప్రీంకోర్టును ఆశ్రయించినట్టు చెప్పారు. ఆ ఇంటర్వ్యూలో ఆయన ఇంకా ఏమన్నారంటే..

> నెయ్యి శాంపిల్స్ పరీక్షలు చేసి, టీటీడీ ప్రమాణాలకు అనుగుణంగా లేకపోవడంతో వెనక్కు పంపించామని టీటీడీ ఈవో రిపోర్టులో స్పష్టంగా ఉన్నప్పటికీ, కల్తీ జరిగిందని సాక్షాత్తు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పదే పదే బహిరంగంగా ప్రకటించడం దేనికి నిదర్శనం? ఇలా ఆరోపణలు చేశాక దర్యాప్తుకు ఆదేశిస్తారా? నిజానిజాలు నిర్ధారించుకోకుండా భక్తుల్లో అలజడి సృష్టించడానికి యత్నించడం కుట్ర కోణంగా భావించక తప్పదు.
>
> – ప్రముఖ న్యాయవాది, మాజీ ఎంపీ డాక్టర్ సుబ్రమణ్యస్వామి

జగన్ సీఎం అయినప్పటి నుంచి ఇదే వైఖరి

- తిరుమల బాలాజీ లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని స్వయంగా ముఖ్యమంత్రే గత నెల 18న బహిరంగంగా ఆరోపించారు. ఆ తర్వాత ప్రసాదం కల్తీపై దర్యాప్తు చేసేందుకు సిట్‌ను నియమిస్తున్నట్టు సెప్టెంబర్ 26న ప్రకటించారు. ఇలాంటి తీవ్రమైన ఆరోపణ చేసేటప్పుడు సీఎం స్థాయిలో ఉన్న వారు వాస్తవమా.. కాదా అని తొలుత దర్యాప్తు చేసి నిర్ధారించుకోవాలి.
- కానీ ఇక్కడ అలా జరగలేదు. ముందు ఆరోపణ చేసి తర్వాత సిట్ దర్యాప్తు అన్నారు. పైగా కల్తీపై దర్యాప్తు కోసం అదే ప్రభుత్వం సిట్‌ను నియమించడం ద్వారా వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అనుకోవడం లేదు. జూలైలో కల్తీ జరిగిందని చెప్పి.. ఇంత కాలం తర్వాత ఇప్పుడు ఎందుకు సిట్‌ని నియమించారు? పైగా గత ప్రభుత్వంపై, నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన మంత్రులపై చాలా పెద్ద ఆరోపణలు చేశారు.
- జగన్ సీఎం అయినప్పటి నుంచి తిరుపతిలో క్రైస్తవ మత ప్రచారం చేస్తున్నారని ఓ ప్రణాళిక ప్రకారం ఆరోపణలు చేస్తూ వచ్చారు. తద్వారా నాటి సీఎం వైఎస్ జగన్‌పై మత ముద్ర వేసేందుకు చాలా ప్రయత్నం చేశారు. 2019లో సుబ్బారెడ్డి టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించినప్పుడు కూడా ఇదే రకమైన ఆరోపణలు చేశారు. ఒక క్రైస్తవుడిని టీటీడీ చైర్మన్‌గా ఎలా నియమిస్తారని హిందూవాదులు ఆగ్రహం వ్యక్తం చేశారు.
- వాస్తవమేంటంటే సుబ్బారెడ్డి గురించి తెలిసిన వారిని ఎవరిని అడిగినా ఆయన హిందువనే చెబుతారు. ఆయన 32 సార్లు మాల వేసుకుని శబరిమలకు వెళ్లివచ్చారు. ఇంట్లో గోశాల నిర్వహిస్తూ గోవులకు పూజ చేస్తున్నారు. ఇప్పుడు లడ్డూ ప్రసాదం కల్తీ జరిగిపోయిందని చంద్రబాబు నాయుడు పత్రికల్లో పతాక స్థాయిలో స్టేట్‌మెంట్లు ఇచ్చారు. ఇలాంటివి చాలానే ఉన్నాయి. ఇందులో సుప్రీంకోర్టును సైతం కలవరపెట్టే అంశాలు చాలా ఉన్నాయి. అందుకే సుప్రీంకోర్టును ఆశ్రయించాను. ప్రస్తుతం ఈ అంశంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ప్రత్యేక సిట్‌ను నియమించింది.

తప్పుడు వార్తలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జూలైలో నెయ్యి శాంపిల్ తీసుకుని టెస్ట్ చేశారని టీటీడీ రిపోర్టులో ఉంది. ఆ రిపోర్టులో కల్తీ జరిగిందని గానీ, ఫిష్ ఆయిల్, కొవ్వు కలిసిందని గానీ ఎక్కడా లేదు. నెయ్యి నాణ్యత టీటీడీ ప్రమాణాలకు తగ్గట్టుగా లేనందున తిప్పి పంపించామని ఉందే తప్ప ప్రసాదం తయారీకి పంపించామని ఎక్కడా చెప్పలేదు. కాబట్టి ఒక అబద్ధాన్ని సృష్టించి.. విస్తృతంగా ప్రచారం చేశారన్నది వాస్తవం. ఇలాంటప్పుడు కల్తీ జరిగిందని ఎలా చెబుతారు? ప్రసాదంపై చేసిన ఆరోపణ కోట్లాది మంది ప్రజలను ప్రభావితం చేసేది. ఆరోపణలు చేయడం సులువే, కానీ వాటిని నిరూపించాలిగా!
- వార్తాపత్రికలు కూడా జవాబుదారీగా ఉండాలి. రాజకీయ నాయకులు లడ్డూ ప్రసాదం, ఆలయ అంశాలను సమస్యగా మార్చి తమ గ్రాఫ్ పెంచుకునే ప్రయత్నం చేయవద్దని సుప్రీంకోర్టు గట్టిగానే చెప్పింది. ఈ హెచ్చరికను ప్రజలు ప్రశంసించారు. ఒకరి గుర్తింపును, ఎదుగుదలను రాజకీయంగా నాశనం చేసేందుకు తప్పుడు వార్తలను ప్రచారం చేసే ఏజెన్సీలు సైతం ఉన్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.



మంచిమాట

జీవన్ భద్రాణి పశ్యంతు

మన పూర్వులు పిల్లలకి జీవితం మీద ఆశని కలిగించి ఎటువంటి అఘాయిత్యాలకి పాల్పడకుండా సానుకూల దృక్పథం పెంపొందే విధంగా మనసులని మలచేవారు. అందుకే ఒకప్పుడు ఆత్మహత్యల వంటివి అంతగా కనపడేవి కావు. ఎక్కడో ఒకటి జరిగితే అదేదో వింత అన్నట్టు అందరూ కంగారు పడేవారు. ఇప్పుడు అవి అతి సామాన్యమై పోయాయి. అది చాలా మామూలు విషయంగా పరిగణించి పెద్దగా పట్టించుకోవటం కూడా లేదు. ప్రతిస్పందించే సున్నితత్వాన్ని కూడా కోల్పోయాం. ''బ్రతికి యుండిన సుఖములు బడయ వచ్చు'' అన్నది భారతీయుల విశ్వాసం. ఇటువంటి భావాలని అతి సామాన్యమైన మాటలలో అందరి మనస్సులలో నాటుకు నేట్టు చేశారు. బ్రతుకుని అంతం చేసుకోవాలనే ఆలోచనే రాకుండా వాతావరణాన్ని ఉంచేవారు. జీవితంలో ప్రతి చిన్న విషయాన్ని చావో రేవో అన్నంత తీవ్రంగా తీసుకునే వారు కాదు. ''కష్టాలు మనుషులకి కాక మాకులకి వస్తాయా?'' అని తేలిక చేసేవారు, మనం అందరం మనుషులం అని గుర్తు చేస్తూ. ఈనాడు జీవితంలో అత్యున్నత స్థాయిలో ఉన్న ఎంతో మంది చిన్నతనంలో కడుపునిండా తిండి కూడా లేనివారు అని వారి జీవితచరిత్రలు చూస్తే అర్థమవుతుంది. ''బతికుంటే బలుసాకు తినవచ్చు'' అని చెప్పి సాంత్వన కలిగించే వారు.పైగా, ఆ రోజుల్లో అనుకున్నది సాధించక పోవటం, పరాజయాల పాలు కావటం జరిగి, తాత్కాలికంగా నిరాశ కలిగినా వెంటనే తేరుకుని రెట్టించిన ఉత్సాహంతో లేదా కసితో అనుకున్న దానిని సాధించటానికి ప్రయత్నం చేసేవారు. తాము విఫలం కావటానికి కారణం ఏమిటి? అని విశ్లేషించుకునేవారు. ఇది కార్యసాధకుల లక్షణం. ఎవరి జీవితం వడ్డించిన విస్తరి కాదు, పూల పానుపూ కాదు.

ఈ ఆలోచనా విధానం నేటి యువతరంలోను, మధ్యవయస్కులలోనూ మృగ్యం అయింది. తక్షణం అనుకున్న ఫలితం రావాలి, తన ప్రయత్నంతో సంబంధం లేకుండా. అపజయాన్ని, ఓటమిని అసలు ఎదుర్కో లేరు. కొంచెం కూడా ఆగలేరు. నిర్ధారణ చేసుకునే ఓపిక కూడా ఉండదు. కొన్ని సందర్భాలలో పొరపాటు పడే అవకాశం కూడా ఉంది. మనం చూస్తూనే ఉంటాం. మొదటి వంద స్థానాల్లో ఉండవలసిన అభ్యర్థి ఉత్తీర్ణుడు కాలేదని ప్రకటన రాగానే తట్టుకో లేక ఆత్మహత్య చేసుకున్న మరునాడు ఆ ప్రకటన తప్పు అని సరి చేసుకోటం తెలుసు కదా! మనసుని ఆ మాత్రం అదుపులో ఉంచలేక పోవటం వల్ల వచ్చిన ప్రమాదం అది. ప్రాణాలు అర్పించి సాధించారు, బలిదానం చేశారు అంటూ పొగిడితే వారికి ఒరిగేది ఏముంది? మిగిలిన వారు అనుభవించ వచ్చు. ఎప్పటికైనా న్యాయం, ధర్మం గెలుస్తాయి. సమయం పట్టవచ్చు. మనస్తత్వశాస్త్రవేత్తలు చెప్పే మాట ఏమంటే, ప్రాణత్యాగం చేయదల్చుకున్న వారిని ఒక్క క్షణం ఆపగలిగితే చాలు నట. క్షణికావేశం చల్లారుతుంది అంటారు. ఆ పనిని ఎవరు చేయగలరు? అసలు ఎవరికైనా తెలియాలి కదా! అందుకే ఎవరికి వారే తమను తాము సముదాయించుకుని, పరిస్థితులతో పోరాడి గెలవాలి. కలిగిన మేలు అనుభవించటానికి బ్రతికి ఉండాలి కదా!

ఈ బతుకుని అంతం చేసుకోవాలనే భావన ఎవరికీ రాదా? సీతమ్మకి, హనుమకి, రామచంద్రమూర్తికి, దుర్యోధనుడి వంటి వారికే వచ్చింది. కాని విచక్షణ వారిని ఆపని చేయకుండా కాపాడింది. సీతమ్మ కనపడలేదని హనుమ ఏ విధంగా శరీరం వదలాలి అని ఆలోచిస్తూ సీతారామలక్ష్మణులకి, సుగ్రీవాదులకి నమస్కారం చేయగానే అశోకవనం కనపడింది. దైవాన్ని, పెద్దలని స్మరిస్తే మార్గం కనపడుతుంది. సీత కూడా జుట్టుతో చెట్టు కొమ్మకి ఉరి వేసుకునే ప్రయత్నంలో ఉండగా త్రిజట మాటలు, హనుమ దర్శనం కలిగాయి. తొందర పడితే? రాముడు కూడా సీత లేకుండా ఉండలేనని అనుకుని, అరణ్యవాసం చేయలేదనే చెడ్డపేరు వస్తుందని ఆగాడు. ఆవేశ పడకుండా కొద్దిగా ఆలోచిస్తే మంచి జరిగి తీరుతుంది.

– డా. ఎన్. అనంతలక్ష్మి

గృహస్థాశ్రమ వైశిష్ట్యం

మాతృవందనమ్



గృహస్థాశ్రమంలో నిత్యం జరిగే పంచ మహా యజ్ఞాలలో మొదటిది అధ్యాపనం కాగా రెండవది– పితయజ్ఞస్య తర్పణం. మనకు ముందుపుట్టి మనకు జన్మనిచ్చిన వాళ్లున్నారు... తల్లిదండ్రులు. లోకంలో ఎవరి రుణం అయినా తీర్చుకోగలమేమో కానీ తల్లిదండ్రుల రుణం తీర్చుకోలేం అంటారు రామచంద్రమూర్తి రామాయణంలో. . సౌత్రామణి అని ఒక యాగం. అది చేస్తే పితరుణం తీరుతుంది. కానీ మాతరుణం ? ఎవ్వరికీ సాధ్యం కాదు.

రుణం తీరడం లేదా తీర్చుకోవడమంటే ??? నీ జన్మ చరితార్థం కావాలంటే... గృహస్థాశ్రమంలో తల్లిదండ్రులకు నమస్కరించి సేవచేయడమే. శంకరో తీతి శంకరః..శంకరుడు ప్రతి ఇంటా ఉన్నాడు... తండ్రి రూపంలో.. అంటే కన్న తండ్రి సాక్షాత్ పరమ శివుడే. తండ్రికి ప్రదక్షిణం చేసి నమస్కరిస్తే పరమ శివుడికి ప్రదక్షిణం చేసి నమస్కరించినట్లే. తల్లికయినా అంతే...''భూప్రదక్షిణ షట్కేన కాశీయాత్రాయుతేనచ /సేతు స్నాన శతైర్యశ్చ తత్ఫలం మాతవందనే'' అంటూ గృహస్థాశ్రమంలో ఉన్నవాడికి ఇంత వెసులుబాటు కల్పించింది శాస్త్రం. అమ్మకు నమస్కరిస్తే... ఆరుసార్లు భూమండలాన్ని ప్రదక్షిణం చేసినట్లు, 10 వేల సార్లు కాశీ యాత్ర చేసినట్లు, నూరు పర్యాయాలు సేతు స్నానం చేసినంత ఫలం దక్కుతుందన్నది. అందువల్ల కంటి ముందు కనిపించే దేవతలయిన అమ్మానాన్నల విషయంలో గృహస్థు తన కర్తవ్యాన్ని తాను నిర్వహిస్తే ఈశ్వరుడు ప్రీతి పొందుతాడు. ఎవరు ఏది చేయాలో అది నిజాయితీగా చేయాలి.

తల్లిదండ్రులు ఉన్నప్పుడో లేనప్పుడో నీ వాటా ఆస్తులు లేదా వారి కోసం నీవు పెట్టే ఖర్చులు లెక్కలు వేసుకోవడం కాదు... వారు నీకిచ్చిందేమిటన్నది ద్రవ్య రూపంలో లెక్కలేసుకోకు. సంతోషంగా నువ్వు నూరేళ్ళు పిల్లాపాపలతో హాయిగా ఉండాలని తప్ప వారు నీనుంచి ఆశించేముంటుంది ? నాకు తెలిసిన ఒక మిత్రుడి తల్లి చనిపోతే ... ఆస్తుల వాటా ప్రస్తావన వచ్చినప్పుడు నీవాటాకేం వచ్చిందంటే... రాలేదు.. నేనే తీసుకున్నా..అన్నాడు. ఏమిటవి అని అడిగితే.. అమ్మ వాడిన చెప్పులు, కళ్ళద్దాలు.. అన్నాడు... అమ్మ వాడిన అద్దాలు నా గుండెమీద పెట్టుకుంటే అమ్మ నన్ను చూస్తూ ఉన్నట్టే ఉంటుంది.. అమ్మ వాడిన అరిగిపోయిన చెప్పులు... నాకోసం ఆమె అరగదీసుకున్న, కరగదీసుకున్న జీవితాన్ని గుర్తుకు తెస్తుంటుంది... అన్నాడు... ఇవి చాలవూ నాకు... అమ్మ పోయినా ఆమెను రోజూ చూసుకోవడానికి.. అన్నాడు. అదీ కతజ్ఞత. అందుకే వారు చనిపోయిన రోజున పరమ భక్తితో, గౌరవంతో తోడబుట్టినవారందరూ కలిసి తల్లిదండ్రులను స్మరించుకోవడానికే శ్రాద్ధం, తద్దినం ఆచారంగా మారింది. అది శ్రద్ధతో చేయాల్సిన పని కాబట్టి శ్రాద్ధం అయింది. అంతే గానీ దానికి ఫలానా వస్తువులే ఉండితీరాలన్న నియమాలేమీ లేవు...

రామాయణంలో...రాముడు గారపిండి ముద్దలు తీసుకెళ్ళి తండ్రి దశరథుడిని స్మరించి పితదేవతలకు పిండం పెట్టాడు. కౌసల్యాదేవి అటుగా వెడుతూ చూసి భోరున ఏడ్చింది. అంటే యజమాని ఏది తింటే పితదేవతలకు అదే పెట్టాలంది శాస్త్రం. రాముడు ఆ సమయంలో అదే తింటున్నాడు కాబట్టి అదే పెట్టాడు. కావలసింది శ్రద్ధ. అందువల్ల గృహస్థు తన విహిత కర్తవ్యాన్ని నిర్వర్తించాలి. అది తర్పణం. అది మహా యజ్ఞం. గృహస్థు చేయాల్సిన పంచమహా యజ్ఞాలలో ఇది ఒకటి.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

తాత్త్వికథ

అశోకుని శోకం



శాస్త్రిగారు ప్రవచనం చెపుతున్నారు. ప్రహ్లాదుడు, శ్రవణకుమారుల గుణగణాలను చెప్పారు. ''పెద్దల పనులను కూడా సరిదిద్దగల పిల్లలు నేటికీ ఉన్నారు. ఈ యుగంలో ఈ కాలంలోనే నాకు తెలిసిన ఒక పిల్లాడి గురించి చెబుతాను'' అని ఇలా చెప్పసాగారు:

అశోక్ తాతగారు చనిపోయారు. ఇంట్లో వాళ్ళందరూ విచారంగా ఉన్నారు. అనేకమంది పలకరించడానికి వస్తున్నారు. ఓదారుస్తున్నారు. కానీ అశోక్ కళ్ళ నుండి ఒక్క చుక్క కూడా కన్నీరు కారటం లేదు. చనిపోయిన తాతగారి భౌతిక కాయాన్ని చూస్తూ ఉండిపోయాడు అశోక్. అతని తండ్రి, బాబాయిలు, మేనత్తలు అందరూ ''అదేమిటిరా తాతగారికి నువ్వంటే ఎంతో ప్రేమ కదా. నీకు ఎన్నో కథలు చెప్పేవారు. మిఠాయిలు తెచ్చి ఇచ్చేవారు. నీకు కూడా ఆయన అంటే ఎంతో ఇష్టం. ఆయన శవాన్ని చూస్తుంటే నీకు ఏడుపు రావటం లేదా?'' అని అడిగారు. అశోక్ నుంచి ఏ సమాధానం లేదు. తాతగారి శవాన్ని చూస్తూ అలా ఉండిపోయాడు అశోక్.

అశోక్ తాతగారు చనిపోయిన పదకొండవ రోజున కార్యక్రమం చేశారు. బంధువులు, మిత్రులు, చుట్టుపక్కల వాళ్ళు చాలామంది వచ్చారు. అందరూ ''దినం బాగా చేశారు. భోజనాలు బాగా పెట్టారు'' అనుకున్నారు.

ఆరోజు సాయంత్రానికి బంధు మిత్రులందరూ వెళ్లిపోయారు. అశోక్ తండ్రి, బాబాయిలు, మేనత్తలు, ఇంకా అశోక్ తాతగారి స్నేహితులు ఒకరిద్దరు మాత్రం మిగిలారు. అందరూ ఆ పెద్దాయన గురించి మాట్లాడుకుంటున్నారు.

ఇంతలో అశోక్ ఉన్నట్టుండి ఒక్కసారిగా లేచి, తాతగారి ఫోటోను గుండెలకు హత్తుకుని పెద్దగా ఏడవటం మొదలెట్టాడు. అందరూ అశోక్ దగ్గరకు వచ్చారు. అతన్ని ఓదార్చటానికి ప్రయత్నించారు. అయినా ఏడుస్తూనే ఉన్నాడు అశోక్. అరగంట తర్వాత తన తండ్రి వద్దకు వచ్చాడు అశోక్. ''నాన్నగారు, మీరు ఈ రోజు తాతగారి దినానికి చేసిన ఖర్చులో సగమైనా ఖర్చుపెట్టి తాతగారికి వైద్యం చేయించి ఉన్నట్టయితే తాతగారు మరికొన్ని రోజులు బతికేవారు కదా'' అన్నాడు ఏడుస్తూ.

అది వినగానే ఎవరి నోటివెంటా మాట రాలేదు. అశోక్ తల్లి ''పెద్దవాళ్ల విషయాలు నీకెందుకు? నోరు మూసుకో!'' అని అశోక్‌ను గదమాయించింది. వెంటనే అశోక్ తాతగారి మిత్రుడు ఒకాయన ''లేదమ్మా, చిన్నపిల్లోడు అయినా పెద్దలకు బుద్ధి చెప్పే మంచి మాట చెప్పాడు'' అంటూ కన్నీళ్లు పెట్టుకున్నాడు.

శాస్త్రిగారు చెప్పటం పూర్తి చేశారు. ప్రేక్షకుల కరతాళ ధ్వనులు మిన్ను పుట్టాయి.

– కళ్ళేపల్లి తిరుమలరావు

సినిమా



రామ్‌చరణ్

గేమ్ చేంజ్

గేమ్ డేట్ చేంజ్ అయింది. ఎందుకంటే ఆడే ఆటని అందరూ చూడాలంటే సరైన తేదీ ఉండాలి కదా. అందుకే ఆటని సంక్రాంతికి మార్చారు. రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న 'గేమ్ చేంజర్' గురించే ఇదంతా. అనిత సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, దిల్ రాజు ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తోన్న చిత్రం ఇది. ఇందులో కియారా అద్వాని హీరోయిన్. క్రిస్మస్ సందర్భంగా ఈ సినిమాను తెలుగు, తమిళ, హిందీ భాషల్లో రిలీజ్ చేయాలనుకున్నారు. అయితే వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 10న విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా 'దిల్' రాజు మాట్లాడుతూ – ''ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నప్పుడు క్రిస్మస్ కన్నా సంక్రాంతి అయితే బాగుంటుందని నాతో పాటు బాలీవుడ్, కోలీవుడ్, కర్ణాటక ఓవర్‌సీస్‌లోని డిస్ట్రిబ్యూటర్స్ అందరూ భావించాం. అయితే సంక్రాంతికి చిరంజీవిగారి 'విశ్వంభర' కూడా ఉంది. 'విశ్వంభర' భారీ బడ్జెట్ చిత్రమే. అయితే 'గేమ్ చేంజర్' మూడేళ్లుగా నిర్మాణంలో ఉందని, సంక్రాంతి డేట్ కావాలని చిరంజీవిగారిని, యూవీ సంస్థని కోరడంతో 'విశ్వంభర' దాదాపు పూర్తి కావచ్చినప్పటికీ సానుకూలంగా స్పందించారు. మా సినిమా కోసం వాళ్ల సినిమాను వాయిదా వేసుకోవడానికి ఒప్పుకున్నందుకు చిరంజీవిగారికి, యూవీ క్రియేషన్స్ వంశీ, ప్రమోద్, విక్కీకి ధన్యవాదాలు'' అన్నారు.

ఫుల్ కామెడీ



రామ్

రామ్ పోతినేని హీరోగా కొత్త సినిమా ప్రకటన వచ్చింది. రామ్ కెరీర్‌లో ఇది 22వ సినిమా. 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' ఫేమ్ మహేశ్‌బాబు పచ్చిగొల్ల దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించనున్నారు ''పూర్తి స్థాయి వినోదం నేపథ్యంలో ఈ చిత్రం రూపొందనుంది. ఇటీవల వరుసగా యాక్షన్ ఓరియంటెడ్ పాత్రలతో అలరించిన రామ్ ఈ మూవీలో ఓ యునిక్ క్యారెక్టర్‌లో కనిపిస్తారు. ఆయన కెరీర్‌లోని ల్యాండ్‌మార్క్ చిత్రాల్లో ఒకటిగా నిలుస్తుంది. మహేశ్‌బాబు ఈ చిత్రాన్ని కంప్లీట్ ఎంటర్‌టైనర్‌ని తెరకెక్కించనున్నారు. త్వరలో షూటింగ్ ప్రారంభిస్తాం. ఈ సినిమాకి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో తెలియజేస్తాం'' అన్నారు మేకర్స్.

దసరా కాంబినేషన్ షురూ



నాని, శ్రీకాంత్ ఓదెల

'దసరా' (2023) వంటి బ్లాక్‌బస్టర్ సినిమా తర్వాత హీరో నాని, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల, నిర్మాత సుధాకర్ చెరుకూరి కాంబినేషన్‌లో 'నాని ఓదెల 2' (వర్కింగ్ టైటిల్) చిత్రం ఆరంభమైంది. ''మునుపెన్నడూ చూడని మాస్ క్యారెక్టర్‌లో నానీని చూపించే గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లే, ఆకట్టుకునే కథని తయారు చేశారు శ్రీకాంత్ ఓదెల. భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించనున్నాం. 'దసరా' సినిమా వంద కోట్లకు పైగా వసూళ్లు సాధించడం, పలు అవార్డులు అందుకోవడంతో పాన్ ఇండియా చిత్రం 'నాని ఓదెల 2' పై భారీ అంచనాలున్నాయి. ఆ అంచనాలను చేరుకునేలా ఈ చిత్రాన్ని రూపొందిస్తాం. మరిన్ని వివరాలు త్వరలో తెలియజేస్తాం'' అని మేకర్స్ పేర్కొన్నారు.

కోహినూర్ కోసం...



సిద్ధు జొన్నలగడ్డ

'డీజే టిల్లు, టిల్లు స్క్వేర్' వంటి సూపర్ హిట్ చిత్రాల తర్వాత హీరో సిద్ధు జొన్నలగడ్డ, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ కాంబినేషన్‌లో మరో చిత్రం రూపొందనుంది. 'కోహినూర్' టైటిల్‌తో హ్యాట్రిక్ టార్గెట్‌గా ఈ చిత్రాన్ని ప్లాన్ చేస్తున్నట్లుగా యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి రవికాంత్ పేరెపు దర్శకుడు. కాగా సిద్ధు జొన్నలగడ్డతో 'కృష్ణ అండ్ హిజ్ లీల' వంటి రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌ను తెరకెక్కించిన రవికాంత్ ఈసారి ఈ హీరోతో సోషియో ఫ్యాంటసీ డ్రామాని ప్లాన్ చేశారు. ''భద్రకాళి మాత మహిమగా నిలిచిన ఐకానిక్ కోహినూర్ వజ్రం కొందరి చేతికి చిక్కుతుంది. ఆ వజ్రాన్ని తిరిగి తీసుకురావడానికి ఓ యువకుడు సాగించే చారిత్రాత్మక ప్రయాణంగా ఈ చిత్రం రూపొందనుంది'' అని యూనిట్ పేర్కొంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించనున్న ఈ చిత్రం 2026లో విడుదల కానుంది.

నా ఛాతీలో దమ్ముంది

'నా కలర్ నలుపు... కానీ, నా క్యారెక్టర్ ఎరుపు' అంటూ నటుడు అశోక్ కుమార్ చెప్పే డైలాగ్‌తో 'ఈశ్వర్' సినిమా ట్రైలర్ ఆరంభమైంది. ప్రభాస్ హీరోగా పరిచయమైన చిత్రం 'ఈశ్వర్'. జయంత్ సి. పరాన్జీ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో శ్రీదేవి విజయ్ కుమార్ హీరోయిన్‌గా నటించారు. బ్రహ్మానందం, శివ కృష్ణ, రేవతి ఇతర పాత్రలు పోషించారు. కొల్ల అశోక్ కుమార్ నిర్మించిన ఈ సినిమా 2002 నవంబరు 11న రిలీజై హిట్‌గా నిలిచింది. కాగా ఈ నెల 23న ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా 'ఈశ్వర్' సినిమాని అదే రోజు 4కే క్వాలిటీలో రీ రిలీజ్ చేస్తోంది లక్ష్మీ నరసింహా మూవీస్. ఈ నేపథ్యంలో ఈ మూవీ రీ రిలీజ్ ట్రైలర్‌ని విడుదల చేశారు. రీ ఇంట్రడ్యూసింగ్ ప్రభాస్ అంటూ రిలీజ్ చేసిన ట్రైలర్ చూస్తే... 'నీ చేతిలో డబ్బుంటే... నా ఛాతీలో దమ్ముంది రా, ఈ రోజు ఆ పోరి సంగతి అటో ఇటో తేల్చేస్తాను, ప్రేమించింది మర్చిపోవడానికి కాదు' అంటూ ప్రభాస్ చెప్పే డైలాగులు ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: ఆర్పీ పట్నాయక్.



ప్రభాస్

విశాఖపట్నంలో కాక్రోచ్



సునీల్‌కుమార్ రెడ్డి

వాస్తవ ఘటనల స్ఫూర్తితో తనదైన శైలిలో సినిమాలు తెరకెక్కిస్తుంటారు డైరెక్టర్ పి. సునీల్‌కుమార్ రెడ్డి. తాజాగా ఆయన దర్శకత్వం వహించిన చిత్రానికి 'కాక్రోచ్' అనే టైటిల్‌ని ఖరారు చేసి, లుక్‌ని రిలీజ్ చేశారు. శ్రీ లక్ష్మీ పిక్చర్స్, ఆదిత్య సినిమాస్‌పై బి. బాపిరాజు, ముతుకి నాగ సత్యనారాయణ నిర్మించారు. ''విశాఖపట్నం నేపథ్యంలో సాగే యాక్షన్ ప్రేమకథ 'కాక్రోచ్'. పాత, కొత్త నటీనటులు నటించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే ఈ చిత్రాన్ని రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: ప్రదీప్ చంద్ర, కెమెరా: సంతోష్ శక్తి.



ఛోటా కె. నాయుడు, వశిష్ఠ, విక్రమ్ రెడ్డి

మహా యుద్ధాన్ని తీసుకొస్తుంది

'విశ్వాన్ని అలుముకున్న ఈ చీకటి విస్తరిస్తున్నంత మాత్రాన వెలుగు రాదని కాదు, ప్రశ్నలు పుట్టించిన కాలమే సమాధానాన్ని కూడా సృష్టిస్తుంది, విర్రవీగుతున్న ఈ అరాచకానికి ముగింపు పలికే మహా యుద్ధాన్ని తీసుకొస్తుంది' వంటి పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో 'విశ్వంభర' చిత్రం టీజర్ విడుదలైంది. చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'విశ్వంభర'. ఈ సినిమాలో త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లు. విక్రమ్ రెడ్డి సమర్పణలో వంశీకృష్ణా రెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి నిర్మించారు. పైన చెప్పిన డైలాగ్స్ టీజర్‌లో వాయిస్ ఓవర్‌గా వినిపిస్తుండగా, ఎగిరే గుర్రాన్ని స్వారీ చేస్తూ చిరంజీవి ఎంట్రీ ఉంటుంది. ఇక 'మిత్రా.. యుద్ధం వస్తది అన్నావుగా.. ఎలా ఉంటుంది ఆ యుద్ధం' అంటూ ఓ పాప చెప్పే డైలాగ్ కూడా టీజర్‌లో ఉంది. ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో డైరెక్టర్ వశిష్ఠ మాట్లాడుతూ– ''విశ్వంభర' ఓ పాట మినహా పూర్తయింది. బిగ్ స్కేల్ ఉన్న సినిమా ఇది'' అన్నారు. ''రామ్ చరణ్ నటించిన 'గేమ్ చేంజర్' కోసం 'దిల్' రాజుగారు అడగడంతో 'విశ్వంభర' సినిమా విడుదల వాయిదా వేశాం. మా సినిమా ఎప్పుడు వస్తే అప్పుడే పండగ'' అన్నారు విక్రమ్ రెడ్డి. కెమెరామేన్ ఛోటా కె. నాయుడు, ఆర్ట్ డైరెక్టర్ ఏఎస్ ప్రకాశ్, మైత్రీ మూవీస్ డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: ఎంఎం కీరవాణి.

సారంగపాణి ఫిక్స్



ప్రియదర్శి

'జెంటిల్‌మన్, సమ్మోహనం' వంటి హిట్ చిత్రాల తర్వాత డైరెక్టర్ మోహనకృష్ణ ఇంద్రగంటి, నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ కలయికలో రూపొందిన సినిమా 'సారంగపాణి జాతకం'. ప్రియదర్శి, రూపా కొడువాయూర్ జంటగా నటించారు. ఈ సినిమాని డిసెంబర్ 20న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ''మనిషి భవిష్యత్తు అతని చేతి రేఖల్లో ఉంటుందా? లేదా అతను చేసే చేతల్లో ఉంటుందా? అనే ప్రశ్నకు జవాబు ఇచ్చే ఓ పరిపూర్ణ హాస్యరస చిత్రం 'సారంగపాణి జాతకం'' అని చెప్పారు శివలెంక కృష్ణప్రసాద్.

శ్రీకృష్ణుడి పై నమ్మకంతో...



అక్షయ్, మమిత బైజు

అక్షయ్ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'డియర్ కృష్ణ'. 'ప్రేమలు' ఫేమ్ మమిత బైజు ఓ హీరోయిన్‌గా ఐశ్వర్య మరో హీరోయిన్‌గా నటిస్తున్నారు. దినేష్ బాబు దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని నిర్మించడంతో పాటు రచయితగానూ వ్యవహరించారు పీఎన్ బలరామ్. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ని విడుదల చేసిన సందర్భంగా పీఎన్ బలరామ్ మాట్లాడుతూ – ''శ్రీకృష్ణుణ్ణే నమ్మే ఒక భక్తుడు తన అనారోగ్యం తాలూకు భారాన్ని ఆ దేవుడిపైనే వేస్తాడు. డాక్టర్లే ఏం చేయలేమన్న పరిస్థితుల్లో ఒక అద్భుతం జరుగుతుంది. ఆ శ్రీకృష్ణుడి దయతోనే ఈ సినిమా నిర్మించాం'' అన్నారు.

కల నెరవేరింది



అరుణ్ మహాశివ, తన్మయి, రామ్ త్రివిక్రమ్

ప్రముఖ దర్శకుడు వి. సముద్ర తనయులు అరుణ్ మహాశివ, రామ్ త్రివిక్రమ్ హీరోలుగా 'దో కమీనే' అనే సినిమా షురూ అయింది. సముద్ర దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో తన్మయి, శ్రీ రాధ హీరోయిన్లుగా నటిస్తున్నారు. హారిక సమర్పణలో చంద్ర పులుగుజ్జు నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి నందమూరి మోహనకృష్ణ కెమెరా స్విచ్ఛాన్ చేయగా, సుమన్ క్లాప్ ఇచ్చారు. బి. గోపాల్ దర్శకత్వం వహించగా, శ్రీకాంత్ స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందించారు. వి. సముద్ర మాట్లాడుతూ– ''పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా 'దో కమీనే'ను రూపొందిస్తున్నాం'' అన్నారు. ''మా బ్యానర్‌లో తొలి సినిమా ఇది'' అని చంద్ర పులుగుజ్జు చెప్పారు. ''నాన్నగారి దర్శకత్వంలో నటించాలనే కల త్వరగా నెరవేరుతున్నందుకు, అవకాశం ఇచ్చిన నిర్మాతకి, మా నాన్నకి ధన్యవాదాలు'' అని రామ్ త్రివిక్రమ్, అరుణ్ మహాశివ అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ వినోద్ మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: శ్రీ వెంకట్.

దసరా ధమాకా


సామ్సన్



- చివరి టి20లో భారత్ ఘన విజయం
- 297 పరుగుల రికార్డు స్కోరు
- 133 పరుగులతో చిత్తయిన బంగ్లాదేశ్
- సంజు సామ్సన్ సూపర్ సెంచరీ

హైదరాబాద్‌లో విజయదశమి రోజున సాయంత్రం...పండగ సంబరాలను కాస్త పక్కన పెట్టి క్రికెట్ వైపు వచ్చిన అభిమానులు అదృష్టవంతులు! అటు స్టేడియంలో గానీ ఇటు ఇంట్లో గానీ మ్యాచ్ చూసినవారు ఫుల్ దావత్ చేసుకున్నట్లే! అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శనను కనబర్చి భారత క్రికెటర్లు పారించిన పరుగుల ప్రవాహంతో పండగ ఆనందం రెట్టింపు అయిందంటే అతిశయోక్తి కాదు.

25 ఫోర్లు, 23 సిక్స్‌లు...ఈ 47 బౌండరీలతోనే ఏకంగా 232 పరుగులు...రెండు ఓవర్లు మినహా మిగతా 18 ఓవర్లూ పదికి పైగా పరుగులు వచ్చిన పవర్‌ప్లే ఓవర్లే! 43 బంతులకే 100, 84 బంతులకే 200 వచ్చేశాయి...అలా వెళ్లిన స్కోరు 300కు కాస్త ముందు ఆగింది. ఈ క్రమంలోనే ఎన్నో రికార్డులు బద్దలు...సరికొత్త రికార్డులు నమోదు.

అంతర్జాతీయ టి20ల్లో 28 ఇన్నింగ్స్‌ల తర్వాత కూడా 2 అర్ధసెంచరీలు, ఇరవై లోపు లోపు 20 స్కోర్లతో తన సెలక్షన్‌పై సందేహాలు రేకెత్తిస్తూ వచ్చిన సంజు సామ్సన్ ఎట్టకేలకు అద్భుతం చేశాడు. ఒకే ఓవర్లో ఐదు సిక్సర్లు సహా అతని మెరుపు సెంచరీ హైలైట్‌గా నిలిచింది. అతి భారీ లక్ష్యం ముందుండగా ముందు చేతులెత్తేసిన బంగ్లాదేశ్ 20 ఓవర్లు ఆడి లాంఛనం ముగించింది.

సాక్షి, హైదరాబాద్: సొంతగడ్డపై బంగ్లాదేశ్‌తో సమరాన్ని భారత జట్టు సంపూర్ణ ఆధిపత్యంతో ముగించింది. టెస్టు సిరీస్‌ను 2-0తో గెలుచుకున్న టీమిండియా ఇప్పుడు టి20 సిరీస్‌ను కూడా 3-0తో సొంతం చేసుకుంది. గత మ్యాచ్‌లోనే 86 పరుగుల ఓటమి తర్వాత సిరీస్ కోల్పోయి కునారిల్లిన బంగ్లాకు చివరి పోరులో అంతకంటే పెద్ద దెబ్బ పడింది. శనివారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన చివరి టి20లో భారత్ 133 పరుగుల తేడాతో బంగ్లాపై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ ముందుగా 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 297 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సంజు సామ్సన్ (47 బంతుల్లో 111; 11 ఫోర్లు, 8 సిక్స్‌లు) కెరీర్‌లో తొలి సెంచరీ సాధించగా, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (35 బంతుల్లో 75; 8 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఎప్పటిలాగే చెలరేగాడు. సామ్సన్, సూర్య రెండో వికెట్‌కు 70 బంతుల్లోనే 173 పరుగులు జోడించడం విశేషం. వీరిద్దరికి తోడు హార్దిక్ పాండ్యా (18 బంతుల్లో 47; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) రియాన్ పరాగ్ (13 బంతుల్లో 34; 1 ఫోర్, 4 సిక్స్‌లు) కూడా దూకుడు కనబర్చడంతో భారత్ భారీ స్కోరు సాధించింది. అనంతరం బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 164 పరుగులే చేయగలిగింది. తౌహిద్ హృదయ్ (42 బంతుల్లో 63 నాటౌట్; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), లిటన్ దాస్ (25 బంతుల్లో 42; 8 ఫోర్లు) మినహా అంతా విఫలమయ్యారు. హార్దిక్ పాండ్యాకు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు దక్కింది.

6, 6, 6, 6, 6...

అభిషేక్ (4)ను తొందరగా అవుట్ చేయడం ఒక్కటే బంగ్లాకు దక్కిన ఆనందం. ఆ తర్వాత 69 బంతుల పాటు వారికి సామ్సన్, సూర్య చుక్కలు చూపించారు. తస్కీన్ ఓవర్లో సామ్సన్ వరుసగా 4 ఫోర్లు కొట్టగా, తన్‌జీమ్ ఓవర్లో సూర్య వరుసగా 3 ఫోర్లు, సిక్స్ బాదాడు. పవర్‌ప్లేలోనే జట్టు 82 పరుగులు చేసింది. 22 బంతుల్లో సామ్సన్ అర్ధసెంచరీని చేరుకున్నాడు. ఆ తర్వాత బంగ్లా స్పిన్నర్ రిషాద్ బాధితుడయ్యాడు. రిషాద్ తొలి ఓవర్లో వరుసగా 2 ఫోర్లు, సిక్స్ కొట్టిన సామ్సన్...అతని తర్వాతి ఓవర్లో విధ్వంసం సృష్టించాడు. తొలి బంతికి పరుగు తీయని సామ్సన్ తర్వాతి ఐదు బంతుల్లో 6, 6, 6, 6, 6తో చెలరేగాడు. మరో వైపు 23 బంతుల్లో సూర్య హాఫ్ సెంచరీ పూర్తయింది. మహేదీ వేసిన ఇన్నింగ్స్ 13వ ఓవర్ తొలి బంతికి నేరుగా ఫోర్ కొట్టడంతో సామ్సన్ 40 బంతుల్లోనే సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. ఎట్టకేలకు సెంచరీ తర్వాత సామ్సన్‌ను ముస్తఫిజుర్ వెనక్కి పంపడంతో బంగ్లా ఊపిరి పీల్చుకుంది. తర్వాతి ఓవర్లోనే సూర్య అవుటయ్యాడు. ఆ తర్వాతా భారత్‌ను నిలువరించడం బంగ్లా వల్ల కాలేదు. పాండ్యా తన జోరును చూపిస్తూ తన్‌జీమ్ ఓవర్లో వరుసగా 4, 6, 6, 4 కొట్టగా...మహేదీ ఓవర్లో పరాగ్ వరుసగా 6, 4, 6 బాదాడు. వీరిద్దరు 26 బంతుల్లోనే 70 పరుగులు జత చేశారు. మూడు బంతులు మాత్రమే మిగిలి ఉన్న సమయంలో క్రీజ్‌లోకి వచ్చిన నితీశ్ కుమార్ రెడ్డి (0) తొలి బంతికే వెనుదిరగ్గా...300కు 3 పరుగుల ముందు భారత్ ఇన్నింగ్స్ ముగిసింది. బంగ్లా ఇన్నింగ్స్‌లో తౌహిద్, దాస్ నాలుగో వికెట్‌కు 38 బంతుల్లో 53 పరుగులు జోడించి కాస్త పోరాడటం మినహా చెప్పుకునేందుకు ఏమీ లేకపోయింది.

స్కోరు వివరాలు:

భారత్ ఇన్నింగ్స్: సామ్సన్ (సి) మహేదీ (బి) ముస్తఫిజుర్ 111; అభిషేక్ (సి) మహేదీ (బి) తన్‌జీమ్ 4; సూర్యకుమార్ (సి) రిషాద్ (బి) మహ్ముదుల్లా 75; పరాగ్ (సి) దాస్ (బి) తస్కీన్ 34; పాండ్యా (సి) రిషాద్ (బి) తన్‌జీమ్ 47; రింకూ (నాటౌట్) 8; నితీశ్ (సి) మహేదీ (బి) తన్‌జీమ్ 0; సుందర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 297. వికెట్ల పతనం:** 1-23, 2-196, 3-206, 4-276, 5-289, 6-289. **బౌలింగ్:** మహేదీ 4-0-45-0, తస్కీన్ 4-0-51-1, తన్‌జీమ్ 4-0-66-3, ముస్తఫిజుర్ 4-0-52-1, రిషాద్ 2-0-46-0, మహ్ముదుల్లా 2-0-26-1.

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: పర్వేజ్ (సి) పరాగ్ (బి) మయాంక్ 0; తన్‌జీద్ (సి) వరుణ్ (బి) సుందర్ 15; నజ్ముల్ (సి) సామ్సన్ (బి) బిష్ణోయ్ 14; లిటన్‌దాస్ (సి) (సబ్) తిలక్ (బి) బిష్ణోయ్ 42; తౌహిద్ (నాటౌట్) 63; మహ్ముదుల్లా (సి) పరాగ్ (బి) మయాంక్ 8; మహేదీ (సి) పరాగ్ (బి) నితీశ్ 3; రిషాద్ (సి) అభిషేక్ (బి) బిష్ణోయ్ 0; తన్‌జీమ్ (నాటౌట్) 8; **ఎక్స్‌ట్రాలు 11; మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 164. వికెట్ల పతనం:** 1-0, 2-35, 3-59, 4-112, 5-130, 6-138, 7-139. **బౌలింగ్:** మయాంక్ 4-0-32-2, పాండ్యా 3-0-32-0, సుందర్ 1-0-4-1, నితీశ్ 3-0-31-1, రవి 4-1-30-3, వరుణ్ 4-0-23-0, అభిషేక్ 1-0-8-0.

1 టి20ల్లో భారత్‌కు ఇదే అత్యధిక స్కోరు. ఓవరాల్‌గా నేపాల్ (314 - మంగోలియాపై) తర్వాత రెండో స్థానం.

2 భారత్ తరఫున టి20ల్లో సామ్సన్ రెండో వేగవంతమైన సెంచరీ (40 బంతుల్లో) సాధించాడు. రోహిత్ (35) ముందున్నాడు.

22 టి20 మ్యాచ్‌లో అత్యధిక సిక్స్‌లు (22) కొట్టిన జట్టుగా తమ గత రికార్డు (21)ను భారత్ సవరించింది.



భారత్ సెమీస్ ఆశలకు దెబ్బ!




హర్మన్‌ప్రీత్

- కీలక పోరులో 9 పరుగులతో ఆసీస్ చేతిలో ఓటమి
- మహిళల టి20 ప్రపంచకప్

షార్జా: భారత మహిళల ముందున్న లక్ష్యం 152...అసాధ్యమేమీ కాదు కానీ 47 పరుగులకే టాపార్డర్ అవుట్! ఈ దశలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (47 బంతుల్లో 54 నాటౌట్; 6 ఫోర్లు), దీప్తిశర్మ (25 బంతుల్లో 29; 3 ఫోర్లు) భాగస్వామ్యం ఆశలు రేపింది. 25 బంతుల్లో 42 పరుగులు చేయాల్సిన దశలో దీప్తి అవుటవడం మ్యాచ్‌ను మలుపుతిప్పింది. గ్రూప్ 'ఎ'లో ఆదివారం భారత మహిళల జట్టు 9 పరుగుల తేడాతో ఓడింది. మొదట ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 151 పరుగులు చేసింది. గ్రేస్ హారిస్ (41 బంతుల్లో 40; 5 ఫోర్లు), కెప్టెన్ తాహ్లియా మెక్‌గ్రాత్ (26 బంతుల్లో 32; 4 ఫోర్లు), ఎలైస్ పెరీ (23 బంతుల్లో 32; 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. అనంతరం భారత అమ్మాయిల జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లకు 142 పరుగులు చేసి ఓడింది.

రాణించిన గ్రేస్ హారిస్

భారత సీమర్ రేణుక ఆరంభ ఓవర్లను కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఆసీస్ 17 పరుగుల వద్దే వరుస బంతుల్లో బెత్ మూని (2), జార్జియా (0) వికెట్లను కోల్పోయింది. ఈ దశలో ఓపెనర్ గ్రేస్ హారిస్, కెప్టెన్ తాహ్లియా కుదురుగా ఆడటంతో 10 ఓవర్లలో జట్టు 65/2 స్కోరు చేసింది. ఆష్లే గార్డ్‌నర్ (6) విఫలం కాగా, ఎలైస్ పెరీ ధాటిగా ఆడింది.

హర్మన్ పోరాడినా...

షఫాలీ వర్మ (13 బంతుల్లో 20; 2 ఫోర్లు, 1 సిక్స్), స్మృతి మంధాన (6), జెమీమా రోడ్రిగ్స్ (16) విఫలం అయ్యారు. ఆ తర్వాత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, దీప్తిశర్మ నడిపించారు. జట్టు స్కోరును 15.1 ఓవర్లలో వందకు చేర్చారు. అయితే భారీ షాట్‌కు యత్నించిన దీప్తిశర్మ బౌండరీ దగ్గర క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. దీంతో నాలుగో వికెట్‌కు 63 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. చివరి ఓవర్లో విజయానికి 14 పరుగులు అవసరం కాగా...4 పరుగుల చేసిన భారత్ 4 వికెట్లు చేజార్చుకుంది.

పాక్ గెలిస్తేనే...

'ఎ' గ్రూప్ నుంచి ఆసీస్ సెమీస్ చేరగా...భారత్, కివీస్ మధ్య రెండో స్థానం కోసం పోటీ ఉంది. నేడు పాకిస్తాన్‌తో జరిగే మ్యాచ్‌లో న్యూజిలాండ్ గెలిస్తే ఎలాంటి సమీకరణంతో పని లేకుండా మూడు విజయాలతో ఆ జట్టుకు ముందుకు వెళ్లి భారత్ నిష్క్రమిస్తుంది. ఈ మ్యాచ్ ఫలితం తర్వాత కూడా భారత్ రన్‌రేట్ కివీస్‌కంటే మెరుగ్గా ఉండే అవకాశం ఉంది. కాబట్టి పాక్ చేతిలో ఆ జట్టు ఓడిపోతే చాలు. అయితే బలహీనమైన పాక్‌పై కివీస్‌కు ఎక్కువ విజయావకాశాలు ఉన్నాయి.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా మహిళల ఇన్నింగ్స్: హారిస్ (సి) స్మృతి (బి) దీప్తిశర్మ 40; బెత్ మూని (సి) రాధ (బి) రేణుక 2; జార్జియా (ఎల్బీడబ్ల్యూ) (బి) రేణుక 0; తాహ్లియా (స్టంప్డ్) రిచా (బి) రాధ 32; పెర్రీ (సి) సబ్-సజన (బి) దీప్తిశర్మ 32; ఆష్లే గార్డ్‌నెర్ (సి) రాధ (బి) పూజ 6; లిచ్‌ఫీల్డ్ నాటౌట్ 15; అనాబెల్ (బి) శ్రేయాంక 10; సోఫీ రనౌట్ 0; మేగన్ షట్ నాటౌట్ 0; **ఎక్స్‌ట్రాలు 14; మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 151. వికెట్ల పతనం:** 1-17, 2-17, 3-79, 4-92, 5-101, 6-134, 7-145, 8-145. **బౌలింగ్:** రేణుకా సింగ్ 4-0-24-2, శ్రేయాంక 4-0-32-1, పూజ వస్త్రకర్ 3-0-22-1, అరుంధతీ రెడ్డి 3-0-24-0, దీప్తిశర్మ 4-0-28-2, రాధా యాదవ్ 2-0-14-1.

భారత మహిళల ఇన్నింగ్స్: షఫాలీ (సి) అనాబెల్ (బి) ఆష్లే గార్డ్‌నర్ 20; స్మృతి మంధాన (ఎల్బీడబ్ల్యూ) (బి) సోఫి 6; జెమీమా (సి) గార్డ్‌నర్ (బి) మేగన్ షటల్ 16; హర్మన్‌ప్రీత్ నాటౌట్ 54; దీప్తిశర్మ (సి) జార్జియా (బి) సోఫీ 29; రిచా ఘోష్ రనౌట్ 1; పూజ (బి) అనాబెల్ 9; అరుంధతి రనౌట్ 0; శ్రేయాంక రనౌట్ 0; రాధ (ఎల్బీడబ్ల్యూ) (బి) అనాబెల్ 0; రేణుక నాటౌట్ 1; **ఎక్స్‌ట్రాలు 6; మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 142. వికెట్ల పతనం:** 1-26, 2-39, 3-47, 4-110, 5-111, 6-139, 7-139, 8-141, 9-141. **బౌలింగ్:** మేగన్ షట్ 4-0-25-1, ఆష్లే గార్డ్‌నర్ 4-0-32-1, అనాబెల్ 4-0-22-2, సోఫి మోలినెక్స్ 4-0-32-2, జార్జియా 3-0-22-0, డార్సీబ్రౌన్ 1-0-8-0.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

కొంకణ్ రైల్వేలో 190 గ్రాడ్యుయేట్/డిప్లొమా అప్రెంటిస్‌లు

కొంకణ్ రైల్వే కార్పొరేషన్ లిమిటెడ్(కొంకణ్ రైల్వే).. మహారాష్ట్ర, గోవా, కర్ణాటక రాష్ట్రాల్లో గ్రాడ్యుయేట్/డిప్లొమా అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 190. శిక్షణ కాలం: ఒక సంవత్సరం.
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్-80, డిప్లొమా అప్రెంటిస్ (టెక్నీషియన్)-80, జనరల్ స్ట్రీమ్ గ్రాడ్యుయేట్స్-30.
» **విభాగాలు:** మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్.
» **అర్హత:** విభాగాన్ని అనుసరించి డిప్లొమా, డిగ్రీ, బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.09.2024 నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.4500, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.4000.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మార్కులు, సర్టిఫికెట్ల పరిశీలన, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 02.11.2024.
» **వెబ్‌సైట్:** https://konkanrailway.com

హుగ్లీ కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో ఎగ్జిక్యూటివ్ పోస్టులు

హౌరా(పశ్చిమ బెంగాల్)లోని హుగ్లీ కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(హెచ్‌సీఎస్‌ఎల్).. ఒప్పంద ప్రాతిపదికన ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 06.
» **పోస్టుల వివరాలు:** డిప్యూటీ జనరల్ మేనేజర్-01, అసిస్టెంట్ జనరల్ మేనేజర్-01, మేనేజర్-01, డిప్యూటీ మేనేజర్-03.
» **విభాగాలు:** ప్రాజెక్ట్-ఆపరేషన్స్, షిప్ బిల్డింగ్ అండ్ షిప్ రిపేర్, మెకానికల్, ఎస్టేట్ అండ్ అడ్మినిస్ట్రేషన్, ఫైనాన్స్, సేఫ్టీ, హ్యూమన్ రిసోర్స్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు డిప్యూటీ జనరల్ మేనేజర్ పోస్టులకు రూ.1,86,120, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పోస్టులకు రూ.1,65,440, మేనేజర్ పోస్టులకు రూ.1,24,000, డిప్యూటీ మేనేజర్ పోస్టులకు రూ.1,03,000.
» **వయసు:**35 ఏళ్ల నుంచి 52 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** పవర్ పాయింట్ ప్రజంటేషన్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.10.2024
» **వెబ్‌సైట్:** http://hooghlycsl.com

ఎస్ఈసీఐఎల్, న్యూఢిల్లీలో యంగ్ ప్రొఫెషనల్ పోస్టులు

న్యూఢిల్లీలోని సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎస్ఈసీఐఎల్).. ఒప్పంద ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 08.
» **విభాగాలు:** ఫైనాన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, హ్యూమన్ రిసోర్స్, కార్పొరేట్ ప్లానింగ్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60శాతం మార్కులతో డిప్లొమా, సీఏ/సీఎంఏ, డిగ్రీ, బీఈ/బీటెక్, ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం కలిగి ఉండాలి. వయసు: 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు మొదటి ఏడాది రూ.70,000, రెండో ఏడాది రూ.75,000, మూడో ఏడాది రూ.80,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్, సర్టిఫికేట్‌ల పరిశీలన, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.స

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 02.11.2024
» **వెబ్‌సైట్:** https://www.seci.co.in

ఆయుష్ బోధనకు మార్గం.. ఎన్‌టీఈటీ

ఆయుష్ వైద్య కోర్సుల్లో పీజీ పూర్తి చేసి..అధ్యాపక వృత్తిలో ప్రవేశించాలని కోరుకునే వారికి చక్కటి మార్గం.. నేషనల్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్(ఎన్‌టీఈటీ)! ఈ టెస్ట్‌లో స్కోర్ సాధిస్తే.. దేశ వ్యాప్తంగా ఉన్న ఆయుష్ మెడికల్ కళాశాలల్లో.. అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాలో అడుగు పెట్టొచ్చు! వైద్య రంగంలో అధ్యాపక వృత్తి లక్ష్యాన్ని చేరుకోవచ్చు!! తాజాగా.. ఎన్‌టీఈటీ-2024కు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. ఎన్‌టీఈటీ-2024 వివరాలు, ప్రాధాన్యం, పరీక్ష విధానం తదితర వివరాలు..



» ఆయుష్ అధ్యాపక వృత్తికి ప్రామాణికంగా ఎన్‌టీఈటీ
» ఎన్‌టీఈటీ స్కోర్‌తో ఆయుష్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్
» ఎన్‌టీఏ ఆధ్వర్యంలో ఎన్‌టీఈటీ పరీక్ష నిర్వహణ
» ఎన్‌టీఈటీ-2024 నోటిఫికేషన్ విడుదల

దేశంలోని ఆయుష్ మెడికల్ కళాశాలల్లో నాణ్యమైన బోధన కోసం ప్రతిభావంతులను నియమించేందుకు అమల్లోకి తెచ్చిన పరీక్ష.. నేషనల్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్. ప్రభుత్వ నిబంధనల ప్రకారం-ఆయుష్ కళాశాలల్లో అధ్యాపక వృత్తిలో అడుగు పెట్టాలంటే.. ఎన్‌టీఈటీలో ఉత్తీర్ణత తప్పనిసరి.

ఆ రెండు కమిషన్ల సిఫార్సు

ఆయుష్ కోర్సుల్లో అధ్యాపక వృత్తికి ఎన్‌టీఈటీ పరీక్ష నిర్వహించాలనే నిర్ణయానికి ప్రధాన కారణం .. నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్, నేషనల్ కమిషన్ ఆఫ్ హోమియోపతిల సిఫార్సులే. 2020లో ఆయుష్ కోర్సుల పర్యవేక్షణ, బోధన తదితర అంశాల నిర్వహణ కోసం ఈ సంస్థలను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇవి ఆయుష్ కోర్సుల బోధన పరంగా నాణ్యత కోసం కృషి చేస్తున్నాయి. అధ్యాపక వృత్తిలో ప్రతిభావంతులైన అధ్యాపకులను నియమించేందుకు నేషనల్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఎన్‌టీఈటీ)ని ప్రతిపాదించాయి. దీంతో.. ఆయుష్ కోర్సుల్లో అధ్యాపక వృత్తిలో ప్రవేశించాలంటే.. పీజీ కోర్సుతోపాటు ఎన్‌టీఈటీ స్కోర్ తప్పనిసరి అనే నిబంధనలు అమల్లోకి తెచ్చారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్

ఎన్‌టీఈటీ స్కోర్ ఆధారంగా ఆయుష్ పీజీ ఉత్తీర్ణులకు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్ట్‌లకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హత లభిస్తుంది. ఈ స్కోర్ పొందిన నాటి నుంచి పదేళ్ల పాటు అధ్యాపక వృత్తిలో విధులు నిర్వర్తించొచ్చు. ఒకవేళ ఇప్పటికే అధ్యాపక వృత్తిలో పని చేసి విరామం తీసుకుని.. మళ్లీ అడుగు పెట్టాలనుకున్న వారు సైతం తప్పనిసరిగా ఎన్‌టీఈటీకి హాజరై ఉత్తీర్ణత సాధించాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి.

అర్హతలు

- దరఖాస్తు చేసుకునే విభాగాన్ని అనుసరించి ఎండీ/ఎంఎస్‌తో పాటు నిర్దేశిత విభాగాల్లో ఎమ్మెస్సీ ఉత్తీర్ణత ఉండాలి.
- 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎండీ/ఎంఎస్‌లో 30నెలలు పూర్తి చేసుకున్న వారు కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.
- ఆయుర్వేద విభాగానికి ఎండీ/ఎంఎస్(ఆయుర్వేద), ఎమ్మెస్సీ(అనాటమీ); ఎమ్మెస్సీ(ఫిజియాలజీ)/మాస్టర్ ఇన్ పబ్లిక్ హెల్త్/ఎమ్మెస్సీ (ఆయు బయాలజీ) పూర్తి చేసుకోవాలి.
- సిద్ధ విభాగానికి ఎండీ(సిద్ధ), ఎంఏ(తమిళ/ఇంగ్లిష్),ఎమ్మెస్సీ(అనాటమీ/ఫిజియాలజీ/బయోకెమిస్ట్రీ/మైక్రో బయాలజీ, ఎమ్మెస్సీ(బోటనీ)/మెడికల్ బోటనీ/ఫార్మకోగ్నసీ, ఎమ్మెస్సీ-బోటనీ, మాస్టర్ ఇన్ పబ్లిక్ హెల్త్, ఎమ్మెస్సీ (ఫార్మకాలజీ/మెడిసినల్ ఫార్మకాలజీ ఉత్తీర్ణులవ్వాలి.
- యునానికి సంబంధించి ఎండీ/ఎంఎస్(యునానీ), ఎంఏ(ఉర్దూ/అరబిక్), ఎమ్మెస్సీ అనాటమీ/ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ, మైక్రో బయాలజీ, ఫార్మకాలజీ/ మెడికల్ ఫార్మకోగ్నసీ, మాస్టర్ ఇన్ పబ్లిక్ హెల్త్‌లను పూర్తి చేసుకోవాలి.
- హోమియోపతి విభాగంలో ఎండీ- హోమియోపతి, ఎమ్మెస్సీ (అనాటమీ), ఎమ్మెస్సీ (ఫిజియాలజీ), ఎమ్మెస్సీ (బయో కెమిస్ట్రీ), ఎమ్మెస్సీ (ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ), మాస్టర్ ఇన్ పబ్లిక్ హెల్త్, అదే విధంగా హోమియోపతిలో పీహెచ్‌డీ చేసిన వారు కూడా అర్హులే.
- అన్ని విభాగాలకు సంబంధించి అభ్యర్థులు తప్పనిసరిగా బ్యాచిలర్ స్థాయిలో సంబంధిత కోర్సులు (బీఏఎంఎస్, బీయూఎంఎస్, బీఎస్ఎంఎస్, బీహెచ్‌ఎంఎస్) ఉత్తీర్ణులై ఉండాలి.

వంద మార్కులకు పరీక్ష

- ఎన్‌టీఈటీ పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో మొత్తం 100 ప్రశ్నలు-100 మార్కులకు ఉంటుంది. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు.
- మొత్తం 100 ప్రశ్నల్లో 40 ప్రశ్నలు సులభంగా, మరో 40 ప్రశ్నలు మోస్తరు క్లిష్టతతో, 20 ప్రశ్నలు క్లిష్టతతో ఉంటాయని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. పరీక్షకు లభించే సమయం రెండు గంటలు.

కనీస మార్కుల నిబంధన

ఎన్‌టీఈటీ స్కోర్ ఆధారంగా.. ఆయుష్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్ట్‌లను భర్తీ చేస్తారు. ఈ నేపథ్యంలో ఎన్‌టీఈటీలో కనీస అర్హత మార్కుల నిబంధన అమలు చేస్తున్నారు. కనీసం 50 శాతం మార్కులు పొందితేనే ఎన్‌టీఈటీ పరీక్ష ఉత్తీర్ణులైనట్లుగా పరిగణిస్తారు.

ఈ నైపుణ్యాలు పరిశీలించేలా

ఎన్‌టీఈటీ పరీక్ష ద్వారా అభ్యర్థుల్లోని టీచింగ్ ఆప్టిట్యూడ్, కమ్యూనికేషన్ స్కిల్స్, తరగతి గది నిర్వహణ, బోధన, ట్రైనింగ్ అండ్ అసెస్‌మెంట్ టెక్నాలజీ, స్టూడెంట్ సైకాలజీ వంటి వాటిపై అవగాహనను పరిశీలించే విధంగా ప్రశ్నలు అడుగుతారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, అక్టోబర్ 14
- **ఫీజు చెల్లింపు చివరి తేదీ:** 2024, అక్టోబర్ 15
- **దరఖాస్తు సవరణ అవకాశం:** 2024, అక్టోబర్ 16, 17 తేదీలు.
- **ఎన్‌టీఈటీ పరీక్ష తేదీ:** డిసెంబర్‌లో నిర్వహించే అవకాశం.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** తిరుపతి హైదరాబాద్.
- **వెబ్‌సైట్:** https://exams.ntaonline.in/NTET

పరీక్షలో రాణించేలా

టీచింగ్ అండ్ ట్రైనింగ్

టీచింగ్ కాన్సెప్ట్స్, మెథడ్స్, టీచింగ్ స్కిల్స్, లెర్నర్స్ దృక్పథం, క్లినికల్ టీచింగ్ మెథడ్స్, విజువల్, ఆడిటరీ, రీడింగ్/రైటింగ్, కినెస్థటిక్ స్టైల్స్‌ను పరిశీలిస్తారు.

కమ్యూనికేషన్

కమ్యూనికేషన్ నిర్వచనం,రకాలు,గ్రూప్ కమ్యూనికేషన్స్, క్లాస్ రూమ్ కమ్యూనికేషన్స్, మాస్ మీడియా అండ్ సొసైటీ, డాక్టర్-పేషెంట్ కమ్యూనికేషన్ వంటి అంశాలపై ప్రశ్నలు అడుగుతారు.

క్లాస్‌రూమ్ మేనేజ్‌మెంట్

- ప్రాక్టికల్ క్లాస్ రూమ్ మేనేజ్‌మెంట్, సైకాలజీ అండ్ క్లాస్ రూమ్ మేనేజ్‌మెంట్, టెక్నాలజీ ఇన్ క్లాస్ రూమ్, మేనేజ్‌మెంట్ స్ట్రాటజీస్, క్లినికల్ ఓపీడీ, ప్రాక్టికల్ ల్యాబ్స్, స్కిల్ ల్యాబ్స్, కమ్యూనిటీ ఔట్‌రీచ్ పై అవగాహన ఉండాలి.
- వీటితోపాటు అసెస్‌మెంట్ మెథడ్స్, ఎడ్యుకేషనల్ టెక్నాలజీస్, ఎడ్యుకేషనల్ సైకాలజీ, అండ్రగాజీ ఇన్ ఎడ్యుకేషన్, లెర్నింగ్ అండ్ పెడగాజీలపై దృష్టి పెట్టాలి.
- అన్ని అంశాలకు సంబంధించి.. వైద్య కోర్సులకు అన్వయిస్తూ అభ్యసించాలి.
- బ్యాచిలర్ స్థాయిలోని బీయూఎంఎస్, బీఎస్ఎంఎస్, బీఏఎంఎస్, బీహెచ్‌ఎంఎస్ పుస్తకాలను పూర్తిగా చదవాలి.
- అదే విధంగా తమ కళాశాల స్థాయిలో అధ్యాపకులు బోధించిన విధానాలను, బోధన పద్ధతులను పునరావలోకనం చేసుకోవాలి.
- ఇంటర్న్‌షిప్ సమయంలో పేషెంట్లతో వ్యవహరించాల్సిన తీరు, దానికి సంబంధించిన మార్గదర్శకాలను అవలోకనం చేసుకోవాలి.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	230	81,381
నిఫ్టీ ▽	34	24,964

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	18,343	△	61
డోజోన్స్	42,864	△	410
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,254	△	16
డాక్స్	19,374	▽	163
హాంగ్‌సెంగ్	3,218	▽	84
నికాయ్	36,606	△	225

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		85.58	84.62
£	బ్రిటన్ పౌండ్		108.72	111.44
€	యూరో		91.34	93.58
¥	జపాన్ ఎన్ (100)		56.21	57.52
AU$	ఆస్ట్రేలియా డాలర్		55.65	57.68
S$	సింగపూర్ డాలర్		62.09	66.79
SAR	సౌదీ రియాల్		21.53	23.02
UAE D	యూఏఈ దిర్హామ్		21.82	23.79
¥	చైనా యువాన్		11.05	12.89

సంసారం.. ఆర్థిక చదరంగం!



హైదరాబాద్‌కు చెందిన మనీషా (30) పెళ్లయి ఏడాది కూడా కాలేదు. అప్పుడే భర్తతో ఆమెకు వాదోపవాదాలు నిత్య కృత్యంగా మారాయి. అది కూడా ఆర్థిక అంశాలపైనే. పెళ్లికి రెండేళ్ల ముందు నుంచే మనీషా దంపతులు ఒకరికొకరు పరిచయస్థులు. ఎన్నో అంశాలపై గంటల తరబడి మాట్లాడుకున్న వారే. ''అతడి గురించి నాకు అంతా తెలుసనుకున్నా. కానీ, ఆర్థిక అంశాల నిర్వహణ గురించి ఎప్పుడూ మాట్లాడుకున్నది లేదు. అక్కడే మేము తప్పటడుగు వేశామని అనిపిస్తోంది'' అన్నది మనీషా అంతరంగం. వైవాహిక బంధం చిరకాలం వర్ధిల్లాలంటే దంపతుల మధ్య చక్కని అవగాహన, పరస్పర గౌరవం, అభిమానం ఉంటే సరిపోతుందని అనుకుంటాం. కానీ, ఆర్థిక అవగాహన కూడా ఉండాలన్నది నిపుణుల సూచన. తమకు ఏ ఆహారం అంటే ఇష్టం, తమకు నచ్చే సినిమాలు, మెచ్చే పర్యాటక ప్రాంతాలు.. ఇలా మూడు ముళ్లకు ముందే ముచ్చట్లు ఎన్నో చెప్పుకోవడం, పరస్పర ఇష్టాలు పంచుకోవడం చేస్తుంటారు. కానీ, ఆర్థిక అంశాలు, భవిష్యత్ ఆర్థిక లక్ష్యాల గురించి చర్చించుకునే వారు బహుశా చాలా తక్కువగా ఉంటారు. ఇలా చేయకపోవడం వల్ల ఎలాంటి ప్రతికూలతలు ఎదురవుతాయో మనీషా ఉదంతం చెబుతోంది. అందుకే వైవాహిక బంధంలోకి అడుగు పెట్టడానికి ముందే భవిష్యత్ ఆర్థిక పథంపై మనసు విప్పి చర్చించుకోవడం ఎంతో అవసరం. దీని ప్రాధాన్యతను తెలియజెప్పే కథనమే ఇది...

– సాక్షి, బిజినెస్‌డెస్క్

వైవాహిక బంధం.. ఆర్థికంగా పటిష్టం

- కాబోయే భాగస్వాములకు 'మనీ'పై అవగాహన ఉండాలి
- పొదుపు, మదుపు, వ్యయాలపై చర్చించుకోవాలి
- భవిష్యత్ లక్ష్యాలపై ఉమ్మడి నిర్ణయాలు
- ఆధిపత్య ధోరణితో కలతలు, సమస్యలు
- సమష్టి తత్వంతోనే విజయం




మారుతున్న పరిస్థితులు..

ఆర్థిక విభేదాలు వైవాహిక బంధంలో చిచ్చు పెట్టే ప్రమాదం లేకపోలేదు. ఆర్థికంగా అప్పుల పాలై, బయట పడే మార్గం తోచక సామూహిక ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. అమెరికాకు చెందిన 'జిమెనెజ్ లా ఫర్మ్' చేసిన అధ్యయనంలో.. ఆ దేశంలో 29% విడాకులకు ఆర్థిక విభేదాలే కారణం అవుతున్నట్టు తెలిసింది. అమెరికా స్థాయిలో ప్రస్తుతం మన దేశంలో బంధాల విచ్ఛిన్నానికి ఆర్థిక అంశాలు కారణం కాకపోవచ్చు. కానీ, ఇటీవలి కాలంలో మనదేశంలోనూ మహిళల ఆర్థిక సాధికారత మెరుగుపడుతూ వస్తోంది. పెళ్లయిన తర్వాత వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల్లో కొనసాగేందుకు యువతరం మహిళలు ఆసక్తి చూపిస్తున్నారు. ఆర్థిక అంశాల్లో వారు పురుషులకు ఏ మాత్రం తక్కువ కాదు. కనుక ఆర్థిక అంశాలపైనా దంపతుల మధ్య ఏకాభిప్రాయం, పరస్పర అంగీకారాలు ముఖ్యమే.

చర్చించుకోవడమే మెరుగైన మార్గం

వివాహం తర్వాత ఆర్థిక విభేదాలు పొడచూపకూడదని అనుకుంటే, అందుకు ఎలాంటి జంకు లేకుండా 'మనీ' గురించి సౌకర్యంగా మాట్లాడుకోవడమే మంచి పరిష్కారం. ''దంపతుల్లో చాలా మంది ఆర్థిక అంశాల గురించి మాట్లాడుకోవడానికి సంకోచిస్తుంటారు. డబ్బు మనిషనో లేదా ఆధిపత్యం చెలాయిస్తున్నారనో పొరపడతారన్నది వారి ఆందోళన. కానీ విడాకులకు ఆర్థిక అంశాలు ప్రధాన కారణంగా ఉంటున్నాయి. కనుక ఈ అంశాలపై చర్చించుకోవడం ఎంతో ముఖ్యం'' అని ఫిన్‌సేఫ్ ఎండీ మ్రుణ్ అగర్వాల్ పేర్కొన్నారు. ఒక వ్యక్తి ఆర్థిక నిర్ణయాలను అప్పటి వరకు కలిగి ఉన్న ఆర్థిక అవగాహనే నిర్ణయిస్తుంది. తమ నిర్ణయాలను గౌరవించే, ఏకీభవించే భాగస్వామిని గుర్తించడం వైవాహిక బంధం విజయవంతానికి కీలకమని నిపుణుల సూచన. విల్లా, కారు తదితర ఆకాంక్షలు ఏవైనా ఉన్నాయా? ఎప్పటిలోపు వాటిని సాధించాలని అనుకుంటున్నారు? వివాహం తర్వాత తొలి ప్రాధాన్యం ఏ లక్ష్యానికి? వినోదం, విహారానికి ఎక్కువ ఖర్చు చేయాలని అనుకుంటున్నారా? డబ్బు విషయంలో బాధ్యతగా ఆలోచిస్తున్నారా? చక్కదిద్దుకోవాల్సిన ఆర్థిక ప్రతికూలతలు ఏవైనా ఉన్నాయా? ఇలాంటి అంశాలన్నింటిపై స్పష్టత అవసరం. ''ఆర్థిక అలవాట్లలో ఎంతో వ్యత్యాసం కనిపిస్తుంటుంది. ఒకరు ఎంతో పొదుపరి అయి ఉంటారు. మరొకరు ఖర్చు చేయడంలో ఆనందాన్ని వెతుక్కుంటూ ఉంటారు. ఇది వివాదానికి దారితీస్తుంది. కొన్ని విభేదాలను సులభంగానే పరిష్కరించుకోవచ్చు. కానీ, కొన్ని ఓ పట్టాన పరిష్కారం కావు. అందుకని ఒకరినొకరు ఆర్థిక అంశాలపై చర్చించుకొని, నిర్ణయాలను ఉమ్మడిగా తీసుకోవాలి'' అని ఆనంద్ రాఠి వెల్త్ డిప్యూటీ సీఈవో ఫెరోజ్ అజీజ్ సూచించారు.



ప్రణాళిక ప్రకారం

దంపతుల మధ్య వచ్చే కలతలకు ఎవరో ఒకరు అధికంగా ఖర్చు చేయడం ప్రధాన కారణం. ఒకరు ఎంతో పొదుపుగా రూపాయి, రూపాయి కూడబెడుతుంటే, మరొకరు ఖర్చు చేయడాన్ని ఆనందిస్తుంటే వారి మధ్య ప్రశాంతత కష్టం. విభేదాలు రాక మానవు. ఖర్చు చేసే అలవాట్లు అన్నవి ఒకరి మానసిక తీరుపైనే ఆధారపడి ఉంటాయి. కొందరు షాపింగ్‌లో ఆనందాన్ని వెతుక్కుంటారు. సంపదతో గౌరవం వస్తుందని భావిస్తుంటారు. బ్యాంక్ ఖాతాలో సరిపడా నిధులు లేకపోయినా గొప్ప కోసం ఖరీదైన ఉత్పత్తులు కొనుగోలుకు మొగ్గు చూపిస్తుంటారు. ఒక భాగస్వామి పొదుపు, మదుపు (పెట్టుబడి)కు ప్రాధాన్యం ఇస్తుండొచ్చు. ఆర్థిక వెసులుబాటు పరిమితంగా ఉండడం ఇందుకు నేపథ్యం కావొచ్చు. అందుకే ఆర్థిక భద్రత దృష్ట్యా పొదుపు చేస్తుండొచ్చు. దీనికి విరుద్ధమైన ధోరణి కలిగిన భాగస్వామి తోడైనప్పుడు అది స్పర్థకు దారితీస్తుంది. ''భాగస్వాములు ఇద్దరూ స్వేచ్ఛను గౌరవించుకోవాలి. అదే సమయంలో చర్చించుకుని, పరస్పర అంగీకారానికి వచ్చే పరిణతి కూడా అవసరం'' అనేది జీవైఆర్ ఫైనాన్షియల్ ప్లానర్స్ సీఈవో రోహిత్ షా సూచన. ఏ తరహా ఆర్థిక వ్యక్తిత్వాన్ని మీరు నచ్చుతారన్న స్పష్టత ఉండాలి. అప్పుడు కాబోయే జీవిత భాగస్వామితో ఈ అంశాలపై విస్తృతంగా చర్చించుకోవాలి. ఆర్థిక అంశాల నిర్వహణపై మాట్లాడుకోవాలి. బడ్జెట్ ఏర్పాటు, ఆర్థిక లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని, వాటికి కట్టుబడి ఉండేలా అంగీకారానికి రావాలి. కేవలం పొదుపు అనే కాదు, జీవనశైలి అలవాట్లు, ఆనందాల కోసం భాగస్వాములు ఇద్దరూ ఆదాయంలో 10% బడ్జెట్ కేటాయించుకోవడంలో తప్పు లేదన్నది నిపుణుల సూచన. కేటాయింపులు అన్నీ పోను మిగులు ఉంటే, ఆ మొత్తాన్ని తమ అభిరుచుల కోసం ఖర్చు చేసుకోవచ్చు.

ధన సాయం

తమ బంధువులు, స్నేహితులు, సహచర ఉద్యోగుల్లో ఎవరికైనా ఆర్థిక సాయం చేసే ముందు, తమ ఆర్థిక అవసరాలకే మొదట ప్రాధాన్యం ఇవ్వాలి. ఇతరులకు సాయం చేయడానికి ముందు తమ ఆర్థిక భవిష్యత్‌కు భరోసా కల్పించుకోవడం అవసరమని జీవైఆర్ ఫైనాన్షియల్ ప్లానర్స్ సీఈవో రోహిత్ షా పేర్కొన్నారు. డబ్బు సాయం తీసుకున్న వారు తిరిగి చెల్లించడంలో విఫలమైతే? పరిస్థితి ఏంటన్నది ప్రశ్నించుకోవాలి. మరీ ముఖ్యంగా భాగస్వామికి తెలియకుండా ఇలాంటి ధన సాయాలు చేస్తే, అవి కాపురంలో కలహాలకు దారి తీసే ప్రమాదం కచ్చితంగా ఉంటుంది.



ఆధిపత్యం పనికిరాదు..

మనీ విషయాల్లో ఆధిపత్య ధోరణి పనికిరాదు. డబ్బుకు సంబంధించి నిర్ణయాలు అన్నింటినీ తానే తీసుకోవాలన్న ధోరణి సరికాదు. ఈ విషయాల్లో జీవిత భాగస్వామి అభిప్రాయాలకు విలువ ఇవ్వాలి. ''ఆర్థిక అంశాల నిర్వహణ గురించి తనకు ఎంత మాత్రం తెలియదన్నది నా భర్త సమాధానం. కానీ, ఖర్చుల గురించి నేను ఎప్పుడు చెప్పాలనుకున్నా.. ఆయన కొట్టిపారేస్తుంటారు'' అని ఢిల్లీకి చెందిన మార్కెటింగ్ నిపుణురాలు అంజలి వర్మ వాపోయారు. కేవలం పురుషులే ఆర్జనా పరులుగా ఉన్న కుటుంబాల్లో ఈ తరహా ధోరణి మరింత ఎక్కువగా కనిపిస్తుంది. భార్య విద్యావంతురాలై, గృహిణిగా కొనసాగుతున్నా, ఆమెకు ఆర్థిక అంశాలపై అవగాహన ఉన్నా కానీ, కుటుంబ నిర్ణయాల్లో సమాన భాగస్వామ్యం కల్పించే తీరు అన్ని చోట్లా కనిపించదు. రాణించే మహిళలు ఉన్న చోట పురుషులు అభద్రతా భావానికి లోనవుతుంటారని, అది కలహాలకు కారణమవుతుందని నిపుణులు చెబుతున్నారు. కనుక ఆర్థిక అంశాల్లో తమ భాగస్వామ్యం ఏ మేరకు అన్న దానిపై పెళ్లికి ముందే యువతీ, యువకులు తప్పకుండా ప్రశ్నించుకోవాలని సూచిస్తున్నారు. ఆర్థిక బాధ్యతలను ఎలా పంచుకుంటారని కూడా ప్రశ్నించుకోవాలి. ఇరువురి మధ్య సరైన అవగాహన కుదిరినప్పుడే ఏడడుగులు వేయడం సరైన నిర్ణయం అవుతుంది.




పెట్టుబడుల ఎంపికలు

పెట్టుబడుల విషయంలోనూ దంపతుల మధ్య అవగాహన, పరస్పర అంగీకారం అవసరమే. ఒకరు అధికంగా రిస్క్ తీసుకుంటే, మరొకరు పరిమిత రిస్క్ ఉన్న పెట్టుబడులకే పరిమితం కావొచ్చు. ఇందులో ఎలాంటి తప్పులేదు. ఇద్దరూ భిన్న మార్గాలను అనుసరించడం మంచి ప్రయోజనాన్ని ఇస్తుంది. దీనివల్ల మెరుగైన రాబడులకు, రక్షణ తోడవుతుంది. ఒక విధంగా ఇది ఈక్విటీ, డెట్ కలయికగా భావించొచ్చు. అయితే ఆయా అంశాలపై కాబోయే దంపతులు ఇద్దరూ చర్చించుకోవాలి. ఏఏ సాధనాలు ఎలా పనిచేస్తాయి, అందులో ఉండే రిస్క్‌లు, వచ్చే రాబడుల గురించి పూర్తి అవగాహన తెచ్చుకోవాలి. అప్పుడు సమష్టి నిర్ణయాలు తీసుకోవాలి. సరైన నిర్ణయాలు తీసుకోకపోతే దీర్ఘకాల ఆర్థిక లక్ష్యాలకు అవరోధాలు ఏర్పడొచ్చు. అవసరం అనుకుంటే ఈ విషయంలో ఆర్థిక సలహాదారుల సాయం తీసుకోవాలి.

గోప్యత ప్రమాదకరం

రుణాలు తీసుకోవడం, అప్పులతో కొనుగోళ్లు చేసే విషయాలను జీవిత భాగస్వామికి తెలియకుండా కొన్ని సందర్భాల్లో దాచి పెడుతుంటారు. ఇది విశ్వాసలేమికి దారితీస్తుంది. ఇదే మాదిరి ఎన్నో విషయాలు తనకు తెలియకుండా చేస్తుండొచ్చని భాగస్వామి సందేహించడానికి అవకాశం కల్పిస్తుంది. అందుకే ఇలాంటివి భాగస్వామికి చెప్పి చేయాలి.

రుణ భారం



తమకు కావాల్సిన ప్రతిదీ ఈఎంఐపై సమకూర్చుకోవడం కొందరికి అలవాటు. ఇందుకోసం క్రెడిట్‌కార్డు రుణాలనూ వాడేస్తుంటారు. అధిక వడ్డీలతో కూడిన రుణాలు ఊబిలోకి నెట్టేస్తాయి. ఆర్థిక సమస్యలు ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తాయి. ఈ తరహా అలవాట్ల గురించి పెళ్లికి ముందే కాబోయే భాగస్వామికి చెప్పడం ఎంతో అవసరం. ఆదాయం, వ్యయాలు, పెట్టుబడుల ప్రణాళికలు, ఖర్చు చేసే అలవాట్లు, రుణాలు తదితర అంశాల గురించి సమగ్రంగా చర్చించుకోవడం, ఆర్థిక సలహాదారుల సాయం తీసుకోవడం, పరస్పర అంగీకారం, గౌరవం, పారదర్శకత ఇవన్నీ.. వైవాహిక బంధంలో ఆర్థిక సంక్షోభాలు రాకుండా నివారిస్తాయి.

డీమార్ట్ లాభం ప్లస్
క్యూ2లో రూ. 660 కోట్లు




న్యూఢిల్లీ: డీమార్ట్ బ్రాండ్ రిటైల్ స్టోర్ల దిగ్గజం ఎవెన్యూ సూపర్ మార్ట్స్ నికర లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) రెండో త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 6% వృద్ధితో రూ. 660 కోట్లకు చేరింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 624 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 14% ఎగసి రూ. 14,445 కోట్లను తాకింది. గత క్యూ2లో రూ. 12,624 కోట్ల టర్నోవర్ మాత్రమే అందుకుంది. అయితే మొత్తం వ్యయాలు సైతం 15% పెరిగి రూ. 13,575 కోట్లకు చేరాయి. గత క్యూ2లో ఇవి 11,809 కోట్లుగా నమోదయ్యాయి. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ డీమార్ట్‌రెడీ ఆదాయం తొలి అర్ధభాగంలో 22 శాతం పెరిగింది.

ఫలితాల ముందురోజు వారాంతాన బీఎస్‌ఈలో డీమార్ట్ షేరు 0.7 శాతం నీరసించి రూ. 4,572 వద్ద ముగిసింది.

విప్రో నుంచి బోనస్ షేర్లు
16-17న బోర్డు సమావేశంలో నిర్ణయం

న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల దేశీ దిగ్గజం విప్రో లిమిటెడ్ వాటాదారులకు తాజాగా బోనస్ షేర్లను జారీ చేయనుంది. ఈ నెల 16-17న నిర్వహించనున్న సమావేశంలో కంపెనీ బోర్డు బోనస్ షేర్ల ప్రతిపాదనను పరిశీలించనున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. ఈ ఆర్థిక సంవత్సరం(2024-25) రెండో త్రైమాసిక ఫలితాలను 17న విడుదల చేయనుంది. ఈ ఏడాది తొలి త్రైమాసికం(ఏప్రిల్-జూన్)లో కంపెనీ నికర లాభం 5 శాతం పుంజుకుని రూ. 3,003 కోట్లను అధిగమించింది. మొత్తం ఆదాయం మాత్రం 4 శాతం క్షీణించి రూ. 21,964 కోట్లకు పరిమితమైంది.



వారాంతాన బీఎస్‌ఈలో విప్రో షేరు 0.8 శాతం బలపడి రూ. 529 వద్ద ముగిసింది.

అసెట్ అలోకేషన్ ఎప్పుడు మొదలు పెట్టాలి?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేను విదేశాల్లో నివసిస్తున్న భారతీయుడిని. రెండేళ్ల నుంచి భారత్‌లో గ్రోత్ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నాను. నా పోర్ట్‌ఫోలియో విలువ ప్రస్తుతం రూ.కోటికి చేరింది. మరో ఎనిమిదేళ్లపాటు ఇదే మాదిరిగా నా పెట్టుబడులు కొనసాగించాలని అనుకుంటున్నాను. 45 ఏళ్లకే రిటైర్మెంట్ తీసుకోవాలన్నది నా యోచన. నేను అసెట్ అలోకేషన్‌ను ఇప్పుడు ప్రారంభించాలా? ఎన్ఆర్ఈ ఖాతాలోని ఫిక్స్‌డ్ డిపాజిట్లను డెట్ కేటాయింపుల కిందకు పరిగణనలోకి తీసుకోవాలా? – వంశీ శేఖర్

మీరు ఐదేళ్ల పొదుపు మొత్తంతో చెప్పుకోదగిన నిధిని ఏర్పాటు చేసుకున్న తర్వాత అసెట్ అలోకేషన్ ప్రారంభించొచ్చు. ఆ లోపు ప్రారంభించకపోయినా పెద్దగా నష్టపోయేది ఉండదు. కనుక ముందు మీ సంపద వృద్ధిపై దృష్టి సారించండి. చెప్పుకోదగిన నిధిని సమకూర్చుకున్న తర్వాత అప్పుడు అసెట్ అలోకేషన్ గురించి ఆలోచించండి. పెట్టుబడుల విధానాన్ని చక్కదిద్ది, వాటిపై మీకు నియంత్రణకు అసెట్ అలోకేషన్ వీలు కల్పిస్తుంది. మార్కెట్లు పడిపోయాయంటే అప్పటికే మొత్తం ఇన్వెస్ట్ చేసేశామని విచారించకుండా మరింత మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టాలి. మీ పెట్టుబడులకు తగినంత వ్యవధి ఉన్నప్పుడు 100 శాతం ఈక్విటీ పోర్ట్‌ఫోలియోను కొనసాగించొచ్చు. రిటైర్మెంట్ లక్ష్యాన్ని సమీపిస్తున్నప్పుడు క్రమంగా ఈక్విటీ పెట్టుబడులను తగ్గించుకుంటూ, డెట్‌లోకి మళ్లించుకోవాలి. దీనివల్ల రిస్క్ తగ్గుతుంది. మీ ఎన్ఆర్ఈ ఖాతాలోని డిపాజిట్లను డెట్ కేటాయింపుల కింద పరిగణించవచ్చు.

నేను ఏదైనా మ్యూచువల్ ఫండ్ పథకంలో ఒకే విడత (లమ్సమ్) ఇన్వెస్ట్ చేశానని అనుకోండి. అప్పుడు ఎక్స్‌పెన్స్ రేషియోని ఒక్కసారే వసూలు చేస్తారా? లేదంటే ఏటా వసూలు చేస్తారా? – నీరజ్ శర్మ

ఎక్స్‌పెన్స్ రేషియో అన్నది ఇన్వెస్టర్ల నుంచి మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు వసూలు చేసే ఫీజు. పెట్టుబడుల నిర్వహణ, పరిపాలన తదితర నిర్వహణ వ్యయాలను ఈ రూపంలో తీసుకుంటాయి. ఒక మ్యూచువల్ ఫండ్ పథకంలో ఎక్స్‌పెన్స్ రేషియో 1 శాతం ఉంటే, మీ పెట్టుబడుల విలువ నుంచి ఏటా ఒక శాతం మ్యూచువల్ ఫండ్ సంస్థకు వెళుతున్నట్టు అర్థం చేసుకోవాలి. ఈ ఎక్స్‌పెన్స్ రేషియోని రోజువారీగా ఫండ్ నెట్ అస్సెట్ వ్యాల్యూ (ఎన్ఏవీ) నుంచి మినహాయించుకుంటాయి. ఉదాహరణకు 1.5 శాతం ఎక్స్‌పెన్స్ రేషియో ఉంటే, అప్పుడు రోజువారీ తీసుకునే మొత్తం 0.0041 శాతం (1.5 శాతం 365 రోజులకు) అవుతుంది. రూ.10 ఎన్ఏవీ ఉన్న ఫండ్‌లో రూ.1,20,000 ఇన్వెస్ట్ చేశారని అనుకుందాం. అప్పుడు 12,000 యూనిట్లు వస్తాయి. రోజువారీ ఎక్స్‌పెన్స్ రేషియో (12,000 ఇంటూ 0.0041 శాతం) రూ.4.9 అవుతుంది. రోజు వారీ మినహాయించుకునే చార్జీ.. ఫండ్ యూనిట్ ఎన్ఏవీకి అనుగుణంగా రోజువారీగా మారుతుంటుంది. ప్రతీ ఇన్వెస్టర్ తన పెట్టుబడిని పూర్తి ఏడాది పాటు కొనసాగిస్తారని చెప్పలేం. ఇన్వెస్ట్ చేసిన మరుసటి రోజు నుంచి ఎప్పుడైనా వెనక్కి తీసుకోవచ్చు. అందుకే రోజువారీ వసూలు విధానాన్ని ఫండ్స్ అనుసరిస్తుంటాయి. అదే సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో ఇన్వెస్ట్ చేస్తున్నట్టు అయితే, ప్రతీ సిప్ వాయిదాతో పెట్టుబడి వృద్ధి చెందుతూ వెళుతుంది. దీంతో యూనిట్ల సంఖ్య పెరుగుతూ పోతుంది. దీంతో ఫండ్స్ సంస్థకు వెళ్లే వ్యయాలు కూడా కాలక్రమేణా పెరుగుతాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

మార్కెట్.. భౌగోళిక అంశాలే దిక్సూచి	రిఫండ్ ఆప్షన్లు ఇవ్వండి: ఓలాకు సీసీపీఏ ఆదేశాలు

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

14-10-2024	
విశాఖ	525-00
చిత్తూరు	538-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

స్టాక్ స్కోప్

కమిన్స్ ఇండియా | బ్రోకరేజ్: మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 3,604 టార్గెట్: రూ. 4,300

ఎందుకంటే: డీజిల్ ఇంజిన్ల తయారీ గ్లోబల్ దిగ్గజం కమిన్స్ ఇండియా యాజమాన్యంతో ఇటీవలే సమావేశమయ్యాం. కంపెనీ ప్రధాన విభాగమైన డీజిల్ జెన్‌సెట్స్ విషయంలో గత కొద్దికాలంగా చోటుచేసుకుంటున్న పర్యావరణ నిబంధనల మార్పులు కంపెనీకి లబ్ధిని చేకూర్చే అవకాశముంది. డీజిల్ జెన్‌సెట్స్‌కు సంబంధించిన కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సీపీసీబీ)4+ నిబంధనలు జూలై 1 నుంచి అమల్లోకి వచ్చాయి. దీంతో ఆధునిక జెన్‌సెట్స్ ధరలు పెరిగినప్పటికీ అంచనాలకు విరుద్ధంగా వీటికి డిమాండ్ ఊపందుకుంది. విభిన్న జెన్‌సెట్స్ ధరలు 15-35 శాతం మధ్య ఎగసినప్పటికీ అమ్మకాలు పుంజుకున్నాయి. సీపీసీబీ 4+ జెన్‌సెట్స్‌తో నిల్వలు, పంపిణీని పెంచిన నేపథ్యంలో డిమాండ్ కొనసాగుతోంది. వెరసి కమిన్స్ ఇండియా గత కొద్ది త్రైమాసికాలలో సాధించిన విధంగానే అత్యధిక మార్జిన్లను కొనసాగించగలదని భావిస్తున్నాం. ఇందుకు వ్యయాల క్రమబద్ధీకరణ, వివిధ ప్రాడక్టుల విడుదల దోహదం చేయనున్నాయి. జోరులో ఉన్న నిర్మాణ రంగ సైకిల్ కారణంగా ఇండస్ట్రియల్ విభాగం లబ్ధి పొందనుంది. రానున్న త్రైమాసికాలలో బలపడనున్నాయి. అయితే కీలక విభాగాలలో డిమాండ్ అంచనాలను అందుకోలేకపోవడం, కమోడిటీల ధరల పెరుగుదల, పోటీ తీవ్రతరం కావడం, ఎగుమతులు ఆశించిన స్థాయిలో పుంజుకోకపోవడం వంటి ప్రతికూలతలను కీలక రిస్కులుగా పరిగణించవచ్చు.

టాటా టెక్నాలజీస్ | బ్రోకరేజ్: ఐసీఐసీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 1,055 టార్గెట్: రూ. 1,290

ఎందుకంటే: ఐటీ సేవల టాటా గ్రూప్ కంపెనీ టాటా టెక్నాలజీస్ ఇటీవలే విశ్లేషకుల సమావేశాన్ని నిర్వహించింది. తద్వారా విభిన్న విభాగాలలో కంపెనీకున్న పటిష్ట అంశాలను ప్రస్తావించింది. ఈ జాబితాలో సంప్రదాయ ఇంటర్నల్ కంబ్యూషన్ ఇంజిన్(ఐసీఈ) నుంచి ఎలక్ట్రిక్ వాహనాలకు మార్పిడి, సాఫ్ట్‌వేర్ ఆధారిత వాహనాలు(ఎస్‌డీవీ), స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్, ప్లాంట్ ఇంజినీరింగ్, రోబోటిక్స్, ఏఐ అమలు, బ్యాటరీ సొల్యూషన్లు తదితరాలున్నాయి. ఆటోమొబైల్ రంగంలోని ప్రధాన తయారీదారుల (ఓఈఎం ఎకోసిస్టమ్) ప్రమోటర్లతో లోతైన భాగస్వామ్యాలను ఏర్పాటు చేసుకోవడంపై కంపెనీ ప్రత్యేక దృష్టిని సారించింది. తద్వారా ఆటో రంగ పోర్ట్‌ఫోలియో.. ఎస్‌డీవీ తదితరాలవైపు మారే ప్రక్రియను వేగవంతం చేసేందుకు మద్దతిస్తోంది. వెరసి ఈవీ, సెమీకండక్టర్, తయారీ విభాగాలలో విన్‌ఫాస్ట్ సంస్థ నుంచి తగ్గనున్న బిజినెస్‌ను న్యూట్రల్ చేసుకునే బాటలో సుప్రసిద్ధ ఆటో దిగ్గజాలతో చేతులు కలుపుతోంది. బ్యాటరీ సొల్యూషన్ల అభివృద్ధి, ఇండస్ట్రియలైజేషన్‌కు వీలుగా అగ్రటాస్‌తో ప్రత్యేక భాగస్వామ్యాన్ని నెలకొల్పుకుంది. కంపెనీ ఇటీవలే ద్విచక్ర, త్రిచక్ర వాహనాలకు ఇంజినీరింగ్ బ్యాటరీ సొల్యూషన్లను ప్రారంభించింది. బ్యాటరీ సామర్థ్యాలు కీలక ఇంజినీరింగ్ వ్యయాల పోటీలో కంపెనీకి దన్నుగా నిలవనున్నాయి. కంపెనీకి ప్రధానమైన ఎలక్ట్రిఫికేషన్ విభాగంలో బ్యాటరీ వ్యయాలే 50 శాతం ఆక్రమించే సంగతి తెలిసిందే. అయితే యూరప్ కార్యకలాపాలు కుంటుపడటం పనితీరును దెబ్బతీయవచ్చు.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

క్లుప్తంగా...

విమెన్ సాఫ్ట్‌బాల్ ఏషియా కప్-2024కు ముగ్గురు విద్యార్థినులు



సాక్షి, హైదరాబాద్: తైవాన్‌లోని తైచుంగ్‌లో జరుగుతున్న ఆసియా విశ్వవిద్యాలయాల మహిళా సాఫ్ట్‌బాల్ ఏషియా కప్–2024కు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీకి చెందిన ముగ్గురు డిగ్రీ విద్యార్థినులు అజ్మీరా ఇందు, లకావత్ రాణి, గుగులోత్ మమత ఎంపికయ్యారు. వీరు ఆదివారం సాయంత్రం చెన్నై ఎయిర్‌పోర్టు నుంచి భారత జట్టుతో కలిసి కోచ్ రంజిత్ నేతృత్వంలో తైవాన్‌కు బయల్దేరారు. వీరి ఖర్చులను సొసైటీ భరిస్తుందని కార్యదర్శి వర్షిణి తెలిపారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రూషియల్ వెల్ఫేర్ ఫండ్ నుంచి ఈ విద్యార్థుల వ్యయాన్ని వెచ్చిస్తున్నట్టు ఆమె తెలిపారు.

రానున్న రెండ్రోజులు మోస్తరు వర్షాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచించింది. రాష్ట్రానికి ఆగ్నేయ దిశ నుంచి తక్కువ ఎత్తులో గాలులు వీస్తున్నట్లు తెలిపింది. ప్రస్తుతం నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ కొనసాగుతోందని, మరోవైపు ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో వాతావరణంలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని వివరించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు వివిధ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ప్రకటించింది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లోని ఒకట్రెండు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కూడా నమోదు కావచ్చని వివరించింది.

జెన్‌కో ఇంజనీర్లకు తాత్కాలిక పదోన్నతి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో)లో భారీ సంఖ్యలో ఇంజనీర్లకు అడ్‌హాక్ (తాత్కాలిక) పదోన్నతి కల్పిస్తూ సంస్థ సీఎండీ రోనాల్డ్ రోస్ ఈ నెల 9న ఉత్తర్వులు జారీ చేశారు. ఎలక్ట్రికల్, మెకానికల్, టెలీ కమ్యూనికేషన్ విభాగాల్లోని 170 మంది ఏఈలు, 33 మంది ఏఏఈలకు ఏడీఈలుగా పదోన్నతి కల్పించారు. ఎలక్ట్రికల్ విభాగంలో 34 మంది ఏడీఈలకు డీఈలుగా, ఏడుగురు డీఈలకు ఎస్ఈలుగా, ఇద్దరు ఎస్ఈలకు సీఈలుగా పదోన్నతి లభించింది. మెకానికల్ విభాగంలో 12 మంది ఏడీఈలకు డీఈలుగా, ముగ్గురు డీఈలకు ఎస్ఈలుగా.. సివిల్ విభాగంలో ఐదుగురు ఏఈలు, ఒక ఏఏఈకు ఏఈఈలుగా, ఇద్దరు ఏఈఈలకు ఈఈలుగా పదోన్నతి కల్పించారు. ఇద్దరు సీనియర్ కెమిస్టులకు సైతం చీఫ్ కెమిస్టులుగా పదోన్నతి ఇచ్చారు. విద్యుత్ ఉద్యోగులకు పదోన్నతుల్లో మెరిట్ కమ్ రిజర్వేషన్ల అమలుపై న్యాయపరమైన చిక్కులు ఉండడంతో తాత్కాలిక పదోన్నతి ఇచ్చినట్టు అధికారవర్గాలు తెలిపాయి.

వెయ్యి మందికి ఒక్క డాక్టరే!

భారత్‌లో 'హెల్త్ వర్క్ ఫోర్స్'పై ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక వెల్లడి

మన దేశంలో ప్రతీ పది వేల మందికి ఉన్న డాక్టర్లు 9.6 మంది మాత్రమే

రాష్ట్రాల వారీగా చూస్తే.. డాక్టర్ల సంఖ్యలో 20వ స్థానంలో తెలంగాణ..

నర్సుల సంఖ్యలో 15వ స్థానం.. ఫార్మసిస్టులలో 13వ స్థానం

దేశంలో ఎంబీబీఎస్ సీట్లు 1.15 లక్షలు.. ఇందులో సగం గత పదేళ్లలో సమకూరినవే..

ఐదు రెట్లు పెరిగిన ఫార్మసీ కాలేజీలు

సాక్షి, హైదరాబాద్: మన దేశంలో ప్రస్తుతం ప్రతీ పది వేల మంది జనాభాకు 9.6 మంది డాక్టర్లు మాత్రమే ఉన్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) తేల్చింది. అంటే ప్రతీ వెయ్యి మందికి ఒక్క డాక్టరే ఉన్నారని పేర్కొంది. 2018లో అయితే ప్రతీ పది వేల మందికి 6.8 మంది డాక్టర్లు మాత్రమే ఉండగా.. ఇప్పుడు గణనీయంగానే పెరిగిందని తెలిపింది. పలు దక్షిణాసియా దేశాలతోపాటు భారత్‌లో 'హెల్త్ వర్క్ ఫోర్స్'పై ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజాగా నివేదిక విడుదల చేసింది. అందులో మన దేశంలో రాష్ట్రాల వారీగా పరిస్థితిని కూడా విశ్లేషించింది. దేశంలో జనాభాకు తగినట్టుగా డాక్టర్లు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో గోవా మొదటి స్థానంలో నిలిచింది. కర్ణాటక రెండో స్థానంలో, సిక్కిం మూడో స్థానంలో ఉన్నాయి. తెలంగాణ 20వ స్థానంలో ఉంది. అలాగే జనాభాకు తగినట్టుగా నర్సులు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో కేరళ తొలి స్థానంలో నిలిచింది. కర్ణాటక, మణిపూర్, తమిళనాడు, ఢిల్లీ ఆ తర్వాతి స్థానాల్లో ఉండగా.. తెలంగాణ 15వ స్థానంలో ఉంది. జనాభాకు అనుగుణంగా దంత వైద్యులున్న రాష్ట్రాల్లో కేరళ మొదటి స్థానం, గోవా రెండో స్థానం, కర్ణాటక మూడో స్థానంలో నిలిచాయి. తెలంగాణ 20వ స్థానంలో ఉంది. ఫార్మాసిస్టుల్లో గుజరాత్ తొలిస్థానంలో ఉంది. గోవా, మహారాష్ట్ర, కేరళ ఆ తర్వాతి స్థానాల్లో నిలవగా.. తెలంగాణ 13 స్థానంలో ఉంది.



డబ్ల్యూహెచ్‌వో నివేదికలోని ముఖ్యాంశాలివీ..

- దేశంలో నర్సులు, మిడ్ వైఫరీ సిబ్బంది 2017లో ప్రతి పది వేల జనాభాకు 20.8 మంది ఉండగా.. 2024 నాటికి 26.3 మందికి పెరిగారు.
- ప్రతి పదివేల జనాభాకు దంత వైద్యులు 2012లో ఒకరే ఉండగా.. ప్రస్తుతం సగటు సంఖ్య 2.4 మందికి చేరింది.
- ఫార్మసిస్టుల సంఖ్య 5.3 మంది నుంచి.. 12.1 మందికి పెరిగింది.
- దేశంలో ప్రస్తుతం ఎంబీబీఎస్ సీట్లు 1.15 లక్షలు.. గత పదేళ్లలోనే సీట్ల సంఖ్య రెట్టింపైంది.
- ఫార్మసీ కాలేజీల సంఖ్య ఐదు రెట్లు పెరిగి 5.87 లక్షలకు చేరింది. బడ్జెట్‌లో ప్రభుత్వం ఆరోగ్యానికి చేసే ఖర్చు 2010లో 3.1 శాతంగా ఉంటే.. 2021లో 3.7 శాతానికి చేరింది.
- దేశంలో పేదరికం 12.9 శాతంగా ఉంది. ప్రజల జీవితకాలం మహిళల్లో 69 ఏళ్లుగా, పురుషుల్లో 65.8 ఏళ్లుగా ఉంది.
- దేశంలో అధిక రక్తపోటుకు అందుబాటులో చికిత్స 30 శాతమే. మధుమేహాన్ని గుర్తించే సౌకర్యాలు 85 శాతం ఉన్నాయి.
- మన దేశంలో అవసరమైన వైద్యులు, వైద్య సిబ్బందిలో ప్రస్తుతం 35 శాతమే ఉన్నారు.
- 30–70 ఏళ్ల మధ్య వయసువారిలో దీర్ఘకాలిక జబ్బులతో మరణించే రిస్క్ 24 శాతంగా ఉంది.
- ఆత్మహత్యకు పాల్పడుతున్నవారి సంఖ్య ప్రతి లక్షకు 12.6 మందిగా ఉంది.
- 15 ఏళ్లపైబడిన జనాభాను లెక్కిస్తే.. దేశంలో ఏటా సగటున తలసరి 4.1 లీటర్ల ఆల్కహాల్ తాగుతున్నారు.
- రోడ్డు ప్రమాదాలతో జరుగుతున్న మరణాలు ప్రతి లక్ష జనాభాకు 14.6గా ఉన్నాయి. అదే కాలుష్యంతో లక్షకు 139 మంది, పరిశుభ్రత, సురక్షిత నీరు లేక లక్షకు 36.4 మంది చనిపోతున్నారు.

దేశంలో మరణాలకు ప్రధాన కారణాలివీ..
(2021 లెక్కల ప్రకారం.. సగటున ప్రతి లక్ష మందికి మరణాలు)

కోవిడ్	250	క్షయవ్యాధి	30
దీర్ఘకాలిక		షుగర్ వ్యాధి	25
ఊపిరితిత్తుల జబ్బులు	85	కాలేయ జబ్బుల	20
పక్షవాతం	60	ప్రమాదాలు	18
విరేచనాల జబ్బులు	45	గుండెపోటు..	10

ఆరోగ్యం, వ్యాధుల పట్ల నిర్లక్ష్యం..

దేశంలోని జనంలో ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్పింది. మహిళల్లో 15–49 ఏళ్ల మధ్య వయసువారు ఆరోగ్య సమస్య వస్తే వైద్యుల దగ్గరికి వెళ్లి చూపించుకోవడం లేదు. గ్రామాల్లో 40శాతం మంది వైద్యుల వద్దకు వెళ్లడం లేదు. ఆరోగ్య సేవలు అందుబాటులో లేకపోవడమే ప్రధాన కారణం. పట్టణాల్లో కూడా ఆరోగ్య సేవలు అందుబాటులో లేవన్న కారణంతో 30శాతం మంది వ్యాధులను నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆర్థిక సమస్యల వల్ల వైద్యం చేయించుకోని పేదలు 58 శాతం ఉన్నారు. ధనికుల్లో కూడా 20 శాతం మంది సరిగా వైద్యం చేయించుకోవడం లేదు.
– డాక్టర్ కిరణ్ మాదల, గాంధీ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్, హైదరాబాద్

ఇంకా ఆ డైరెక్టర్లే కొనసాగింపు!

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో విచిత్ర పరిస్థితి నెలకొంది. తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ(జెన్‌కో) డైరెక్టర్లందరితోపాటు తెలంగాణ విద్యుత్ సరఫరా సంస్థ(ట్రాన్స్‌కో) జేఎండీ, డైరెక్టర్లందరి నియామకంలో నిబంధనలు పాటించలేదని ప్రకటిస్తూ గత జనవరి 27న రాష్ట్ర ఇంధనశాఖ ఉత్తర్వులు (జీవో ఆర్టీ నెం.3) జారీ చేసింది. జేఎండీతో సహా ట్రాన్స్‌కోలోని ఐదుగురు డైరెక్టర్లు, జెన్‌కోలోని ఆరుగురు డైరెక్టర్ల నియామకంలో జీవోలు 18, 45లోని మార్గదర్శకాలను పాటించలేదని, వారి నియామకం అక్రమమని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. తక్షణమే వారి స్థానంలో కొత్త డైరెక్టర్ల నియామకానికి చర్యలు తీసుకోవాలని జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థల సీఎండీని ఆదేశించింది. అయితే ఉత్తర్వులు జారీ చేసి 8 నెలలు గడిచిపోయినా జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థల్లో ఇంకా ఆ డైరెక్టర్లనే రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తోంది. దక్షిణ/ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్/టీజీఎన్పీడీసీఎల్)ల్లో సైతం ఇలానే నిబంధనలకు విరుద్ధంగా నియామకం పొందారనే కారణంతో ఒకేసారి 11 మంది డైరెక్టర్లకు అదే రోజు ఇంధనశాఖ ఉద్వాసన పలికింది. వారి స్థానంలో చీఫ్ ఇంజనీర్లు/సీజీఎంలను ఇన్‌చార్జ్ డైరెక్టర్లుగా నియమించింది. జెన్‌కో, ట్రాన్స్‌కోలో మాత్రం కొత్త డైరెక్టర్ల నియామకం పూర్తయ్యే వరకు ప్రస్తుత డైరెక్టర్లనే కొనసాగించాలని నిర్ణయం తీసుకుంది. మరోవైపు జెన్‌కో, ట్రాన్స్‌కో, టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్పీడీసీఎల్ సంస్థల్లో కొత్త డైరెక్టర్ల నియామకానికి గత జనవరి 29న నోటిఫికేషన్ జారీ చేసింది. అన్ని పోస్టులకు కలిపి సుమారు 150 దరఖాస్తులు రాగా, వాటిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఆశావహులు పెద్ద ఎత్తున పైరవీలు చేసుకుంటుండగా, రాజకీయ స్థాయిలో నిర్ణయం తీసుకోలేకపోతుండటంతో జాప్యం జరుగుతుందనే విమర్శలున్నాయి.

జేఎండీతోపాటు డైరెక్టర్లందరి నియామకం అక్రమమని గతంలో ఇంధనశాఖ ఉత్తర్వులు
- 8 నెలలు గడుస్తున్నా ఇంకా వారిని తొలగించని రాష్ట్ర ప్రభుత్వం
- కొత్త డైరెక్టర్ల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ.. ఎంపికపై నిర్ణయం తీసుకోలేకపోతున్న వైనం

ఆ ఇద్దరు డైరెక్టర్ల చేతిలోనే జెన్‌కో, ట్రాన్స్‌కో పగ్గాలు

ఇంధనశాఖ కార్యదర్శిగా, జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థల సీఎండీగా అదనపు బాధ్యతల్లో కొనసాగుతున్న ఐఏఎస్ అధికారి రోనాల్డ్ రోస్ విద్యుత్ సౌధలో అందుబాటులో ఉండటం లేదని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. వారి నియామకమే అక్రమమని గతంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇద్దరు అధికారులే జెన్‌కో, ట్రాన్స్‌కో వ్యవహారాలను నడుపుతున్నారని ఆరోపిస్తున్నారు. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు ఒప్పందంపై ప్రభుత్వం వేసి విచారణ కమిషన్ ముందు వీరితోపాటు ఇతర డైరెక్టర్లూ విచారణ ఎదుర్కొంటుండడం గమనార్హం. ఈ నెల 9న తక్షణమే రోనాల్డ్ రోస్‌ను తెలంగాణ కేడర్ నుంచి రిలీవ్ చేస్తూ ఏపీ కేడర్‌కు కేటాయించింది. ఆయనే పోస్టుల్లో కొనసాగుతూ ఈ నెల 10న జెన్‌కో హైడల్ విభాగానికి ఇన్‌చార్జ్ డైరెక్టర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 16లోగా ఆయన ఏపీలో రిపోర్టు చేయాల్సి ఉంది.

ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక..

డైరెక్టర్లుగా పనిచేసేందుకు సంబంధిత విభాగాల్లో అనుభవం, పరిజ్ఞానం కలిగిన అర్హులైన ఇన్ సర్వీస్, రిటైర్డ్ విద్యుత్ అధికారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించారు. డైరెక్టర్ల నియమకానికి మార్గదర్శకాలను జారీ చేస్తూ 2012 మే 14న జారీ చేసిన జీవో 18 ప్రకారం.. ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ ఇంటర్వ్యూ నిర్వహించి ఒక్కో డైరెక్టర్ పోస్టుకు ముగ్గురి పేర్లతో షార్ట్ లిస్ట్‌ను రూపొందించి ప్రభుత్వానికి సిఫారసు చేయాలి. ఈ కమిటీలో ఆయా విద్యుత్ సంస్థల సీఎండీలు కన్వీనర్లుగా, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల శాఖ ముఖ్యకార్యదర్శి, ప్రభుత్వం నామినేట్ చేసే విద్యుత్ రంగ ఇండిపెండెంట్ ఎక్స్‌పర్ట్ సభ్యులుగా ఉంటారు. సెలక్షన్ కమిటీ సిఫారసు చేసిన షార్ట్ లిస్ట్‌లోని ముగ్గురి నుంచి ఒకరిని డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి. ఇంత వరకు ఇంటర్వ్యూలే జరగకపోవడం గమనార్హం.



మధుసూదనాచారిని అభినందిస్తున్న కేటీఆర్, తలసాని

మండలిలో ప్రతిపక్ష నేతగా మధుసూదనాచారి బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. మండలిలో జరిగిన ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరై అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మౌంట్‌పటాల్సును అధిరోహించిన సన్నితకు సర్టిఫికెట్ అందజేస్తున్న దృశ్యం





వెల్‌డన్ సన్నిత

- మౌంట్‌పటాల్సు పర్వతాన్ని అధిరోహించిన విద్యార్థిని

వేములవాడ: హిమాచల్‌ప్రదేశ్‌లోని మౌంట్‌పటాల్సు పర్వతాన్ని వేములవాడకు చెందిన విద్యార్థిని సన్నిత అధిరోహించింది. పులి రామ్‌గోపాల్–సుధారాణి కుమార్తె సన్నిత కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలి ప్రాంతంలో గల 4,250 మీటర్ల ఎత్తులో ఉన్న మౌంట్‌పటాల్సు పర్వతాన్ని సన్నిత మూడు రోజుల్లో అధిరోహించింది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 20 మంది ఉన్న బృందంలో సన్నిత పాల్గొంది. మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతోనే ఈ పర్వతాన్ని అధిరోహించినట్లు సన్నిత తెలిపింది. ఇంటర్నేషనల్ మౌంటెనీర్ మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ట్రెక్కింగ్ జరిగింది. సన్నితను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదివారం అభినందించారు.

బస్సు నడుస్తుండగానే డ్రైవర్‌కు అస్వస్థత

అదుపు తప్పడంతో స్టీరింగ్ పట్టి పక్కకు నిలిపిన స్థానికుడు



డ్రైవర్ రమేశ్ అస్వస్థతకు గురికావడంతో బస్సును పక్కకు నిలుపుతున్న తౌసిఫ్

కరీంనగర్ క్రైం: బస్సు నడుస్తుండగానే డ్రైవర్ అస్వస్థతకు గురయ్యాడు. అదుపుతప్పుతున్న బస్సులోకి ఎక్కిన ఓ స్థానిక యువకుడు వెంటనే స్టీరింగ్ అదుపు చేసి బస్సును పక్కకు నిలిపాడు. దీంతో బస్సు లోని ప్రయాణికులకు ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటన కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. సిరిసిల్ల డిపోకు చెందిన అద్దె బస్సు కరీంనగర్ నుంచి సిరిసిల్లకు బయల్దేరింది. తెలంగాణ చౌక్‌కు చేరుకోగానే డ్రైవర్ రమేశ్ కళ్లు తిరగడంతో స్వల్ప అస్వస్థతకు గురయ్యాడు. బస్సు అదుపు తప్పుతున్న క్రమంలో స్థానికంగా ఉన్న ఎండీ తౌసిఫ్‌తో పాటు మరికొందరు నడుస్తున్న బస్సులోకి ఎక్కారు. తౌసిఫ్ స్టీరింగ్ పట్టి బస్సును పక్కకు నిలిపాడు. ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. సమాచారం అందుకున్న ఆర్టీసీ అధికారులు మరో డ్రైవర్‌ను పంపించి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చారు. అస్వస్థతకు గురైన డ్రైవర్ రమేశ్‌ను ఆస్పత్రికి తరలించారు. తౌసిఫ్‌తో పాటు పలువురిని స్థానికులు అభినందించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
సోమవారం : 14-10-2024





ఔషధ మొక్కకు ఆపద

కనుమరుగవుతున్న పల్లె నేస్తాలు

ప్రకృతి సిద్ధంగా లభించేవన్నీ మటుమాయం

భవిష్యత్ తరాలు గూగుల్‌లో చూసుకోవాల్సిందే..

గ్రామీణ జన జీవనంతో ముడిపడి ఉన్న అనేక రకాల చెట్లు, ఔషధ మొక్కలు కాలక్రమేణా కనుమరుగవుతున్నాయి. ఒకప్పుడు పల్లెల్లో అడుగుపెట్టగానే ఎన్నో రకాల చెట్లు కనిపించేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. ప్రధానంగా మారేడు, బ్రహ్మజెముడు, నాగజెముడు, ఉమ్మెంత, ఉత్తరేని, జిల్లెడు, తిప్పతీగె, కలమంద వంటి ఔషధ మొక్కలు ఎక్కడా కనిపించడం లేదు. చెలకల్లో తంగేడు, గునుగు పూల చెట్లు ఎక్కువగా ఉండేవి. చేను చుట్టూరా కంప చెట్లు, వాయిలాకు చెట్లు ఉండేవి. చాలా గ్రామాల్లో ఇప్పుడవి లేవు. ఇళ్ల ముందర వేప చెట్లు, పెరట్లో చింత చెట్లు ఉండేవి. ఊరి నడుమ వివిధ రకాల పెద్ద పెద్ద వృక్షాలు ఉండేవి. ఆలయాల దగ్గర రావి, ఉసిరి, మారేడు (పత్రి) చెట్లు కనిపించేవి. అయితే పల్లెలకు ఆధునికత చొచ్చుకు వచ్చిన తర్వాత పెంకుటిళ్లు, పూరి గుడిసెల స్థానంలో బంగళాలు నిర్మించారు. వాటిని నిర్మించే క్రమంలో చాలా ఇళ్ల ఎదుట ఉన్న వేప చెట్లు, చింత చెట్లు నరికివేశారు. కొత్తగా నాటే విషయం ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో కొత్త తరానికి ఔషధ మొక్కల ప్రాధాన్యం కూడా తెలియని పరిస్థితి ఏర్పడుతోంది.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

కనిపించని నాగజెముడు, బ్రహ్మజెముడు



ఊళ్లల్లో చాలా చోట్ల బ్రహ్మజెముడు, నాగజెముడు చెట్లు కనిపిస్తాయి. దళసరిగా ఉండే ఆకులపై ముళ్లు ఉండే ఈ చెట్లలో ఎన్నో ఔషధ గుణాలుంటాయని చెబుతారు. బ్రహ్మజెముడు పండ్లలో మంచి పోషకాలుంటాయని, డ్రాగన్ ఫ్రూట్ కన్నా వెయ్యి రెట్లు ఎక్కువ పోషకాలు లభిస్తాయని చెబుతారు. ముఖ్యంగా బీ12, ఏ, సీ విటమిన్లు అందులో ఉంటాయని పేర్కొంటున్నారు. అయితే చాలా చోట్ల బ్రహ్మజెముడు మొక్కలు కానరావడం లేదు. వ్యవసాయ యాంత్రీకరణతో చేల వద్ద పెద్దపెద్ద చెట్లను జేసీబీలతో తొలగించి పొలం మడుగులు చేయడం మూలంగా బ్రహ్మజెముడు, నాగజెముడు వంటి చెట్లు కనుమరుగయ్యాయి.

మారేడు, ఉసిరి కూడా అంతే...



శివపూజకు మారేడు ఆకులు (పత్రి) వాడుతారు. మారేడు కాయలో అనేక రకాల ఔషధ గుణాలుంటాయని చెబుతారు. ఉసిరి అయితే శరీరంలో కొవ్వును నిరోధించడంలో ఉపయోగపడుతుందంటారు. ఉసిరి కాయలను తినడం, తొక్కుగా చేసుకొని తినడం కూడా మంచిదే అంటారు. కార్తీక పౌర్ణమి రోజున ఉసిరి కాయ ముక్కల్ని నీటిలో వేసుకొని స్నానం చేయడం ద్వారా శరీర రుగ్మతలు దూరమవుతాయని పేర్కొంటున్నారు. అయితే మారేడు చెట్లు కనుమరుగవుతుండగా, ఉసిరి చెట్లు కూడా క్రమంగా అంతరించిపోతున్నాయి. అక్కడక్కడా ఉసిరి తోటలు పెంచుతున్నారు. ఇప్పుడు ప్రకృతిసిద్ధంగా ఉన్న ఉసిరి దొరకడం లేదు.

ఉమ్మెత్త లేదు.. ఉత్తరేణి దొరకదు





చర్మ సమస్యలు, పైత్యం వేడి, దురద, గడ్డలు, దగ్గు, దమ్ము, ఆయాసం వంటి వాటికి ఉమ్మెత్త ఆకులను కాల్చి దాని నుంచి వెలుబడే పొగను పీల్చడం వల్ల ఆయా సమస్యలు తొలగిపోతాయని చెబుతుంటారు. ఉమ్మెత్త మొక్కలు ఎలాగుంటాయో కూడా నేటి తరానికి తెలియడం లేదు. ఉత్తరేణి ఆకులను పూజల్లో వాడుతారు. ఉత్తరేణి మంచి ఔషధ మొక్క. ఉత్తరేణి వేర్లతో పళ్లు తోముకుంటే ధృడంగా తయారవుతాయని చెబుతారు. ఉత్తరేణి ఆకుల రసంతో నొప్పులు, పంటినొప్పి కూడా తగ్గించొచ్చని పేర్కొంటున్నారు. ఊళ్లల్లో ఇప్పుడు ఉమ్మెత్త మొక్కలు కనిపించడం లేదు. ఆఖరుకు ఉత్తరేణి కూడా దొరకడం అరుదుగా మారింది.

తంగేడు దొరకని పరిస్థితి...



చెలకల వద్ద, అటవీ ప్రాంతంలో విరివిగా లభించే తంగేడు పువ్వు ఇప్పుడు గగనమైంది. చాలా గ్రామాల్లో తంగేటు చెట్లు కనిపించడం లేదు. దీంతో బతుకమ్మ పేర్చడానికి తంగేడు పువ్వు దొరకడం లేదు. అక్కడక్కడ తంగేడు మిగిలి ఉన్నా, చాలా ప్రాంతాల్లో తంగేడు చెట్లు కనుమరుగయ్యాయి. మక్క, పత్తి చేలల్లో గునుగు పూల చెట్లు విపరీతంగా మొలిచేవి. బతుకమ్మ సీజన్‌లో జనం వెళ్లి కోసుకుని వచ్చేవారు. వ్యవసాయంలో వచ్చిన మార్పుల కారణంగా విత్తనం వేసేటపుడే కలుపు నివారణ మందులు పిచికారీ చేయడం, మొలకలు వచ్చిన తర్వాత కూడా కలుపు నివారణ మందులు పిచికారీ చేయడంలో గునుగు దొరకడం లేదు. గునుగు పువ్వును ఔషధ మొక్కగా గుర్తిస్తారు. పసరికలు అయిన వారికి ఆరబెట్టిన గునుగు పువ్వును చూర్ణం చేసి మందు బిల్లలుగా మింగిస్తే తగ్గిపోతుందని చెబుతారు. అంత గొప్ప ఔషధ గుణాలున్న గునుగు పూల చెట్లు రానురాను తగ్గిపోతున్నాయి.

జిల్లేడు, తిప్పతీగ కూడా...





చాలామంది ఆరోగ్య సమస్యలను అధిగమించేందుకు జిల్లేడు ఆకులను వాడుతారు. ఆకులను దంచి దాని రసాన్ని గాయాలపై రుద్దితే గాయాలు త్వరగా మానుతాయని, ఉబ్బులు తగ్గుతాయని చెబుతుంటారు. జిల్లెడు ఆకు తెంపి దాని నుంచి కారే పాల చుక్కలను నొప్పి ఉన్న చోట పెట్టడంతో నొప్పులు తగ్గుతాయని విశ్వసిస్తారు. మరిన్ని సమస్యలకూ జిల్లెడును వాడుతారు. కీళ్ల సమస్యలు ఉన్న వారు తిప్పతీగను పొడిగా చేసి పాలల్లో కలుపుకొని తాగుతుంటారు. తిప్పతీగ చాలా రకరాల ఆరోగ్య సమస్యలకు మంచి ఔషధిగా చెబుతుంటారు. ఆర్థరైటిస్ సమస్యలకు బాగా పనిచేస్తుందని పేర్కొంటున్నారు. ఇప్పుడు పల్లెల్లో తిప్పతీగలే కాదు జిల్లెడు కూడా కనిపించడం లేదు.

మహబూబాబాద్‌లో ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు హాజరైన యువత (ఫైల్)



మత్తు వదలరా.. మంచివైపు సాగరా!

అడవి బిడ్డల్లో మార్పుకోసం పోలీస్‌శాఖ కృషి • యువతకు క్రీడా కిట్లు, ప్రోత్సాహకాలు
నిరుద్యోగ యువతకు ఉపాధి మార్గం • మంచి పౌరులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు

మహబూబాబాద్ జిల్లాలో అధికంగా ఆదివాసీ, గిరిజన తండాలు ఉన్నాయి. ఇక్కడ యువతలో చాలామంది చదువును మధ్యలోనే ఆపేస్తున్నారు. కాగా, ప్రభుత్వాలు ఎన్ని సౌకర్యాలు కల్పించినా..కొందరు యువతీ, యువకులు చెడుమార్గం పట్టడం పరిపాటిగా మారింది. గంజాయి మత్తుకు బానినకావడం, రవాణా, గుడుంబా తయారీ, బెల్లం విక్రయాలు, ఇతర అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొనడం, తాగిన మత్తులో ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితి కొందరిది. చదువుకోవాలనే ఆశ ఉన్నా.. సరైన మార్గదర్శకత్వం లేకపోవడం, ఆర్థిక ఇబ్బందులతో చదువును మధ్యలోనే ఆపి వ్యవసాయం చేయడం, పొలం లేని వాళ్లు కూలీలుగా మారిపోతున్నారు. ఈ పరిస్థితుల్లో యువతలో మార్పు తీసుకురావాలన్న ఆలోచనతో మానుకోట జిల్లా పోలీస్‌లు వినూత్న రీతిలో ఆలోచించారు. యువతను మంచి మార్గంలో నడిపించేందుకు అక్కడి రుగ్మతలకు చికిత్స మొదలు పెట్టారు.

– సాక్షి, మహబూబాబాద్



గంగారం మండలంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ అందజేస్తున్న ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ (ఫైల్)

చెడు వ్యసనాలకు దూరం..

జిల్లాకు మాయని మచ్చగా ఉన్న గంజాయి, గుడుంబాకు యువత బానిసకాకుండా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ వినూత్నంగా ఆలోచన చేశారు. ఏజెన్సీ ప్రాంతాలు, గిరిజన, ఆదివాసీ గూడేల్లో గుడుంబా తయారీని నిర్మూలించాలని, అందుకు అందరి సహకారం కావాలని తండాలు, గూడేల పెద్దలను కోరారు. దీంతో పోలీసుల తనిఖీలు, స్థానికుల సహకారంతో ఇప్పటివరకు జిల్లాలోని సుమారు రూ.10కోట్ల విలువ చేసే నల్లబెల్లం, పానకం, పటిక, గంజాయి, మద్యంతోపాటు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకున్నారు. బెల్లం, గంజాయి రవాణా చేస్తున్న వారిని శిక్షించే విషయంలో ప్రజాప్రతినిధుల అడ్డు రావద్దని ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులను కోరినట్లు సమాచారం. అదేవిధంగా పోలీస్, ఎక్సైజ్‌శాఖలోని కొందరు ఉద్యోగులు ముందస్తు సమాచారం ఇస్తున్న విషయంపై కూడా పోలీస్ బాస్ సీరియస్‌గా ఉన్నట్లు ఆశాఖలో చర్చ జరుగుతోంది.

మానసిక పరివర్తన

జిల్లాలోని సమస్యాత్మక ప్రాతాలను గుర్తించి అక్కడ యువతతో పోలీసులు సమావేశమయ్యారు. వారి అవసరాలను తెలుసుకున్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో 43 ప్రైవేట్ కంపెనీలను పిలిపించి విద్యార్హతకు తగిన ఉద్యోగాలు ఇప్పించేందుకు ఏర్పాటు చేసిన జాబ్‌మేళాకు జిల్లా నలుమూలల నుంచి 3వేలకు పైగా యువతీ, యువకులు హాజరయ్యారు. అర్హులకు ఉద్యోగాలు ఇప్పించారు. మరికొందరికి నైపుణ్య శిక్షణ ఇప్పించేందుకు సిద్ధమయ్యారు. యువతకు క్రికెట్, ఇతర క్రీడా పరికరాలు అందజేసి ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని, ఉద్యోగాల్లో స్థిరపడాలని హితబోధ చేశారు. అదేవిధంగా స్కూల్ పిల్లలతో కలసి భోజనం చేయడం, వారికి బ్యాగులు, పుస్తకాలు అందజేసి తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి పిల్లల భవిష్యత్ గురించి వివరించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిస కావొద్దని కోరారు. సరఫరా చేస్తున్న వారిలో కొందరిని అదుపులోకి తీసుకుని హెచ్చరించారు. గుడుంబా రహిత గ్రామాలుగా తయారు చేసేందుకు కృషి చేస్తామని పలు గ్రామాల ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.



మార్పు దిశగా యువత

గంజాయి రవాణా, గుడుంబా తయారీ జిల్లాకు చెడ్డ పేరు తెస్తున్నాయి. వీటి నుంచి యువతను దూరం చేయాలన్నదే పోలీస్‌శాఖ లక్ష్యం. అందుకోసమే ఈ ప్రయత్నాలు. మూడు నెలలుగా ఏజెన్సీ, గిరిజన తండాల్లోని యువతలో కొంత మార్పు కనిపిస్తుంది. ఇందుకు నిదర్శనం జాబ్‌మేళాకు మూడువేలకుపైగా యువతీ, యువకులు హాజరుకావడమే.

– సుధీర్‌రాంనాథ్ కేకన్, ఎస్పీ, మహబూబాబాద్

భగీరథ ప్రాజెక్టును సర్కారు నిర్వహించలేకపోతోంది: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు చేపట్టిన మిషన్ భగీరథ ప్రాజెక్టును కూడా సరిగా నిర్వహించలేక ప్రజల ప్రాణాలతో రేవంత్ సర్కార్ ఆటలాడుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్'వేదికగా ధ్వజమెత్తారు. 'కృష్ణా, గోదావరి నదీ జలాలను శుద్ధి చేసి రాష్ట్రమంతటా తాగునీరు ఇచ్చే విధంగా చేపట్టిన మిషన్ భగీరథను ఈ సర్కార్ నిర్వహించలేక పోతుంది. సంజీవ‌రావుపేటలో కలుషిత నీటి సరఫరా వల్ల జరిగిన మరణాలు ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే. మరణించిన వారి కుటుంబాలను ఆదుకోవాలని, చికిత్స పొందుతున్నవారికి తగిన సాయం అందించాలని, తెలంగాణలో మరెక్కడా ఇటువంటి దురదృష్టకరమైన సంఘటనలు జరగకుండా చూసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను'అని పేర్కొన్నారు.



యాదాద్రిలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట రూరల్: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆదివారం కిటకిటలాడింది. ఆదివారంతో పాటు.. దసరా సెలవులు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి దర్శనానికి తరలి వచ్చారు. స్వామి వారి ధర్మదర్శనానికి సుమారు 2 గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. వివిధ విభాగాల ద్వారా స్వామి వారికి రూ.29,30,290 ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు వెల్లడించారు.



అబుదాబిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

అబుదాబిలో బతుకమ్మ సంబరాలు

రాయికల్(జగిత్యాల): యూఏఈలోని అబుదాబిలో ఇండియన్ సోషల్ అండ్ కల్చరల్ సెంటర్లో ఆదివారం తెలంగాణ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ నుంచి వివిధ రకాల పూలను అబుదాబికి తీసుకెళ్లి బతుకమ్మను పేర్చి పూజలు చేసిన అనంతరం మహిళలు ఆడిపాడారు. సుమారు 2,000 మంది మహిళలు వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూఏఈ భారత రాయబార కార్యాలయ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ అమర్నాథ్ అశోకన్, కౌన్సిలర్ బాలాజీ హాజరయ్యారు. ఉత్తమ బతుకమ్మలు తయరు చేసిన మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాజ శ్రీనివాసరావు, గోపాల్ వంశీ, శ్రీనివాస్, సాగర్, గంగన్న సంతోష్, జగదీశ్, అశోక్ శ్రీనివాస్‌రెడ్డి, మహిళా ప్రతినిధులు పావని, అర్చన, పద్మజ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మలతో మహిళలు

ఫల పుష్ప ప్రదర్శన



విజయనగరంలోని ట్యాంక్‌బండ్ రోడ్డులో జిల్లా అధికారులు ఆదివారం ఫల పుష్ప ప్రదర్శన ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన పూలు, పండ్లను విభిన్న ఆకృతుల్లో కత్తిరించి సుందరంగా అలంకరించారు. ఈ ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది. - సాక్షి, ఫొటోగ్రాఫర్ విజయనగరం

మళ్లీ దసరావరకు.. ఈ జ్ఞాపకం పదిలం



దసరా ఉత్సవాల్లో చివరిదైన రావణ వధ ఘట్టాన్ని తమ సెల్ ఫోన్లలో చిత్రించి..స్నేహితులు, బంధువులతో జరుపుకున్న ఈ ఉత్సవాలను మళ్లీ దసరావరకు ఓ తీపి జ్ఞాపకంగా గుర్తుంచుకునేందుకు యువత పోటీపడ్డారు. విశాఖ సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ టెంపుల్ వద్ద శనివారం సాయంత్రం ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది - సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

తోటకు చీరే రక్ష



బొప్పాయి తోటను పక్షులు, జంతువుల బారినుంచి రక్షించుకునేందుకు ఇలా చీరలను చుట్టూ కంచెలా కట్టాడు ఓ రైతు. అన్నమయ్య జిల్లా కోడూరు, మామండూరు మధ్య పూతకు వచ్చినబొప్పాయి తోటను రక్షించుకునేందుకు ఓ రైతు ఇలా రంగురంగుల చీరలతో కంచె ఏర్పాటుచేసుకున్నారు. వీటిని చూసి కోతులు, అడవి పందులు వంటివి తోటలోకి రావని చెబుతున్నాడు. - సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

జంక్ ఫుడ్‌పై ఫ్యాట్ ట్యాక్స్!

ఆరోగ్యకర ఆహారంవైపు మళ్లించేందుకు ప్రయత్నం

- డెన్మార్క్, మెక్సికో, ఫ్రాన్స్, యూకే, హంగేరీ, కొలంబియాలో అమలు
- మన దేశంలో కేరళలో అమలు...గుజరాత్‌లో అమలుకు యత్నం
- జీఎస్టీ అమల్లోకి రావడంతో ఆగిపోయిన వైనం
- అదనపు పన్ను బాదుడుతో ఇతర ఆహారపదార్థాల వైపు మొగ్గు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ఆరోగ్యకరమైన జీవనానికి ఆహారమే ప్రధానం. అయితే, అటువంటి ఆహారమే అనారోగ్యాల బారిన పడేలా చేస్తుంటే.. అదనపు బరువుకు కారణమవుతుంటే...అటువంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు వచ్చిన ఆలోచనే ఫ్యాట్ ట్యాక్స్. నోరూరించేలా... మంచి రుచి, రంగుతో ఉండి ఆరోగ్యాన్ని దెబ్బతీసే జంక్ ఫుడ్‌పై ఫ్యాట్ ట్యాక్స్ పేరుతో ప్రపంచంలోని పలు దేశాలు అదనపు పన్ను విధిస్తున్నాయి. కొన్ని దేశాల్లో ఫ్యాట్ ట్యాక్స్... మరికొన్ని దేశాల్లో షుగర్ ట్యాక్స్ ఇలా వేర్వేరు పేర్లతో దీన్ని అమలు చేస్తున్నాయి. అదనపు పన్ను విధించడం వల్ల జంక్ ఫుడ్ ధర పెరిగి... వాటిని తినడం తగ్గుతుందనేది ఆయా ప్రభుత్వాల ఆలోచన. డెన్మార్క్, హంగేరి, మెక్సికో, కొలంబియా, బ్రిటన్, ఫ్రాన్స్‌తో పాటు స్విట్జర్లాండ్ వంటి దేశాలు దీన్ని అమలు చేస్తున్నాయి. ఈ నిర్ణయం కొన్ని దేశాల్లో మంచి ఫలితాలు ఇవ్వగా... మరికొన్ని దేశాల్లో పెద్దగా ప్రభావం చూపించడంలేదు. ఇక మన దేశంలో ఫ్యాట్ ట్యాక్స్‌ను మొదటి సారిగా కేరళ ప్రభుత్వం అమలు చేసింది. అయితే, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) విధానం 2017 నుంచి అమల్లోకి రావడంతో నిలిచిపోయింది. కేరళ స్ఫూర్తితో గుజరాత్ ప్రభుత్వం కూడా అమలు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించినప్పటికీ... జీఎస్టీ విధానం రాకతో అమలు కాకుండా ఆగిపోయింది.

డెన్మార్క్‌తో షురూ...!

ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు, జంక్ ఫుడ్ వినియోగం తగ్గించేందుకు ప్రపంచంలోని పలు దేశాలు అదనపు పన్ను విధించడం ప్రారంభించాయి. ముందుగా డెన్మార్క్ దీనికి పునాది వేసింది.శ్యాచురేటెడ్ ఫ్యాట్ (అనారోగ్య కొవ్వు) 2.3 శాతం కంటే ఎక్కువ ఉన్న జంక్ ఫుడ్‌పై 2011 నుంచి అదనపు పన్ను విధిస్తూ డెన్మార్క్ నిర్ణయం తీసుకుంది. దీనివల్ల అదనపు కొవ్వు ఉన్న పిజ్జాలు, బర్గర్లు వంటి ఆహార పదార్థాల వినియోగం తగ్గించి పండ్లు, పాలు వంటి ఆహారపదార్థాల వైపునకు మళ్లించాలనేది ఆ ప్రభుత్వ ఆలోచన. అయితే, ఈ విధానం అక్కడ సంతృప్తికర ఫలితాలేవీ ఇవ్వలేదన్నది ఆ తర్వాత కాలంలో తేలింది. ఇక హంగేరిలో అధిక మోతాదులో చక్కెర, ఉప్పు ఉన్న ఆహార పదార్థాలపై అదనపు పన్ను విధించారు. నాలుగేళ్ల తర్వాత ఈ పన్ను విధానం ఫలితాలపై సర్వే కూడా చేసింది. సుమారు 73 శాతం మంది వినియోగదారులు జంక్ ఫుడ్ నుంచి ఇతర ఆరోగ్య ఆహారం... పండ్లు వగైరాలవైపు మళ్లినట్టు తేల్చింది. ''బార్బడోస్ దేశంలో 2016 అక్టోబర్‌లో జంక్ ఫుడ్, శీతల పానీయాలపై అదనంగా 10 శాతం పన్నునువిధించారు. ఏడాది తర్వాత పరిశీలిస్తే... షుగర్ అధికంగా ఉండే శీతల పానీయాల వినియోగం 4.3 శాతం తగ్గగా... ఇతర ఫ్రూట్ జ్యూస్‌ల వినియోగం 5.2 శాతం పెరిగింది'అని పరిశోధన చేసిన రెడ్‌పాపజ్ అనే ఎన్‌జీవో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కరోలినా పైనరోస్ ఓస్పియానా తెలిపారు. అదేవిధంగా అమెరికాలోని బెర్కెలీ నగరంలో కూడా ఈ అదనపు పన్ను విధింపుతో 9.6 శాతం మేర షుగర్ అధికంగా ఉండే పానీయాల కొనుగోలు తగ్గిందని ఆయన పేర్కొంటున్నారు. 'కొలంబియాలో 56.4 శాతం మంది జనాభా అదనపు బరువుతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ జంక్ ఫుడ్ ట్యాక్స్‌ను తప్పకుండా విధించాలనే డిమాండ్ బలంగా ముందుకొచ్చింది. ఇందుకు అనుగుణంగా 2022 డిసెంబర్‌లో కొలంబియా చట్టం తెచ్చి అమలు ప్రారంభించింది. ఈ పన్ను 10 శాతంతో ప్రారంభించి... 2025 నాటికి 20 శాతానికి పెంచాలని నిర్ణయించింది. అయితే, దీనిని ఎన్‌జీవో సంస్థలు స్వాగతించగా... పలు వ్యాపార సంస్థలు కోర్టుకెక్కాయి. వ్యాపార సంస్థల పిటిషన్లను 2023 అక్టోబర్‌లో కోర్టు కొట్టేసింది. ఫ్రాన్స్‌లోనూ మొత్తం జనాభాలో 15 శాతం మంది అధిక బరువు కలిగి ఉన్నట్లు తేలింది. ఈ నేపథ్యంలో ఆ దేశం కూడా 20 శాతం అదనపు పన్ను వసూలు చేస్తోంది. స్విట్జర్లాండ్‌లో షుగర్ ట్యాక్స్ పేరుతో షుగర్ ఎక్కువగా ఉండే శీతల పానీయాలపై అదనపు పన్ను విధించారు. అంతేకాకుండా నార్వే, చిలీ, ఆస్ట్రేలియా వంటి దేశాలు కూడా ఈ అదనపు పన్ను విధానాన్ని అమలు చేస్తున్నాయి.

జీఎస్టీ రాకతో....!

వాస్తవానికి భారతదేశంలో కూడా జంక్ ఫుడ్ వినియోగాన్ని తగ్గించేందుకు పలు రాష్ట్రాలు ప్రయత్నించాయి. ప్రధానంగా కేరళ ప్రభుత్వం దేశంలోనే మొదటి సారిగా 2016 ఆగస్టులో జంక్‌ఫుడ్‌పై 14.5 శాతం అదనపు పన్ను విధించింది. ప్రధానంగా పిజ్జాలు, బర్గర్లపై ఈ అదనపు పన్ను వసూలును ప్రారంభించింది. కేరళలో ఈ విధానం అమలును పరిశీలించిన తర్వాత గుజరాత్ ప్రభుత్వం కూడా 2017 నుంచి దీన్ని అమలు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించింది. అయితే, వస్తు సేవల పన్ను (జీఎస్టీ) విధానం 2017లో అమల్లోకి రావడంతో భారతదేశంలో ఫ్యాట్ ట్యాక్స్ అమలు కాస్తా కేరళలో నిలిచిపోయింది. ఆగస్టు 2016 నుంచి జూన్ 2017 వరకూ అంటే మొత్తం 11 నెలల పాటు ఈ అదనపు ఫ్యాట్ ట్యాక్స్ విధానం కేరళలో అమలుకాగా... 2017 నుంచి అమలు చేయాలని నిర్ణయించిన గుజరాత్ కాస్తా జీఎస్టీ రాకతో అమలు చేయకుండానే వెనుదిరగాల్సి వచ్చింది. భారతదేశంలో తాజాగా 3 కోట్ల మంది యువత అధిక బరువు, స్థూలకాయంతో బాధపడుతున్నారని లాన్‌సెట్ సర్వే తెలియజేస్తోంది. మొత్తానికి ప్రపంచ జనాభాలో అధిక బరువు (స్థూలకాయం) ఉన్న వారి శాతం పెరిగిపోతున్న నేపథ్యంలో అన్ని దేశాల్లో ఈ విధానం అమల్లోకి రావాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఉద్యోగులకు రూ.22వేల కోట్ల బకాయిలు చెల్లించాలి

యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు రూ.22వేల కోట్లు వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ డిమాండ్ చేశారు. కడప యూటీఎఫ్ భవన్‌లో ఆదివారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే బకాయిలు చెల్లిస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చడంలో జాప్యం తగదన్నారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలు, అంతిమ చెల్లింపులు, సరెండర్ లీవ్, డీఏ, గత పీఆర్సీ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. నూతన పీఆర్సీ కమిషన్ వేయాలని, అది అమలయ్యే వరకు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఎస్‌జీటీలకు ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ వృత్యంతర శిక్షణ ఏ జిల్లా వారికి అక్కడే నిర్వహించాలని కోరారు. ఆరోగ్య సమస్యలున్న వారిని, 55 ఏళ్లు దాటిన వారికి శిక్షణ నుంచి మినహాయించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్‌బాబు, జిల్లా సహాధ్యక్షుడు రవికుమార్, జిల్లా కార్యదర్శులు శ్రీనివాసులు, క్రిష్టారెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరి ప్రసాద్, షేక్ జాబీర్, జిల్లా కార్యదర్శి పి.వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలను చెల్లించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలు రాకపోవడంతో దసరా పండగ రోజున పాఠశాలల పారిశుద్ధ్య కార్మికులు పస్తులుండాల్సిన పరిస్థితి ఉందని ఏఐటీయూసీ వైఎస్సార్ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేసీ.బాదుల్లా పేర్కొన్నారు. నగరంలోని హౌచిమన్ భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. స్కావెంజర్స్‌ను కార్మికులుగా గుర్తించాలని కోరారు. సుప్రీంకోర్టు నిబంధనల మేరకు ప్రకారం పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు.

రాష్ట్రంలో సామాజిక అన్యాయం

మంత్రివర్గంలో చర్చించాలని సీఎం చంద్రబాబుకు ఎస్‌జేఎఫ్ లేఖ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న సామాజిక అన్యాయంపై మంత్రివర్గ సమావేశంలో చర్చించి సమన్యాయం అందించే చర్యలు చేపట్టాలని సామాజిక న్యాయపోరాట వేదిక (ఎస్‌జేఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాసిన లేఖను ఎస్‌జేఎఫ్ రాష్ట్ర చైర్మన్ యర్రాకుల తులసీరామ్ ఆదివారం మీడియాకు విడుదల చేశారు.

ఏపీబీవోడీఏ అధ్యక్షుడిగా డాక్టర్ రమణ యశస్వి



నియామక పత్రాన్ని అందజేస్తున్న సీతామహాలక్ష్మి

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ శరీర, అవయవ దాతల సంఘం (ఏపీబీవోడీఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా గుంటూరు జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ రమణ యశస్వి బాధ్యతలు స్వీకరించారు. గుంటూరులో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయనకు అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం వ్యవస్థాపకురాలు, సావిత్రి బాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ (స్పెక్ట్) చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి నియామక ఉత్తర్వులు అందజేశారు. అనంతరం శాలువాతో ఘనంగా సత్కరించారు.

రూ.25వేల కోట్ల బకాయిలు సత్వరమే చెల్లించాలి

రాష్ట్ర ప్రభుత్వానికి ఫోర్టో విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయులకు రావాల్సిన రూ.25వేల కోట్ల బకాయిలతోపాటు డీఏ ఎరియర్లు, సరెండర్ లీవుల తక్షణ చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఫోరమ్ ఆఫ్ రిజిస్టర్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఫోర్టో) విజ్ఞప్తి చేసింది. పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్లు వెంటనే క్లియర్ చేయాలని కోరింది. రాష్ట్ర ఫోర్టో నూతన చైర్మన్‌గా కరణం హరికృష్ణ, ప్రధాన కార్యదర్శిగా అంకాల కొండయ్యతోపాటు నూతన కార్యవర్గాన్ని ఆదివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

20న డాక్టర్ జానమద్ది సాహిత్య సేవా పురస్కార ప్రదానం

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ స్మారక గ్రంథాలయ నిర్మాత డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి పేరిట ఈనెల 20న ఆదివారం ఉదయం 10 గంటలకు బ్రౌన్ గ్రంథాలయంలో గ్రంథాలయ, సాహిత్య సేవా పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ తెలిపారు. ఇందులో భాగంగా పద్మశ్రీ డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, శతావధాని గండ్లూరి దత్తాత్రేయశర్మలకు ఈ పురస్కారాలు అందజేస్తారన్నారు. పూర్వ ఉప సభాపతి మండలి బుద్ధ ప్రసాద్, న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్, జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, పైనేని తులసీనాథం నాయుడు హాజరవుతారన్నారు.

బాలికపై అత్యాచార యత్నం

- యువకుడ్ని పట్టుకుని దేహశుద్ధి చేసిన స్థానికులు
- తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో ఘటన



శ్రీకాళహస్తి : తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలోని సంత మైదానం వద్ద శనివారం ఐదేళ్ల బాలికపై అత్యాచార యత్నానికి ఒడిగట్టిన గుర్తుతెలియని యువకుడిని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. స్థానికుల కథనం మేరకు.. సంతమైదానం సమీప ప్రాంతానికి చెందిన ఐదేళ్ల బాలికను గుర్తుతెలియని యువకుడు స్కూటర్ పై తీసుకొచ్చి నిర్మాణంలో ఉన్న ఇంటి మిద్దెపైకి బలవంతంగా ఎత్తుకెళ్లాడు. అటుగా వెళ్తున్న సుబ్బలక్ష్మి అనే యువతి అతని వాలకంపై అనుమానంతో గమనించింది. ఆపై విషయాన్ని స్థానికులకు చెప్పింది. దీంతో స్థానికులు మిద్దెపైకి వెళ్లి బాలికపై అఘాయిత్యం చేయబోతున్న యువకుడిని పట్టుకుని కరెంట్ స్తంభానికి కట్టేసి చితకబాదారు. అనంతరం ఒకటో పట్టణ పోలీసులకు అప్పగించారు. పోలీసులు యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేశారు.

సూపర్ సిక్స్ వెంటనే అమలు చేయాలి

మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి డిమాండ్



పార్టీ నేతలతో మాజీ డిప్యూటి సీఎం నారాయణస్వామి

పాలసముద్రం: ఎన్నికలకు ముందు చంద్రబాబు 'బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' అంటూ సూపర్ సిక్స్ పథకాల పేరిట ఊరూవాడా ఊదరగొట్టారని, అధికారంలోకి వచ్చిన వెంటనే బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ అనే విధంగా వ్యవహరిస్తున్నారని మాజీ డిప్యూటీ సీఎం కె. నారాయణస్వామి ధ్వజమెత్తారు. ఆదివారం చిత్తూరు జిల్లా, జీడీనెల్లూరు నియోజకవర్గం, పాలసముద్రంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ నాణ్యమైన మద్యం ఇస్తామని చెబుతోందని, ఈ మద్యం తాగితే అనారోగ్య సమస్యలు రావా..?అని ప్రశ్నించారు. రాష్ట్రంలో మద్యం టెండర్ల ద్వారా టీడీపీ అరాచకపాలన బట్టబయలయ్యిందన్నారు. మద్యం టెండర్ల విషయంలో ప్రతి టీడీపీ నాయకుడూ వీధి రౌడీలా మారి, తాము చెప్పిన వారే టెండర్లు వేయాలని.. ఒక వేళ వేరేవారు వేసినా షాపు నిర్వహించకుండా అడ్డుకుంటామని బెదిరిస్తున్నారన్నారు.

ఉద్యోగుల వేతన సవరణకు కమిటీ ప్రకటించాలి

ఆర్‌జేయూపీపీ రాష్ట్ర అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగుల నూతన వేతన సవరణకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కమిటీని ప్రకటించాలని, రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్(ఆర్‌జేయూపీ) రాష్ట్ర అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. కడప భుజంగరావు టీచర్స్ హోంలో జరిగిన ఏపీ జాతీయ ఉపాధ్యాయ పరిషత్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు నూతన పీఆర్సీ అమలు చేసే వరకు మధ్యంతర భృతి(ఐ.ఆర్) ఇవ్వాలన్నారు. సంఘం అధికార ప్రతినిధి ముత్తోజు వీరబ్రహ్మం మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుళరెడ్డి మాట్లాడుతూ జీవో-117 ను రద్దు పరచి, ప్రాథమిక తరగతులను వేరుగా కొనసాగించాలని కోరారు. సీనియర్ నాయకులు విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల డైట్, జేఎల్ తదితర పదోన్నతులకు మార్గం సుగమం చేయాలన్నారు. ఉపాధ్యాయ శిక్షణ సంస్థలు డైట్, బీఎడ్ కళాశాలలను బలోపేతం చేయాలన్నారు.



శ్రీవారి దర్శనానికి 24 గంటలు


తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 24 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 73,684 మంది స్వామివారిని దర్శించుకోగా 36,482 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.72 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది.

గజవాహనంపై సిరులతల్లి



చంద్రగిరి(తిరుచానూరు): విజయదశమి సందర్భంగా తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారు శనివారం గజవాహనంపై భక్తులను అనుగ్రహించారు. తెల్లవారుజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం అభిషేక సేవ చేసి, శోభాయమానంగా అలంకరించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ దీప కాంతుల నడుమ అమ్మవారికి ఊంజల్‌సేవ కనుల పండువగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన గజవాహనంపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు.

శ్రీవారికి సంగీత, నృత్య నీరాజనం



తిరుపతి కల్చరల్: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరోజైన శనివారం రాత్రి ఎస్వీ సంగీత, నృత్య కళాశాల అధ్యాపకులు భక్తి సంకీర్తనలాపన, నృత్య ప్రదర్శనలతో స్వామివారికి ఘన నీరాజనాలు సమర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కొల్లూరు వందన బృందం భక్తి సంకీర్తనలను సుమధురంగా గానం చేసి, సభికులను మైమరిపించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఉమ ముద్దుబాల మాట్లాడుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో తిరుమల మాడ వీధుల్లో కళాశాలకు చెందిన 1200 మంది కళాకారులు 41 బృందాలు, తిరుపతి వేదికగా 250 మంది కళాకారులు పాల్గొని స్వామివారికి సంగీత, నృత్య సేవ చేశారని తెలిపారు.

ప్రపంచ శాంతికి మతపెద్దల ప్రార్థనలు



నాయుడుపేటటౌన్: ప్రపంచ శాంతి కోరుతూ నాయుడుపేటలోని జామీయా మసీదు ఈద్గా మైదానంలో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు ముస్లిం మతపెద్దలు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దల సారథ్యంలో శని,ఆదివారాల్లో ఇస్తిమా నిర్వహించి మత పెద్దలు ప్రబోధనలు చేశారు. ప్రతి ఒక్కరు మంచిగా నడుచుకోవాలని, తల్లిదండ్రులతోపాటు పెద్దలను గౌరవించాలని సూచించారు. ముఖ్యంగా ప్రతిరోజూ ఐదు పూటల నమాజు చేయాలన్నారు. సంపాదించిన నగదులో కొంత పేదలకు పంచిపెట్టి ఇతరులకు సహాయం చేయాలని, చెడు వ్యసనాల జోలికి వెళ్లకూడదని సూచించారు.

స్వర్ణకవచధారిణిగా కనకమహాలక్ష్మి



దాబాగార్డెన్స్: విశాఖ నగరంలోని బురుజుపేటలో గల కనకమహాలక్ష్మి దేవస్థానంలో పది రోజులుగా నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా విజయదశమి రోజున కనకమహాలక్ష్మి అమ్మవారు స్వర్ణ కవచ ధారిణిగా భక్తులకు దర్శనమిచ్చారు. 108 బంగారు పుష్పాలతో పూజ చేసి, పలు రకాల ఫలాలు సమర్పించారు.


వైభవంగా అప్పన్న జమ్మివేట ఉత్సవం



సింహాచలం (విశాఖ): విజయదశమిని పురస్కరించుకుని ఆదివారం సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనసింహ స్వామి జమ్మివేట ఉత్సవం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి రామాలంకారం చేసి సాయంత్రం సింహగిరి నుంచి మెట్లమార్గం ద్వారా కొండదిగువకి తీసుకొచ్చారు. అనంతరం అక్కడ నుంచి స్వామిని పూలతోటలోకి తీసుకెళ్లారు. పూలతోటలో ఉన్న ప్రధాన మండపంలో వేంజేపచేశారు. పూలతోటలోనే ఉన్న శమీ వక్షం చెంతన విశేష పూజలు నిర్వహించారు.

ఆర్‌సెట్ అడ్మిషన్లు నేటి నుంచి ప్రారంభం

తిరుపతి సిటీ: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ, కుప్పం ద్రావిడ వర్సిటీ, ఎస్వీయూలో సోమవారం నుంచి ఏపీ ఆర్‌సెట్ 2023-24 అడ్మిషన్లు ప్రారంభమవుతాయని కన్వీనర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా వర్సిటీలలో సీట్లు పొందిన విద్యార్థులు సంబంధిత వర్సిటీ అడ్మిషన్ల కార్యాలయాల్లో సోమవారం నుంచి ఈనెల 19వ తేదీలోపు రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు.



నేటి నుంచి పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ పీజీ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఆదివారం ఒక ప్రకటన తెలిపారు. సోమ, మంగళవారాల్లో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగనుందని పేర్కొన్నారు. పీజీసెట్-2024లో అర్హత పొంది, ఆసక్తి గల విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఎస్వీయూలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో హాజరై అడ్మిషన్లు పొందాలని కోరారు. మరిన్ని వివరాలకు డీఓఏ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ బాబు 0877-2248589 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

డిగ్రీ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన డిగ్రీ నాల్గవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శనివారం విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ దామ్లానాయక్ తెలిపారు. ఫలితాల కోసం ఎస్వీయూ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన విద్యార్థులకు సూచించారు.

ఎస్సీ, ఎస్టీలకు ఉచిత డీఎస్సీ శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మీ తెలిపారు. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో డీఎస్సీ పరీక్షకు హాజరవుతున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా వసతితో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇందుకు టెట్ అర్హత కలిగి ఉండి వార్షిక ఆదాయం రూ.2.50 లక్షల లోపు ఉండాలన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ నెల 21వ తేదీ లోపు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు.

16న సెపక్ తక్రా జిల్లా జట్ల ఎంపిక

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్స్ పురుషులు, మహిళలు జిల్లా జట్ల ఎంపిక ఈ నెల 16న సత్తెనపల్లి మండలం నంది గామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతుందని జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డెంపూడి పవన్‌కుమార్ ఆదివారం తెలిపారు. క్రీడాకారులు ఆధార్ కార్డుతో హాజరు కావాలని కోరారు.

ట్రావెల్ ఆర్ట్ & కల్చర్
సాక్షి ప్లస్
సోమవారం ॥ 14-10-2024



సంస్కృత స్మారకం

అక్షర్‌ధామ్.... ఆధ్యాత్మికతకు అర్థం చెప్పిన స్వామి నారాయణుడి ఆలయం. సమాజాన్ని ధర్మం, జ్ఞానం, వైరాగ్యం, తాత్వికత వైపు నడిపించిన సంఘసంస్కర్త స్మారక మందిరమే అక్షర్‌ధామ్. స్వామి నారాయణుడు 18–19 శతాబ్దాల్లో సమాజంలో కరడుగట్టి ఉన్న సామాజిక దురాచారాలను పరిహరించడం కోసం పని చేశాడు. మనదేశం అప్పుడు స్థానికంగా హిందూ, ముస్లిం పాలకుల పాలనలో ఉంది. ఈ రాజ్యాలన్నీ బ్రిటిష్ పాలన కింద మనుగడ సాగించాయి. ఈ సమ్మేళన సంస్కృతి ప్రభావం సమాజం మీద తీవ్రమైన ప్రభావాన్ని చూపించింది. అనేక మూఢ నమ్మకాలు, సామాజిక దురాచారాలు పెచ్చరిల్లిన నేపథ్యంలో మహిళలు ఆంక్షల వలయంలో చిక్కుకుపోయారు. భద్రత, మత విశ్వాసాల నిబంధనల కింద పేదవాళ్ల మహిళలు మగ్గిపోతున్న సమయంలో సమసమాజ స్థాపన కోసం కృషి చేసిన మహోన్నతుడు స్వామి నారాయణుడు. ఆడపిల్లలను పురిట్లోనే ప్రాణాలు తీస్తున్న రోజుల్లో స్వామి నారాయణుడు సతి దురాచారాన్ని నియంత్రించడంతో పాటు మహిళలకు చదువు అవసరాన్ని చెప్పాడు. వివక్ష రహిత, హింస రహిత సమాజాన్ని స్థాపించడం కోసం సమాజాన్ని సన్మార్గంలో నడిపించాడు. ఒక సంఘ సంస్కర్త గౌరవార్థం నిర్మించిన క్షేత్రం కావడంతో ఇక్కడ వైదిక క్రతువులు ఉండవు. ఏకకాలంలో ఈ ఆవరణంలో వేలాదిమంది ఉన్నప్పటికీ రణగొణధ్వనులుండవు. నిశ్శబ్దంగా, ప్రశాంతంగా ఉంటుంది వాతావరణం. అక్షర్‌ధామ్ గురించి ఒక్కమాటలో చెప్పాలంటే ఇది ఆర్ట్, సైన్స్, కల్చర్, స్పిరిచువాలిటీల సమ్మేళనం.

ఇది ఎక్కడుంది!


గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో ఉంది అక్షర్‌ధామ్. అహ్మదాబాద్ నుంచి 40 కి.మీ.లు ఉంటుంది. రాజస్థాన్ నుంచి తెప్పించిన ఈ పింక్ సాండ్‌స్టోన్ నిర్మాణం... అందమైన శిల్పసౌందర్యానికి నిలయం. చక్కటి గార్డెన్‌లు, స్వామి నారాయణ్ జీవిత చరిత్ర, ఆయన తీసుకువచ్చిన సంస్కరణల ఇతివృత్తంలో సాగే చిత్ర ప్రదర్శన, పెయింటింగ్స్, శిల్పాలను చూసి తీరాల్సిందే. ఈ ఆలయంలో ప్రతి అంగుళం అత్యాధునికమైన సాంకేతికతను, ఆధ్యాత్మిక భావనను, క్రమశిక్షణను ప్రతిబింబిస్తుంది. అక్షర్‌ధామ్‌ను ఎక్స్‌ప్లోర్ చేయడానికి ప్రయాణ సమయం కాకుండా కనీసం మూడు గంటల సమయాన్ని కేటాయించుకోవాలి.

అభిషేకం చేయవచ్చు!

అక్షర్‌ధామ్‌లో పర్యాటకులు అందరూ స్వామి నారాయణ్‌కి అభిషేకం చేయవచ్చు. అభిషేక మండపంలో పూలు, ఆకులతో నీటి చెంబులను వరుసగా పేర్చి ఉంటారు. టికెట్ తీసుకుని మౌనంగా క్యూలో వెళ్లి అభిషేకం చేయాలి. ఇక్కడ నియమాలు చాలా కచ్చితంగా ఉంటాయి. కానీ హ్యూమన్ ఫ్రెండ్లీగానే ఉంటాయి. డ్రెస్ కోడ్ విషయంలో ఇండియన్, వెస్టర్న్ అనే నియమాలేవీ ఉండవు. కానీ భుజాలు, ఛాతీ, నాభి, భుజాల నుంచి మోచేతుల వరకు, మోకాళ్ల కింది వరకు కవర్ అయ్యే డ్రెస్‌లను



మాత్రమే అనుమతిస్తారు. మనం ధరించిన డ్రెస్ వాళ్ల నియమాలకు లోబడి లేకపోతే మూడు వందల రూపాయలు డిపాజిట్ చేయించుకుని సరోంగ్ అనే డ్రెస్‌ను ఇస్తారు. మన దుస్తుల మీద దానిని ధరించాలి. డ్రెస్ వెనక్కి ఇచ్చినప్పుడు మన డబ్బు ఇచ్చేస్తారు. ఫోన్‌లు, కెమెరాలు, పెన్‌డ్రైవ్‌లు, మ్యూజిక్ డివైజ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ ఐటెమ్స్, ఆయుధాలు, ఆటబొమ్మలు, లగేజ్, పెట్‌లు, ఆహార పానీయాలు, పొగాకు ఆల్కహాల్ ఇతర నిషేధిత డ్రగ్స్‌కు అనుమతి ఉండదు. చంటి పిల్లలతో వెళ్లే వాళ్లకు పాలు, ఆహారం, నీళ్ల సీసాలను అనుమతిస్తారు. వికలాంగులకు, వృద్ధులకు వీల్ చైర్ ఫ్రీగా ఇస్తారు.







అక్షర్‌ధామ్‌కి ఎంట్రీ ఫీజ్ లేదు కానీ ఎగ్జిబిషన్‌లు, వాటర్ షోలకు టికెట్ ఉంటుంది. వాటర్ షో 'సత్ చిత్ ఆనంద్' కథనం కఠోపనిషత్తు ఆధారంగా హిందీలో సాగుతుంది నెరేషన్. నచికేతుడికి యముడు వరాలివ్వడం వంటి ఉపనిషత్ సారాంశాన్ని అర్థం చేసుకోవడం కొంచెం కష్టమే, కానీ మల్టీ కలర్ లేజర్స్, ఫైర్‌బాల్స్, అండర్ వాటర్ ఫ్లేమ్స్‌లో టెక్నాలజీని ఎంజాయ్ చేయవచ్చు.

ఫొటో పాయింట్

అక్షర్‌ధామ్ లోపలికి మన కెమెరాలను అనుమతించరు, కానీ ఈ ఆవరణలో ఫొటో పాయింట్ దగ్గర కెమెరాతో ఒక ఫొటోగ్రాఫర్ ఉంటాడు. పర్యటనకు గుర్తుగా అక్షర్‌ధామ్ గోపురం కనిపించేటట్లు ఫొటో తీయించుకోవచ్చు.

సావనీర్ షాప్‌లో పుస్తకాలు, ఫొటోలు, వీడియో సీడీలతోపాటు అక్షర్‌ధామ్ టీ షర్టులుంటాయి. ఫొటోలతో ఇంటిని నింపడం కంటే టీ షర్టు కొనుక్కోవడం మంచి ఆప్షన్. అక్షర్‌ధామ్ ఆవరణ మొత్తం తిరిగి చూసిన తర్వాత ఆశ్చర్యంగా అనిపించేదేమిటంటే... స్వామి నారాయణుడి జీవనశైలి అత్యంత నిరాడంబరంగా సాగింది. ఆయన స్మారక మందిరం మాత్రం సంపన్నతకు ప్రతిరూపంగా ఉంది.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

నైనితాల్
విహంగ విహారం


నైనితాల్... ఎనభైల నాటి సినిమాల్లో చూసిన ప్రదేశం. కథానుగుణంగా కొన్ని సీన్లను ఇక్కడ చిత్రీకరించేవారు. పాత్రలన్నీ మంకీ క్యాప్, ఉలెన్ స్వెటర్, ఫుల్ షూస్, షాల్‌తో ఇక్కడ చల్లగా ఉంటుందని చెప్పకనే చెప్పే దృశ్యాలుండేవి. ఈ ప్రదేశం ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఉంది. ఢిల్లీ నుంచి మూడు వందల కిలోమీటర్లు ఉంటుంది. ఆధ్యాత్మికతకు, అడ్వెంచర్‌కి, ప్రశాంతంగా గడపడానికి, నేచర్‌ను ప్రేమించేవారికి అందరికీ, అన్ని వయసుల వారికీ అనువైన టూరిస్ట్ ప్రదేశం ఇది. అయితే పెద్దవాళ్లు మార్చి నుంచి జూన్ మధ్యలో వెళ్లడం బాగుంటుంది. హనీమూన్ కపుల్‌కి ఈ నెల మంచి సమయం.

రెండు వేల మీటర్ల ఎత్తులో కుమావ్ పర్వత శ్రేణుల్లో ఉంది నైనితాల్. చుట్టూ హిమాలయ పర్వతాలు, దట్టమైన పచ్చని వృక్షాల మధ్య ఓ సరస్సు. పచ్చదనం మధ్యలో ఉండడం వల్లనేమో నీరు కూడా పచ్చలరాశిని తలపిస్తుంది. పౌరాణిక కథల ప్రకారం సతీదేవి కన్ను పడిన ప్రదేశం ఇదని చెబుతారు. ఈ సరస్సు పరిసరాల్లో ఉండే భీమ్‌తాల్, సాత్తాల్, నౌకుచియాల్‌తాల్‌లకు కూడా పౌరాణిక కథనాలున్నాయి. మనదేశంలో హిల్ స్టేషన్‌లను ఎక్స్‌ప్లోర్ చేసింది బ్రిటిషర్లే. చల్లని ప్రదేశాలను వేసవి విడుదులుగా డెవలప్ చేశారు వాళ్లు. దాంతో ఇక్కడ బ్రిటిష్ బంగ్లాల మధ్య విహరిస్తుంటే యూరప్‌ను తలపిస్తుంది.


నైనితాల్‌లో బోట్ షికార్‌తోపాటు యాచింగ్, పెడలింగ్ చేయవచ్చు. ఇంకా గుడారాల్లో క్యాంపింగ్, పర్వతాల మీదకు ట్రెకింగ్, రాక్ క్లైంబింగ్, పారా గ్లైడింగ్ చేయవచ్చు. ఏ అడ్వెంచర్ చేసినా చేయకపోయినా కేబుల్ కార్ మాత్రం ఎక్కాల్సిందే. కేబుల్ కార్‌లో వెళ్తూ తెల్లటి మంచు శిఖరాలను పై నుంచి చూడవచ్చు.



సరస్సులో బోట్ షికార్ - యాచింగ్



గవర్నర్ హౌస్




నైనాదేవి టెంపుల్

హంపి
నాటి వైభవానికి నిలువుటద్దం


రాజులు రాజ్యస్థాపనలో రాజధాని నిర్మాణం ప్రధానమైంది. అయితే రాజులందరూ రాజధాని కోసం కొండలు, గుట్టల బాట పడుతారెందుకో. హంపిని చూసినప్పుడు ఇదే అనిపిస్తుంది. బీడు భూమి సారవంతమైన పంట నేలగా మారాలంటే ఏళ్లు పడుతుంది. అందుకే పంట పొలాలను రాజధానిగా మార్చే ప్రయత్నం చేసేవారు కాదు. గట్టి నేల మీద నిర్మాణాలు చేపట్టి శత్రుదుర్భేద్యంగా మలుచుకుంటారు. హంపి కూడా అలాంటిదే. హంపిలోని నిర్మాణాలు 14వ శతాబ్దం నాటివి. ప్రతి కట్టడమూ విధ్వంసానికి గురై ఉండడంతో హంపిని లాస్ట్ సిటీ అంటారు కానీ పర్యాటకుల సంఖ్యను చూస్తే దాని కల్చరల్ గ్లోరీని ఏ మాత్రం లాస్ కాలేదనిపిస్తుంది. పర్వత శ్రేణుల్లో 500కు పైగా మాన్యుమెంట్‌లున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులు వస్తారు. ఏడాదికి ఏడు లక్షల మంది వస్తారు. ఇంతటి చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యం ఉంది కాబట్టే యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్‌ల జాబితాలో చేరిపోయింది.

ఆలయం, లోటస్ మహల్, ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా మ్యూజియం. రామాయణకాలంలో కిష్కింద అంటే ఈ ప్రదేశమేనని అశోకుని శిలాశాసనంలో ఉంది. పంపాదేవి తీర్థక్షేత్రంగా దీని ప్రస్తావన ఉంది. ఈ ప్రదేశం బెంగళూరు వాళ్లకు ఎంత దూరం (348 కి.మీ.లు)లో ఉందో హైదరాబాద్ వాళ్లకీ దాదాపు అంతే దూరం(385 కిమీలు)లో ఉంది. హంపి పర్యాటకులకు హోటళ్లు హోస్పెటలో ఉంటాయి. కన్నడ సంప్రదాయ భోజనం, నివాసాలను ఆస్వాదించాలంటే



లోటస్ మహల్





తుంగభద్రలో బోటింగ్

కన్నడ గ్రామంలో బస

హంపి టూర్‌లో మిస్ కాకూడనివి... తుంగభద్రానదిలో పడవ ప్రయాణం, పంట పొలాల్లో రాత్రి బస, మోటార్‌బైక్ మీద అచ్చమైన కన్నడ గ్రామాల్లో విహారం, క్లిఫ్ జంపింగ్, విరూపాక్ష

హంపికి ఉత్తరాన కదిరామ్‌పురా గ్రామంలో హోమ్‌స్టేలుంటాయి. హంపిని ఇప్పటికే చూసి ఉంటే... విజయదశమి ఉత్సవాలు పూర్తి చేసుకుని పండగ శోభను కొనసాగిస్తూ ఉండే హంపిని మరోసారి చూసిరావచ్చు. ఎంజాయ్‌మెంట్‌కి మినిమమ్ గ్యారంటీ.

ఆర్ట్

* సింపుల్ ఆర్ట్ మ్యూజియం
అలల జలాల నుండి ప్రేరణ

రెండు దశాబ్దాలుగా బీజింగ్ ఒలింపిక్స్, షాంఘై వరల్డ్ ఎక్స్‌పో, హాంగ్‌జౌ ఆసియా క్రీడలు, ప్రపంచ మహమ్మారి... వంటి సంఘటనల ద్వారా గుర్తించిన చైనీస్ నగరాలు ఇవి.

ఇప్పుడు ఈ నగరాలు కొత్త తరహా వాస్తుశిల్పంతో పట్టణ అభివృద్ధిని మరో కోణంలో పరిచయం చేస్తున్నాయి. జీవన కేంద్రీకృత, కళాత్మక, సామాజిక స్పృహతో కూడిన విధానంగా ఈ నగరాలు పరిణామం చెందుతున్నాయి అనడానికి ఇటీవల రూపొందించిన 'సింపుల్ ఆర్ట్ మ్యూజియం' ఒక గొప్ప ఉదాహరణగా.





21వ శతాబ్దం ప్రారంభంలో మ్యూజియం నిర్మాణంలో చైనా అద్భుతమైన అభివృద్ధిని చూపుతోంది. సాంస్కృతిక పునరుజ్జీవనం, చారిత్రక పునర్నిర్మాణం, సాంఘిక సంరక్షణ బ్యానర్ క్రింద ఇక్కడి నగరాలు వికసించాయి. పట్టణ ప్రకృతి దృశ్యం కోసం అంతర్జాతీయ దృష్టిని ఆకర్షిస్తోంది. అందుకు ఉదాహరణంగా నిలిచింది 'సింపుల్ ఆర్ట్' మ్యూజియం.

సాంస్కృతిక ప్రాముఖ్యత

ఇది సమాజం, పర్యావరణంపై కళాకారుల ప్రతిబింబాలను పరిశోధించే సమకాలీన ఆర్ట్ మ్యూజియం. పాత నగరం అంచున అభివృద్ధి చెందుతున్న పట్టణ అభివృద్ధిలో చైనాలోని అన్హుయ్‌లో నెలకొల్పబడిన ఈ మ్యూజియం గతానికి, వర్తమానానికి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గిస్తుంది. విలక్షణమైన హుయ్-శైలి నిర్మాణానికి ప్రసిద్ధి చెందిన ఈ ప్రాంతం, ఐకానిక్ ఎలిమెంట్స్, పైకప్పులు, స్తంభాలు, ఉద్యానవనాలతో రూపొందించింది. ఇది అక్కడి సాంస్కృతిక ప్రాముఖ్యత కథను తెలియజేస్తుంది. నగరం పెరుగుతున్న కొద్దీ, మ్యూజియం దాని చారిత్రాత్మక మూలాల వారసత్వాన్ని గౌరవిస్తూ కొత్త సాంస్కృతిక అర్థాన్ని నింపుతుంది.

తరంగాల పై కప్పు

ఎబి డిజైన్, రీసెర్చ్ వ్యవస్థాపక ప్రిన్సిపాల్స్ అయిన ఆర్కిటెక్ట్‌లు వారి వినూత్న డిజైన్ ద్వారా తాజా సాంస్కృతిక దృష్టిని అందించారు. అన్హుయ్ సాంప్రదాయక నిర్మాణ రూపాల నుండి ప్రేరణ పొంది, మ్యూజియం పైకప్పులు.. వంటి అంశాలను అర్థవంతంగా మలిచారు. వాటిలో మానవ ఆత్మ, సామాజిక పరస్పర చర్య కలిసే సమకాలీన ప్రదేశంగా మార్చారు. డిజైన్ హుయ్- శైలి గ్రామం సారాంశాన్ని విస్తరించింది. ఇది తేలియాడే తరంగాల పైకప్పును కలిగి ఉంది. లోపలికి ఎదురుగా అగ్నినిరోధక సింబాలిక్ నిర్మాణంగా పరిణామం చెందింది. ఈ నిరంతర రూపం కళాత్మక వ్యక్తీకరణ, హౌసింగ్ ఆర్ట్ ఎగ్జిబిషన్‌లు, గ్యాలరీలు, వర్క్‌షాప్‌లు, మల్టీమీడియా గదులు, డిజైన్ సెలూన్‌లు, కేఫ్‌ల కోసం అతుకులు లేని ఇండోర్ వాతావరణాన్ని సృష్టిస్తుంది. వాస్తుశిల్పం లోపలి వంపు గోడలలోకి అప్రయత్నంగా ప్రవహిస్తుంది. ఆధునికతలోకి అందమైన సంప్రదాయం కళ్లకు కడుతుంది.

అంతరిక్ష సౌందర్యం

గ్రౌండ్ ఫ్లోర్‌లో విస్తారమైన గ్రే స్పేస్, కేర్, కనెక్షన్‌ని ఆహ్వానిస్తుంది. ఇది భాగస్వామ్య అనుభవాల కోసం స్థానికుల ఆరాటాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ స్థలం ఊహాశక్తిని రేకెత్తిస్తుంది. నివాసితులను కళ, అందం వైపు ఆకర్షిస్తుంది, అసాధారణమైన భావనతో సాధారణ వ్యక్తులను నింపుతుంది. పైన మ్యూజియం, పైకప్పు క్రింద ఉన్న ఎగ్జిబిషన్ స్థలాలను ప్రతిధ్వనిస్తుంది. ఇది చైనీస్ గార్డెన్‌లను గుర్తుకు తెచ్చే వైండింగ్ మార్గాన్ని సృష్టించే వంపు గోడలచే వ్యక్తీకరిస్తుంది. ఇక్కడ సహజ కాంతి, నీడ కలిసి నృత్యం చేస్తాయి. ఇది అన్ని కాలాల వాతావరణాన్ని సృష్టిస్తుంది. ఎగువ స్థాయి, ఓపెన్ ఆర్ట్ కార్యాలయాల కేంద్రం, గ్రౌండ్ ఫ్లోర్ ప్రదర్శన స్థలం కళాత్మకతను పరిచయం చేస్తాయి. మ్యూజియం కళకు కంటైనర్‌గా దాని పాత్రను అధిగమించి, ఆలోచనలకు ఇంక్యుబేటర్‌గా మారుతుంది.

'మదర్ రివర్ ఆఫ్ హెఫీ' అని పిలవబడే నాన్ఫీ నదికి సమీపంలో ఉన్న ఈ మ్యూజియం సహస్రాబ్దాలుగా ఈ ప్రాంతాన్ని ఆకృతి చేసిన అలల నుండి ప్రేరణ పొందింది. వంకర గోడలు, అలల వంటి పైకప్పు నది సహజ లయను ప్రతిబింబిస్తాయి. మధ్యాహ్నం పూట సూర్యకాంతి ఫిల్టర్ అవుతున్నప్పుడు, భవనం మెరిసే ఉపరితలం సజీవ ప్రతిబింబంగా మారుతుంది. మిట్టమధ్యాహ్నం మ్యూజియం పైకప్పు అంతటా విస్తృతమైన నీడతో ఉంటుంది. మధ్యాహ్నం అంతరిక్ష సౌందర్యాన్ని సృష్టిస్తుంది. రాత్రి సమయానికి, మ్యూజియం లోపలి నుండి మెరుస్తుంది. మారుతున్న పట్టణ ప్రకృతి దృశ్యానికి ప్రతీకగా నిలుస్తుంది. ఇది కేవలం గ్యాలరీ, సాంస్కృతిక ప్రదర్శన స్థలం మాత్రమే కాదు. ఒక గొప్ప వాస్తుశిల్పంతో అద్భుత లోకంలోకి ఆహ్వానించే ప్రదేశం.

ఇక్కడ గతం, వర్తమానాలు కలుస్తాయి. ఆర్కిటెక్ట్‌లు జెంచీ హంగ్, కుల్తిదా సాంగ్‌కిట్టి పాక్డీ కళను మాత్రమే కాకుండా అందం పట్ల గాఢమైన ఉత్సుకతను రేకెత్తించే భవనాన్ని రూపొందించారు. ఇది కాంక్రీట్ నగరం మధ్య సంప్రదాయం, సమకాలీన సంస్కృతిని కలుపుతూ క్రాస్-జనరేషన్ స్ఫూర్తిని అందిస్తోంది.

* వారసత్వపు వెలుగు
లడఖ్ కళలను పరిరక్షిస్తున్న నూర్జాహాన్

దాదాపు పద్నాలుగేళ్ల క్రితం వేసవికాలం... నూర్జాహాన్‌కు మరపురాని రోజులవి. ఆమె కాలేజీలో చదువుతున్న ఢిల్లీ నుండి సెలవుల కోసం ఇంటికి వచ్చింది. లేహ్ పాత పట్టణం ఆవరణలో కొంతమంది విదేశీయులు తారసపడ్డారు. వారు సమీపంలోని బౌద్ధ దేవాలయంలో పరిరక్షణ పనిని నిర్వహిస్తున్న బృందంలో ఉన్నారు. వారితో మాట్లాడిన కొన్ని మాటలు నూర్జాహాన్ జీవిత గమనాన్ని మార్చేశాయి. నూర్జాహాన్ కళా పరిరక్షణ రంగం గురించి చదవడం ప్రారంభించింది. 2017లో లేహ్‌లో తన కజిన్ వజీదా తబస్సుమిన్‌తో కలిసి 'షెస్రిగ్ లడఖ్' అనే తన స్టూడియోను ప్రారంభించి, లడఖ్‌లోని మొదటి తరం ఆర్ట్ కన్జర్వేటర్‌లలో భాగమైంది.

'ఈ రంగంలోకి అనుకోకుండా ప్రవేశించాను. కళ లేదా వారసత్వానికి సంబంధించిన స్పృహ జీవితంలో చాలా ఏళ్ల తర్వాత వచ్చింది. కానీ ఒకసారి అనుకున్నది తారసపడితే గతంలోని చాలా చుక్కలను కనెక్ట్ చేయగలను' అని భారత జాతీయ ఐస్ హాకీ జట్టుకు గోల్ కీపర్‌గానూ చేసిన 34 ఏళ్ల నూర్ చెబుతారు.

లోతైన పరిశోధన

''లడఖ్‌లో కళల పరిరక్షణను ఎప్పుడూ వృత్తిగా పరిగణించలేదు. స్థానికుల కోసం కాదు. అంతర్జాతీయ నిపుణులు ప్రాజెక్టుల కోసం వచ్చి వెళ్లిపోవడం చూస్తుంటాం. అందుకే దీన్నే ఒక సబ్జెక్ట్‌గా ఎంచుకున్నాం. సుమారు రెండు దశాబ్దాల క్రితం లడఖ్‌లో జీవితం చాలా కఠినంగా ఉండేది. ప్రభుత్వ ఉద్యోగం లేదా కాంట్రాక్టర్‌గా జీవనోపాధి పొందడం ఇక్కడ ప్రాధాన్యతగా ఉండేది. నేను స్కూల్‌లో చేరగానే యువత దృష్టి డాక్టర్‌లు, ఇంజనీర్లుగా మారడం వైపు మళ్లింది. కళల పరిరక్షణ, పునరుద్ధరణ ఎప్పుడూ జీవనోపాధికి సంబంధించిన సాధనంగా పరిగణించబడలేదు. దీంతో ఈ రంగంలో ఎక్కువగా బయటి వ్యక్తులే ఉన్నారు.

సవాల్‌గా నిలిచే రంగం

లేహ్ సమీపంలోని సుమ్దా చున్‌లోని 13వ శతాబ్దానికి చెందిన గేట్‌వే స్థూపంపై నెల రోజులపాటు పని చేయడం అంటే, అక్కడి స్థానికులతో కలిసి జీవించడం. గోల్డెన్ టెంపుల్ లోపల పెయింటింగ్స్‌పై పని చేయడంలో నిచ్చెనపై గంటల తరబడి గడిపేవాళ్లం. డిస్కిట్ సమీపంలోని సన్యాసిని ఆలయాన్ని పునరుద్ధరించడానికి, ఒక లోయలో వారాలు గడపడానికి ముగ్గురు మహిళల బృందం అవసరం అయ్యింది. విరిగిన జనరేటర్, వన్యప్రాణుల నుండి ఆహార నిల్వలను కాపాడుకోవడం ప్రతిదీ ఓ సవాల్‌గా ఉండేది. నా జీవితమంతా పట్టణ వాతావరణంలో జీవించాను కాబట్టి ఈ వాతావరణంలో పని చేస్తున్నప్పుడు చాలా సవాళ్లు ఎదుర్కొన్నాను. ఢిల్లీలోని నేషనల్ మ్యూజియం ఇన్‌స్టిట్యూట్‌లో పీహెచ్‌డీ డిసెర్టేషన్‌పై పనిచేస్తున్నప్పుడు సొంత ప్రాక్టీస్ ప్రారంభించాలనుకున్నాను. పాత పట్టణం లేహ్‌లో మా పూర్వీకుల శిథిలమైన ఇంటిని స్టూడియోగా మార్చాను. తంగ్కా పెయింటింగ్‌లు, పాత పెయింటెడ్ ఫర్నిచర్, చెక్క కళాఖండాలు, పాత గ్రంథాలు, మాన్యుస్క్రిప్టులు, మెటీరియల్‌లను, ముఖ్యంగా గడ్డకట్టే చలికాలంలో విషయావగాహనకు, పరిధిని విస్తరించడానికి ఇటువంటి సౌకర్యం చాలా ముఖ్యమైనది. షెస్రిగ్ లడఖ్‌ను స్థాపించిన ఐదేళ్ల వరకు ఇంటిని పునరుద్ధరించడం, స్టూడియో పనిని పూర్తి చేయగలిగాం.

సంరక్షణ దిశగా పనులు



మా బృందంలో నలుగురు ఆడ, ఒక మగ. ఐదుగురం కలిసి లడఖ్ చుట్టుపక్కల ఉన్న స్థానిక కమ్యూనిటీలు, వ్యక్తిగత ఆసక్తి ఉన్నవారిని సంప్రదించాం. నిధులు నిరంతరం సమస్య. ప్రతి ప్రాజెక్ట్‌కు కొత్త సవాళ్లు ఉండేవి. ఉదాహరణకు,19వ శతాబ్దం మధ్యలో డోగ్రా దండయాత్ర సమయంలో, వారి సైన్యం ముల్బెఖ్ ఆలయంలో స్థావరాన్ని ఏర్పాటు చేసి దానిలో వంట చేసింది. కాబట్టి, సాధారణ పునరుద్ధరణ పనులతో పాటు, పెయింటింగ్స్‌పై మిగిలిపోయిన ధూళిని కూడా మేం శుభ్రం చేయాల్సి వచ్చింది. సంవత్సరాలుగా, వాతావరణ మార్పులు, మానవ కార్యకలాపాల కారణంగా అనేక కట్టడాలు శిథిలమయ్యాయి. గత దశాబ్దంలో లడఖ్‌లో అధిక వర్షపాతం వల్ల సంప్రదాయ మట్టి నిర్మాణాలకు ముప్పు కలిగింది. నిర్మాణ, అభివృద్ధి పనులు కూడా వారసత్వ ప్రదేశాలపై దుష్ప్రభావం చూపుతున్నాయి. పాత ఆలయాన్ని సంరక్షించడం కంటే కొత్త ఆలయానికి నిధులు సేకరించడం సులభమని గ్రహించిన సందర్భాలూ ఉన్నాయి.

కొంతమంది మా పనిని అర్థం చేసుకుంటారు. కానీ పని పూర్తయ్యాక విషయాలు కొత్తగా కనిపిస్తాయని ఆశించే వారు చాలా మంది ఉన్నారు. పరిరక్షణ, పునరుద్ధరణ అంటే చాలా మందికి తెలియదు. కాబట్టి, మేం ఒక ప్రాజెక్ట్‌లో పనిచేసినప్పుడల్లా, ఆ కమ్యూనిటీని, ముఖ్యంగా పిల్లలను వచ్చి మమ్మల్ని చూడమని ఆహ్వానిస్తాం. వారసత్వంపై అవగాహన, ప్రజలు దానిని ఎలా గ్రహిస్తారు అనేది రాబోయే కాలంలో ఈ సమాచారం అత్యంత కీలకం అవుతుంది' అని వివరిస్తారు నూర్.

సంస్కృతి హిల్సా వంటకం
కళ, సంస్కృతి, కవిత్వాన్ని ప్రేరేపించే
చేప కథ

అనేక బెంగాలీ కుటుంబాలకు వారి ప్రియమైన ఇలిష్ (హిల్సా) లేకుండా దుర్గా పూజ అసంపూర్ణంగా ఉంటుంది. అది లేనిదే పూజ అసంపూర్తిగా ఉంటుందని భావించి కొందరు అమ్మవారికి ఈ చేప వంటకాన్ని నైవేద్యంగా సమర్పిస్తారు.

హిల్సా వంటకం కేవలం పాక ఆనందాన్ని మాత్రమే కాకుండా వారి సంస్కృతిపై ఆసక్తిని రేకెత్తిస్తుంది. ఇది భారతదేశం, బంగ్లాదేశ్ 'జీవనాళం' గుండా ఈదుతూ, పండుగలు, వేడుకలలో కనిపిస్తుంది.


హిల్సా వెండి మెరుపు, అద్భుతమైన రుచి రారమ్మని ఆహ్వానిస్తాయి. బెంగాలీ-అమెరికన్ ఆహార చరిత్రకారుడు చిత్రిత బెనర్జీ ఈ చేప సాంస్కృతికతను సంపూర్ణంగా అక్షరీకరించారు. దీనిని 'జలాల ప్రియత', 'చేపలలో రాకుమారుడు'గా అభివర్ణించారు.

హిల్సా కథ పండుగలు, డైనింగ్ టేబుల్‌కు మించి విస్తరించి ఉంది. శతాబ్దాలుగా, ఇది సాంప్రదాయ కాళీఘాట్ పెయింటింగ్స్‌లో లేదా సమకాలీన వర్ణనలలో గంభీరమైన, మత్స్యకన్య లాంటి దేవతగా - కవులు, రచయితలు, కళాకారుల కల్పనలను ఆకర్షించింది.

ఒక సాహిత్య వ్యవహారం

హిల్సాతో బెంగాలీ ప్రేమ, దాని సాహిత్య సంప్రదాయంలో క్లిష్టంగా అల్లింది. 18 ఉపపురాణాలలో ఒకటైన బృహద్ధర్మ పురాణంలో సనాతనవాదులు దాని వినియోగాన్ని చర్చించినప్పటికీ, చేపలు బ్రాహ్మణులకు రుచికరమైనది అని ప్రశంసించారు. 'బ్రాహ్మణులు రోహు (బెంగాలీలో రుయి), చిత్తడి ముద్ద (పుంటి), స్నేక్‌హెడ్ ముర్రెల్ (షూల్), ఇతర తెల్లటి, పొలుసుల చేపలను తినవచ్చని ఈ పాఠం చెబుతోంది' అని గులాం ముర్షీద్ తన పుస్తకం, బెంగాలీ కల్చర్ ఓవర్ ఎ థౌజండ్‌లో రాశారు.





మీ కస్టమర్ స్థానంలో మిమ్మల్ని ఊహించుకోండి
వ్యాపారంలో విజయం సాధిస్తారు...
- ఒరిసిన్ స్వీట్ మారడెమ్, వ్యక్తిత్వ వికాస నిపుణులు

ఫలితాలు, గణాంకాలు కీలకం

- భౌగోళిక, రాజకీయ అంశాలకూ ప్రాధాన్యం
- చమురు ధరలు, రూపాయి కదలికల ఎఫెక్ట్
- విప్రో బోనస్, హ్యుందాయ్ ఐపీవోపై దృష్టి
- ఈ వారం మార్కెట్ల ట్రెండ్‌పై నిపుణుల అంచనాలు



దేశీ స్టాక్ మార్కెట్లను ఈ వారం పలు కీలక అంశాలు ప్రభావితం చేయనున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) రెండో త్రైమాసిక ఫలితాల సీజన్ గత వారమే ప్రారంభమైంది. ఇకపై ఊపందుకోనుంది. వారాంతాన ఐటీ సేవల దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, పీఎస్‌యూ ఇరెడా, జస్ట్‌దయల్ జులై-సెప్టెంబర్(క్యూ2) ఫలితాలను వెల్లడించాయి. ఈ బాటలో మరిన్ని దిగ్గజాలు క్యూ2 పనితీరును వెల్లడించనున్నాయి. -సాక్షి, బిజినెస్ డెస్క్

క్యూ2 జాబితాలో

ఈ వారం ప్రయివేట్ రంగ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్, బ్యాంకింగ్ బ్లూచిప్ హెచ్‌డీఎఫ్‌సీ క్యూ2 ఫలితాలు వెల్లడించనున్నాయి. ఈ నేపథ్యంలో మార్కెట్ల ట్రెండ్‌ను ఫలితాలు నిర్దేశించే వీలున్నట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా పేర్కొన్నారు. 17న ఐటీ సేవల దిగ్గజం విప్రో క్యూ2 ఫలితాలుసహా బోనస్ షేర్లను ప్రకటించనుంది. అంతేకాకుండా 12న డీమార్ట్ క్యూ2 పనితీరును వెల్లడించడంతో సోమవారం(14న) ఈ ప్రభావం రెండు షేర్లపై కనిపించే వీలున్నట్లు మార్కెట్ నిపుణులు తెలియజేశారు.

3 ఐపీవోలు

ఈ వారం మూడు కంపెనీల పబ్లిక్ ఇష్యూలు ప్రారంభంకానున్నాయి. వీటిలో ప్రధానమైనది హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇష్యూ. అతిపెద్ద ఐపీవోగా రికార్డు సృష్టించనున్న రూ. 27,870 కోట్ల ఇష్యూ మంగళవారం ప్రారంభమై గురువారం ముగియనుంది. ఈ బాటలో మరో రెండు చిన్న కంపెనీలు బీఎస్‌ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్ ద్వారా ఐపీవోకు రానున్నాయి. లక్ష్య పవర్‌టెక్, ఫ్రెషార అగ్రో ఎక్స్‌పోర్ట్స్ 16-17 మధ్య ఇష్యూలు చేపట్టనున్నాయి. అయితే గత వారం క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ.. ఎస్ఎంఈ ఐపీవో తదుపరి ట్రాఫిక్‌సోల్‌ను లిస్ట్‌కాకుండా నిలిపి వేయడం గమనార్హం. నిధుల వినియోగంపై అభియోగాలతో మరింత లోతైన దర్యాప్తునకు సైతం ఆదేశించింది.

ద్రవ్యోల్బణం

గత వారం పారిశ్రామికోత్పత్తి గణాంకాలు వెలువడగా.. ఇకపై రిటైల్ ధరలు(సీపీఐ), టోకు ధరల ద్రవ్యోల్బణ(డబ్ల్యూపీఐ) వివరాలు వెల్లడికానున్నాయి. సెప్టెంబర్ నెలకు ద్రవ్యోల్బణ గణాంకాలను ప్రభుత్వం నేడు(సోమవారం) విడుదల చేయనుంది. వీటికితోడు పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నెలకొని ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భౌగోళిక, రాజకీయ పరిస్థితులు సెంటిమెంటును దెబ్బతీయగలవని స్టాక్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇండియా, చైనా, యూకే ద్రవ్యోల్బణ గణాంకాలు విడుదల చేయనున్నట్లు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ్ ఖేమ్కా వెల్లడించారు. ఈసీబీ పాలసీ రేట్ల నిర్ణయాలు, చైనా జీడీపీ, యూఎస్ రిటైల్ అమ్మకాల గణాంకాలు సైతం వెల్లడికానున్నట్లు వివరించారు. వీటన్నిటిపైనా ఇన్వెస్టర్లు దృష్టిసారిస్తారని తెలియజేశారు.

చమురు రయ్

ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతల కారణంగా గత వారం ముడిచమురు ధరలు రివ్వున పైకెగశాయి. మరోపక్క డాలరుతో మారకంలో రూపాయి సరికొత్త కనిష్టం 84ను దాటి ముగిసింది. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) నిరవధిక అమ్మకాలకే మొగ్గు చూపుతున్నారు. ఈ అంశాలన్నీ విదేశీ మారక నిల్వలపై ప్రతికూల ప్రభావాన్ని చూపగలవని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడ్డాయి. చైనా సహాయక ప్యాకేజీలు, అందుబాటులో ఉన్న షేర్ల విలువలు ఎఫ్‌పీఐలను ఆకట్టుకుంటున్నట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయిర్ పేర్కొన్నారు. మరోపక్క 10ఏళ్ల యూఎస్ ట్రెజరీ ఈల్డ్స్ మెరుగుపడటం సైతం విదేశీ పెట్టుబడులపై ప్రభావం చూపుతున్నట్లు తెలియజేశారు.

గత వారమిలా

గత వారం ఆటుపోట్ల మధ్య దేశీ స్టాక్ మార్కెట్లు స్వల్ప నష్టాలతో నిలిచాయి. బీఎస్ఈ సెన్సెక్స్ నికరంగా 307 పాయింట్లు క్షీణించి 81,381 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 పాయింట్లు నీరసించి 24,964 వద్ద స్థిరపడింది.

ఎఫ్‌పీఐల భారీ విక్రయాలు

కొద్ది రోజులుగా అమ్మకాల యూటర్న్ తీసుకున్న విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) ఇటీవల మరిన్ని పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారు. ఈ నెల(అక్టోబర్)లో ఇప్పటివరకూ(1-11 మధ్య) నికరంగా రూ. 58,711 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించారు. అయితే గత నెల(సెప్టెంబర్)లో రూ. 57,724 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. గత 9 నెలల్లో ఇవి అత్యధిక పెట్టుబడులుకాగా.. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య పెరిగిన ఉద్రిక్తతలు, చైనా సహాయక ప్యాకేజీల తదుపరి దేశీ స్టాక్స్‌లో నిరంతర అమ్మకాలు చేపడుతున్నట్లు మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ కేలండర్ ఏడాది ఏప్రిల్, మే నెలల తదుపరి జూన్ నుంచి ఎఫ్‌పీఐలు దేశీయంగా పెట్టుబడులకే కట్టుబడినట్లు మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ ఇండియా అసోసియేట్ డైరెక్టర్ హిమాన్షు శ్రీవాస్తవ తెలియజేశారు. అయితే పశ్చిమాసియా యుద్ధ భయాలతో ముడిచమురు ధరలు పెరగడం, చైనా మార్కెట్లు బలపడుతుండటం వంటి అంశాలు ఎఫ్‌పీఐల అమ్మకాలకు కారణమవుతున్నట్లు విశ్లేషించారు. వెంచురా సెక్యూరిటీస్ రీసెర్చ్ హెడ్ వినిత్ బి. సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

మెరుగైన రాబడులకు.. ఫ్యాక్టర్ ఇన్వెస్టింగ్..



వికాస్ వాడేకర్
హెడ్ (ప్యాసివ్స్), యాక్సిస్ మ్యుచువల్ ఫండ్

గడిచిన దశాబ్దకాలంగా దేశీయంగా మ్యుచువల్ ఫండ్ పరిశ్రమ గణనీయంగా వృద్ధి చెందింది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న మార్కెట్లలో ఒకటిగా మారింది. ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ విస్తృతి, సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్లకు (సిప్) ఆదరణ పెరుగుతుండటం మొదలైన సానుకూలాంశాలు ఇందుకు దోహదపడుతున్నాయి. గత పదేళ్లుగా ఇండెక్స్ ఫండ్స్, ఈటీఎఫ్‌లు బాగా ప్రాచుర్యంలోకి వచ్చాయి. 2014లో మొత్తం ఏయూఎంలో (నిర్వహణలోని ఆస్తులు) వీటి పరిమాణం 2 శాతమే ఉండగా 2024 జూన్ నాటికి ఏకంగా 17 శాతానికి (మొత్తం ఏయూఎం రూ. 10,00,000 కోట్లకు పైగా ఉంటుంది) ఎగిసింది. ఇంత వేగంగా పరిశ్రమ వృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఎప్పటికప్పుడు మారిపోతున్న ఇన్వెస్టర్ల అవసరాలకు అనుగుణంగా వినూత్నమైన ఉత్పత్తులు, కొత్త వ్యూహాలను ప్రవేశపెట్టడంపై అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (ఏఎంసీ) కసరత్తు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే ఫ్యాక్టర్ ఇన్వెస్టింగ్ వ్యూహం తెరపైకి వచ్చింది. అధిక రాబడులనిస్తూ, రిస్కులను తగ్గిస్తూ, మెరుగైన డైవర్సిఫికేషన్ ప్రయోజనాలను అందించే విధంగా ఇది ఉంటుంది.

సెక్యూరిటీస్‌లో అంతర్గతంగా మెరుగైన రాబడులు అందించే నిర్దిష్ట లక్షణాలను లక్ష్యంగా చేసుకుని ఫ్యాక్టర్ ఇన్వెస్టింగ్ పని చేస్తుంది. ఫ్యాక్టర్ ఫండ్స్ అనేవి భారత్‌లో ఇండెక్స్ ఫండ్, ఈటీఎఫ్ ఫార్మాట్‌లో తక్కువ వ్యయాలతో అందుబాటులో ఉంటున్నాయి. నాణ్యత (క్వాలిటీ), విలువ (వేల్యూ), పరిమాణం (సైజ్), గతి (మూమెంటమ్), తక్కువ ఒడిదుడుకులు వంటి నిర్దిష్ట గుణాలపై ప్రధానంగా దృష్టి పెట్టడం ద్వారా ఫ్యాక్టర్ ఇన్వెస్టింగ్ అనేది ఇన్వెస్టర్లు తమ ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా తమ పోర్ట్‌ఫోలియోలను తీర్చిదిద్దుకునేందుకు వీలు కల్పిస్తుంది. ఉదాహరణకు, వేల్యూ ఇన్వెస్టింగ్ అనేది ఫ్యాక్టర్ ఇన్వెస్టింగ్‌లో ఒక భాగం. ఇది తక్కువ వేల్యుయేషన్లతో ఉన్న సెక్యూరిటీలను టార్గెట్ చేయడం ద్వారా ప్రయోజనాలను అందించేందుకు ప్రయత్నిస్తుంది. అలాగే, మూమెంటమ్ ఇన్వెస్టింగ్ అనే విధానం, ధర పెరుగుతున్న ట్రెండ్ ఆధారితమైనదిగా ఉంటుంది.

సంపద సృష్టి: చారిత్రకంగా మార్కెట్‌ను మించి రాబడులు పొందడానికి తోడ్పడే నిర్దిష్ట గుణాలను లక్ష్యంగా పెట్టుకుని ఫ్యాక్టర్ ఇన్వెస్టింగ్ పని చేస్తుంది. వివిధ మార్కెట్లు, అసెట్ క్లాస్‌లు, కాలవ్యవధులవ్యాప్తంగా ఇది పనిచేస్తుంది. ఒక పద్ధతి ప్రకారం ఈ ఫ్యాక్టర్లను ఉపయోగించడం ద్వారా ఇన్వెస్టర్లు తమ పోర్ట్‌ఫోలియోను ఎలాంటి ఆర్థిక పరిస్థితుల్లోనైనా, మార్కెట్‌లో ఎలాంటి ఒడిదుడుకులు ఎదురైనా నిలదొక్కుకోగలిగేలా మరింత పటిష్టంగా తీర్చిదిద్దుకోవచ్చు. పరిశోధనల ప్రకారం చారిత్రకంగా ఫ్యాక్టర్ ఇన్వెస్టింగ్ అనేది మార్కెట్ బెంచ్‌మార్క్‌లను మించిన పనితీరు కనపర్చింది. సరిగ్గా ఉపయోగించుకుంటే ఇది ఇన్వెస్టర్లకు దీర్ఘకాలంలో సంపద సృష్టించి ఇవ్వగలదు.

రిస్క్ మేనేజ్‌మెంట్: వివిధ మార్కెట్ పరిస్థితుల్లో మెరుగ్గా రాణించే ఫ్యాక్టర్లను లక్ష్యంగా పెట్టుకోవడం ద్వారా రిస్కులను సమర్ధవంతంగా అదుపులో ఉంచుకునేందుకు ఫ్యాక్టర్ ఇన్వెస్టింగ్ సహాయపడుతుంది. ఉదాహరణకు మార్కెట్లు పతనమవుతున్న తరుణంలో, తక్కువ హెచ్చుతగ్గులకు లోనయ్యే స్టాక్స్ మెరుగ్గా ఉంటాయి. నష్టభారాన్ని తగ్గిస్తాయి. తీవ్ర ఒడిదుడుకులు ఉన్న పరిస్థితుల్లో పోర్ట్‌ఫోలియోను స్థిరపర్చుకునేందుకు ఈ విధానం సహాయపడుతుంది.

పారదర్శకత: మిగతా పాసివ్ ఫండ్స్ (ఇండెక్స్ ఫండ్, ఈటీఎఫ్) తరహాలోనే ఫ్యాక్టర్ ఇన్వెస్టింగ్ వ్యూహాలు కూడా సాధారణంగా రూల్స్ ఆధారితమైనవిగా ఉంటాయి. అంటే, పెట్టుబడులను పెట్టేందుకు నిర్దిష్ట నిబంధనలను పాటిస్తాయి. పెట్టుబడి నిర్ణయాల వెనుక గల హేతుబద్ధతను అర్థం చేసుకునేందుకు, తమ పోర్ట్‌ఫోలియోలను సులభతరంగా పర్యవేక్షించుకునేందుకు, నిర్వహించుకునేందుకు ఇన్వెస్టర్లకి ఈ పారదర్శకత ఉపయోగకరంగా ఉంటుంది.

డైవర్సిఫికేషన్: ఒకదానితో మరొక దానికి మరీ అధిక స్థాయిలో పరస్పర సంబంధం ఉండని వివిధ ఫ్యాక్టర్లవ్యాప్తంగా పెట్టుబడులు పెట్టడం ద్వారా ఫ్యాక్టర్ ఇన్వెస్టింగ్ అనేది వైవిధ్యానికి సంబంధించిన ప్రయోజనాలను కల్పిస్తుంది. ఏదైనా ఒక ఫ్యాక్టర్ పనితీరు బాగా లేకపోతే పోర్ట్‌ఫోలియోలో దాని ప్రతికూల ప్రభావాన్ని తగ్గిస్తుంది. రిస్కులకు తగ్గ మెరుగైన రాబడులను అందుకోవడానికి వివిధ ఫ్యాక్టర్లను కలిపి వాడే వ్యూహాన్ని అంతర్జాతీయ ఇన్వెస్టర్లు, అడ్వైజర్లు ఉపయోగిస్తుంటారు.

సౌలభ్యం: టెక్నాలజీ, డేటా వంటి అంశాల్లో పురోగతి కారణంగా ఫ్యాక్టర్ ఇన్వెస్టింగ్ ప్రస్తుతం ఇన్వెస్టర్లకు మరింతగా అందుబాటులోకి వచ్చింది. ఫ్యాక్టర్ ఆధారిత వ్యూహాలను సులభతరంగా అమలు చేయడానికి సాధనాలు, ప్లాట్‌ఫాంలు వీలు కల్పిస్తున్నాయి. ఫ్యాక్టర్ ఇన్వెస్టింగ్ అనేది మెరుగైన రాబడులు అందించేలా, రిస్కులను నియంత్రించుకునేలా, తక్కువ వ్యయాలతో కూడుకున్న పెట్టుబడి సాధనాలను వినియోగించుకునేలా పోర్ట్‌ఫోలియోను తీర్చిదిద్దుకునేందుకు ఉపయోగపడుతుంది.

గుర్తుంచుకోవాల్సిన అంశాలు ..

ఫ్యాక్టర్స్ కొన్నాళ్ల పాటు అండర్‌పెర్ఫార్మ్ చేసే అవకాశాలు ఉన్నాయి. ఉదాహరణకు వేల్యూ స్టాక్స్ అనేవి నిర్దిష్ట మార్కెట్ పరిస్థితుల్లో గ్రోత్ స్టాక్స్‌తో పోలిస్తే వెనుకబడొచ్చు. ఒకే ఫ్యాక్టర్‌లో అత్యధికంగా పెట్టుబడులు పెట్టడం వల్ల ఒకవేళ ఆ ఫ్యాక్టర్ పనితీరు సరిగ్గా లేకపోతే గణనీయంగా నష్టాలు రావచ్చు. తప్పిదాల వల్ల పనితీరు దెబ్బతినే అవకాశం ఉన్నందున, ఫ్యాక్టర్ ప్రీమియంలను కచ్చితంగా గుర్తించి, అందిపుచ్చుకోవాలంటే అధునాతన మోడల్స్, విస్తృతమైన డేటా విశ్లేషణ అవసరమవుతుంది. మార్కెట్ పరిస్థితులు గానీ ఇన్వెస్టర్ ధోరణి గానీ మారితే ఫ్యాక్టర్ వ్యూహాల సామర్థ్యాలపై ప్రభావం పడుతుంది. ఉదాహరణకు ఒకవేళ పెద్ద సంఖ్యలో ఇన్వెస్టర్లు అదే ఫ్యాక్టర్ వ్యూహాన్ని అమలు చేయడం మొదలుపెట్టారంటే, ఫ్యాక్టర్ ప్రయోజనం తగ్గిపోవచ్చు. ఫ్యాక్టర్ ఇన్వెస్టింగ్ వ్యూహాలు అమలు చేయాలనుకునే ఇన్వెస్టర్లు ఈ రిస్కులను దృష్టిలో ఉంచుకోవడం చాలా ముఖ్యం. రిస్కులను తగ్గించుకునేందుకు వివిధ ఫ్యాక్టర్లవ్యాప్తంగా డైవర్సిఫికేషన్ పాటించాలి. మార్కెట్ పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉంటే సహాయకరంగా ఉంటుంది.

రిస్కు సామర్థ్యాలను బట్టి..

ఇన్వెస్టర్లు తమ పెట్టుబడి లక్ష్యాలు, రిస్కు సామర్థ్యాలకు అనుగుణంగా నిర్దిష్ట ఫ్యాక్టర్స్‌ను టార్గెట్‌గా పెట్టుకుని తమ పోర్ట్‌ఫోలియోను తీర్చిదిద్దుకోవచ్చు. ఉదాహరణకు అధిక రిస్కు సామర్థ్యాలున్న ఇన్వెస్టర్లు, మూమెంటమ్ లేదా సైజ్ వంటి ఫ్యాక్టర్లకు మరింత ఎక్కువగా కేటాయించవచ్చు. ఇవి మరింత ఎక్కువ ఒడిదుడుకులకు లోనైనా అధిక రాబడులనిచ్చే అవకాశాలు కూడా ఉంటాయి. స్థిరమైన ఆదాయాన్ని కోరుకునే వారు నాణ్యమైన, తక్కువ ఒడిదుడుకులుండే ఫ్యాక్టర్లను ఎంచుకోవచ్చు. ఇక, గ్రోత్ కోరుకునే ఇన్వెస్టర్లు, వేల్యూ అలాగే మూమెంటమ్‌కి ప్రాధాన్యతనివ్వొచ్చు. అంతర్జాతీయంగా ఇన్వెస్టర్లు, అడ్వైజర్లు కూడా దాదాపు ఇలాంటి ఫ్యాక్టర్ మేళవింపులనే ఎంచుకుంటూ ఉంటారు.

చివరగా చెప్పాలంటే, ఫ్యాక్టర్ ఇన్వెస్టింగ్ అనేది అధిక రాబడులను అందించే నిర్దిష్ట చోదకాలను అందిపుచ్చుకునేందుకు ఉపయోగపడే ఒక విధానం. రిస్కులను తగ్గించుకుని, అధిక రాబడులను అందుకునే అవకాశాలను ఇది కల్పిస్తుంది. అదే సమయంలో దీనిలో కూడా ఉండే కొన్ని రిస్కులను దృష్టిలో ఉంచుకుని, తమ వ్యక్తిగత ఇన్వెస్ట్‌మెంట్ ప్రొఫైల్‌ను బట్టి ఇన్వెస్టర్లు వ్యూహాలు వేసుకోవాల్సి ఉంటుంది. ఫ్యాక్టర్లను అర్థం చేసుకుని, జాగ్రత్తగా ఎంచుకోగలిగితే ఇన్వెస్టర్లు తమ ఆర్థిక లక్ష్యాలను మరింత సమర్థమంతంగా సాధించుకోగలుగుతారు.

జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్ ప్రచారకర్తగా దుల్కర్ సల్మాన్



ముంబై: దక్షిణాది మార్కెట్లకు సంబంధించి ప్రముఖ నటుడు దుల్కర్ సల్మాన్‌ను ప్రచారకర్తగా నియమించుకున్నట్లు జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్ తెలిపింది. ఈ మార్కెట్ల కోసం రూపొందించిన ప్రచార ప్రకటనల్లో ఆలియా భట్, దుల్కర్ సల్మాన్ ఉంటారని పేర్కొంది. అలాగే ఖూబ్‌సూరత్ సోంచ్ పేరిట రూపొందించిన ప్రచార కార్యక్రమాల్లో ఆలియా భట్, ఆయుష్మాన్ ఖురానా ఉంటారని వివరించింది. ఈ ప్రకటనలు టీవీలు, డిజిటల్, ఇతర వేదికల్లో ప్రసారమవుతాయని సంస్థ వివరించింది.

రిఫండ్ ఆప్షన్లు ఇవ్వండి..

ఓలాకు సీసీపీఏ ఆదేశాలు

న్యూఢిల్లీ: వినియోగదారులకు అనుకూల విధానాలను అమలు చేయాలంటూ ట్యాక్సీ సేవల సంస్థ ఓలాను కేంద్రీయ వినియోగదారుల హక్కుల పరిరక్షణ ప్రాధికార సంస్థ (సీసీపీఏ) ఆదేశించింది. కస్టమర్లకు రిఫండ్ ఆప్షన్లు, రైడ్‌లకు సంబంధించి రసీదులు కూడా ఇవ్వాలని సూచించింది. ప్రస్తుత విధానంలో బ్యాంకు ఖాతాలోకి రిఫండ్ పొందే అవకాశాన్ని కస్టమర్లకు ఇవ్వకుండా, భవిష్యత్ రైడ్‌లకు ఉపయోగించుకునేలా కూపన్ కోడ్‌లనే ఓలా జారీ చేస్తోందని సీసీపీఏ పేర్కొంది. ఫలితంగా కస్టమర్లు దాన్ని ఉపయోగించుకునేందుకు తప్పనిసరిగా మరోమారు ఓలానే ఎంచుకోవాల్సి వస్తోందని తెలిపింది. ఈ నేపథ్యంలోనే రిఫండ్ ఆప్షన్లు ఇవ్వాలని సీసీపీఏ సూచించింది. అలాగే, అన్ని రైడ్‌లకు సంబంధించి బిల్లులు, ఇన్‌వాయిస్‌లు జారీ చేయాల్సిందేనని స్పష్టం చేసింది. అలా చేయకపోతే అనుచిత



వ్యాపార విధానాలు పాటిస్తున్నట్లుగా పరిగణించాల్సి వస్తుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఓలా తన వెబ్‌సైట్‌లో గ్రీవెన్స్, నోడల్ ఆఫీసర్ల కాంటాక్ట్ వివరాలను, క్యాన్సిలేషన్ నిబంధనలను, బుకింగ్.. క్యాన్సిలేషన్ ఫీజులు మొదలైన వాటిని పొందుపర్చింది.

రిటైల్ రుణాల ప్రాసెసింగ్ సెంటర్ల ఏర్పాటులో ఐవోబీ



చెన్నై: ప్రభుత్వ రంగ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐవోబీ) దేశవ్యాప్తంగా పలు నగరాల్లో రిటైల్ రుణాల ప్రాసెసింగ్ సెంటర్లను (ఆర్ఎల్‌పీసీ) ప్రారంభించింది. రుణ అనుమతుల ప్రక్రియను క్రమబద్ధీకరించేందుకు, టర్నెరౌండ్ సమయాన్ని తగ్గించేందుకు ఇవి ఉపయోగపడగలవని సంస్థ ఎండీ అజయ్ కుమార్ శ్రీవాస్తవ తెలిపారు. హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, ఢిల్లీ, కోల్‌కతా తదితర నగరాల్లో వీటిని ప్రారంభించినట్లు వివరించారు.

గడువు తేదీ గడిచిపోయిందా..



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

రెండు రోజులు ఆలస్యంగా అందరికీ దసరా శుభాకాంక్షలు. విజయదశమి సందర్భంగా అందరికీ అన్ని విధాలా విజయం కలగాలని కోరుకుంటూ.. ''గడువు తేదీ''ని కేవలం ప్రతి సంవత్సరం ఆదాయపు పన్ను రిటర్నులు వేసే కోణంలోనే పరిశీలిద్దాం.

2024 మార్చి 31తో పూర్తయ్యే ఆర్థిక సంవత్సరపు రిటర్నులు వేయడానికి గడువు తేదీ 2024 జులై 31. మీలో చాలా మంది సకాలంలో వేసి ఉంటారు. ఈసారి రిటర్నులు వేసేవారి సంఖ్య గణనీయంగా పెరిగిందని డిపార్టుమెంటు వారు చెప్తున్నారు. అనారోగ్యం కానివ్వండి. విదేశాయానం కానివ్వండి. కారణం ఏదైనా కానివ్వండి. మీరు రిటర్ను ఇంకా వేయలేదా? చింతించకండి. బెంగ వద్దు. ఇలాంటి వారికి చక్కని రాజమార్గం ఉంది. లేటు ఫీజు కట్టాలి. ఇలా లేటు ఫీజు చెల్లించినవారికి 2024 డిసెంబర్ 31 వరకు గడువు తేదీ ఉన్నట్లు లెక్క. అంటే మరో రెండు నెలల పదిహేను రోజులు. అలా అని ఆలస్యం చేయకండి.

ఎంత లేటు ఫీజు చెల్లించాలి..

ఆలస్యమైన నెలలతో సంబంధం లేకుండా రెండు రకాల నిర్దేశిత రుసుములు ఉన్నాయి. పన్నుకి గురయ్యే ఆదాయం.. రూ. 5,00,000 లోపల ఉంటే రూ. 1,000 చెల్లించాలి. పన్నుకి గురయ్యే ఆదాయం రూ. 5,00,000 దాటి ఉన్నట్లయితే, ఫీజు రూ. 5,000 ఉంటుంది. ఇవి మారవు. అంటే మీరు ఆగస్టు 1 నుండి డిసెంబర్ 31 లోపల ఎప్పుడు దాఖలు చేసినా రుసుములంతే. అయితే, పన్ను చెల్లించాల్సి ఉంటే వడ్డీ విధిస్తారు. ఇది నెలకు 1 శాతం చొప్పున వడ్డిస్తారు. రిఫండు క్లెయిమ్ చేసినా అప్పటికి పన్ను చాలా చెల్లించినట్లయితే, ఈ వడ్డీ పడదు. పన్ను చెల్లించాల్సిన మొత్తం ఎక్కువగా ఉంటే మీరు తొందరపడాల్సి ఉంటుంది. వడ్డీని తగ్గించుకోవచ్చు. మీరు బయటి నుంచి 1 శాతం వడ్డీతో అప్పు తెచ్చి పన్ను భారం చెల్లించే బదులు ఆ వడ్డీ మొత్తం ఏదో 'సీతమ్మగారి పద్దు'లో పడేలా ప్లాన్ చేసుకోండి. మీ ఆర్థిక వనరులను ప్లాన్ చేసుకోవడం మీ చేతుల్లో ఉంది. ఆలోచించుకోండి. ఈ వెసులుబాటనేది 'తత్కాల్' టిక్కెట్టు కొనుక్కుని రైల్లో ప్రయాణం చేసినట్లు ఉంటుంది.

అయితే, రిటర్ను గడువు తేదీలోగా దాఖలు చేయకపోవడం వల్ల రెండు పెద్ద ఇబ్బందులు తలెత్తుతాయి. వీటి విషయంలో ఎలాంటి వెసులుబాటు లేదు. గడువు తేదీ లోపల రిటర్ను వేసేవారికి డిపార్టుమెంటు రెండు ప్రయోజనాలు పొందుపర్చింది. ఆ రెండు ప్రయోజనాలూ లేటు విషయంలో వర్తించవు.

ఇంటి మీద ఆదాయం లెక్కింపులో మనం లోన్ మీద వడ్డీని నష్టంగా పరిగణిస్తాం. ఆ నష్టాన్ని పరిమితుల మేరకు సర్దుబాటు చేసి, ఇంకా నష్టం మిగిలిపోతే దాన్ని రాబోయే సంవత్సరాలకు బదిలీ చేసి, నష్టాన్ని.. ఆదాయాన్ని సర్దుబాటు చేస్తాం. దీని వల్ల రాబోయే సంవత్సరంలో పన్ను భారం తగ్గుతుంది. ఇది చాలా ప్రయోజనకరంగా, ఉపశమనంగా ఉంటుంది. లేటుగా రిటర్ను వేస్తే ఈ 'బదిలీ' ప్రయోజనాన్ని ఇవ్వరు. ఈ సదుపాయాన్ని శాశ్వతంగా వదులుకోవాల్సి ఉంటుంది.

ఇక రెండోది.. ప్రస్తుతం అమల్లో ఉన్న పాత పద్ధతి లేదా కొత్త పద్ధతుల్లో.. మనం ఏదో ఒకటి ఎంచుకోవచ్చు. సాధారణంగా పన్ను తగ్గే పద్ధతి ఎంచుకుంటాం. మనం గడువు తేదీ లోపల రిటర్ను వేయకపోతే, ఇలా ఎంచుకునే అవకాశం ఇవ్వరు. కంపల్సరీగా కొత్త పద్ధతిలోనే పన్నుభారాన్ని లెక్కించాలి. అయినా, రిటర్ను వేయడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి.

1. ఇది మీ ఆదాయానికి ధృవపత్రం అవుతుంది
2. రుణ సౌకర్యం లభిస్తుంది
3. విదేశీయానం అప్పుడు వీసాకి పనికొస్తుంది
4. చట్టంలో ఉన్న అన్ని ప్రయోజనాలను పొందవచ్చు
5. పెనాల్టీ మొదలైనవి ఉండవు కాబట్టి రిటర్నులు వేయండి.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

మిడ్‌క్యాప్ విభాగంలో ఛాంపియన్!

- మోతీలాల్ ఓస్వాల్ మిడ్‌క్యాప్ ఫండ్



లార్జ్‌క్యాప్ స్టాక్స్‌లో అధిక స్థిరత్వం చాలా మంది ఇన్వెస్టర్లను ఆకర్షిస్తుంటుంది. కానీ, కొందరు రిస్క్ ఎక్కువ ఉన్నా ఫర్వాలేదు రాబడులు అధికంగా ఉండాలని కోరుకుంటూ ఉంటారు. ఈ తరహా ఇన్వెస్టర్లు స్మాల్‌క్యాప్ ఫండ్స్ ఎంపిక చేసుకుంటారు. రిస్క్ మధ్యస్థంగా ఉండి, రాబడులు కూడా లార్జ్‌క్యాప్ కంటే ఎక్కువగా ఉండాలని కోరుకునే వారికి మిడ్‌క్యాప్ విభాగం అనుకూలంగా ఉంటుంది. దీర్ఘకాలంలో లార్జ్‌క్యాప్ స్టాక్స్ కంటే స్మాల్ క్యాప్ స్టాక్స్ అధికంగా రాబడులు ఇచ్చినట్టు ఎన్నో అధ్యయనాలు చెబుతున్నాయి. కానీ, గడిచిన పదేళ్లలో రాబడుల పరంగా స్మాల్‌క్యాప్ కంటే మిడ్‌క్యాప్ సూచీ ముందుంది. బీఎస్ఈ 150 మిడ్ క్యాప్ టీఆర్ఐ సూచీ.. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ టీఆర్ఐ సూచీ కంటే 2.13 శాతం అధికంగా 21.32 శాతం చొప్పున ఏటా రాబడులు అందించింది. ఇదే కాలంలో స్మాల్‌క్యాప్ సూచీ వార్షిక రాబడులు 19.18 శాతంగానే ఉన్నాయి. మిడ్‌క్యాప్ విభాగంలో అధిక స్థిరత్వం, మెరుగైన రాబడులు కోరుకునే వారికి మోతీలాల్ ఓస్వాల్ మిడ్‌క్యాప్ ఫండ్ మంచి ఎంపిక అవుతుంది.

రాబడులు..

ఈ పథకం డైరెక్ట్ ప్లాన్‌లో ఏడాది కాలంలో రాబడి 73 శాతంగా ఉంది. అదే రెగ్యులర్ ప్లాన్‌లో అయితే 71 శాతం రాబడి వచ్చింది. మూడేళ్లలో డైరెక్ట్ ప్లాన్ ఏటా 36 శాతానికి పైనే రాబడి తెచ్చి పెట్టింది. ఐదేళ్లలోనూ 35 శాతం చొప్పున వార్షిక రాబడులను అందించిన చరిత్ర ఈ పథకం సొంతం. ఇక ఏడేళ్లలో ఏటా 24 శాతం, పదేళ్లలో ఏటా 23 శాతం చొప్పున పెట్టుబడులపై ఇన్వెస్టర్లకు రాబడి లభించింది. ఇందులో డైరెక్ట్ ప్లాన్ అన్నది మధ్యవర్తుల ప్రమేయం లేనిది. ఈ ప్లాన్‌లో ఫండ్స్ సంస్థ ఎవరికీ కమీషన్లు చెల్లించదు. రెగ్యులర్ ప్లాన్‌లో మధ్యవర్తులకు కమీషన్ వెళుతుంది. ఈ మేర ఇన్వెస్టర్ల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తారు. కనుక రెగ్యులర్ ప్లాన్ కంటే డైరెక్ట్ ప్లాన్‌లో దీర్ఘకాలంలో రాబడులు ఎక్కువగా ఉంటాయి.



పెట్టుబడుల విధానం/ పోర్ట్‌ఫోలియో...

మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్ సంస్థ నాణ్యత, వృద్ధి, దీర్ఘకాలం, ధర అనే అంశాల ఆధారంగా మిడ్‌క్యాప్ విభాగంలో భవిష్యత్‌లో మంచి రాబడులు ఇచ్చే స్టాక్స్‌ను ఎంపిక చేస్తుంటుంది. బలమైన వృద్ధి అవకాశాలున్న నాణ్యమైన కంపెనీలను ఎంపిక చేసుకుంటుంది. సహేతుక ధరల వద్దే కొనుగోలు చేస్తుంటుంది. ఎంపిక చేసుకునే కంపెనీలకు గణనీయమైన వ్యాపార వృద్ధి అవకాశాలు ఉండేలా జాగ్రత్త పడుతుంది. రిటర్న్ ఆన్ క్యాపిటల్, రిటర్న్ ఆన్ ఈక్విటీ 20 శాతానికి పైన ఉన్న కంపెనీలను ఎంపిక చేసుకుంటుంది. బలమైన ఫ్రీ క్యాష్ ఫ్లోను కూడా చూస్తుంది. ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.18,604 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 81 శాతాన్నే ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసింది. 15 శాతం మేర డెట్ సాధనాల్లో పెట్టుబడి పెట్టింది. 3.89 శాతం మేర నగదు నిల్వలు కలిగి ఉంది. ఈక్విటీ పెట్టుబడుల్లోనూ 66 శాతం మేర లార్జ్‌క్యాప్‌లోనే ఉన్నాయి. మిడ్‌క్యాప్‌లో 32.49 శాతం, స్మాల్‌క్యాప్‌లో 1.77 శాతం చొప్పున పెట్టుబడులు ఉన్నాయి. లార్జ్‌క్యాప్ విభాగంలో ఎక్కువ పెట్టుబడులు ఉన్నప్పుడు మిడ్‌క్యాప్ పథకం ఎలా అయిందన్న సందేహం రావచ్చు. ఈ పథకం ఇన్వెస్ట్ చేసిన కంపెనీలు మధ్య కాలానికే లార్జ్‌క్యాప్ కంపెనీలుగా అవతరించడం ఇందుకు కారణం. పెట్టుబడుల పరంగా టెక్నాలజీ, కన్జ్యూమర్ డిస్క్రీషనరీ, ఇండస్ట్రియల్స్ రంగాలకు ఎక్కువ వెయిటేజీ ఇస్తూ.. 61 శాతం పెట్టుబడులను ఈ రంగాలకు చెందిన కంపెనీల్లోనే ఇన్వెస్ట్ చేసింది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
కల్యాణ్ జ్యుయలర్స్	9.77
పాలీక్యాబ్ ఇండియా	9.53
జియో ఫైనాన్షియల్	8.81
కోఫోర్జ్	8.49
పర్సిస్టెంట్ సిస్టమ్స్	7.91
ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్	5.75
వోల్టాస్	4.96
బాలకృష్ణ ఇండస్ట్రీస్	3.85
జొమాటో	3.67
మ్యాక్స్ హెల్త్‌కేర్	2.90

బాబర్ ఆజమ్‌పై వేటు

కీలక బ్యాటర్‌ను తప్పించిన పాక్ సెలక్టర్లు

- అఫ్రిది, నసీమ్ షా కూడా అవుట్



ముల్తాన్: సొంతగడ్డపై ఇంగ్లండ్ చేతిలో తొలి టెస్టులో చిత్తుగా ఓడిన తర్వాత పాకిస్తాన్ క్రికెట్ సెలక్టర్లు సంచలన నిర్ణయం తీసుకున్నారు. పాక్ అగ్రశ్రేణి బ్యాటర్, మాజీ కెప్టెన్ బాబర్ ఆజమ్‌పై వేటు వేశారు. ఇంగ్లండ్‌తో జరిగే తర్వాతి రెండు టెస్టుల కోసం ప్రకటించిన జట్టులో బాబర్‌కు చోటు దక్కలేదు. అతనితో పాటు గత కొన్నేళ్లుగా పాక్ బృందంలో కీలక ఆటగాళ్లుగా మారిన పేస్ బౌలర్లు షాహిన్ అఫ్రిది, నసీమ్ షాలను కూడా తప్పించారు. టీమ్ మొత్తం విఫలమైన చోట వీరికి వేటు వేయడం అంటే సెలక్టర్లు ప్రదర్శనకంటే కూడా ఒక హెచ్చరిక జారీ చేసేందుకే అనిపిస్తోంది. వీరి స్థానంలో ముగ్గురు కొత్త ఆటగాళ్లు కమ్రాన్ గులామ్, హసీబుల్లా, మెహ్రాన్ ముంతాజ్‌లను ఎంపిక చేశారు. వీరితో పాటు ఇద్దరు సీనియర్ స్పిన్నర్లు సాజిద్ ఖాన్, నోమాన్ అలీలకు కూడా చోటు దక్కింది.

ఘనమైన రికార్డు...

తొమ్మిదేళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో బాబర్ ఆజమ్ పాకిస్తాన్ నంబర్‌వన్ బ్యాటర్‌గా ఎదిగాడు. మూడు ఫార్మాట్‌లలోనూ పలు కీలక విజయాలు అందించడంతో పాటు కెప్టెన్‌గా కూడా చెప్పుకోదగ్గ ఘనతలు సాధించాడు. సుదీర్ఘ కాలం ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌గా కూడా కొనసాగాడు. అయితే ఇటీవల ఫామ్ కోల్పోయిన అతను టెస్టుల్లో పరుగులు చేయడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాడు. డిసెంబర్ 2022లో హాఫ్ సెంచరీ నమోదు చేసిన అతను...గత 18 టెస్టు ఇన్నింగ్స్‌లలో ఒక్క అర్ధ సెంచరీ కూడా చేయలేదు. 2023 నుంచి ఆడిన 9 టెస్టుల్లో అతని సగటు 21 మాత్రమే. ఇంగ్లండ్‌తో తొలి టెస్టులో కూడా బ్యాటింగ్‌కు బాగా అనుకూలించిన పిచ్‌పై బాబర్ 30, 5 పరుగులు మాత్రమే సాధించాడు. ముఖ్యంగా బౌలింగ్‌కు ఏమాత్రం అనుకూలంగా లేని వికెట్‌పై అతను పేలవంగా ఆడి నిష్క్రమించడం కూడా ఆశ్చర్యపర్చింది. ఇంగ్లండ్‌తో టెస్టు ఓడగానే మాజీ ఆటగాళ్లు ఆకిబ్ జావేద్, అసద్ షఫీక్, అజహర్ అలీ తదితరులతో పాక్ బోర్డు హడావిడిగా కొత్త సెలక్షన్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ ఆటగాళ్లే బాబర్‌ను తప్పించాలని నిర్ణయించారు. బాబర్‌పై వేటు పాక్ క్రికెట్ వర్గాల్లో సంచలన చర్చకు కారణమైంది. ఇటీవల ఫామ్ కోల్పోయినా సరే...ప్రస్తుతం పాకిస్తాన్ క్రికెట్‌లో అందరికంటే పెద్ద స్టార్ ఆటగాడు అతనే. కనీసం మరో ఆటగాడు అతని దరిదాపుల్లో కూడా లేడు. జట్టు ప్రదర్శనతో సంబంధం లేకుండా వ్యక్తిగతంగా ఎంతో ఫాలోయింగ్ అతనికి ఉంది. ఒక దశలో తన నిలకడైన ఆటతో 'ఫ్యాబ్ 4'తో పోటీ పడుతూ ఐదో ఆటగాడిగా తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న బాబర్‌పై వేటు అసాధారణం. 55 టెస్టుల్లో అతను 43.92 సగటుతో 9 సెంచరీలు, 26 అర్ధసెంచరీలు సహా 3997 పరుగులు సాధించాడు.

హర్మన్‌ప్రీత్‌కు 78 లక్షలు

- భారీగా వెచ్చించిన సూర్మా హాకీ క్లబ్
- అభిషేక్‌కు రూ. 71 లక్షలు
- హాకీ ఇండియా లీగ్ వేలం



న్యూఢిల్లీ: భారత హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్‌కు హాకీ ఇండియా లీగ్ (హెచ్‌ఐఎల్) వేలంలో భారీ ధర పలికింది. ఆదివారం ప్రారంభమైన హెచ్‌ఐఎల్ లీగ్ తొలి రోజు జేఎస్‌డబ్ల్యూ గ్రూప్‌కు చెందిన సూర్మా హాకీ క్లబ్ రూ. 78 లక్షలు పెట్టి హర్మన్‌ప్రీత్ సింగ్‌ను కొనుగోలు చేసుకుంది. వేలం మొదటి రోజు భారత జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆటగాళ్ల కోసం ఎనిమిది ఫ్రాంచైజీలు పోటీ పడ్డాయి. అభిషేక్ కోసం బెంగాల్ టైగర్స్ ఫ్రాంచైజీ రూ. 72 లక్షలు వెచ్చించగా.. యూపీ రుద్రాస్ ఫ్రాంచైజీ హార్దిక్ సింగ్‌ను రూ. 70 లక్షలకు పెట్టి కొనుగోలు చేసుకుంది. తమిళనాడు డ్రాగన్స్ జట్టు అమిత్ రోహిదాస్ కోసం రూ. 48 లక్షలు వెచ్చించగా... బెంగాల్ టైగర్స్ ఫ్రాంచైజీ జుగ్‌రాజ్‌కు అంత మొత్తమే ఇచ్చి తీసుకుంది. **హైదరాబాద్ తూఫాన్స్ ఫ్రాంచైజీ తొలి రోజు వేలంలో అత్యధికంగా సుమిత్ కోసం రూ. 46 లక్షలు ఖర్చు చేసింది. తొలి రోజు వేలంలో భారత్** నుంచి 54 మంది ప్లేయర్లతో పాటు 18 మంది విదేశీ ప్లేయర్లు అమ్ముడుపోయారు. మొత్తం ఎనిమిది ఫ్రాంచైజీలు 16 కోట్ల 88 లక్షల 50 వేలు ఖర్చు చేశాయి.

ఎనిమిది ఫ్రాంచైజీల్లో కళింగ లాన్సర్స్ వద్ద అత్యధికంగా రూ. 2.57 కోట్లు ఇంకా మిగిలి ఉండగా... అత్యల్పంగా బెంగాల్ టైగర్స్ వద్ద రూ. 1.44 కోట్లు పర్స్ మనీ ఉంది. హైదరాబాద్ తూఫాన్స్ ఫ్రాంచైజీ వద్ద ఇంకా రూ. 2.04 కోట్లు ఉన్నాయి. జర్మనీకి చెందిన గొంజలో పైలట్ అత్యధిక ధర పలికిన విదేశీ ప్లేయర్‌గా నిలిచాడు. అతడికోసం తమిళనాడు డ్రాగన్స్ జట్టు రూ. 68 లక్షలు వెచ్చించింది. నెదర్లాండ్స్‌కు చెందిన జిప్ జాన్‌సెన్‌ను రూ. 54 లక్షలు పెట్టి తమిళనాడు ఫ్రాంచైజీ సొంతం చేసుకుంది.

తొలి రోజు అత్యధిక ధర పలికిన టాప్-5 ప్లేయర్లు

ప్లేయర్	దేశం	ఫ్రాంచైజీ	ధర
హర్మన్‌ప్రీత్ సింగ్	భారత్	సూర్మా హాకీ క్లబ్	రూ. 78 లక్షలు
అభిషేక్	భారత్	బెంగాల్ టైగర్స్	రూ. 71 లక్షలు
హార్దిక్ సింగ్	భారత్	యూపీ రుద్రాస్	రూ. 70 లక్షలు
గొంజలో పైలట్	జర్మనీ	హైదరాబాద్ తుఫాన్స్	రూ. 68 లక్షలు
జిప్ జాన్‌సెన్	నెదర్లాండ్స్	తమిళనాడు డ్రాగన్స్	రూ. 54 లక్షలు

రన్నరప్‌గా శ్రీవల్లి రష్మిక

ఐటీఎఫ్ మైసూర్ ఓపెన్



మైసూర్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మైసూర్ ఓపెన్‌లో హైదరాబాద్ టెన్నిస్ ప్లేయర్, టాప్‌సీడ్ శ్రీవల్లి రష్మికకు ఫైనల్లో చుక్కెదురైంది. ఈ టోర్నీ ఆసాంతం నిలకడగా రాణించిన ఆమె చివరకు ఓటమితో రన్నరప్‌గా సరిపెట్టుకుంది. ఆదివారం ఇక్కడ జరిగిన హోరాహోరీ ఫైనల్లో రష్మిక 6-3, 3-6, 6-7 (6/8)తో రెండో సీడ్ జెస్సీ అనెయ్ (అమెరికా) చేతిలో పోరాడి ఓడింది. తుది పోరును చక్కగా ఆరంభించిన హైదరాబాదీ తొలి సెట్‌లో చక్కగా ఆడింది. దీంతో సులువుగానే సెట్‌ను వశం చేసుకున్న ఆమెకు రెండో సెట్ నుంచి అమెరికన్ ప్రత్యర్థి నుంచి సవాళ్లు ఎదురయ్యాయి. రెండు బ్రేక్ పాయింట్లను సాధించిన అనెయ్ భారత ప్లేయర్‌కు ఏమాత్రం అవకాశమివ్వకుండా సెట్‌ను ముగించింది. నిర్ణాయక సెట్‌లో రష్మిక పెద్ద పోరాటమే చేసింది. మొదట్లో తప్పిదాలు చేసినా... వెంటనే పుంజుకొని ప్రత్యర్థిపై పైచేయి సాధించింది. 12వ గేమ్‌లో మ్యాచ్ పాయింట్ నుంచి మళ్లీ రష్మిక షాట్లు గతి తప్పడంతో అనూహ్యంగా సెట్ టైబ్రేక్‌కు దారి తీసింది. ఇందులోనూ భారత టెన్నిస్ క్రీడాకారిణి చివరి దాకా పోరాడినప్పటికీ... 2 గంటల 33 నిమిషాల పాటు సుదీర్ఘంగా సాగిన పోరులో అమెరికన్ పైచేయి సాధించి టైటిల్‌ను చేజిక్కించుకుంది.

ఐహిక -సుతీర్థ జోడీకి కాంస్యం

అస్తాన (కజకిస్తాన్): ఆసియా టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు మూడో పతకం దక్కింది. మహిళల డబుల్స్‌లో తొలిసారి ఐహిక ముఖర్జీ–సుతీర్థ ముఖర్జీ ద్వయం కాంస్యం అందించడం విశేషం. ప్రపంచ 15వ ర్యాంకింగ్ జోడీ అయిన ఐహిక-సుతీర్థ సెమీఫైనల్లో 4-11, 9-11, 8-11తో జపాన్‌కు చెందిన మివా హరిమొతొ-మియు కిహర జంట చేతిలో ఓడింది. ఈ చాంపియన్‌షిప్‌లో సెమీస్ చేరితే కనీసం కాంస్యం లభిస్తుంది. ఇంతకుముందే మహిళల టీమ్ ఈవెంట్‌లో మనిక బత్రా, ఐహిక, సుతీర్థ ముఖర్జీలతో కూడిన భారత బృందం సెమీస్‌లో 1-3తో జపాన్ జట్టు చేతిలో ఓడిపోవడంతో కాంస్యంతో సరిపెట్టుకుంది. టీమ్ కేటగిరీలో 1972 తర్వాత మహిళల జట్టు కాంస్యం గెలుపొందడం ఇదే తొలిసారి! పురుషుల టీమ్ ఈవెంట్‌లోనూ భారత జట్టుకు సెమీస్ పరాజయంతో మూడో కాంస్యం ఖాయమైంది. శరత్ కమల్, మానవ్ ఠక్కర్, హర్మీత్ దేశాయ్‌లతో కూడిన భారత్ 0-3తో చైనీస్ తైపీ టీమ్ చేతిలో పరాజయం చవిచూసింది. పురుషుల సింగిల్స్‌లో మాత్రం భారత ప్లేయర్లకు నిరాశే ఎదురైంది. ఆరంభ మ్యాచ్‌లో ప్రపంచ 14వ ర్యాంకర్ జంగ్ వూజిన్ (దక్షిణ కొరియా)కు షాకిచ్చిన ప్రపంచ 60వ ర్యాంకర్ మానవ్ టక్కర్ ప్రి క్వార్టర్ ఫైనల్లో మాత్రం 4-11, 4-11, 8-11తో బల్డ్‌విన్ చాన్ చేతిలో కంగుతిన్నాడు. మరో మ్యాచ్‌లో మానుష్ షా 8-11, 5-11, 11-7, 11-6, 12-14తో లిన్ యున్ జు (చైనీస్ తైపీ) చేతిలో పోరాడి ఓడాడు.



భారత్ 1-1 వియత్నాం

స్నేహపూర్వక ఫుట్‌బాల్ మ్యాచ్ 'డ్రా'



మ్యాచ్‌లో ఒక దృశ్యం

నామ్ దిన్హ్ (వియత్నాం): ఒత్తిడిని అధిగమిస్తూ చక్కటి గోల్ చేయడంతో పాటు... ప్రత్యర్థి ప్రయత్నాలను విజయవంతంగా తిప్పికొట్టిన భారత సీనియర్ ఫుట్‌బాల్ జట్టు వియత్నాంతో స్నేహపూర్వక మ్యాచ్‌ను 'డ్రా'గా ముగించింది. శనివారం వియత్నాం రాజధాని హనోయ్‌కి సమీపంలోని తియెన్ తువోంగ్ స్టేడియంలో భారత్, వియత్నాం మధ్య జరిగిన మ్యాచ్ 1-1తో సమమైంది. భారత్ తరఫున ఫరూఖ్ చౌదరి (53వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించగా... ఆట 38వ నిమిషంలో భారత గోల్ కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సంధు తప్పిదం కారణంగా సెల్ఫ్ గోల్ కావడంతో వియత్నాం ఖాతా తెరిచింది. ఫిఫా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 116వ స్థానంలో ఉన్న వియత్నాం మ్యాచ్ ఆరంభం నుంచే వరుస దాడులతో జోరు కనబర్చగా... 126వ ర్యాంక్‌లో ఉన్న భారత్ వాటిని దీటుగా ఎదుర్కొంది. హెడ్ కోచ్‌గా మనోలో మార్క్వెజ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత భారత్ తరఫున తొలి గోల్ నమోదు చేసిన ప్లేయర్‌గా ఫరూఖ్ చౌదరి నిలిచాడు. మ్యాచ్ ఆరంభం నుంచే కొత్త తరహా వ్యూహాలతో బరిలోకి దిగిన భారత జట్టు మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకుంది.

హైదరాబాద్ విజయలక్ష్యం 296

- రెండో ఇన్నింగ్స్‌లో గుజరాత్ 201 ఆలౌట్
- అనికేత్ రెడ్డికి 5 వికెట్లు
- రంజీ ట్రోఫీ



అనికేత్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: లెఫ్టార్మ్ స్పిన్నర్ అనికేత్ రెడ్డి (5/36) సత్తా చాటడంతో సికింద్రాబాద్ జింఖానా మైదానంలో హైదరాబాద్‌తో జరుగుతున్న రంజీ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో గుజరాత్ 62.4 ఓవర్లలో 201 పరుగులకు ఆలౌటైంది. ఉమంగ్ కుమార్ (113 బంతుల్లో 85; 11 ఫోర్లు, 2 సిక్సర్లు) హాఫ్ సెంచరీతో రాణించగా... సిద్ధార్థ్ దేశాయ్ (32), తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో మనన్ హింగ్‌రాజియా (25) ఫర్వాలేదనిపించారు. హైదరాబాద్ బౌలర్లలో అనికేత్ రెడ్డి 5, సీవీ మిలింద్, తనయ్ త్యాగరాజన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అంతకుముందు గుజరాత్ తొలి ఇన్నింగ్స్‌లో 93.4 ఓవర్లలో 343 పరుగులు చేయగా... హైదరాబాద్ 89.5 ఓవర్లలో 248 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రాహుల్ సింగ్ (90 బంతుల్లో 56; 6 ఫోర్లు, 2 సిక్సర్లు), హిమతేజ (184 బంతుల్లో 66; 11 ఫోర్లు), సీవీ మిలింద్ (83 బంతుల్లో 60; 9 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధశతకాలతో రాణించారు. ఓపెనర్లు తన్మయ్ అగర్వాల్ (0), అభిరథ్ రెడ్డి (2) నాలుగు ఓవర్లలోపే పెవిలియన్‌కు చేరగా... వికెట్ కీపర్ రాహుల్ రాధేశ్ (8), తనయ్ త్యాగరాజన్ (1) ప్రభావం చూపలేక పోయారు. అప్పటికే గుజరాత్ తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు చేయగా... హైదరాబాద్‌కు సరైన ఆరంభం దక్కలేదు. స్కోరు బోర్డు మీద రెండు పరుగులు నమోదయ్యేసరికి రెండు వికెట్లు పడ్డాయి. ఈ దశలో రోహిత్ రాయుడు (23)తో కలిసి కెప్టెన్ రాహుల్ సింగ్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. ఆ తర్వాత హిమతేజ, మిలింద్ చక్కటి ఇన్నింగ్స్‌లు ఆడటంతో హైదరాబాద్ జట్టు ఆ మాత్రం స్కోరు చేయగలిగింది. ఏడో వికెట్‌కు మిలింద్‌తో కలిసి హిమతేజ 99 పరుగులు జోడించాడు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 95 పరుగులతో కలుపుకొని ఓవరాల్‌గా గుజరాత్ 296 పరుగుల ఆధిక్యంలో ఉంది. సోమవారం ఆటకు చివరి రోజు కాగా... మరి ఈ లక్ష్యాన్ని హైదరాబాద్ బ్యాటర్లు ఛేదిస్తారా చూడాలి!

మరో 239 పరుగులు...



షేక్ రషీద్

నాగ్‌పూర్: కట్టుదిట్టమైన బౌలింగ్‌తో తొలి ఇన్నింగ్స్‌లో విదర్భను తక్కువ స్కోరుకే ఆలౌట్ చేసిన ఆంధ్ర జట్టు... రెండో ఇన్నింగ్స్‌లో అదే తీవ్రత కొనసాగించలేకపోయింది. ఫలితంగా విదర్భ రెండో ఇన్నింగ్స్‌లో 102.1 ఓవర్లలో 366 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ అథర్వ (170 బంతుల్లో 118; 15 ఫోర్లు, 2 సిక్సర్లు) సెంచరీతో రాణించాడు. అతడితో పాటు అమన్ (53), దానిశ్ (61), కరుణ్ నాయర్ (43), కెప్టెన్ అక్షయ్ వాడ్కర్ (40) కూడా సత్తా చాటడంతో విదర్భ భారీ స్కోరు చేసింది. 272/2తో మరింత భారీ స్కోరు చేసేలా కనిపించిన విదర్భ జట్టును ఆఖర్లో ఆంధ్ర బౌలర్లు కట్టడి చేయగలిగారు. విజయ్ 4, లలిత్ మోహన్ మూడు వికెట్లు పడగొట్టారు. సత్యనారాయణ రాజుకు రెండు వికెట్లు దక్కాయి.

అంతకుముందు విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 118 పరుగులకు ఆలౌట్ కాగా... ఆంధ్ర 167 పరుగులు చేసింది. అభిషేక్ రెడ్డి (68), షేక్ రషీద్ (56) అర్ధ శతకాలు సాధించారు. ఆంధ్ర జట్టుకు 49 పరుగులు కీలక తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించినా... విదర్భ ఆటగాళ్లు రెండో ఇన్నింగ్స్‌లో మెరుగైన ప్రదర్శన చేయడంతో ఆంధ్ర జట్టు ముందు 318 పరుగుల లక్ష్యం నిలిచింది. ఆదివారమే రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు... ఆట ముగిసే సమయానికి 21 ఓవర్లలో వికెట్ కోల్పోయి 79 పరుగులు చేసింది. మాజీ కెప్టెన్ హనుమ విహారి (22) ఔట్ కాగా.. ఓపెనర్ అభిషేక్ రెడ్డి (38 బ్యాటింగ్; 5 ఫోర్లు, ఒక సిక్సర్), షేక్ రషీద్ (18 బ్యాటింగ్; 2 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. సోమవారం ఆటకు చివరి రోజు కాగా... చేతిలో 9 వికెట్లు ఉన్న ఆంధ్ర జట్టు విజయానికి ఇంకా 239 పరుగులు చేయాల్సి ఉంది.

మళ్లీ ముంబై కోచ్‌గా జయవర్ధనే



ముంబై: శ్రీలంక మాజీ కెప్టెన్ మహేలా జయవర్ధనే తిరిగి ముంబై ఇండియన్స్ కోచ్‌గా ఎంపికయ్యాడు. గతంలో 2017 నుంచి 2022 వరకు ముంబై జట్టుకు హెడ్‌కోచ్‌గా వ్యవహరించిన జయవర్ధనే రెండేళ్ల తర్వాత తిరిగి ఆ బాధ్యతలు చేపట్టాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ఐదు టైటిల్స్ సాధించిన ముంబై జట్టు... ఈ ఏడాది 14 మ్యాచ్‌ల్లో కేవలం నాలుగే గెలిచి పాయింట్ల పట్టిక అట్టడుగున నిలిచింది. దీంతో దిద్దుబాటు చర్యలకు దిగిన ఫ్రాంచైజీ... 2023-24 సీజన్‌లలో ముంబై కోచ్‌గా వ్యవహరించిన దక్షిణాఫ్రికా మాజీ వికెట్ కీపర్ మార్క్ బౌచర్ స్థానంలో జయవర్ధనేను తీసుకొచ్చింది. జయవర్ధనే శిక్షణలో ముంబై జట్టు మూడు ఐపీఎల్ టైటిల్స్ నెగ్గింది. 'ముంబై ఫ్రాంచైజీతో విడదీయరాని అనుబంధం ఉంది. 2017 నుంచి ఆ ప్రయాణం సాగుతుంది. ప్రతిభావంతులను గుర్తించి వారికి సరైన తర్ఫీదునిచ్చాం. దానివల్లే జట్టు బలం పెరిగింది. ఇప్పుడూ అదే పని చేస్తాం. ఈ సవాల్‌ను స్వీకరించేందుకు ఉత్సుకతతో ఎదురుచూస్తున్నా' అని జయవర్ధనే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాడు. ఐపీఎల్ వేలంలో యువ ఆటగాళ్లను ఎంపిక చేసుకోవడంలో మంచి అనుభవం ఉన్న జయవర్ధనే రాకతో ఫ్రాంచైజీకి లబ్ధి చేకూరుతుందని జట్టు యజమాని ఆకాశ్ అంబానీ పేర్కొన్నారు. విశ్వవ్యాప్తంగా ఉన్న ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీలకు జయవర్ధనే గ్లోబల్ హెడ్‌గా కొనసాగుతాడని వెల్లడించారు.

సినెర్‌దే షాంఘై మాస్టర్స్ టైటిల్

జొకోవిచ్‌పై గెలుపు



షాంఘై: ప్రపంచ నంబర్‌వన్ ర్యాంకర్ జానిక్ సినెర్ ఈ ఏడాది టైటిళ్లతో దూసుకెళుతున్నాడు. చైనాలో జరిగిన షాంఘై మాస్టర్స్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ఇటాలియన్ స్టార్ ప్లేయర్ వరుస సెట్లలోనే టెన్నిస్ దిగ్గజం నొవాక్ జొకోవిచ్‌కు షాకిచ్చాడు. ఫైనల్లో సినెర్ 7-6 (7/4), 6-3తో 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల విజేత, సెర్బియన్ సూపర్ స్టార్ జొకోవిచ్‌ను కంగు తినిపించాడు. కేవలం గంటా 37 నిమిషాల్లోనే సినెర్ ఈ టైటిల్ పోరును ముగించడం విశేషం. సినెర్ 8 ఏస్‌లను సంధించి, 22 విన్నర్లు కొట్టాడు. మరోవైపు అంచనాలకు తగినట్లుగా ఆడలేకపోయిన నొవాక్ 4 ఏస్‌లు, 12 విన్నర్లే కొట్టగలిగాడు. దీంతో కెరీర్‌లో వందో టైటిల్ సాధించాలన్న సెర్బియన్ ఆశలు ఆవిరయ్యాయి. పురుషుల టెన్నిస్ చరిత్రలో ఇద్దరే ఆటగాళ్లు అమెరికన్ లెజెండ్ జిమ్మీ కానర్స్ 109, స్విట్జర్లాండ్ ఆల్‌టైమ్ గ్రేట్ రోజర్ ఫెడరర్ 103 టైటిళ్లతో సెంచరీ మార్క్‌ను దాటారు. ఈ ఏడాది సూపర్ ఫామ్‌లో ఉన్న 23 ఏళ్ల సినెర్ హార్డ్‌కోర్ట్‌లో టాప్-5 ప్లేయర్లపై తన విజయాల ఆధిక్యాన్ని కొనసాగిస్తున్నాడు. ప్రపంచ టాప్ ఐదు ర్యాంక్ ప్లేయర్లపై 8 సార్లు గెలిచిన సినెర్ కేవలం రెండు సార్లు మాత్రమే ఓడిపోయాడు. ఐదేళ్ల తర్వాత షాంఘై బరిలోకి దిగిన 37 ఏళ్ల జొకోవిచ్ చివరకు రన్నరప్‌గానే సరిపెట్టుకున్నాడు. మహిళల సింగిల్స్‌లో జరిగిన వుహాన్ ఓపెన్‌లో వరుసగా మూడోసారి బెలారస్ స్టార్ అరియాన సబలెంక హ్యాట్రిక్ టైటిల్‌ను సాధించింది. ఫైనల్లో ప్రపంచ రెండో ర్యాంకర్ సబలెంక 6-3, 7-5, 6-3తో స్థానిక చైనా స్టార్ జెంగ్ కిన్వెన్‌ను కంగుతినిపించింది. ఈ సీజన్‌లో బెలారస్ టెన్నిస్ స్టార్‌కిది నాలుగో టైటిల్. ఆమె గ్రాండ్‌స్లామ్ ఈవెంట్లలో ఆస్ట్రేలియన్, యూఎస్ ఓపెన్ టైటిళ్లను కూడా గెలుచుకుంది.



సబలెంక

గురుడి చందమామ యూరోపా...

మంచు లోకంలో మహా సముద్రం!


''ప్రాణం... ఎపుడు మొదలైందో... తెలుపగల తేదీ ఏదో గుర్తించేందుకు వీలుందా?'' అని ప్రశ్నిస్తారొక సినీ కవి. నిజమే. ప్రాణం ఎప్పుడు మొదలైంది? ఎలా మొదలైంది? భూమి కాకుండా అనంత విశ్వంలో ఇంకెక్కడైనా జీవులున్నాయా? కోట్లాది గెలాక్సీలు, తారాతీరాలు, గ్రహాలు, ఆస్టరాయిడ్లు, తోకచుక్కలు... సుదూరాన ఎన్నో కొత్త లోకాలు, మరెన్నో ప్రపంచాలు! వీటిలో ఎక్కడైనా ప్రాణికోటి వర్ధిల్లుతోందా? ఆ జీవరాశి జాడ తెలిసేదెలా? భూమి మినహా విశ్వంలో జీవులకు ఆవాసయోగ్యమైన ప్రదేశాలను కనిపెట్టేదెలా? వాతావరణం, పరిస్థితుల పరంగా జీవుల మనుగడకు ఆలంబనగా నిలిచే సానుకూల ప్రదేశాలు మన సౌరవ్యవస్థలో ఉన్నాయా? జవాబులు తెలియాలంటే గ్రహాంతర జీవం కోసం అన్వేషించాలి. మరి ఎలా వెదకాలి? ఎక్కడని వెదకాలి? శోధించేందుకు సరైన, అత్యుత్తమ జగత్తు ఏదైనా ఉందా? అంటే... ఉంది! దాని పేరు యూరోపా. బృహస్పతిగా పిలిచే గురు గ్రహానికి అది ఒక చందమామ. యూరోపాపై పరిశోధనకు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' భారత కాలమానం ప్రకారం సోమవారం రాత్రి 9:49 గంటలకు ఫ్లోరిడాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి 'యూరోపా క్లిప్పర్' అంతరిక్ష నౌకను ప్రయోగిస్తోంది. 'స్పేస్ ఎక్స్' సంస్థకు చెందిన ఫాల్కన్ హెవీ రాకెట్ దాన్ని నింగికి మోసుకెళ్లనుంది.

జీవులకు ఆవాసయోగ్యమేనా?

- అధ్యయనానికి నాసా 'యూరోపా క్లిప్పర్' మిషన్
- నేడు ఫ్లోరిడా నుంచి ప్రయోగం
- 2030లో గురుడి కక్ష్యలోకి అంతరిక్ష నౌక
- ప్రాజెక్టు వ్యయం రూ.42 వేల కోట్లు

నీరు–రసాయనాలు–శక్తి
ఈ మూడు వనరుల నెలవు!

జీవావిర్భావంలో కీలక పాత్ర పోషించే మూడు అంశాలు... ద్రవరూప జలం, రసాయనాలు, శక్తి. 'జలం ఎక్కడో జీవం అక్కడ' అనేది నానుడి. జీవులు ఆహారంగా స్వీకరించే పోషకాలను నీరు కరిగిస్తుంది. కణాంతర్గత జీవక్రియల్లో రసాయనాల రవాణాకు, అలాగే కణాలు వ్యర్థాలను తొలగించుకోవడానికి నీరు కీలకం. ఈ కోణంలో చూస్తే యూరోపాపై ఓ భారీ సముద్రమే ఉంది! జీవం పుట్టుకకు కర్బనం, ఉదజని, ఆమ్లజని, నత్రజని, గంధకం, భాస్వరం తదితర రసాయనిక పదార్థాలు అత్యావశ్యకం. అవి యూరోపా ఆవిర్భావ సమయంలోనే దానిపై ఉండి ఉండొచ్చు. ఇక తోకచుక్కలు, గ్రహశకలాలు యూరోపాను ఢీకొని మరిన్ని సేంద్రియ అణువులను దానిపై వదిలి ఉంటాయని భావిస్తున్నారు. భూమ్మీద శక్తికి సూర్యుడే మూలాధారం. కిరణజన్యసంయోగ క్రియ సాయంతో మొక్కలు ఆహారం తయారుచేసుకుంటాయి. మొక్కలను తినడం వల్ల మానవులు, జంతువులకు శక్తి బదిలీ అవుతుంది. కానీ యూరోపాలోని మహాసంద్రంలో జీవులు ఉంటే వాటి



శక్తికి కిరణజన్యసంయోగక్రియ ఆధారం కాకపోవచ్చని, రసాయన చర్యల శక్తి మాత్రమే వాటికి లభిస్తుందని ఊహిస్తున్నారు. యూరోపాలోని మహాసముద్ర అడుగు భాగం రాతిపొరతో నిర్మితమైంది. ప్రాణుల మనుగడకు కావాల్సిన రసాయన పోషకాలను అక్కడి హైడ్రోథర్మల్ యాక్టివిటీ అందించగలదని అంచనా. భూమ్మీది సముద్రాల్లో మాదిరిగా యూరోపాలోని సముద్రంలోనూ రసాయన క్రియల వల్ల హైడ్రోథర్మల్ వెంట్స్ ఏర్పడే అవకాశముంది. భూమిపై మాదిరిగానే ఈ హైడ్రోథర్మల్ వెంట్స్ యూరోపా మీద కూడా పర్యావరణ వ్యవస్థలకు ఊతమిస్తాయని భావిస్తున్నారు. ద్రవరూప జలం, రసాయనాలు, శక్తి... ఇవన్నీ ఉన్నా జీవావిర్భావానికి సమయం పడుతుంది. అలాంటి కాలం గడిచిపోయి ఇక జీవం పుట్టబోతున్న సమయం ఆసన్నమైన ప్రపంచాల కోసం మనం అన్వేషించాలి. అదిగో... సరిగ్గా ఇక్కడే శాస్త్రవేత్తల కళ్లు మన సౌరకుటుంబంలోని యూరోపాపై పడ్డాయి. గ్రహాంతర జీవాన్వేషణ దిశగా మనకు గట్టి హామీ ఇస్తున్న మరో ప్రపంచం యూరోపానే!

క్లిప్పర్... అంతరిక్ష నౌకలకు పెద్దన్న!




యూరోపా క్లిప్పర్ అంతరిక్ష నౌక

గ్రహాంతర అన్వేషణలో 'నాసా' ఇప్పటిదాకా రూపొందించిన అంతరిక్ష నౌకల్లో అతి పెద్దది 'యూరోపా క్లిప్పర్'. ఈ ప్రాజెక్టు వ్యయం రూ.42 వేల కోట్లు. క్లిప్పర్ నౌక మొత్తం బరువు 6 టన్నులు. నౌక బరువు 3,241 కిలోలు కాగా ఇంధనం బరువు 2,759 కిలోలు. దాదాపు సగం బరువు ఇంధనానిదే. నౌకలో యూరోపా ఇమేజింగ్ సిస్టమ్, థర్మల్ ఎమిషన్ ఇమేజింగ్ సిస్టమ్, మ్యాపింగ్ ఇమేజింగ్ స్పెక్ట్రోమీటర్, అల్ట్రావయొలెట్ స్పెక్ట్రోగ్రాఫ్, మాస్ స్పెక్ట్రోమీటర్, సర్ఫేస్ డస్ట్ మాస్ అనలైజర్, మాగ్నెటోమీటర్ తదితర 9 శాస్త్రీయ పరికరాలున్నాయి. 'యూరోపా క్లిప్పర్' ఎత్తు 16 అడుగులు. 24 ఇంజిన్లు, 3 మీటర్ల వ్యాసంతో హై గెయిన్ యాంటెన్నా అమర్చారు. సౌరఫలకాలు అన్నీ విచ్చుకుంటే వాటి పొడవు అటు చివర నుంచి ఇటు చివరకు 100 అడుగుల పైనే. బాస్కెట్ బాల్ కోర్టు పొడవు ఎంతో ఆ సోలార్ ప్యానెల్స్ పొడవు అంత! సూర్యుడు–భూమి మధ్య గల దూరంతో పోలిస్తే భూమి–గురుడుల మధ్య దూరం 5 రెట్లు ఎక్కువ (77 కోట్ల కిలోమీటర్లు). సూర్యుడు–గురుడుల నడుమ దూరం ఎక్కువ కనుక గురుడి చెంత సూర్యకాంతి తక్కువగా, సూర్యకిరణాలు బలహీనంగా ఉంటాయి. భారీ అంతరిక్ష నౌక అయిన క్లిప్పర్ పరిశోధనలు చేయాలన్నా, సేకరించిన డేటాను భూమికి ప్రసారం చేయాలన్నా అధిక శక్తి అవసరం. అందుకే అంత పెద్ద సోలార్ ప్యానెల్స్ పెట్టారు. ఇంధనం పొదుపు నిమిత్తం 'యూరోపా క్లిప్పర్' తన ప్రయాణంలో భూమి, అంగారకుడుల గురుత్వశక్తిని వాడుకుంటుంది. అలా ఐదున్నరేళ్లలో అది సుమారు 290 కోట్ల కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. గురుగ్రహపు మరో చంద్రుడు 'గానిమీడ్' గురుత్వశక్తిని వాడుకుంటూ 'యూరోపా క్లిప్పర్' తన వేగాన్ని తగ్గించుకుని 2030 ఏప్రిల్ నెలలో గురుగ్రహం కక్ష్యలోకి చేరుతుంది. అనంతరం పలు సర్దుబాట్లతో గురుడి కక్ష్యలో కుదురుకుని చంద్రుడైన యూరోపా చెంతకు వెళ్లేందుకు మార్గం సుగమం చేసుకుంటుంది. ఇందుకు ఓ ఏడాది పడుతుంది. అనంతరం మూడేళ్లపాటు గురుడి కక్ష్యలోనే క్లిప్పర్ నౌక పరిభ్రమిస్తూ 49 సార్లు యూరోపా దగ్గరకెళ్లి అధ్యయనం చేస్తుంది. 21 రోజులకోసారి గురుడి చుట్టూ ప్రదక్షిణ పూర్తిచేస్తూ యూరోపా ఉపరితలానికి బాగా సమీపంగా 25 కిలోమీటర్ల దూరంలోకి క్లిప్పర్ నౌక వెళ్తొస్తుంటుంది. రేడియేషన్ ముప్పు దృష్ట్యా క్లిప్పర్ అంతరిక్ష నౌకను నేరుగా యూరోపా కక్ష్యలో ప్రవేశపెట్టబోవడం లేదు. గురుడి కక్ష్యలోనూ రేడియేషన్ తీవ్రత అధికం. ఆ ప్రమాదాన్ని తప్పించడం కోసం క్లిప్పర్ నౌకను గురుడి చుట్టూ దీర్ఘవృత్తాకార కక్ష్యలో ప్రవేశపెడతారు. రేడియేషన్ బారి నుంచి నౌకలోని ఎలక్ట్రానిక్ వ్యవస్థలను కాపాడటానికి 9 మిల్లీమీటర్ల మందం గల అల్యూమినియం గోడలతో 'వాల్ట్' ఏర్పాటుచేశారు. యూరోపా జియాలజీ, మూలకాల కూర్పు, ఉష్ణోగ్రతలను క్లిప్పర్ నౌక పరిశీలిస్తుంది. మహాసముద్రం లోతును, లవణీయతను కొలుస్తుంది. యూరోపా గురుత్వక్షేత్రాన్ని, దాని ప్రేరేపిత అయస్కాంత క్షేత్రాన్ని అధ్యయనం చేస్తుంది. యూరోపా ఉపరితలంపై ఎరుపు–ఆరెంజ్ కలబోత రంగులో కనిపించే సేంద్రియ పదార్థాన్ని విశ్లేషిస్తుంది. అది మహాసముద్రం నుంచి ఉద్భవించిందో లేక సమీపంలోని చంద్రుళ్ల శిథిలాలతో తయారైందో పరిశీలిస్తుంది. గురుగ్రహం, దాని చంద్రుళ్లు గానిమీడ్, యూరోపా, కలిస్టోలను పరిశోధించడానికి యూరోపియన్ అంతరిక్ష సంస్థ (ఈఎస్ఏ) 2023లో ప్రయోగించిన 'జూపిటర్ ఐసీ మూన్స్ ఎక్స్‌ప్లోరర్' (జ్యూస్) అంతరిక్ష నౌక కూడా 2031 జులైలో గురుడి కక్ష్యలో ప్రవేశిస్తుంది.

– జమ్ముల శ్రీకాంత్

యూరోపా... మరో జల ప్రపంచం!

జీవాన్వేషణలో యూరోపాను 'నాసా' ప్రత్యేకంగా ఎంచుకోవడానికి కారణాలు లేకపోలేదు. గురుగ్రహానికి 95 ఉపగ్రహాలు (చంద్రుళ్లు) ఉన్నాయి. వీటిలో పెద్దవైన నాలుగు చంద్రుళ్లను ఇటలీకి చెందిన ఖగోళ శాస్త్రవేత్త గెలీలియో గెలీలీ 1610లో కనుగొన్నారు. ఆ చంద్రుళ్ల పేర్లు... అయో, యూరోపా, గానిమీడ్, కలిస్టో. వీటిలో 'ఐసీ మూన్' యూరోపా సైజులో మన చంద్రుడి కంటే కొంచె చిన్నదిగా ఉంటుంది. యూరోపా ఉపరితలం గడ్డకట్టిన మంచుతో నిండివుంది. ఆ మంచు పొర మందం 15–25 కిలోమీటర్లు. మంచు పొర కింద 60–150 కిలోమీటర్ల లోతున సువిశాల ఉప్పునీటి మహాసముద్రం ఒకటి ఉందట. గతంలో పయనీర్–10, పయనీర్–11, వోయేజర్–1, వోయేజర్–2, గెలీలియో, కేసిని, జునో మిషన్స్ ఆ మహా సముద్రం ఆనవాళ్లను గుర్తించాయి. భూమ్మీద అన్ని సముద్రాల్లో ఉన్న నీటి కంటే రెట్టింపు నీరు యూరోపాలోని మహాసంద్రంలో ఉండొచ్చని విశ్వసిస్తున్నారు. యూరోపాపై పెద్ద సంఖ్యలో దర్శనమిస్తున్న పగుళ్లు, కొద్దిపాటి బిలాల ఆధారంగా చూస్తే దాని ఉపరితలం 'యుక్త వయసు'లోనే ఉందని, భౌగోళికంగా క్రియాశీలకంగా ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. 'నాసా' యూరోపా క్లిప్పర్ మిషన్ ప్రధాన లక్ష్యం... యూరోపాపై ప్రస్తుతం జీవం ఉందో, లేదో నిర్ధారించడం కాదు. అంటే... యూరోపా ఉపరితలపు మంచు పొరను క్లిప్పర్ నౌక తవ్వదు (డ్రిల్ చేయదు). అలాగే అక్కడి సముద్రంలోకి చొచ్చుకెళ్లి పరిశీలించదు. యూరోపా మంచు పొర కింద గల మహాసముద్రంలో జీవం మనుగడ సాగించడానికి దోహదపడే సానుకూల పరిస్థితులున్నాయా? జీవులకు ఆవాసం కల్పించే సామర్థ్యం యూరోపాకు ఉందా? అసలక్కడ జీవం మనుగడ సాధ్యమేనా? వంటి అంశాలు తెలుసుకోవడానికే నాసా ఈ ప్రయత్నం చేస్తోంది. భవిష్యత్ మిషన్లకు కావాల్సిన కీలక సమాచారాన్ని 'యూరోపా క్లిప్పర్' సంపాదిస్తుంది. శని గ్రహపు చంద్రుడైన ఎన్సెలాడస్ ఉపరితలం నుంచి గీజర్ల మాదిరిగా నీటి ఆవిర్లు రోదసిలోకి విడుదలవుతున్నట్టు గతంలో గుర్తించారు. యూరోపా ఉపరితలం నుంచి పైకి లేస్తున్న నీటి ఆవిర్లు కూడా అలాంటివేనా అనే అంశాన్ని 'యూరోపా క్లిప్పర్' పరిశోధిస్తుంది.



1.ఉపరితలంపై గడ్డకట్టిన మంచు పొర. 2.గడ్డకట్టిన మంచు పొర నుంచి రోదసిలోకి విడుదలవుతున్న నీటి ఆవిర్లు. 3.మంచు పొర కింద మహాసముద్రం 4.మహాసముద్రం అడుగున శిలానిర్మితమైన నేల.

బీజేపీ ఉగ్రవాదుల పార్టీ: ఖర్గే

న్యూఢిల్లీ: కాంగ్రెస్‌ను అర్బన్ నక్సల్స్ నడిపిస్తున్నారంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే తీవ్రంగా స్పందించారు. బీజేపీని టెర్రరిస్టుల పార్టీ అంటూ మండిపడ్డారు. 'మోదీ ఎప్పుడూ కాంగ్రెస్‌పై అర్బన్ నక్సల్స్ పార్టీ అనే ముద్ర వేస్తుంటారు. అది ఆయన అలవాటు. కానీ, ఆయన సొంత పార్టీ సంగతేమిటి? బీజేపీ మూకహత్యలు చేసే ఉగ్రవాదుల పార్టీ. అటువంటి వాళ్లకే ఆ పార్టీ మద్దతిస్తుంది. మాపై ఇటువంటి ఆరోపణలు చేసే హక్కు ఆయనకు లేదు' అని తిప్పికొట్టారు. ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమైతే, దేశాన్ని ముక్కలు చేయాలనే తమ పన్నాగం పారదని బీజేపీకి భయం పట్టుకుందని విమర్శించారు.

కాంగ్రెస్‌ది సైద్ధాంతిక దివాళాకోరుతనం: జేపీ నడ్డా

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమి పాలవ్వడంతో ఆ పార్టీ చీఫ్ ఖర్గే నిరాశతో, సైద్ధాంతిక దివాళాకోరుతనంతో మాట్లాడుతున్నారని బీజేపీ చీఫ్ జేపీ నడ్డా అన్నారు. ఎన్నికల్లో ఓటమిని కప్పిపుచ్చుకునేందుకు బీజేపీని ఉగ్రవాదుల పార్టీ అంటూ బురద చల్లుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పరిస్థితిని చూసి ప్రతి ఒక్కరూ ఇప్పుడు జాలి పడుతున్నారన్నారు. ప్రజల అభిమానాన్ని పొందడంలో ఎందుకు విఫలమయ్యారో ఆత్మ విమర్శ చేసుకోవాలని ఖర్గేను కోరారు. జాతి వ్యతిరేక శక్తులకు, అర్బన్ నక్సల్స్‌కు మద్దతిచ్చేదెవరో ప్రజలకు తెలుసునని నడ్డా పేర్కొన్నారు.

సీఎం అభ్యర్థి ఎవరన్నది ముఖ్యం కాదు

మహారాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు నానా పటోలె

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరన్నదానిపై రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి. కూటమిలోని ఎన్సీపీ(శరద్ పవార్), కాంగ్రెస్ పార్టీ సీఎం పదవి కోసం పోటీ పడుతున్నట్లు ప్రచారం సాగుతోంది. సీఎం అభ్యర్థిని ఇప్పుడే తేల్చాలని శివసేన(ఉద్ధవ్) అధినేత ఉద్ధవ్‌ఠాక్రే డిమాండ్ చేస్తున్నారు. అయితే, తమ కూటమి తరఫున సీఎం అభ్యర్థి ఎవరన్నది ఇప్పుడంత ముఖ్యం కాదని మహారాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు నానా పటోలె చెప్పారు. ఎన్నికల్లో విజయంపైనే తమ దృష్టంతా ఉందని చెప్పారు. ఎంవీఏ నేతలు ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు.

ఇబ్బంది వస్తే నన్ను సంప్రదించండి: కేజ్రీవాల్

దోడా(జమ్మూకశ్మీర్): ''పరిమిత అధికారాలున్న ఢిల్లీకి సీఎంగా పనిచేసిన అనుభవంతో చెబుతున్నా.. ఏవైనా ఇబ్బందులు ఉంటే నన్ను సంప్రదించండి'' అంటూ ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అర్వింద్ కేజ్రీవాల్.. నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లాకు సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన ఒమర్‌కు కేజ్రీవాల్ అభినందనలు తెలిపారు. అతని నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని ఆకాంక్షించారు. మెహ్రాజ్ మాలిక్‌ను గెలిపించి తమ పార్టీకి జమ్మూకశ్మీర్‌లో మొట్టమొదటి విజయాన్ని అందించిన దోడా అసెంబ్లీ నియోజకవర్గంలో కేజ్రీవాల్ ఆదివారం పర్యటించారు. దోడా నియోజకవర్గ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తమ పార్టీ చారిత్రాత్మక విజయం రాబోయే పదేళ్లలో జమ్మూకశ్మీర్ చరిత్రను మారుస్తుందన్నారు.

నేను బీజేపీతోనే ఉన్నా

తిరుగుబాటు వార్తలను ఖండించిన కేంద్రమంత్రి రావు ఇందర్‌జిత్ సింగ్

చండీగఢ్: బీజేపీపై తాను తిరుగుబాటు చేశాననే వార్తలను కేంద్రమంత్రి రావు ఇందర్‌జిత్ సింగ్ ఖండించారు. తాను భారతీయ జనతా పార్టీతోనే ఉంటానని స్పష్టం చేశారు. 'తొమ్మిది మంది ఎమ్మెల్యేలతో కలిసి బీజేపీపై తిరుగుబాటు చేశానని కొన్ని టీవీ ఛానళ్లు నిరాధార వార్తలను ప్రసారం చేస్తున్నాయి. ఇవి సత్యదూరమైన వార్తలు' అని ఇందర్‌జిత్ ఆదివారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అహిర్వాల్ ప్రాంతంలో మొత్తం 11 నియోజకవర్గాలు ఉండగా.. బీజేపీ 10 చోట్ల గెలవడం విశేషం. ఇందర్‌జిత్ కూతురు ఆర్తి సింగ్ కూడా ఇందులో ఉన్నారు. అహిర్వాల్ ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యేల్లో మెజారిటీ ఇందర్‌జిత్ సింగ్‌కు సన్నిహితులుగా పేరుపడ్డారు.

కేఐఏడీబీకి భూమిని తిరిగిచ్చేసిన రాహుల్ ఖర్గే

బెంగళూరు/శివాజీనగర: కర్ణాటకలో ముడా స్కాం నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కుమారుడు రాహుల్ ఖర్గే కీలక నిర్ణయం తీసుకున్నారు. వారి కుటుంబానికి చెందిన సిద్ధార్థ విహార్ ట్రస్ట్ 'మల్టీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్స్ అండ్ రీసెర్చ్ సెంటర్' ఏర్పాటుకు బెంగళూరులో ఐదెకరాల స్థలాన్ని కేటాయించాలనే అభ్యర్థనను ఉపసంహరించుకున్నారు. ఈ మేరకు సెప్టెంబర్ 20న కర్ణాటక పారిశ్రామిక అభివృద్ధి బోర్డు (కేఐఏడీబీ)కు రాసిన లేఖలో రాహుల్ ఖర్గే పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఎమర్జింగ్ టెక్నాలజీలో మరిన్ని ఉద్యోగావకాశాలు కల్పించడమే సిద్ధార్థ విహార్ ట్రస్ట్ లక్ష్యమన్నారు. కళాశాల విద్యను అభ్యసించలేని విద్యార్థులకు సహాయం చేయడానికి కూడా దీనిని రూపొందించామని పేర్కొన్నారు. పరిశ్రమలకు దగ్గరగా ఉండటం వల్ల యువతకు అవకాశాలు పెరుగుతాయనే కేఐఏడీబీ ఇండస్ట్రియల్ ఏరియాను ఎంచుకున్నామని లేఖలో స్పష్టం చేశారు. ఆ లేఖ కాపీలను కర్ణాటక మంత్రిగా ఉన్న మల్లికార్జున ఖర్గే చిన్న కుమారుడు ప్రియాంక్ ఖర్గే తన 'ఎక్స్' హ్యాండిల్‌లో పంచుకున్నారు. సిద్ధార్థ విహార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటైన సంస్థలన్నీ లాభాపేక్ష లేని సంస్థలేనని, సీఏ స్థలం కోసం దరఖాస్తు చేసుకోవడానికి, పొందడానికి ట్రస్టుకు పూర్తి అర్హత ఉందని మంత్రి పేర్కొన్నారు. అయితే.. దురుద్దేశంతో కూడిన, రాజకీయ ప్రేరేపిత ఆరోపణలను నిరంతరం ఎదుర్కొంటూ ఏ విద్యాసంస్థా సమర్థవంతంగా పనిచేయదని, సామాజిక సేవే లక్ష్యంగా నడుస్తున్న ట్రస్టును వివాదాల్లోకి నెట్టడం ఇష్టం లేకే ప్రతిపాదనను ఉపసంహరించుకుంటున్నట్లు కేఐఏడీబీకి ట్రస్టు లేఖ రాసిందని మంత్రి తెలిపారు.

ఇటీవల అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆయన తనయుడు రాహుల్ ఖర్గేలకు చెందిన సిద్ధార్థ విహార్ ట్రస్టుకు రాష్ట్ర ప్రభుత్వం 5 ఎకరాల భూమిని మంజూరు చేసింది. కాగా, సిద్ధార్థ విహార్ ట్రస్టుకు భూమి కేటాయించడాన్ని బీజేపీ ఐటీ విభాగం ఇంచార్జ్ అమిత్ మాలవీయ, బీజేపీ రాజ్యసభ సభ్యుడు లహర్‌సింగ్ సిరోయాలు ఎక్స్‌లో వేదికగా ప్రశ్నించారు. ఇది కచ్చితంగా అధికార దుర్వినియోగం, బంధుప్రీతితో వ్యవహరించడమేనని పేర్కొన్నారు. కేఐఏడీబీ భూమి పొందడానికి ఖర్గే కుటుంబ సభ్యులు ఏరోస్పేస్ పారిశ్రామిక వేత్తలుగా ఎప్పుడు మారారని ఎద్దేవా చేశారు. ముడా ప్లాట్ల కేటాయింపుల విషయంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య పార్వతి, ఆమె సోదరుడిపై లోకాయుక్త పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. దీంతో 14 సైట్లను మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి ఆమె తిరిగి ఇచ్చేశారు. ఈ నేపథ్యంలో ఖర్గే కుటుంబం ఈ నిర్ణయం తీసుకుంది.

ఈవీఎంలపై సందేహాలను ఈసీ నివృత్తి చేయాలి: ఎంపీ కపిల్ సిబల్

న్యూఢిల్లీ: హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎంలలో తేడాలపై కాంగ్రెస్ లేవనెత్తిన సందేహాలను ఎన్నికల సంఘం (ఈసీ) నివృత్తి చేయాలని రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ డిమాండ్ చేశారు. ఈవీఎంలలో అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ గురు, శుక్రవారాల్లో ఈసీకి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈసీకి ఆధారాలు అందజేస్తున్నామని, తమ సందేహాలను ఎన్నికల సంఘం నివృత్తి చేయాల్సి ఉందని కపిల్ సిబల్ అన్నారు. 'ఈవీఎంల దుర్వినియోగం జరుగుతోందనే భావిస్తున్నా. అయితే అది ఏమేరకు జరుగుతోందనేది నేను చెప్పలేను. ఈవీఎంల వాడకానికి నేను మొదటినుంచి వ్యతిరేకమే. పారదర్శకత లేనిదేదైనా ఆమోదయోగ్యం కాదు' అని కాంగ్రెస్ మాజీ నాయకుడు సిబల్ అన్నారు. హరియాణాలో అనూహ్య ఫలితాలు వెలువడ్డాయని కాంగ్రెస్ ఆరోపించింది. ఈవీఎంల బ్యాటరీలు 80 శాతం కంటే తక్కువ ఉన్నచోట్ల కాంగ్రెస్ అభ్యర్థులు ఆధిక్యాన్ని కనబర్చారని, 99 శాతం చార్జింగ్ ఉన్న ఈవీఎంలలో బీజేపీకి అనుకూల ఫలితాలు వచ్చాయనేది కాంగ్రెస్ ఆరోపణ.

9వ రోజుకు జూడాల నిరశన దీక్ష

కోల్‌కతా: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో ట్రెయినీ వైద్యురాలి హత్యాచార ఘటనకు సంబంధించిన డిమాండ్ల సాధనకు జూనియర్ డాక్టర్లు చేపట్టిన నిరాహార దీక్ష ఆదివారం 9వ రోజుకు చేరుకుంది. నేటి నుంచి ఆస్పత్రుల్లో కొన్ని సేవలను నిలిపివేయనున్నట్లు రెసిడెంట్ డాక్టర్ల సంఘాల వేదిక ప్రకటించింది. ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో హత్యాచారానికి గురైన ట్రెయినీ వైద్యురాలికి న్యాయం చేయాలని, ఆరోగ్య కార్యదర్శి ఎన్ఎస్ నిగమ్‌ను వెంటనే తొలగించాలని, తాము పనిచేస్తున్న చోట భద్రత కల్పించాలని జూడాలు డిమాండ్ చేస్తున్నారు. నిరశన దీక్ష చేపట్టిన జూడాలకు రెసిడెంట్ డాక్టర్ల సంఘాల వేదిక ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్(ఫైమా) సంఘీభావం ప్రకటించింది. సోమవారం నుంచి దేశవ్యాప్తంగా ఆస్పత్రుల్లో కొన్ని సేవలను బహిష్కరించాలని నిర్ణయించినట్లు తెలిపింది. ఆస్పత్రుల్లో అత్యవసర సేవలు మాత్రం కొనసాగుతాయని స్పష్టం చేసింది. ఈ విషయంలో గతంలో తాము రాసిన లేఖకు సీఎం మమతా బెనర్జీ నుంచి సరైన రీతిలో స్పందన రాలేదని పేర్కొంది. దీక్షకు పూనుకున్న వైద్యులకు ఎలాంటి హాని తలపెట్టాలని చూసినా జాతీయ స్థాయిలో వైద్యసేవలను పూర్తిగా నిలిపివేస్తామని ఫైమా రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది.



యూరప్ దేశం బోస్నియాలో సంభవించిన ఆకస్మిక వరదల కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో, నెరేట్వా నదిలో కొట్టుకొచ్చిన వ్యర్థాలన్నీ గ్రబోవికాలోని డ్యామ్ వద్ద మేట వేశాయిలా.



లెబనాన్ నుంచి హెజ్‌బొల్లా మిలిటెంట్లు రాకెట్లు ప్రయోగించడంతో ఇజ్రాయెల్‌లోని ఆక్రె నగరంలోని బాంబ్ షెల్టర్‌లో రక్షణ పొందుతున్న చిన్నారులు

గుజరాత్‌లో రూ. 5 వేల కోట్ల డ్రగ్స్ స్వాధీనం

న్యూఢిల్లీ: ఢిల్లీ, గుజరాత్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో రూ.5,000 కోట్ల విలువైన 518 కిలోల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. గుజరాత్‌లోని అంక్లేశ్వర్‌లో ఉన్న అవ్‌కార్ ఫార్మాస్యూటికల్ కంపెనీలో నిర్వహించిన సోదాల్లో కొకైన్ లభ్యమైనట్లు ఢిల్లీ పోలీసు స్పెషల్ సెల్, గుజరాత్ పోలీసులు ఆదివారం తెలిపారు. పట్టుబడిన కొకైన్ విలువ అంతర్జాతీయ మార్కెట్లో సుమారు రూ.5,000 కోట్లు ఉంటుందని సమాచారం. దీంతో ఈ పక్షం రోజుల్లో ఢిల్లీ, గుజరాత్‌లలో రూ.13,000 కోట్ల విలువైన 1,289 కిలోల కొకైన్, 40 కిలోల హైడ్రోపోనిక్ థాయ్‌లాండ్ గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. అక్టోబర్ 1న ఢిల్లీలో ఉన్న మహిపాల్‌పూర్‌లోని ఓ గోదాముపై స్పెషల్ సెల్ దాడి చేసి 562 కిలోల కొకైన్, 40 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకుంది. ఈ నెల 10న ఢిల్లీలోని రమేశ్‌నగర్‌లోని ఓ దుకాణంలో 208 కిలోల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇవి అంక్లేశ్వర్‌కు చెందిన అవ్‌కార్ ఫార్మాస్యూటికల్ కంపెనీ నుంచి వచ్చినవని పోలీసులు గుర్తించారు. అక్కడ సోదాలు నిర్వహించడంతో పెద్ద ఎత్తున కొకైన్ పట్టుబడింది.

బ్రెజిల్‌లో పెను తుఫాను

సావో పాలోలో ఏడుగురు మృతి, అంధకారంలో 10 లక్షల ఇళ్లు

సావో పాలో: బ్రెజిల్‌లోని సావో పాలో రాష్ట్రంలో పెను తుఫాను బీభత్సం సృష్టించింది. కొద్ది సమయంలోనే వచ్చిన తీవ్రమైన తుఫానులో ఏడుగురు మరణించారు. విద్యుత్ అంతరాయంతో 10 లక్షల ఇళ్లు అంధకారంలోనే ఉన్నాయి. తుఫాను ప్రభావంతో శుక్రవారం రాత్రి నుంచే గంటకు 108 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచాయి. దీంతో ట్రాన్స్‌మిషన్ లైన్లు నేలకూలాయి. కొన్ని ప్రాంతాల్లో తీవ్ర నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు. రెండో కోట్ల జనాభా కలిగిన మెట్రోపాలిటన్ నగరంలోని పలు ప్రాంతాలు శనివారం ఇంకా చీకట్లోనే ఉన్నాయి. సావోపాలో సమీప నగరాలైన సావో బెర్నార్డో డో కాంపో, కోటియా, సావో కెటానో, శాంటో ఆంద్రీ, డియాడెమాలలో నీటి సరఫరాకు అంతరాయం కలిగించింది. భద్రతా కారణాల దృష్ట్యా పలు విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేశారు. సాధ్యమైనంత త్వరగా సాధారణ స్థితిని పునరుద్ధరించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రకృతి ఈ స్థాయిలో విరుచుకుపడటం 30 ఏళ్లలో మొదటిసారని అధికారులు చెబుతున్నారు.

ఇజ్రాయెల్‌కు అమెరికా 'థాడ్'

వాషింగ్టన్: ఇరాన్ క్షిపణి దాడుల నేపథ్యంలో ప్రతి చర్య ఊహించనంతగా ఉంటుందంటూ హెచ్చరికలు చేస్తున్న ఇజ్రాయెల్‌కు అగ్రరాజ్యం అమెరికా మరింత సాయం అందించేందుకు సిద్ధమైంది. క్షిపణి దాడుల నుంచి కాచుకునేందుకు అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థ టెర్మినల్ హై ఆల్టిట్యూడ్ ఏరియా డిఫెన్స్(థాడ్) బ్యాటరీపాటు నిర్వహణకు అవసరమైన కొన్ని బలగాలను కూడా పంపించాలని నిర్ణయించింది. అధ్యక్షుడు బైడెన్ ఆదేశాల మేరకు రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ స్వయంగా వీటి బట్వాడాను పర్యవేక్షిస్తున్నారని పెంటగాన్ ప్రతినిధి మేజర్ జనరల్ ప్యాట్ రైడర్ ఆదివారం ప్రకటించారు. ఇజ్రాయెల్‌కు సైనిక బలగాలను పంపించవద్దంటూ అమెరికాకు ఇరాన్ హెచ్చరికలు చేయడం గమనార్హం.

కొనసాగుతున్న వాంగ్చుక్ నిరాహార దీక్ష

లద్దాఖ్ భవన్ వద్ద పలువురి నిర్బంధం

న్యూఢిల్లీ: లద్దాఖ్‌ను రాజ్యాంగం ఆరో షెడ్యూల్‌లో చేర్చాలంటూ ఈ నెల 6వ తేదీ నుంచి ఢిల్లీలోని లద్దాఖ్ భవన్‌లో పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్చుక్ చేపట్టిన నిరాహార దీక్ష కొనసాగుతోంది. ఆదివారం ఢిల్లీ పోలీసులు లద్దాఖ్ భవన్ వెలుపల కొందరిని నిర్బంధించారు. 'జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టేందుకు వీరు అనుమతి కోరారు. ఆ దరఖాస్తు పరిశీలనలో ఉంది. వీరికి మరెక్కడా ఆందోళన చేపట్టేందుకు అనుమతి లేదు. ఆదివారం అదుపులోకి తీసుకున్న సుమారు 25 మందిని తర్వాత విడిచిపెడతాం' డీసీపీ దేవేశ్ మహ్లా చెప్పారు. పోలీసుల చర్యను వాంగ్చుక్ తీవ్రంగా ఖండించారు. భారత ప్రజాస్వామ్యంపై మాయనిమచ్చగా అభివర్ణిస్తూ ఒక మెసేజీ విడుదల చేశారు.

సాక్షి ప్లస్
సోమవారం । 14-10-2024

ప్రాథమిక హక్కుల పరిరక్షణ కర్త సుప్రీంకోర్టు

వ్యక్తిగత స్వేచ్ఛలు, హక్కులు

ప్రకరణ-28

విద్యాలయాల్లో మత బోధన నిషేధం

ప్రకరణ 28(1): ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నడిచే ప్రైవేట్ విద్యాసంస్థల్లో ప్రత్యేక మత బోధన నిషేధం.

ప్రకరణ 28(2): పై నిబంధనకు కొన్ని మినహాయింపులిచ్చారు. ప్రభుత్వం నిర్వహించే దేవాదాయ, ధర్మాదాయ సంస్థల్లో ప్రత్యేక మత బోధన చేయవచ్చు.

ప్రకరణ 28(3): ప్రభుత్వ గుర్తింపు ఉన్న, ప్రభుత్వ ఆర్థిక సహాయం పొందే విద్యాసంస్థల్లో ఒక వ్యక్తి ఐచ్ఛికంగా మత ప్రార్థనలు/బోధనల్లో పాల్గొనవచ్చు. అయితే పాల్గొనమని ఒత్తిడి చేయరాదు. ఆ వ్యక్తి మైనర్ అయితే తల్లిదండ్రులు లేదా సంరక్షకుడి అనుమతి తీసుకోవాలి.

ప్రకరణలు-29, 30

విద్యా, సాంస్కృతిక పరమైన హక్కులు

ప్రకరణ 29(1): భారతదేశంలో నివసిస్తున్న ప్రజలకు ప్రత్యేక భాష, లిపి, సంస్కృతి ఉంటే.. వాటిని పరిరక్షించుకుని, పెంపొందించుకునే స్వేచ్ఛ వారికి ఉంటుంది.

ప్రకరణ 29(2): ప్రభుత్వం నిర్వహిస్తోన్న లేదా ప్రభుత్వ ఆర్థిక సహాయం పొందుతున్న సంస్థల్లో ప్రవేశానికి మతం, జాతి, కులం, భాషా ప్రాతిపదికన వివక్ష చూపరాదు.

ప్రకరణ 30(1): మైనారిటీ వర్గాలవారు, ప్రత్యేక విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకొని, నిర్వహించుకోవచ్చు.

ప్రకరణ 30(1)(ఎ): మైనారిటీలు నిర్వహిస్తున్న విద్యాసంస్థలు, వాటి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే, వారికి ప్రత్యేక నష్టపరిహారం చెల్లించాలి. 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ క్లాజును చేర్చారు.

ప్రకరణ 30(2): ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించే సమయంలో విద్యాసంస్థల పట్ల వివక్ష చూపరాదు. అల్ప సంఖ్యాక వర్గాల వారు నడిపే సంస్థలు, అధిక సంఖ్యాక వర్గాల వారు నడిపే సంస్థలను సమ దృష్టితో చూడాలి.

వివరణ:

- ఆర్టికల్ 29, 30లలో 'మైనారిటీ' పదాన్ని ప్రస్తావించారు. కానీ ఈ పదాన్ని రాజ్యాంగంలో ఎక్కడా నిర్వచించలేదు.
- మైనారిటీల వర్గీకరణకు రాష్ట్రాన్ని ప్రాతిపదికగా తీసుకోవాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. దేశంలో రెండు రకాల మైనారిటీ వర్గాలున్నాయి. అవి మతపరమైన, భాషాపరమైన మైనారిటీ వర్గాలు.
- హిందువులు మినహా మిగతా వారంతా మతపరమైన మైనారిటీలే. భాషాపరమైన మైనారిటీలు రాష్ట్రాల వారీగా మారుతుంటారు. ఉదాహరణకు.. తెలంగాణలో కన్నడిగులు, గుజరాతీలు, మరాఠీలు భాషాపరంగా మైనారిటీలు.

సుప్రీంకోర్టు తీర్పులు

కేరళ విద్య పాఠ్యాంశాల సవరణ బిల్లు (1958) కేసు: కేరళ ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవ, కమ్యూనిస్టు భావాలున్న పాఠ్యాంశాలను చేర్చారు. దీంతో ఈ బిల్లును సుప్రీంకోర్టు సలహా పరిధికి నివేదించారు. పాఠ్యాంశాల్లో తీవ్రవాద భావజాలాన్ని చేర్చడం చెల్లదని సుప్రీంకోర్టు తెలిపింది.

డి.ఎ.వి. కాలేజ్ v/s స్టేట్ ఆఫ్ పంజాబ్ (1971) కేసు: విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలల్లో పంజాబీ మాత్రమే బోధన భాషగా ఉండాలని నిర్ణయించారు. అయితే ఇది చెల్లుబాటు కాదని సుప్రీంకోర్టు తీర్పుచెప్పింది.

అల్‌సెయింట్స్ v/s గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (1980) కేసు: మైనారిటీ విద్యాసంస్థల నిర్వహణలో ప్రభుత్వం జోక్యం చేసుకోరాదని ఈ కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

టి.ఎం.ఎ.పాయ్ v/s స్టేట్ ఆఫ్ కర్ణాటక (2003) కేసు: మైనారిటీ విద్యా సంస్థల విషయంలో ప్రభుత్వం ఏ సందర్భంలో జోక్యం చేసుకోవచ్చో, జోక్యం చేసుకోరాదో వివరణ ఇస్తూ కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. అవి..

- మైనారిటీ స్థాయిని నిర్ణయించడానికి రాష్ట్రాన్ని మాత్రమే యూనిట్‌గా తీసుకోవాలి.
- మైనారిటీ అనే పదంలో భాషాపరమైన, మతపరమైన మైనారిటీలు ఉండవచ్చు.
- బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు, వారిపై పాలనా నియంత్రణ సంబంధిత హక్కులు మేనేజ్‌మేంట్‌కే ఉంటాయి. ప్రభుత్వ ధనసహాయం పొందని మైనారిటీ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించే అధికారం ప్రభుత్వానికి లేదు. అయితే క్యాపిటేషన్ ఫీజులను ప్రభుత్వం నియంత్రించవచ్చు.

మత స్వేచ్ఛ - సుప్రీంకోర్టు తీర్పులు

బిజో ఇమాన్యువల్ v/s స్టేట్ ఆఫ్ కేరళ (1986) కేసు:
జాతీయ గీతాన్ని ఆలపించడం తమ మత విశ్వాసాలకు విరుద్ధమని నిరూపించగలిగితే.. జాతీయ గీతం పాడాలని ఏ వ్యక్తిని ఒత్తిడి చేయరాదని సుప్రీంకోర్టు పేర్కొంది. కేరళ పాఠశాలల్లో జాతీయ గీతం ఆలపించడం తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీన్ని ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టులో ఈ కేసు దాఖలైంది.

సెయింట్ జేవియర్స్ కాలేజ్ v/s స్టేట్ ఆఫ్ గుజరాత్ (1974) కేసు:
'లౌకికతత్వం' పదానికి ఈ కేసులో సుప్రీంకోర్టు వివరణ ఇచ్చింది. మతానికి, దేవుడికి అతీతంగా వ్యవహరించడమే లౌకికతత్వం. దేవుడి పట్ల ప్రత్యేక ద్వేషం,వ్యతిరేకత చూపకూడదు. దేవుణ్ని నమ్మేవారిని, నమ్మని వారిని ప్రభుత్వం ఒకే విధంగా చూడాలి.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

ప్రకరణ - 31

ఆస్తిహక్కు

పార్లమెంటు ఆస్తి హక్కుకు సంబంధించి అనేక సవరణలు, చట్టాలు చేసింది. 1951లో మొదటి రాజ్యాంగ సవరణ, 1964లో 17వ రాజ్యాంగ సవరణ, 1971లో 24వ రాజ్యాంగ సవరణ చేశారు. 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించారు. దాన్ని 12వ భాగంలో ప్రకరణ 300-ఎలో రాజ్యాంగ పరమైన హక్కుగా (Constitutional Rights) చేర్చారు. 1979 జూన్ 20 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. అలాగే ఆస్తి హక్కుకు సంబంధించి నూతన నిబంధనలను కూడా చేర్చారు.

ప్రకరణ 31(ఎ): ప్రభుత్వం ఆస్తిని స్వాధీనం చేసుకున్నప్పుడు వర్తించే కొన్ని మినహాయింపులను ఈ ప్రకరణలో పేర్కొన్నారు. భూ సంస్కరణల అమలు కోసం చట్టాలు చేసినప్పుడు.. అవి 14, 19 ప్రకరణలకు వ్యతిరేకమనే కారణంతో న్యాయస్థానాల్లో ప్రశ్నించరాదు.

ప్రకరణ 31(బి): కొన్ని చట్టాల వర్తింపునకు మినహాయింపులు. వీటిని 9వ షెడ్యూల్డ్‌లో ప్రస్తావించారు. ప్రాథమిక హక్కులకు వ్యతిరేకంగా ఉన్నాయన్న కారణంతో ఇలాంటి చట్టాలను న్యాయస్థానాల్లో ప్రశ్నించరాదు.9వ షెడ్యూల్డ్‌లో పేర్కొన్న అంశాలు సాధారణంగా న్యాయ సమీక్షకు గురికావు. కానీ'రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో న్యాయ సమీక్ష అంతర్భాగం. దాన్ని పరిమితం చేసే అధికారం పార్లమెంటుకు లేదు' అని కేశవానంద భారతి కేసు(1973)లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

2007లో ఐ.ఆర్. కొహెల్హో v/s తమిళనాడు కేసులో 'న్యాయ సమీక్ష రాజ్యాంగ మౌలిక నిర్మాణంలోకి వస్తుంది. కాబట్టి 1973 తర్వాత 9వ షెడ్యూల్డ్‌లో చేర్చిన అంశాలు న్యాయ సమీక్షకు గురవుతాయి' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

ప్రకరణ 31(సి): ఆదేశిక సూత్రాల అమలు కోసం ప్రాథమిక హక్కులపై, ముఖ్యంగా ఆస్తి హక్కుపై కొన్ని పరిమితులు విధించవచ్చు. ఈ పరిమితులు రాజ్యాంగ విరుద్ధమంటూ న్యాయస్థానాల్లో ప్రశ్నించడానికి వీల్లేదు.

ఆదేశిక సూత్రాల్లోని ప్రకరణ 39లో ఉన్న క్లాజు బి, సిలో సామ్యవాద తరహా సమాజ స్థాపన గురించి పేర్కొన్నారు. ఈ విషయమై రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంటు కొన్ని పరిమితులు విధిస్తే, అవి ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమని న్యాయస్థానంలో ప్రశ్నించలేం.



వివరణ:

ప్రకరణ 31(ఎ), 31(బి), 31(సి)లు ఆస్తి హక్కుపై పరిమితికి సంబంధించినవి. ఇవి ఎలాంటి ప్రాథమిక హక్కులను ప్రసాదించవు. 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆస్తి హక్కు ప్రకరణ 31ను తొలగించారు. కానీ వీటిని మాత్రం కొనసాగించారు.

ప్రకరణ - 32

రాజ్యాంగ పరిహార హక్కు (Right to Constitutional Remedies)

ప్రాథమిక హక్కుల్లో ఇది అత్యంత ముఖ్యమైంది. మూడో భాగంలో పొందుపరచిన ప్రాథమిక హక్కులకు భంగం కలిగినా/ఆ హక్కులను పరిమితం చేసినా/అమలు చేయకపోయినా, బాధితులు నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించి తగిన రాజ్యాంగ పరిహారాలను పొందవచ్చు. మొదటి ఆరు ప్రాథమిక హక్కుల అమలు ఈ నిబంధన పైనే ఆధారపడి ఉంటుంది. హక్కులను గుర్తించడంతోపాటు, వాటి అమలుకు హామీ ఉన్నప్పుడే వాటికి విలువ ఉంటుంది. అమలు కాని హక్కులు వ్యర్థం.

ప్రాథమిక హక్కుల పరిరక్షణకు నిబంధన 32(4) హామీ ఇస్తోంది. అందుకే అంబేద్కర్ రాజ్యాంగ పరిహార హక్కును రాజ్యాంగ ఆత్మగా, హృదయంగా వర్ణించారు.

ప్రకరణ 32(1): ఒక వ్యక్తి ప్రాథమిక హక్కులకు భంగం కలిగినప్పుడు లేదా అవి అమలు కానప్పుడు ఆ వ్యక్తి నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించి తగిన పరిహారం పొందవచ్చు.

ప్రకరణ 32(2): హక్కులను కాపాడటానికి ప్రత్యేక ఆదేశాలైన హెబియస్ కార్పస్, మాండమస్, ప్రొహిబిషన్, కో-వారెంటో, సెర్షియరీ లాంటి రిట్లను సుప్రీంకోర్టు జారీ చేసేందుకు ఈ భాగం వీలు కల్పిస్తుంది.

ప్రకరణ 32(3): సుప్రీంకోర్టు అధికారాలకు విఘాతం కలగకుండా, ఇతర న్యాయస్థానాల(స్థానిక కోర్టులు, జిల్లా కోర్టులు)కు కూడా రిట్లు జారీచేసే అధికారాన్ని పార్లమెంటు చట్టం ద్వారా కల్పించవచ్చు.

ప్రకరణ 32(4): రాజ్యాంగంలో ఇతరత్రా అనుమతించిన విధంగా తప్ప ఈ ప్రకరణ ద్వారా గుర్తించిన హక్కులు రద్దు కావు.

వివరణ:

రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో రాజ్యాంగ పరిహార హక్కు అంతర్భాగమని 1981లో ఫర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

రిట్లు-పరిధి-పరిమితులు

ప్రాథమిక హక్కుల పరిరక్షణకు జారీచేసే ప్రత్యేక ఆదేశాలను న్యాయశాస్త్ర పరిభాషలో రిట్లు (Writs) అంటారు. రిట్లు జారీ చేసే పద్ధతిని బ్రిటన్ రాజ్యాంగం నుంచి గ్రహించారు. నిబంధన 32 ప్రకారం సుప్రీంకోర్టుకు, నిబంధన 226 ప్రకారం రాష్ట్ర హైకోర్టులకు రిట్లు జారీ చేసే అధికారాన్ని కల్పించారు. పార్లమెంటు ప్రత్యేక చట్టం ద్వారా ఈ అధికారాన్ని జిల్లా న్యాయస్థానాలకు కల్పించవచ్చు. ఇప్పటి దాకా పార్లమెంటు అలాంటి చట్టాలను రూపొందించలేదు. కాబట్టి సుప్రీంకోర్టు, హైకోర్టులకు మాత్రమే రిట్లు జారీ చేసే అధికారం ఉంది. రిట్ల జారీ విషయంలో సుప్రీంకోర్టు, హైకోర్టు మధ్య వ్యత్యాసాలు ఉన్నాయి.

హైకోర్టులు జారీ చేసే రిట్ అత్యవసర పరిస్థితుల్లో రద్దవుతుంది. ప్రకరణ 226 విషయ పరిధి తక్కువ. కానీ సుప్రీంకోర్టు జారీ చేసే రిట్ అత్యవసర పరిస్థితుల్లో రద్దు కాదు. ప్రకరణ 32 విషయ పరిధి విస్తృతమైంది.

ప్రాథమిక హక్కుల పరిరక్షణలో సుప్రీం కోర్టుకు ప్రత్యేకమైన, ప్రాథమిక విచారణ పరిధి ఉంటుంది (Primary and Original). అందుకే సుప్రీంకోర్టును **ప్రాథమిక హక్కుల పరిరక్షణ కర్త** అంటారు.

ప్రాథమిక హక్కుల పరిరక్షణలో సుప్రీంకోర్టు, హైకోర్టులకు ఉమ్మడి పరిధి ఉంటుంది. అంటే పౌరులు ప్రాథమిక హక్కుల పరిరక్షణకు ప్రకరణ 32 ప్రకారం నేరుగా సుప్రీంకోర్టును లేదా ప్రకరణ 226 ప్రకారం హైకోర్టును ఆశ్రయించవచ్చు.

సాధారణంగా హైకోర్టు ద్వారా తగిన రక్షణ, ఉపశమనం లభిస్తుందని పౌరులు భావిస్తే, మొదట హైకోర్టును ఆశ్రయించాలని కనుభాయ్ బ్రహ్మభట్ v/s గుజరాత్ (1972) కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

వివిధ రిట్లు-అర్థం-పరిధి-ప్రాముఖ్యత

హెబియస్ కార్పస్ (Hebeas Corpus)

ఈ పదం లాటిన్ భాష నుంచి వచ్చింది. హెబియస్ అంటే 'Have', కార్పస్ అంటే 'Body' అని అర్థం. ఒక వ్యక్తిని భౌతికంగా కోర్టు ముందు హాజరుపర్చడమని దీనికి అర్థం.ఇది పురాతన రిట్. నిబంధన 19-22 వరకు పొందుపరచిన వ్యక్తిగత స్వేచ్ఛలకు భంగం కలిగినప్పుడు ఈ రిట్ జారీ చేస్తారు. అరెస్టయిన వ్యక్తిని 24 గంటల్లోగా సమీప న్యాయస్థానంలో హాజరుపరచాలి. లేని పక్షంలో ఈ రిట్ దాఖలు చేస్తే వెంటనే ఆ వ్యక్తిని న్యాయస్థానం ముందు హాజరుపరచాలని కోర్టు ఆదేశిస్తుంది.

వ్యక్తిగత స్వేచ్ఛల పరిరక్షణతోపాటు చట్టబద్ధత లేకుండా ఏ వ్యక్తిని నిర్బంధించకుండా, శిక్షించకుండా కాపాడటం ఈ రిట్ ప్రధాన ఉద్దేశం. ఈ రిట్‌ను ప్రభుత్వ సంస్థలకు, ప్రైవేట్ వ్యక్తులకు కూడా జారీ చేయవచ్చు.

మూడో వ్యక్తికి కూడా ఇందులో జోక్యం చేసుకునే హక్కు (లోకస్ స్టాండై) ఉంటుంది. బాధితుల తరఫున సామాజిక స్పృహ ఉన్న సంస్థ/వ్యక్తి ఈ రిట్ దాఖలు చేయవచ్చు. అందుకే దీన్ని ఉదారమైన రిట్ అని, వ్యక్తిగత స్వేచ్ఛల పరిరక్షణ సాధనమని అంటారు.

మినహాయింపులు:

పార్లమెంటు స్వాధికారాలకు భంగం కలిగించిన కారణంతో వ్యక్తిని నిర్బంధించినప్పుడు, కోర్టు ద్వారా నేరారోపణ నిరూపితమై జైలు శిక్ష అనుభవిస్తున్నప్పుడు ఇది వర్తించదు.

మాండమస్ (Mandamus)

భాషాపరంగా మాండమస్ అంటే ఆదేశం అని అర్థం. సుప్రీం కోర్టు లేదా హైకోర్టు జారీచేసే అత్యున్నత ఆదేశంగా దీన్ని చెప్పవచ్చు. ప్రభుత్వాధికారి/సంస్థ తమ చట్టబద్ధమైన విధులను నిర్వర్తించనప్పుడు వాటిని నిర్వర్తించమని న్యాయస్థానం ఇచ్చే ఆదేశం.

ప్రభుత్వాధికారులు, సంస్థలు తమ విధులను చట్టబద్ధంగా నిర్వర్తించనప్పుడు ప్రజల హక్కులకు భంగం వాటిల్లుతుంది. అలాంటి సందర్భాల్లో వారు సక్రమంగా విధులు నిర్వర్తించడానికి ఈ రిట్ జారీ చేస్తారు. పబ్లిక్ సంస్థలు, క్వాజి పబ్లిక్ (Quasi-Public), జ్యుడీషియల్ సంస్థలు, క్వాజి జ్యుడీషియల్ సంస్థలకు వ్యతిరేకంగా ఈ రిట్ జారీ చేయవచ్చు.

మినహాయింపులు:

రాష్ట్రపతి, గవర్నర్లకు ఈ రిట్ వర్తించదు. వీరు తమ అధికారాలు, విధులను నిర్వర్తించనప్పుడు వాటిని నిర్వర్తించమని ఏ కోర్టు ఆదేశించలేదు.

ప్రైవేట్ వ్యక్తులు, ప్రైవేటు సంస్థలకు వ్యతిరేకంగా ఈ రిట్ జారీచేయడానికి వీల్లేదు.

మాండమస్ రిట్‌ను అంతిమ ప్రత్యామ్నాయంగా మాత్రమే జారీచేస్తారు. అంటే పరిపాలనాపరమైన ప్రత్యామ్నాయాల ద్వారా పౌరులు న్యాయాన్ని పొందలేనప్పుడు ఈ రిట్ ద్వారా ఉపశమనం పొందవచ్చు. ఈ రిట్ జారీ అనేది కోర్టు విచక్షణపై ఆధారపడి ఉంటుంది.

అధికారులు తప్పనిసరిగా నిర్వర్తించాల్సిన విధులకే ఇది వర్తిస్తుంది. విచక్షణా (Discretion) పూర్వకమైన విధులకు వర్తించదు.

'ది లాస్ ఆఫ్ మోషన్' గ్రంథ రచయిత?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఫిజికల్ సైన్స్ మెథడాలజీ

1. సైన్స్ ఏ భాషా పదం?
ఎ) ఇంగ్లిష్ బి) లాటిన్
సి) ఫ్రెంచ్ డి) గ్రీకు
2. పాదరసం ద్రవ రూపంలో ఉన్న లోహం. ఇది ఒక..?
ఎ) భావన బి) సాధారణీకరణం
సి) యదార్థం డి) ప్రాకల్పన
3. పరమాణువులు సంయోగం చెంది అణువులు ఏర్పడతాయి. ఇది ఒక..?
ఎ) యదార్థం బి) భావన
సి) పరికల్పన డి) సత్యం
4. పరస్పర సంబంధం కలిగి.. సత్యాల సంబంధాన్ని నియమబద్ధం చేసేది..?
ఎ) యదార్థం బి) భావన
సి) పరికల్పన డి) సాధారణీకరణం
5. ఎత్తైన పర్వతాలపై నీరు తక్కువ ఉష్ణోగ్రత వద్ద మరగవచ్చు. ఇది ఒక..?
ఎ) నల్ ప్రాకల్పన బి) ప్రశ్నా ప్రాకల్పన
సి) ప్రాసక్తి ప్రాకల్పన
డి) ప్రకటనాత్మక ప్రాకల్పన
6. ఆమోదించిన సిద్ధాంతం ఒక..?
ఎ) నియమం బి) సూత్రం
సి) యదార్థం డి) పరికల్పన
7. కింది వాటిలో విజ్ఞాన శాస్త్రంలో ద్రవ్యాత్మక నిర్మాణం కానిది?
ఎ) యదార్థం బి) భావన
సి) శాస్త్రజ్ఞులు పరిస్థితులను వివరించడం
డి) సిద్ధాంతం
8. విజ్ఞాన శాస్త్రాన్ని ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ ఎలా నిర్వచించింది?
ఎ) భౌతిక ప్రపంచాన్ని, ప్రకృతి నియమాలను పరిశీలించడం
బి) అనుభవాత్మక పరిశీలనలు - అన్వేషణ
సి) విజ్ఞానశాస్త్రం అంటే మాపకం
డి) వ్యవస్థీకృతమైన సాధారణ జ్ఞానం
9. విజ్ఞానశాస్త్రం అంటే ఒక మాపకం.. అని చెప్పింది?
ఎ) కార్ల్ పియర్‌సన్ బి) ఆర్హీనియస్
సి) జేమ్స్ బికోనెంట్ డి) ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ
10. విషయాత్మక విశ్వంలో సామ్యం ఉందని విజ్ఞాన శాస్త్రం భావించడం ఒక..?
ఎ) యదార్థం బి) భావన
సి) పరికల్పన డి) మూల భావన
11. ఒక విద్యార్థి నాలుగు ఆమ్లాలను రుచి చూసిన అనంతరం.. అవి పుల్లగా ఉంటాయని చెప్పాడు. ఇది ఒక..?
ఎ) యదార్థం బి) సాధారణీకరణం
సి) భావన డి) పరికల్పన
12. శాస్త్రీయ ఫలితాలను సమర్థవంతంగా వివరించేవి..?
ఎ) యదార్థం బి) భావనలు
సి) ప్రాగుక్తీకరణలు డి) సిద్ధాంతాలు
13. శాస్త్రజ్ఞులకి ఉండే ప్రత్యేక లక్షణాలను ఎలా పిలుస్తారు?
ఎ) శాస్త్రీయ పద్ధతి బి) శాస్త్రీయ వైఖరి
సి) పై రెండూ డి) ఏదీకాదు
14. ఒక విద్యార్థి ఏ నిర్ణయాన్ని అంత్య నిర్ణయంగా అంగీకరించకపోవడం.. ఒక ?
ఎ) శాస్త్రీయ పద్ధతి బి) శాస్త్రీయ వైఖరి
సి) శాస్త్ర లక్షణం డి) పైవన్నీ
15. కాంతి ఏడు రంగుల మిశ్రమం. ఇది ఏ రకమైన ప్రాకల్పన?
ఎ) శూన్య ప్రాకల్పన బి) ప్రశ్నా ప్రాకల్పన
సి) ప్రాగుక్త ప్రాకల్పన
డి) ప్రకటనాత్మక ప్రాకల్పన
16. విజ్ఞానశాస్త్ర అభ్యాసకుడు సత్యశీలుడు.. ఎందుకంటే శాస్త్ర స్వభావం ఒక?
ఎ) క్రమశిక్షణ బి) సౌందర్యాన్వేషణ
సి) ధనార్జన డి) సత్యాన్వేషణ
17. సార్వత్రికంగా రుజువు చేసే ప్రవచనం.. ఒక?
ఎ) ప్రాకల్పన బి) నియమం
సి) ప్రయోగం డి) సాధారణీకరణం
18. జ్ఞాన సముపార్జనకు దోహదం చేసేది?
ఎ) తర్కం బి) స్పందన
సి) కంఠస్థం డి) అధికారత్వం
19. సాధారణీకరించిన ఊహ లేదా ఆలోచనే ఒక..?
ఎ) యదార్థం బి) సిద్ధాంతం
సి) సూత్రం డి) భావన
20. శాస్త్ర ప్రక్రియ నిర్మాణంలో ఇమడని కృత్యం?
ఎ) ప్రశ్నించడం బి) పరిశీలించడం
సి) నమ్మడం డి) ఊహించడం
21. జ్యోతిష్య శాస్త్రాన్ని అభివృద్ధి చేసింది?
ఎ) ఈజిప్షియన్లు బి) బాబిలోనియన్లు
సి) మెసపటోనియన్లు డి) పైవేవీ కాదు
22. 365 రోజుల క్యాలెండర్‌ను తయారు చేసింది?
ఎ) ఈజిప్షియన్లు బి) బాబిలోనియన్లు
సి) హోమోసేపియన్లు డి) ఇండియన్స్
23. నవీన విజ్ఞాన శాస్త్ర పితామహుడు?
ఎ) గెలీలియో బి) న్యూటన్
సి) నీల్స్ బోర్ డి) ఐన్‌స్టీన్
24. విశ్లేషణాత్మక త్రాసును అభివృద్ధి చేసింది?
ఎ) అరిస్టాటిల్ బి) గెలీలియో
సి) లెవోయిజర్ డి) న్యూటన్
25. 'ప్రిన్సిపియా ఆఫ్ మేథమెటికా' పుస్తకాన్ని రాసింది?
ఎ) ఐన్‌స్టీన్ బి) గెలీలియో
సి) న్యూటన్ డి) ఫారడే
26. ఖగోళ శాస్త్రానికి పునాది వేసిన గ్రంథం?
ఎ) గణితం బి) విజ్ఞానశాస్త్రం
సి) ఆర్యభట్టీయం డి) లీలావతి గణితం
27. రెటీనా, హెర్నియా, సిజేరియన్‌ల గురించి తెలిపే గ్రంథం?
ఎ) చరక సంహిత బి) రుగ్వేదం
సి) సుశ్రుత సంహిత డి) అన్నీ
28. రసరత్నాకర గ్రంథాన్ని రాసింది?
ఎ) ఐన్‌స్టీన్ బి) నాగార్జునుడు
సి) న్యూటన్ డి) నీల్స్ బోర్
29. భారతదేశంలో నూతన విద్యా విధాన పితామహుడు?
ఎ) ఛార్లెస్ గ్రాంట్ బి) గెలీలియో
సి) కొఠారి డి) న్యూటన్
30. సెకండరీ విద్యా కమిషన్ అధ్యక్షుడు?
ఎ) సర్వేపల్లి రాధాకృష్ణన్ బి) మొదలియార్
సి) కొఠారి డి) ఛార్లెస్ గ్రాంట్
31. ఎన్‌సీఈఆర్‌టీని ప్రారంభించిన సంవత్సరం?
ఎ) 1961 బి) 1962
సి) 1963 డి) 1964
32. జీవశాస్త్ర పితామహుడు?
ఎ) న్యూటన్ బి) డార్విన్
సి) అరిస్టాటిల్ డి) గెలీలియో
33. కణాల బ్రౌనియన్ చలనం గురించి తెలిపింది?
ఎ) చార్లెస్ హెచ్‌టిన్స్ బి) ఐన్‌స్టీన్
సి) న్యూటన్ డి) గెలీలియో
34. 'π' విలువను కనుగొన్న శాస్త్రవేత్త?
ఎ) ఐన్‌స్టీన్ బి) గెలీలియో
సి) ఆర్యభట్ట డి) న్యూటన్
35. సిద్ధాంత శిరోమణి గ్రంథాన్ని రాసింది?
ఎ) ఆర్యభట్ట బి) భాస్కరాచార్యుడు
సి) లీలావతి డి) మహావీర
36. 1954లో భారతరత్న బిరుదు పొందిన శాస్త్రవేత్త?
ఎ) న్యూటన్
బి) సుబ్రహ్మణ్యం చంద్రశేఖర్
సి) సి.వి.రామన్ డి) ఐన్‌స్టీన్
37. నాడీ గమనాన్ని తెలిపే పరికరం?
ఎ) ఆడో మీటర్ బి) స్ఫిగ్మో మీటర్
సి) పల్స్ మీటర్ డి) పైవేవీ కావు
38. 'ఆన్ ది నేచర్ ఆఫ్ కామెంట్స్' పుస్తక రచయిత?
ఎ) న్యూటన్ బి) గెలీలియో
సి) ఫారడే డి) హైగెన్స్
39. 'అనాటమీ అండ్ ఫిజియాలజీ' అనే గ్రంథాన్ని రాసింది?
ఎ) గెలీలియో బి) న్యూటన్
సి) లెవోయిజర్ డి) హైగెన్స్
40. 'ఆటమ్స్ ఫర్ పీస్' అవార్డ్ పొందిన శాస్త్రవేత్త?
ఎ) నీల్స్ బోర్ బి) హైగెన్స్
సి) న్యూటన్ డి) రూథర్ ఫర్డ్
41. విద్యుత్ ప్రవాహం వల్ల జరిగే రసాయనిక మార్పులను అధ్యయనం చేసేది?
ఎ) ఎలక్ట్రాలసిస్ బి) హైడ్రాలసిస్
సి) ఎలక్ట్రో కెమిస్ట్రీ డి) పైవన్నీ
42. అన్‌సర్టైనిటి ప్రిన్సిపల్‌ను తెలియజేసింది?
ఎ) హైసెన్ బర్గ్ బి) హైగెన్స్
సి) న్యూటన్ డి) ఫారడే
43. ప్రయోగాత్మక విజ్ఞాన శాస్త్రానికి ఆద్యుడు?
ఎ) గెలీలియో బి) విలియం హార్వే
సి) న్యూటన్ డి) రోజర్ బేకన్
44. జ్ఞానం మరింత జ్ఞాన సముపార్జన కోసం.. అనే భావాన్ని అభివృద్ధి పర్చిన విలువ ఏది?
ఎ) ఉపయోగిత విలువ
బి) వృత్తి విలువ సి) బౌద్ధిక విలువ
డి) క్రమశిక్షణ విలువ
45. విజ్ఞానశాస్త్రం విద్యార్థుల్లో అవగాహన, బుద్ధి వికాసం, బుద్ధి కుశలత, సత్యాన్వేషణ కలిగిస్తే.. అది ఏ విలువ?
ఎ) బౌద్ధిక విలువ బి) వృత్తి విలువ
సి) నైతిక విలువ డి) క్రమశిక్షణ విలువ
46. విజ్ఞాన శాస్త్రాన్ని అధ్యయనం చేస్తే.. విద్యార్థి శాస్త్ర స్వభావాన్ని కలిగి ఉండడం ఒక?
ఎ) నైతిక విలువ బి) వృత్తి విలువ
సి) శాస్త్రీయ వైఖరి- అభివృద్ధి విలువ
డి) సాంస్కృతిక విలువ
47. సత్యాన్వేషణలో శాస్త్రీయ పద్ధతిని ఉపయోగించడం వల్ల విద్యార్థిలో పెంపొందే విలువ?
ఎ) బౌద్ధిక విలువ బి) నైతిక విలువ
సి) క్రమశిక్షణ విలువ
డి) సౌందర్యాత్మక విలువ
48. భావనలు సత్యం లేదా అసత్యం అని నిరూపించలేని పక్షంలో అవి ఎలా మిగిలిపోతాయి?
ఎ) నియమాలుగా బి) సూత్రాలుగా
సి) సాధారణీకరణాలుగా
డి) సిద్ధాంతాలుగా
49. సాంస్కృతిక వారసత్వాన్ని నూతన తరాలకు అందించటం, సాంస్కృతిక అభివృద్ధికి విజ్ఞాన శాస్త్రం సహాయం చేయటం ఒక..?
ఎ) నైతిక విలువ
బి) సౌందర్యాత్మక విలువ
సి) సాంస్కృతిక విలువ
డి) క్రమశిక్షణ విలువ
50. ప్రస్తుతం మనం ఉపయోగిస్తున్న సెల్‌ఫోన్. విజ్ఞానశాస్త్రం ఏ విలువ అవుతుంది?
ఎ) వృత్తి విలువ
బి) సాంస్కృతిక విలువ
సి)ఉపయోగిత విలువ
డి) క్రమశిక్షణ విలువ
51. ఒక ఉపాధ్యాయుడు ప్రతిరోజు ఒక విద్యార్థికి బొమ్మలు గీయమని చెబుతున్నాడు. దీని ద్వారా నెరవేరే ఉద్దేశం?
ఎ) జ్ఞాన సముపార్జన
బి) నైపుణ్య, సామర్థ్యాల అభివృద్ధి
సి) శాస్త్రీయ పద్ధతిలో శిక్షణ
డి) శాస్త్రీయ వైఖరుల అభివృద్ధి
52. ఒక ఉపాధ్యాయుడు విద్యార్థుల్లో అనుకూలమైన అలవాట్లు పెంపొందించడంలో నెరవేరే సామర్థ్యం?
ఎ) స్వీయ నిశ్చయం చేయగలగడం
బి) నైపుణ్యాల అభివృద్ధి
సి) శాస్త్రీయ వైఖరుల అభివృద్ధి
డి) భావి జీవితానికి భూమిక
53. విద్యుదయస్కాంత సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన శాస్త్రవేత్త?
ఎ) న్యూటన్ బి) మాక్స్‌వెల్
సి) మాక్స్ ప్లాంక్ డి) హైగెన్స్
54. సౌర గడియారాన్ని తొలుత తయారు చేసినవారు?
ఎ) మెసపటోనియన్లు
బి) బాబిలోనియన్లు
సి) ఈజిప్షియన్లు డి) గ్రీకులు
55. అణుశాస్త్ర పితామహుడు?
ఎ) డాల్టన్ బి) న్యూటన్
సి) నీల్స్ బోర్ డి) హైగెన్స్
56. జాన్ డాల్టన్ రాసిన పుస్తకాలు..?
ఎ) న్యూ సిస్టమ్ ఆఫ్ కెమికల్ ఫిలాసఫీ
బి) కలర్ బ్లైండ్‌నెస్
సి) పరమాణు సిద్ధాంతం డి) పైవన్నీ
57. ఫారడే సిద్ధాంతాన్ని గణిత రూపంలో మార్చిన శాస్త్రవేత్త?
ఎ) మాక్స్‌వెల్ బి) మాక్స్ ప్లాంక్
సి) ఫ్లెమింగ్ డి) ఐన్‌స్టీన్
58. 'ది లాస్ ఆఫ్ మోషన్' గ్రంథ రచయిత?
ఎ) న్యూటన్ బి) గెలీలియో
సి) ఫారడే డి) కోపర్నికస్

సమాధానాలు

1) ఎ	2) సి	3) బి	4) డి	5) సి
6) ఎ	7) సి	8) సి	9) డి	10) డి
11) బి	12) డి	13) బి	14) బి	15) డి
16) డి	17) బి	18) సి	19) డి	20) సి
21) బి	22) ఎ	23) ఎ	24) సి	25) సి
26) సి	27) సి	28) బి	29) ఎ	30) బి
31) ఎ	32) సి	33) సి	34) బి	35) బి
36) సి	37) సి	38) బి	39) సి	40) ఎ
41) సి	42) ఎ	43) డి	44) సి	45) ఎ
46) సి	47) సి	48) డి	49) సి	50) సి
51) బి	52) ఎ	53) బి	54) సి	55) ఎ
56) డి	57) ఎ	58) బి		

దక్షిణ భారతదేశంలో అతిపెద్ద నది ఏది?

భారతదేశ ప్రధాన నదీ వ్యవస్థ

భారతదేశంలో నదీ వ్యవస్థను ప్రధానంగా రెండు రకాలుగా విభజించవచ్చు.

అవి:

1) జీవ నదీ వ్యవస్థ
2) వర్షాధార నదీ వ్యవస్థ

ఈ రెండు నదీ వ్యవస్థల వల్ల భారతదేశానికి వ్యవసాయపరంగా, పారిశ్రామికంగా, రవాణా పరంగా చాలా ప్రయోజనాలున్నాయి.

జీవ నదీ వ్యవస్థ

వీటినే హిమాలయన్ నదులు అని కూడా అంటారు. సంవత్సరం పొడవునా నీటి ప్రవాహం ఉన్న నదులను 'జీవనదులు' అంటారు. వర్షాకాలంలోని వర్షపు నీరు, ఇతర కాలాల్లో పర్వత శిఖరాల్లోని మంచు కరగడం వల్ల ఈ నదులు ఎల్లప్పుడూ ప్రవహిస్తూ ఉంటాయి. హిమాలయ నదులైన గంగా, సింధూ, బ్రహ్మపుత్ర, వీటి ఉపనదులు జీవ నదులుగా ఉన్నాయి.

- **సింధూనది:** ఇది 'టిబెట్' హిమాలయాల్లోని 'మానస సరోవరం' పశ్చిమ వైపున 5180 మీ. ఎత్తయిన కైలాస శిఖరాల్లో జన్మిస్తోంది. టిబెట్, భారత్, పాకిస్థాన్‌లో ప్రవహిస్తోంది. దీని మొత్తం పొడవు 2880 కి.మీ. భారతదేశంలో 709 కి.మీ. దూరం ప్రయాణిస్తుంది. ఈ నది భారతదేశంలో జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రంలో ప్రవేశిస్తుంది. ఈ రాష్ట్రం నుంచి పాకిస్థాన్‌లోకి ప్రవేశించి, ఆ దేశంలో ఉత్తర, దక్షిణాలుగా ప్రవహిస్తోంది. చివరకు పాకిస్థాన్‌లోని 'కరాచి' వద్ద అరేబియా సముద్రంలో కలుస్తోంది. జమ్మూ-కాశ్మీర్‌లో ప్రధానంగా లద్దాఖ్, బల్టిస్థాన్ ప్రాంతాల ద్వారా ప్రవహిస్తోంది. దీని ఉపనదులు సట్లెజ్, జీలం, చినాబ్, బియాస్, రావి. వీటిలో అతి పెద్ద ఉపనది సట్లెజ్.
- **గంగా:** ఇది భారతదేశంలో ప్రవహిస్తున్న నదుల్లో అత్యంత పొడవైంది. ఉత్తరాఖండ్ హిమాలయాల్లో గంగోత్రి హిమానీనదం వద్ద జన్మిస్తున్న అలకనంద, భగీరథ అనే రెండు పాయలు కొంత దూరం ప్రవహించి 'దేవ ప్రయాగ' వద్ద కలిసి 'గంగానది' ఏర్పడుతోంది. దీని మొత్తం పొడవు 2525 కి.మీ. దీని పరీవాహక ప్రాంతం సుమారు 8,61,404 చ.కి.మీ. విస్తరించి ఉంది.

ఈ నది భారతదేశంలో ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల ద్వారా ప్రవహిస్తూ బంగ్లాదేశ్‌లోకి ప్రవేశించి బంగాళాఖాతంలో కలుస్తోంది. దీన్ని బంగ్లాదేశ్‌లో 'పద్మా నది' అని, బ్రహ్మపుత్రా నదితో కలిసిన తర్వాత 'మేఘన' అని పిలుస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లో నిర్మించిన ఫరక్కా బ్యారేజీ ద్వారా దీని నీటిని హుగ్లీనదికి మళ్లిస్తున్నారు. దీని ప్రధాన ఉప నదులు- యమున, కోసీ, రామ్‌గంగా, గోమతి, బాగ్రా, గండక్, మహానందా, సోన్. దక్షిణ దిశ నుంచి వచ్చి గంగానదిలో కలిసే ఏకైక ఉపనది సోన్. మిగితావన్నీ హిమాలయాల నుంచి వచ్చి గంగానదిలో కలుస్తున్నాయి.



- **యమునా:** ఇది గంగానది ఉపనదులన్నింటిలో పెద్దది. ఇది 'యమునోత్రి' హిమానీనదం వద్ద పుట్టి 'అలహాబాద్' దగ్గర గంగానదితో కలుస్తుంది. చంబల్, బెట్వా, కెన్ దీని ఉపనదులు.
- **బ్రహ్మపుత్ర:** ఇది టిబెట్ హిమాలయాల్లోని 'మానస సరోవరం' తూర్పు వైపున జన్మిస్తోంది. టిబెట్, భారత్, బంగ్లాదేశ్ ద్వారా 2900 కి.మీ. దూరం ప్రయాణించి బంగాళాఖాతంలో కలుస్తోంది.

ఈ నది భారత్‌లో అరుణాచల్ ప్రదేశ్‌లో ప్రవేశించిన వెంటనే 'షియాంగ్' అనే నదితో కలిసి కొంత దూరం ప్రయాణించి 'దిహాంగ్' అనే ప్రదేశం వద్ద దిహాంగ్, లోహిత నదులతో కలుస్తోంది. అసోంలో 'తీస్టా' ఉపనదిని కలుపుకొని బంగ్లాదేశ్‌లో ప్రవేశిస్తోంది. చివరగా గంగానదితో కలిసి బంగాళాఖాతంలో కలుస్తోంది. ఈ నదిని వివిధ ప్రాంతాల్లో వివిధ పేర్లతో పిలుస్తున్నారు. టిబెట్‌లో - సాంగ్‌పో లేదా త్యాంగ్‌పో అని పిలుస్తున్నారు. 'స్వచ్ఛమైన' అని దీని అర్థం. అరుణాచల్ ప్రదేశ్‌లో 'దిహాంగ్' అని, బంగ్లాదేశ్‌లో 'జమునా' అని పిలుస్తున్నారు.

మగవారి పేరుతో పిలుస్తున్న భారతదేశ ఏకైక నది బ్రహ్మపుత్ర. దీని ఉపనదులు తీస్టా, షియాంగ్, దిహాంగ్, లోహిత. గంగా, బ్రహ్మపుత్ర నదులు సముద్రంలో కలిసేచోట ప్రపంచంలో కెల్లా అతి పెద్దదైన 'సుందర్‌బన్ డెల్టా'ను ఏర్పరుస్తున్నాయి.

వర్షాధార నదీ వ్యవస్థ

వర్షాకాలం మాత్రమే నీటి ప్రవాహం కలిగి ఉండటం వల్ల వీటిని 'వర్షాధారిత నదులు' అంటారు. వీటినే 'ద్వీపకల్ప నదులు' అని కూడా అంటారు.

వీటిని రెండు రకాలుగా విభజించవచ్చు.

పశ్చిమం వైపునకు ప్రవహిస్తున్న నదులు: సబర్మతి, నర్మదా, తపతి, మహి మొదలైనవి.

- **నర్మదానది:** ఇది పశ్చిమం దిశగా ప్రవహిస్తున్న నదుల్లో అతి పొడవైంది. ఇది మధ్యప్రదేశ్‌లోని 'అమర్‌కంటక్' ప్రాంతంలో పుట్టి వింధ్య, సాత్పురా పర్వత శ్రేణుల మధ్య 1312 కి.మీ. ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తోంది. భారతదేశంలో 'పగులు లోయ'లో ప్రవహిస్తున్న అతి పొడవైన నది నర్మద.

దీని ప్రధాన ఉపనదులు షార్, బర్హానర్, బుంజర్, షక్కర్, కోలర్, బుర్నా, హీరాన్. ఈ నది ప్రవాహ మార్గంలో రెండు ప్రధాన జలపాతాలున్నాయి. అవి: కపిల ధారా, ధూన్‌ధర్. దీని పరీవాహ ప్రాంతం అత్యధికంగా మధ్యప్రదేశ్‌లో (87 శాతం), మిగి లింది మహారాష్ట్ర, గుజరాత్‌లో ఉంది.

- **తపతి:** ఇది పశ్చిమం దిశగా ప్రవహిస్తున్న వాటిలో రెండో అతిపెద్ద నది. ఇది మధ్యప్రదేశ్‌లోని 'బిటువల్' జిల్లాలోని 'ముల్టాయి' వద్ద పుట్టి 724 కి.మీ. పొడవున సాత్పురా - అజంతా పర్వత శ్రేణుల మధ్య ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తోంది. పూర్ణానది, గిర్నా, బోరి, కీప్ర, సిప్రా, సుకీ, అమరావతి దీని ఉపనదులు.

తూర్పు వైపునకు ప్రవహిస్తున్న నదులు: వీటిలో ముఖ్యమైనవి గోదావరి, కృష్ణా, మహానది, కావేరి, పెన్నా.

ద్వీపకల్ప పీఠభూమి తూర్పువైపునకు వాలి ఉండటంతో దీనిలోని నదులు అధికభాగం తూర్పుదిశగా ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తున్నాయి.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ జాగ్రఫీ

- **గోదావరి:** భారతదేశంలో గంగానది తర్వాత రెండో అతిపెద్ద నది గోదావరి. ఇది దక్షిణ భారతదేశంలో అతిపెద్ద నది. దీన్ని 'దక్షిణ గంగా', 'దక్షిణ గంగోత్రి', 'వృద్ధ గంగా' అని కూడా అంటారు. ఈ నది మహారాష్ట్రలోని పశ్చిమ కనుమల్లో 'నాసిక్ త్రయంబకం' వద్ద జన్మిస్తోంది. మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ద్వారా సుమారు 1465 కి.మీ. ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తోంది. మంజీరా, మానేరు, ప్రాణహిత, ఇంద్రావతి, శబరి, సీలేరు, వార్ధా మొదలైనవి దీని ఉపనదులు. ఇది నిర్మల్ జిల్లాలోని 'బాసర' వద్ద తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశిస్తుంది.
- **కృష్ణానది:** ఇది మహారాష్ట్రలో పశ్చిమ కనుమల్లోని 'మహాబలేశ్వరం' వద్ద పుట్టి మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రవహిస్తోంది. 1440 కి.మీ. ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తోంది. ఇది దక్షిణ భారతదేశంలో రెండో అతిపెద్దనది. ఈ నది నారాయణపేట జిల్లాలోని మక్తల్ మండలం 'తంగడి' వద్ద తెలంగాణ రాష్ట్రం లో ప్రవేశించి ఆంధ్రప్రదేశ్‌లోని హంసలదీవి వద్ద బంగాళాఖాతంలో కలుస్తోంది.

తుంగభద్ర, కోయన, పాలేరు, దిండి, మూసీ, భీమా, మున్నేరు, ఘటప్రభ మొదలైనవి దీని ఉపనదులు.

- **కావేరి:** ఇది కర్ణాటకలోని 'కూర్గ్' జిల్లాలో 'బ్రహ్మగిరి' కొండల్లో జన్మించి కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల ద్వారా సుమారు 805 కి.మీ. పొడవున ప్రవహిస్తోంది. తమిళనాడులోని కావేరి పట్టణం ప్రాంతంలో బంగాళాఖాతంలో కలుస్తోంది. హేమావతి, లోకపావని, షింషా, ఆర్కావతి, లక్ష్మణ తీర్థ, భవాని మొదలైనవి దీని ఉపనదులు. ఇది తమిళనాడులో అతి ప్రధానమైన నది.
- **పెన్నా:** ఇది కర్ణాటకలోని మైసూరు వద్ద 'నంది దుర్గ' కొండల్లో పుట్టి అనంతపురం జిల్లా హిందూపురం వద్ద ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశిస్తోంది. నెల్లూరు జిల్లాలోని 'ఊటుకూరు' వద్ద బంగాళాఖాతంలో కలుస్తోంది. జయమంగళి, చిత్రావతి, కుందేరు, పాపాఘ్ని, చెయ్యేరు, సగిలేరు దీని ఉపనదులు.
- **మహానది:** ఇది మధ్యప్రదేశ్‌లో పుట్టి ఒడిశా ద్వారా ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తోంది. దీని పొడవు 857 కి.మీ. దీని ఉపనదులు- మండ్, షియోనాథ్, లేవ్, ఇబ్, హస్‌డియో.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. కిందివాటిలో అత్యంత పొడవైన నది ఏది?
   1) గంగా 2) నర్మదా
   3) కృష్ణా 4) గోదావరి
2. భారతదేశంలోకి బ్రహ్మపుత్ర నది మొదట ఎక్కడ ప్రవేశిస్తుంది?
   1) అరుణాచల్ ప్రదేశ్
   2) త్రిపుర 3) అస్సాం
   4) మేఘాలయ
3. దక్షిణ గంగా అని ఏ నదికి పేరు?
   1) కృష్ణా 2) గోదావరి
   3) తుంగభద్ర 4) పెన్నా
4. ఏ నదీ సమూహం టిబెట్‌లో ప్రారంభ మూలాన్ని కలిగి ఉంది?
   1) బ్రహ్మపుత్ర, గంగా, సట్లెజ్
   2) గంగా, సట్లెజ్, యమున
   3) చినాబ్, రావి, సట్లెజ్
   4) బ్రహ్మపుత్ర, ఇండస్, సట్లెజ్
5. సాత్పురా, వింధ్య శ్రేణుల మధ్య ప్రవహించే నది ఏది?
   1) నర్మద 2) గండక్
   3) తపతి 4) గోదావరి
6. బంగ్లాదేశ్‌లో గంగానదిని ఏమని పిలుస్తారు
   1) సుభ్ర 2) భగీరథి
   3) రూప్ నారాయణ్ 4) పద్మ

సమాధానాలు

1) 1; 2) 1; 3) 2; 4) 4;
5) 1; 6) 4.

మాదిరి ప్రశ్నలు

1. కొంకణ్ తీరం ఏ రాష్ట్రంలో విస్తరించి ఉంది?
   1) కర్ణాటక 2) తమిళనాడు
   3) కేరళ 4) మహారాష్ట్ర
2. అత్యధిక సంఖ్యలో సరస్సులు, లాగూన్‌లను కలిగి ఉన్న తీర ప్రాంతం ఏది?
   1) కేరళ తీరం 2) తమిళనాడు తీరం
   3) ఒడిశా తీరం 4) గుజరాత్ తీరం
3. అష్టముడి సరస్సు ఏ రాష్ట్రంలో ఉంది?
   1) తమిళనాడు 2) కేరళ
   3) పశ్చిమ బెంగాల్ 4) మణిపూర్
4. శ్రీహరికోటలోని 'సతీష్‌ధావన్' రాకెట్ ప్రయోగ కేంద్రం ఏ సరస్సులో విస్తరించి ఉంది?
   1) చిలుకా సరస్సు 2) కొల్లేరు సరస్సు
   3) పులికాట్ సరస్సు
   4) వెంబనాడ్ సరస్సు
5. పగులులోయ ద్వారా ప్రవహిస్తున్న నది?
   1) గంగా 2) నర్మదా
   3) బ్రహ్మపుత్ర 4) గోదావరి
6. టిబెట్‌లో 'త్యాంగ్‌పో' అని ఏ నదిని పిలుస్తారు?
   1) సింధూ 2) బ్రహ్మపుత్ర
   3) గంగా 4) గండక్
7. గంగానది ఉపనదుల్లో ఉత్తరానికి ప్రవహించేది?
   1) కోసి 2) ఘాగ్ర
   3) సోన్ 4) గండక్
8. కిందివాటిలో పశ్చిమానికి ప్రవహించే నది?
   1) గోదావరి 2) చంబల్
   3) మహానది 4) నర్మదా
9. ఒడిశా రాష్ట్రంలో డెల్టాను ఏర్పరిచే నది?
   1) సువర్ణరేఖ 2) మహానది
   3) కావేరి 4) నర్మదా
10. బెంగాల్ దుఃఖదాయని అని ఏ నదిని పిలుస్తారు?
    1) కోసి 2) హుబ్లీ
    3) దామోదర్ నది 4) గంగానది
11. బీహార్ దుఃఖదాయని అని ఏ నదిని పిలుస్తారు?
    1) దామోదర్ 2) కోసి
    3) బ్రహ్మపుత్ర 4) వైతరణి
12. కృష్ణా - గోదావరి నదుల మధ్య విస్తరించిన సరస్సు ఏది?
    1) పులికాట్ 2) కొల్లేరు
    3) చిలుకా 4) అష్టముడి
13. గంగానది ఉపనదుల్లో కెల్లా అతిపెద్దది?
    1) చంబల్ 2) ఘాగ్ర
    3) కోసి 4) యమునా
14. కపిలధార జలపాతం ఏ నదిపై ఉంది?
    1) యమునా 2) నర్మదా
    3) గోదావరి 4) కావేరి
15. అలకనంద, భాగీరథిలు ఎక్కడ కలుస్తాయి?
    1) రుద్ర ప్రయాగ్ 2) దేవ ప్రయాగ్
    3) రిషికేష్ 4) ప్రయాగ్
16. నర్మదా నది ఎక్కువ భాగం ఏ రాష్ట్రం ద్వారా ప్రవహిస్తుంది?
    1) రాజస్థాన్ 2) గుజరాత్
    3) మధ్యప్రదేశ్ 4) మహారాష్ట్ర

సమాధానాలు

1) 4; 2) 1; 3) 2; 4) 3;
5) 2; 6) 2; 7) 3; 8) 4;
9) 2; 10) 3; 11) 2; 12) 2;
13) 4; 14) 2; 15) 2; 16) 3.

The scheme has fallen out due to..

BANK EXAMS

GENERAL ENGLISH

Directions (Q. 1-10):

In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/phrase in each case and mark your answer.

Though most of us know him _____ (1) for his inventions, Thomas Alva Edison was first and _____ (2) a telegraph operator. Born humbly in Ohio, U.S.in 1847, he was the seventh _____ (3) last child of Samuel Ogden Edison. At the _____ (4) age of nineteen he moved to Kentucky, where he worked in night shifts. He was _____ (5) with a lead-acid battery when he spilled Sulfuric acid onto the floor it ran between the floorboards and onto his boss's desk below. The next morning Edison was ____ (6). He was ___ (7) about reading and experimenting. One of his mentors during those early years was a fellow telegrapher and inventor named Franklin Leonard Pope, who allowed the ____(8) youth to live and work in the basement of his home. The invention that first gained him notice was the phonograph in 1877. This ___ (9) was so unexpected by the public at large as to appear almost ___ (10).


1. (1) except (2) best (3) hardly (4) greatly (5) sometimes
2. (1) previous (2) only (3) foremost (4) above (5) lastly
3. (1) between (2) before (3) with (4) and (5) of
4. (1) elder (2) early (3) delicate (4) old (5) tough
5. (1) set (2) establish (3) working (4) shared (5) purchase
6. (1) fired (2) send (3) showed (4) followed (5) take
7. (1) fame (2) character (3) passionate (4) defeat (5) poor
8. (1) poverty (2) worry (3) problem (4) conflict (5) impoverished
9. (1) accomplishment (2) well (3) fine (4) leading (5) excellent
10. (1) partly (2) wisely (3) rarely (4) magical (5) almost

Directions (Q. 11-20):

*Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.*

The joy of discovery is a very real **incentive** to research, despite the rareness of its realization. It is on error to suppose that the scientist is unemotional, or could succeed if he were. The error has arisen through a misconception. The absolute necessity that a scientist's findings shall not be changed from **objective** truth in response to emotional urges of any kind does not result in his becoming a particularly unemotional person: whether a discoverer or anyone else is pleased with a discovery has no effect on its validity. 'I have been working like a madman at Drosera' wrote Darwin to Sir J.D. Hooker in reference to his study of insectivorous plants and a few days later, to the geologist, Lyell 'at the present moment I care more about Drosera that the origin of all the species in the world---- I am **frightened** and **astounded** at my results'. Kropotkin once wrote, 'There are not many joys in human life equal to the **joy** of the sudden birth of a generalization ---He who has once in this life experienced this joy of scientific creation will never forget it.'

11. The author of the passage counters the misconception that a scientist is unemotional by pointing out that
    1) the objectivity of a scientist cannot make emotional compromises
    2) even such a great scientist as Darwin cared so much for Drosera
    3) he has capacity to react to emo tional appeals made by others
    4) he considers scientific discovery equal to the joy of creation
    5) he has no capacity to react to emotional appeals made by others
12. In this passage the author tells us that scientific research leads one to
    1) rare discoveries
    2) success, sometimes
    3) sure success
    4) finding the objective truth
    5) funding rarity
13. Darwin's letter to Lyell reveals to us that he
    1) attached greater importance to his discovery of insectivorous pants than to his discovery of the origin of the species
    2) used to get deeply involved in whatever research, big or small, he had on hand at a given point of time
    3) was rather uncertain about his success in his research on insectivorous plants
    4) was worried that insectivorous plants would destroy all species of insects
    5) was sure of success
14. The findings of scientific researchers
    1) are universally welcome
    2) result in robbing the researcher of all emotions
    3) are objective in nature
    4) have universal validity
    5) no relation to present
15. Kropotkin says about the unforgettable experience
    1) joy of scientific creation
    2) remember the experience
    3) sorrows of human life
    4) generalized observations
    5) astounding facts



Directions (Q. 16-18):

*Choose the word which is MOST SIMILAR in meaning to the word printed in **bold** as used in the passage.*

16. **ASTOUNDED**
    1) amazed 2) scared
    3) rescued 4) worked
    5) furnished
17. **JOY**
    1) ecstasy 2) wander
    3) murmur 4) jump 5) leap
18. **INCENTIVE**
    1) enticement 2) enjoyment
    3) overwhelm 4) spurious
    5) engulf

Directions (Q. 19-20):

*Choose the word which is MOST OPPOSITE in meaning to the word printed in **bold** as used in the passage.*

19. **OBJECTIVE**
    1) purpose 2) subjective
    3) change 4) bonus
    5) increment
20. **FRIGHTENED**
    1) ghastly 2) beastly
    3) horrified 4) courageous
    5) happy

Directions (Q. 21-25):

Each question below has two blanks, each blank indicating that something has been omitted. Choose the set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

21. Scientists fear that many birds ----- heading towards a unisex existence that would ----- to extinction.
    1) is… make 2) are.. making
    3) is… moving 4) are…lead
    5) were…leading
22. Using ------ from government survey, he found ------ support for his line of reasoning.
    1) data… strong 2) date…much
    3) doubt…many
    4) dates…very 5) date…meek
23. Science consists of ------, Art consists of ------.
    1) naming…pleading
    2) knowing…doing
    3) doing... pleasing
    4) creation…erosion
    5) evolution…inspection
24. Technology is important but what is of great ---------- is the capturing of tacit knowledge.
    1) important 2) import
    3) improvement 4) importance
    5) importantly
25. The ------ of the hour is to evolve measures to tackle the issue.
    1) time 2) moment 3) need
    4) pride 5) speed

Directions (Q. 26-30):

Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

26. There is a misconception (1)/that freedom means(2)/to be doing (3)/your own thing.(4)/No error (5)
27. Shakespeare was (1)/ better than any poet(2)/of his days (3)/ acc-ording to critics. (4)/ No error (5)
28. I ordered for a cup of tea (1)/ but the bearer (2)/brought it only (3)/ at the end of the tea-session. (4)/ No error (5)
29. Lack of honesty(1)/ is sometimes labeled as(2)/tact public relations (3)/or politics. (4)/ No error (5)
30. in the aftermath of the September 11th (1)/ the American president's speech was (2)/ broadcasted and televised (3)/ all over the world. (4)/ No error (5)

Directions (Q. 31-35):

Which of the phrases (1), (2), (3) and (4) given below each sentence should replace the phrase printed in bold in the sentence to make it grammatically correct? If the sentence is correct as it is given and no correction is required, mark (5) as the answer.

31. The minister **hit out** at his critics and categorically denied his involvement in the scam.
    1) hit up2) hit back
    3) hit upon 4) hit around
    5) no correction
32. He can **strike out** a friendship even with complete strangers.
    1) strike up 2) strike at
    3) strike on 4) strike back
    5) no correction
33. I prefer listening to soft music to help me **wind over** after a stressful day.
    1) wind up 2) wind down
    3) wind off 4) wind of
    5) no correction
34. The scheme has **fallen out** due to paucity of funds.
    1) fallen through 2) fallen over
    3) fallen apart 4) fallen back
    5) no correction
35. Over the years several extremists **laid up** their arms and joined the mainstream.
    1) laid out 2) laid upon
    3) laid by 4) laid down
    5) no correction

KEY

1) 2	2) 3	3) 4	4) 3	5) 3
6) 1	7) 3	8) 5	9) 1	10) 4
11) 1	12) 4	13) 1	14) 3	15) 1
16) 1	17) 1	18) 1	19) 2	20) 4
21) 4	22) 1	23) 2	24) 4	25) 3
26) 3	27) 2	28) 1	29) 2	30) 3
31) 2	32) 1	33) 2	34) 1	35) 4